
శుక్రవారం 22-9-2023

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 6.50
సంపుటి: 16 సంచిక: 8

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'



'అసలు'కు ముందు ఆఖరి సమరం

నేడు భారత్, ఆస్ట్రేలియా తొలి వన్డే.. అశ్విన్, శ్రేయాస్ ఫామ్‌పై దృష్టి - 13లో



పడుతున్న పొదుపులు

దేశంలోని కుటుంబాల ఆర్థిక ముఖచిత్రాన్ని వెల్లడించిన ఎస్‌బీఐ రీసెర్చ్ - 13లో



మన వైద్య విద్యార్థులకు శుభవార్త

భారత వైద్య విద్యార్థులు ఇకపై విదేశాల్లోనూ ప్రాక్టీస్ చేసుకోవచ్చు. అలాగే పీజీ చదువులు కూడా కొనసాగించవచ్చు.

వివరాలు 6లో ▸



ఎర్రచొక్కా.. తలపై పెట్టె..

కాంగ్రెస్ నేత రాహుల్ ఢిల్లీలోని రైల్వేస్టేషన్‌లో ఎర్ర చొక్కా, బ్యాడ్జి ధరించి తలపై సూట్‌కేసు మోస్తూ కూలీలతో ముచ్చటించారు.

వివరాలు 6లో ▸



దూసుకెళ్తున్న వివేక్ రామస్వామి

అమెరికా అధ్యక్ష అభ్యర్థిత్వం కోసం రిపబ్లికన్ పార్టీలో కొనసాగుతున్న రేసులో భారత సంతతికి చెందిన వివేక్ దూసుకుపోతున్నారు.

వివరాలు 6లో ▸



జనవరిలో పాక్ ఎన్నికలు

పాక్‌లో 2024 జనవరి చివరి వారంలో సాధారణ ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఆ దేశ ఎన్నికల సంఘం ప్రకటించింది.

వివరాలు 6లో ▸

అసెంబ్లీ సాక్షిగా..

టీడీపీ బరితెగింపు

చిల్లర చేష్టలతో టీడీపీ ఎమ్మెల్యేల వీరంగం.. అసభ్య సైగలతో లేకి ప్రవర్తన

- స్పీకర్ తమ్మినేని ఛైర్‌ను చుట్టుముట్టి దౌర్జన్యకాండ.. పేపర్లు విసిరి, టేబుల్ మానిటర్ లాగేసిన వైనం
- మీసం మెలేసి అధికార పార్టీ ఎమ్మెల్యేలను రెచ్చగొట్టిన బాలకృష్ణ
- వారితో కలిసి రెచ్చిపోయిన వైఎస్సార్‌సీపీ బహిష్కృత ఎమ్మెల్యేలు కోటంరెడ్డి, శ్రీదేవి
- అనగాని, పయ్యావుల, కోటంరెడ్డి సెషన్ మొత్తం సస్పెన్షన్

మరో 14 మంది ఒకరోజు సస్పెన్షన్

10లో


అసెంబ్లీలో స్పీకర్ పోడియాన్ని చుట్టుముట్టి గొడవ చేస్తున్న టీడీపీ ఎమ్మెల్యేలు

శాసన సభ సమావేశాలు ప్రారంభమైన తొలి రోజు గురువారం టీడీపీ ఎమ్మెల్యేలు వీరంగం సృష్టించారు. చట్ట సభ ప్రతిష్టను దిగజారుస్తూ, స్పీకర్ పట్ల అమర్యాదగా వ్యవహరించారు. ఎలాగైనా సరే సస్పెండ్ అవ్వాలన్న ఉద్దేశం తోనే సభలో అడుగుపెట్టిన వారు ఆద్యంతం వీధి రౌడీలను మరిపిస్తూ చిల్లరగా వ్యవహరించారు. పోడియంపైకి చేరుకుని అసభ్య చేష్టలు, సైగలతో రెచ్చిపోయారు. పయ్యావుల, తదితరులు సీనియర్ ఎమ్మెల్యేలు అయినప్పటికీ సభా మర్యాద పాటించలేదు. సభలో వీడియో చిత్రీకరణ నిషేధం అని తెలిసినప్పటికీ ఆ పనే చేస్తూ.. ఇలాంటి వాళ్లా మన ప్రజాప్రతినిధులు అని ప్రజలు ఛీదరించుకునేలా దిగజారి నడుచుకున్నారు. అరుపులు, కేకలు, బూతులే తమకు తెలుసన్నట్లు నిస్సిగ్గుగా ప్రవర్తించారు.

మరో 4 రోజులు అసెంబ్లీ

- 22, 25, 26, 27 తేదీల్లో సమావేశాలు
- బీఏసీ సమావేశంలో నిర్ణయం
- సమావేశానికి హాజరుకాని టీడీపీ
- నేడు 'స్కిల్' స్కామ్‌పై చర్చ

10లో

ఆమె బిల్లుకు అంతా ఓకే

నారీశక్తి వందన్ అధినియమ్ బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించిన రాజ్యసభ

సభకు హాజరైన మొత్తం 214 మంది సభ్యుల మద్దతు

- పార్టీలకు అతీతంగా సభ్యుల మద్దతు.. సరికొత్త చరిత్రకు వేదికైన నూతన పార్లమెంటు
- మెజారిటీ రాష్ట్రాల ఆమోదమే తరువాయి
- జనగణన, డీ లిమిటేషన్ అనంతరం అమల్లోకి

6లో


గురువారం రాత్రి రాజ్యసభలో మహిళా బిల్లు ఆమోదం అనంతరం ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలుపుతున్న ఎంపీలు


గురువారం పార్లమెంటు నూతన భవనం వద్ద సినీ నటీమణులు మంచు లక్ష్మి, తమన్నా, దివ్యదత్తా, ఖుష్బూ, మెహ్రీన్

ఓబీసీలపై కాంగ్రెస్ సవతి ప్రేమ

అధికారంలో ఉండగా వారి గురించి ఆలోచించనైనా లేదు: నడ్డా

దేశానికి తొలి ఓబీసీ పీఎంను ఇచ్చింది బీజేపీయే.. మహిళా బిల్లుపై రాజ్యసభలో చర్చలో బీజేపీ చీఫ్

రాహుల్ 'ఓబీసీ కార్యదర్శుల' వ్యాఖ్యలపై నిప్పులు

6లో

"మహిళా బిల్లుకు మద్దతిచ్చిన ఎంపీలందరికీ కృతజ్ఞతలు. ఈ స్ఫూర్తి భారతీయుల ఆత్మగౌరవాన్ని సరికొత్త ఎత్తులకు చేరుస్తుంది. భారత మహిళలకు మరింత ప్రాతినిధ్యం, సాధికారత లభించే నూతన శకంలోకి మనమిక సగర్వంగా అడుగు పెట్టనున్నాం. ఇది కేవలం చట్టం మాత్రమే కాదు. మన దేశాన్ని నిరంతరం ఇంత గొప్ప స్థాయిలో తీర్చిదిద్దుతున్న, అందుకోసం తమ సర్వస్వాన్నీ నిరంతరం త్యాగం చేస్తూ వస్తున్నా మహిళామణులకు, మన మాతృమూర్తులకు మనం చేస్తున్న వందనమిది. - మోదీ

న్యూస్‌రీల్

నేడు తిరుమలలో గరుడ వాహన సేవ



శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా విశిష్టమైన గరుడ వాహన సేవ శుక్రవారం రాత్రి 7 గంటలకు ఆరంభమవ్వనుంది. 2.5 లక్షల మందికి పైగా భక్తులు హాజరయ్యే అవకాశాలున్నాయి. భక్తులకు ఇబ్బంది కలగకుండా టీటీడీ ఏర్పాట్లు చేసింది.

వివరాలు 5లో ▸

చంద్రబాబు కస్టడీపై తీర్పు నేటికి వాయిదా



స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో అరెస్టయిన టీడీపీ నేత చంద్రబాబును 5 రోజుల పాటు తమ కస్టడీకి అప్పగించాలంటూ సీఐడీ దాఖలు చేసిన పిటిషన్‌లో ఏసీబీ ప్రత్యేక కోర్టు తన తీర్పును శుక్రవారానికి వాయిదా వేసింది.

వివరాలు 14లో ▸

ఇదండీ సంగతి


అరెస్టును ఖండించడానికి సరైన సాక్ష్యాలు లేవు! కావాలనే సస్పెన్షన్ చేయించుకొని బయటకు వచ్చాం!!

ఐరాస సదస్సు ప్రాంగణంలో 'న్యూస్ వీక్' సీనియర్ ఎడిటర్ ఇన్ చీఫ్ సర్గోన్‌తో ఏపీ విద్యార్థులు



ఏపీ సంక్షేమ పథకాలపై

'ఐరాస'లో చర్చ

ప్రపంచ దేశాలకు దిశ చట్టాన్ని వివరించిన రాష్ట్ర ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులు

సాక్షి, అమరావతి: అమెరికా వెళ్లిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు తాజాగా ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ 78వ సదస్సులో పాల్గొన్నారు. 27 దేశాలకు చెందిన గ్లోబల్ పార్టనర్లు, ప్రపంచ దేశాల నాయకులు, దౌత్యవేత్తలు, పౌర సమాజ సభ్యులను ఒక్కతాటిపైకి తెచ్చేందుకు న్యూయార్క్‌లో నిర్వహించిన హైబ్రిడ్ సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ కాన్ఫరెన్స్–2023లో ఏపీ ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులు ప్రసంగించారు. ఏపీలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అటు ప్రజలకు, ఇటు విద్యార్థుల ప్రగతికి ఏవిధంగా ఉపయోగపడుతున్నాయో వివరించారు. మహిళల భద్రత కోసం సీఎం జగన్ తీసుకువచ్చిన దిశ చట్టం గురించి తెలియజేశారు. కాగా, ప్రపంచ శాంతి, మానవ హక్కులు, స్థిరమైన అభివృద్ధిపై జరిగిన ఈ సదస్సులో ప్రపంచ వ్యాప్తంగా 150 మంది ఉన్నత స్థాయి స్పీకర్లను ఒక్కచోటకు చేర్చి ఇంటర్ డిసిప్లినరీ గ్రూపులను ఏర్పాటు చేశారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. సదస్సులో జర్నలిస్ట్స్ అండ్ రైటర్స్ ఫౌండేషన్ సభ్యులతో పాటు వివిధ దేశాల ప్రతినిధులు, ఐక్యరాజ్యసమితి స్పెషల్ స్టేటస్ మెంబర్ ఉన్నవ షకిన్ కుమార్, సమగ్ర శిక్ష ఎస్పీడీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కెనడా వీసాలు తాత్కాలికంగా నిలిపివేత

- భద్రతా కారణాలతో కెనడాలో కార్యకలాపాలు సాగడం లేదన్న కేంద్రం
- భారత హైకమిషన్లు, కాన్సులేట్లకు బెదిరింపులు వస్తున్నాయని వెల్లడి
- ఉగ్రవాదులకు కెనడా స్వర్గధామంగా మారింది: విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి అరిందమ్ బాగ్చి
- ట్రూడో ప్రభుత్వం ఉగ్రవాదుల్ని పెంచి పోషిస్తోందని ఆరోపణ
- వారికి ఆర్థిక సాయం కూడా అందిస్తోందని మండిపాటు

6లో



ఓడీఎల్ అడ్మిషన్లు కఠినతరం

ఆన్‌లైన్ డిస్టెన్స్ లెర్నింగ్, ఆన్‌లైన్ కోర్సులపై యూజీసీ కీలక నిర్ణయం

19కి పైగా కోర్సుల్లో ప్రవేశాలపై నిషేధం

వీటితోపాటు పీహెచ్‌డీ, ఎంఫిల్ కోర్సులూ చేపట్టరాదు

వీటిని అందించే సంస్థలకు విధిగా యూజీసీ అనుమతి ఉండాలి

3లో

హాస్టళ్లలో 'చైల్డ్ ఫ్రెండ్లీ' మాన్యువల్

- పిల్లలతో ఎలా ప్రవర్తించాలో సిబ్బందికి శిక్షణ
- పిల్లలకు అందుబాటులో ల్యాండ్ లైన్
- సిబ్బంది బాధ్యతలపై 17 మార్గదర్శకాలు జారీ చేసిన ప్రభుత్వం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని సంక్షేమ వసతి గృహాలలో స్నేహపూర్వక వాతావరణం ఉండేలా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. ప్రధానంగా హాస్టళ్లలోని పిల్లలతో సిబ్బంది, అధికారులు స్నేహపూర్వకంగా మెలిగేలా ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే ఐదు ప్రధాన అంశాలతో రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర ప్రామాణిక ఆపరేటివ్ విధానాన్ని (ఎస్ఓపీ) అమలులోకి తెచ్చిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలో 3,783 హాస్టల్స్, రెసిడెన్షియల్ హాస్టల్స్‌లో తీసుకోవాల్సిన పటిష్ట చర్యలపై ఇప్పటికే అధికార యంత్రాంగాన్ని సన్నద్ధం చేసింది. ఇందుకు అనుగుణంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, ఈబీసీ, వికలాంగుల, జువెనైల్ సంక్షేమ శాఖలకు చెందిన వసతి గృహాలు, గురుకుల విద్యాలయాల్లో యంత్రాంగాన్ని అప్రమత్తం చేసింది. ఇందులో భాగంగానే హాస్టల్స్ సిబ్బంది, అధికారులు తీసుకోవాల్సిన చర్యలపై 17 మార్గదర్శకాలను పేర్కొంది.

మార్గదర్శకాలు ఇవీ

- పిల్లలతో స్నేహపూర్వక వాతావరణం ఏర్పాటు చేయాలి. డ్రిల్ నిర్వహించే సమయంలో విద్యార్థులకు తప్పనిసరిగా భద్రతపై అవగాహన కల్పించాలి. ఇందుకోసం చైల్డ్ ఫ్రెండ్లీ టీచర్‌ను ఏర్పాటు చేసి విధులు అప్పగించాలి.
- పిల్లలతో ఎలా ప్రవర్తించాలో సిబ్బందికి శిక్షణ ఇవ్వాలి. ఈ తరహా శిక్షణలు నిరంతరం కొనసాగించాలి. శిక్షణ పొందిన పీఈటీ, టీచర్ ద్వారా బాలికలకు ఆత్మరక్షణపై శిక్షణ అందించాలి.
- పిల్లల మానసిక పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించి కౌన్సెలింగ్ అందించాలి. ఉపశమన చర్యలు చేపట్టాలి. వసతి గృహాలకు వచ్చే సందర్శకులకు పరిమితి విధించాలి. వారి వివరాలు నమోదు చేసేలా రిజిస్టర్‌ను కచ్చితంగా నిర్వహించాలి. పిల్లలకు ల్యాండ్ ఫోన్ సౌకర్యం అందుబాటులో ఉంచాలి. సమీపంలోని పోలీస్ స్టేషన్, సహాయ అధికారుల నంబర్లు అందుబాటులో ఉంచాలి.
- పిల్లలకు అందించే ఆహారాన్ని పరీక్షించడం, మెనూ అమలుపై, తీసుకున్న చర్యలపై ఒక రిజిస్టర్ నిర్వహించాలి. హాస్టల్లోని సిబ్బంది విధి జాబితా (జాబ్ చార్ట్)ను ప్రదర్శించాలి.
- హాస్టల్ భవనానికి సరైన ఎలక్ట్రికల్ వైరింగ్, పరిసరాల్లోని బావుల చుట్టూ ఫెన్సింగ్ సరిహద్దు, సేఫ్టీ గ్రిల్ మొదలైనవి ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. మరుగుదొడ్లలో నీటి సరఫరా సక్రమంగా ఉండేలా చూడాలి.
- పిల్లలకు మంచి స్పర్శ(గుడ్ టచ్), చెడు స్పర్శ (బ్యాడ్ టచ్)పై అవగాహన కల్పించాలి.
- పిల్లలు హాస్టల్ నుంచి బయటకు వెళ్లినా, లోపలికి వచ్చినా వారి కదలికల వివరాలు నమోదు చేసేలా రిజిష్టర్‌ను నిర్వహించాలి.
- కౌమార బాలికలకు రుతుక్రమ పరిశుభ్రతపై మహిళా టీచర్‌తో అవగాహన కల్పించాలి.
- పిల్లలు సైబర్ నేరాల బారిన పడకుండా అప్రమత్తం చేసేందుకు నెలకొకసారి సైబర్ భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించాలి.
- వసతి గృహాల చుట్టూ పాన్, పొగాకు ఉత్పత్తులను విక్రయించే దుకాణాలు లేకుండా చర్యలు తీసుకోవాలి.
- పోలీస్ స్టేషన్, పెట్రోలింగ్ బృందం, సామాజిక సలహాదారు, వైద్య సదుపాయాలతో ఆయా హాస్టల్స్‌లో మ్యాప్‌లు ఏర్పాటు చేయడంతోపాటు వాటి ఫోన్ నంబర్లు అందుబాటులో ఉంచాలి. సెక్యూరిటీ సిబ్బంది, హాస్టల్ సిబ్బంది సహాయంతో విద్యార్థులపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి.

'ప్రగతి' బాటలో

పొదుపు మహిళ

మెప్మా ఆధ్వర్యంలో 'పట్టణ ప్రగతి' యూనిట్లు..


సదస్సుకు హాజరైన టీఎల్ఎఫ్ లీడర్లు

పర్యావరణ అనుకూల ఉత్పత్తుల తయారీలో శిక్షణ

ప్రభుత్వ సహకారంతో పరిశ్రమల స్థాపన.. మహిళలతోనే నిర్వహణ

700 మంది టీఎల్ఎఫ్ లీడర్లకు అవగాహన సదస్సు

నాలుగేళ్లలో ఆర్థికంగా ఎదిగిన క్రమాన్ని వివరించిన మహిళలు

2లో

"వ్యాపారం చేసుకుంటున్నాం



గతంలో బ్యాంకు రుణం వస్తే డబ్బులు పంచుకుని ఇంట్లో ఖర్చు చేసేవాళ్లం. ఇప్పుడు బ్యాంకు రుణాలు ఇప్పించడంతోపాటు వ్యాపారం దిశగా 'మెప్మా' ప్రోత్సహిస్తోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక నాలుగున్నరేళ్లుగా అన్ని పథకాలు అందుతున్నాయి. బ్యాంకులు మాకు పిలిచి మరీ రుణాలు ఇస్తున్నాయి. ఈ డబ్బులతో సంఘాల్లోని సభ్యులు తమకు నైపుణ్యం ఉన్న అంశంలో వ్యాపారం చేస్తున్నారు. స్థిరమైన ఆదాయం వస్తోంది. వ్యాపార ఆలోచన ఉంటే మెప్మా శిక్షణనిచ్చి ప్రోత్సహిస్తోంది.

- పి.కృష్ణకుమారి, నరసరావుపేట

క్లుప్తంగా...

గ్రూప్‌-4 పోస్టుల హాల్‌టికెట్లు సిద్ధం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో గ్రూప్‌-4 కేడర్ పోస్టుల భర్తీకి సంబంధించిన రాత పరీక్షలకు అభ్యర్థుల హాల్‌టికెట్లను సిద్ధంచేసినట్లు ఏపీపీఎస్సీ గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ పరీక్షలను అక్టోబర్ 3, 4 తేదీల్లో నిర్వహించనున్నారు. హాల్‌టికెట్లను కమిషన్ వెబ్‌సైట్ నుంచి ఈ నెల 25 నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని కమిషన్ పేర్కొంది.

వివిధ ఆఫీసర్ పోస్టులకు కూడా..

అలాగే, డిస్ట్రిక్ట్ ప్రొబేషన్ ఆఫీసర్, ఇండస్ట్రియల్ ప్రమోషన్ ఆఫీసర్, పోస్టుల భర్తీకి నిర్వహించే రాతపరీక్ష హాల్‌టికెట్లను కూడా సిద్ధం చేసినట్లు ఏపీపీఎస్సీ వెల్లడించింది. ఈ పరీక్షలు అక్టోబర్ 3, 5 తేదీల్లో నిర్వహిస్తుండగా ఫుడ్‌సేఫ్టీ ఆఫీసర్ పోస్టుల భర్తీకి రాతపరీక్షను అక్టోబర్ 3, 4 తేదీల్లో నిర్వహిస్తారు. మరో వైపు.. జూనియర్ ట్రాన్స్‌లేటర్ (తెలుగు) పోస్టుల పరీక్షలు అక్టోబర్ 3, 5 తేదీల్లో.. అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ పరీక్ష అక్టోబర్ 6న జరుగుతుంది. ఈ పరీక్షల హాల్‌టికెట్లను కూడా ఈనెల 25వ తేదీ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

మరో మైలురాయిని అధిగమించిన షిప్‌యార్డు



ఐఎన్ఎస్ నిస్తార్

సాక్షి, విశాఖపట్నం: యుద్ధ నౌకల మరమ్మతుల విషయంలో హిందూస్థాన్ షిప్‌యార్డు మరో మైలురాయిని అధిగమించింది. ఏడాది క్రితం మరమ్మతుల కోసం హెచ్ఎస్ఎల్‌కు వచ్చిన భారత నౌకాదళానికి చెందిన డైవింగ్ సపోర్ట్ యుద్ధ నౌక ఐఎన్ఎస్ నిస్తార్ మరమ్మతుల్ని త్వరితగతిన పూర్తి చేసినట్లు షిప్‌యార్డు సీఎండీ కమాండర్ హేమంత్ ఖత్రి తెలిపారు. అంతర్గత షాఫ్ట్ టర్నింగ్ ట్రయల్స్‌ని పూర్తి చేసింది. యుద్ధ నౌక పర్యవేక్షణ బృందం (డబ్ల్యూవోటీ) సమక్షంలో గేర్ బాక్స్ ద్వారా షిప్ ఇంజిన్ల శక్తితో షాఫ్ట్ టర్నింగ్ ట్రయల్స్ సాధించడం అద్భుతమైన ఫీట్ అని సీఎండీ వివరించారు. నిస్తార్ మరమ్మతుల్ని త్వరితగతిన పూర్తి చేసేందుకు సహకరించిన ఎంఎస్ఎంఈలకు సీఎండీ ఖత్రి కృతజ్ఞతలు తెలిపారు.

ఫెర్రో మాంగనీస్ దిగుమతిలో వీపీఏ రికార్డు



ఫెర్రో మాంగనీస్‌ను అన్‌లోడ్ చేస్తున్న దృశ్యం

సాక్షి, విశాఖపట్నం: ఒకే రోజు రికార్డు స్థాయిలో ఫెర్రో మాంగనీస్‌ని దిగుమతి చేసి విశాఖ పోర్ట్ ట్రస్ట్ రికార్డు సృష్టించింది. ఈ నెల 20న అక్సాన్ సిరీన్ అనే పనామా కార్గో షిప్ నుంచి 18,749 మెట్రిక్ టన్నుల ఫెర్రో మాంగనీస్‌ని పోర్టు సిబ్బంది దిగుమతి చేశారు. 2022 సెప్టెంబర్ 25న 15,446 మెట్రిక్ టన్నుల దిగుమతి రికార్డుని విశాఖ పోర్ట్ ట్రస్ట్ అథారిటీ (వీపీఏ) అధిగమించింది. ఒక్కో కార్గో హ్యాండ్లింగ్‌లో ఒక్కో రికార్డుని నమోదు చేస్తూ..పోర్టు అభివృద్ధికి కృషి చేస్తున్న సిబ్బందిని చైర్మన్ డా.అంగముత్తు అభినందించారు.

నీట్ పీజీ కటాఫ్ స్కోర్ జీరో పర్సంటైల్‌కు కుదింపు

సాక్షి, హైదరాబాద్: వైద్య విద్య పోస్టు గ్రాడ్యుయేషన్ ప్రవేశాలకు సంబంధించిన నీట్ పీజీ కటాఫ్ స్కోరును కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ తగ్గించింది. ఇదివరకు కేటగిరీల వారీగా కటాఫ్ ఉండగా... ఇప్పుడు జీరో పర్సంటైల్‌కు కటాఫ్ స్కోరును కుదించింది. దీంతో పరీక్షకు హాజరైన అభ్యర్థులంతా కౌన్సెలింగ్‌లో పాల్గొనేందుకు అర్హులే. తాజాగా కటాఫ్ స్కోరు తగ్గించడంతో పీజీ ప్రవేశాలకు కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ మరో రౌండ్‌కు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రకటించింది. ఇందులో భాగంగా అభ్యర్థులకు ఈనెల 24వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు, ఆప్షన్ల నమోదుకు అవకాశం కల్పించింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తుతో పాటు సంబంధిత ధ్రువీకరణ పత్రాలను అభ్యర్థులు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ధ్రువపత్రాల పరిశీలన అనంతరం తుది మెరిట్ జాబితాను వర్సిటీ ప్రకటిస్తుంది.

క్రెడిట్ కార్డు రివార్డు పాయింట్ల పేరిట మోసం

సాక్షి, హైదరాబాద్ : క్రెడిట్ కార్డు రివార్డు పాయింట్లను సాకుగా చూపుతూ సైబర్ నేరగాళ్లు కొత్త తరహా మోసాలకు తెరతీస్తున్నారు. ఖాతాదారుల వివరాలు ఆన్‌లైన్‌లో సేకరిస్తున్న సైబర్ నేరగాళ్లు, క్రెడిట్ కార్డు రివార్డు పాయింట్లను వినియోగించుకోండి.. లేదంటే మీ క్రెడిట్ పాయింట్లు ఎక్స్‌పైర్ అవుతాయంటూ మెసేజీలు పంపుతున్నారు. వివరాల కోసం కింది లింక్‌పై క్లిక్ చేయాలని సూచిస్తూ..ఒక లింక్‌ను అందులో జత చేస్తున్నారు. ఇలాంటి మెసేజీలు నమ్మవద్దని సైబర్ భద్రత నిపుణులు సూచిస్తున్నారు.

‘ప్రగతి’ బాటలో పొదుపు మహిళ

సాక్షి, అమరావతి: పట్టణ ప్రాంత స్వయం సహాయక సంఘాల్లోని ప్రతి మహిళా స్వయం శక్తితో ఎదిగేందుకు రాష్ట్ర ప్రభుత్వం అందించిన తోడ్పాటు సత్ఫలితాలనిస్తోంది. వివిధ పథకాల ద్వారా ప్రభుత్వం అందించిన నిధులతో అక్కచెల్లెమ్మలు స్వయం ఉపాధి మార్గాలపై దృష్టి పెట్టారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) అండగా నిలిచి ‘పొదుపు’ మహిళలకు దిశానిర్దేశం చేస్తోంది. మెప్మా మిషన్ డైరెక్టర్ వి.విజయలక్ష్మి వారికి అవసరమైన శిక్షణ ఇవ్వడంతో పాటు అవసరమైన నిధులను సమకూర్చి విజయం దిశగా ప్రోత్సహిస్తున్నారు గత నాలుగున్నరేళ్లల్లో వివిధ పథకాల ద్వారా 25 లక్షల మంది పట్టణ ప్రాంత పొదుపు సంఘాల్లోని మహిళలతో జగనన్న మహిళా మార్టులు, ఆహా క్యాంటీన్లు, అర్బన్ మార్కెట్లను నెలకొల్పి అద్భుత ఫలితాలను సాధించారు. దీంతోపాటు మహిళలు తయారు చేసే చేతి ఉత్పత్తులకు విస్తృత మార్కెట్ కల్పించేందుకు ఈ-కామర్స్ సంస్థలతో ఒప్పందం చేసుకున్నారు. ఇదంతా ఒక ఎత్తయితే ఇప్పుడు పొదుపు మహిళలతో పరిశ్రమలు నెలకొల్పేందుకు ‘మెప్మా’ ముందడుగు వేసింది. పర్యావరణహితంగా సరికొత్త ఆలోచనలను ప్రోత్సహిస్తూ మహిళలతో ‘ప్రగతి యూనిట్లు’ ఏర్పాటు దిశగా కార్యాచరణ చేపట్టారు. ఏ పరిశ్రమ స్థాపించాలి? మూలధనం, శిక్షణ లాంటి అంశాలపై చర్చించేందుకు మెప్మా ఎండీ తాజాగా సంఘాల లీడర్లతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. 25 లక్షల మంది సభ్యులుగా ఉన్న పట్టణ సమాఖ్యలకు చెందిన టీఎల్ఎఫ్ రిసోర్స్ పర్సన్లు, సమాఖ్య అధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారులు (ఆఫీస్ బేరర్స్) దాదాపు 700 మంది పాల్గొన్న ఈ సదస్సులో రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల్లోని మహిళా సంఘాలు తీర్మానాలు చేసిన ప్రాజెక్టులపై చర్చించారు. రాష్ట్రంలోని 123 యూఎల్బీల్లోని పట్టణ మహిళా సంఘాలు సంఘటితంగా సాధించిన ప్రగతిని ఈ సందర్భంగా ఎండీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. 9 పట్టణాల్లోని జగనన్న మహిళా మార్టుల ద్వారా ఆగస్టు వరకు రూ.25 కోట్ల వ్యాపారం చేసినట్లు లబ్ధిదారులు వివరించారు. 110 యూఎల్బీల్లో ప్రతినెలా ఒకరోజు ఏర్పాటు చేసే అర్బన్ మార్కెట్ ద్వారా ఒక్కోచోట సగటున రూ.30 వేల నుంచి రూ.40 వేల దాకా వ్యాపారం చేస్తున్నట్టు తెలిపారు. వీటితోపాటు ఆస్పత్రులు, మార్కెట్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన 140 మెప్మా ఆహా క్యాంటీన్ల ద్వారా సంఘాల సభ్యులు ఆదాయం పొందుతున్న తీరును, వాటికున్న డిమాండ్‌ను సదస్సులో పంచుకున్నారు.

మెప్మా ఆధ్వర్యంలో ‘పట్టణ ప్రగతి’ యూనిట్లు

పర్యావరణ అనుకూల ఉత్పత్తుల తయారీలో శిక్షణ



మహిళలకు అండగా సీఎం



మహిళా సాధికారత అంటే ఇన్నాళ్లూ మాకు తెలియదు. ఇంటికే పరిమితమైన మమ్మల్ని సీఎం జగన్ ప్రగతి వైపు అడుగులు వేయించారు. ప్రభుత్వ ప్రోత్సాహంతో ఆర్థికంగా ఎదుగుతున్నాం. తిరుపతిలో జగనన్న మహిళా మార్ట్ ఏర్పాటు చేసుకున్నాం. పెద్దపెద్ద మార్ట్‌లతో పోటీ పడి వ్యాపారంలో లాభాలు పొందుతున్నాం. నవరత్నాల పథకాలను ప్రధానంగా మహిళల కోసమే అమలు చేస్తున్నారు.

– ప్రతిమారెడ్డి, తిరుపతి

గత ప్రభుత్వంలో మోసపోయాం



ఎన్నో ఏళ్లుగా పొదుపు సంఘంలో సభ్యురాలిగా ఉన్నా ఏనాడు ఆర్థికంగా బాగున్నది లేదు. గత ప్రభుత్వం రుణమాఫీ చేస్తామని చెప్పడంతో సభ్యులు ఎంతో ఆశతో రుణాలు చెల్లించడం ఆపేశారు. దాంతో బ్యాంకు మా సంఘాన్ని డిఫాల్టర్‌గా ప్రకటించింది. ఈ ప్రభుత్వం వచ్చాక వాటిని చెల్లిస్తూ వ్యాపారం దిశగా ప్రోత్సహించింది. ఇప్పుడు బ్యాంకులు పొదుపు సంఘాలకు రూ.20 లక్షల వరకు రుణాలు ఇచ్చేందుకు ముందుకు వస్తున్నాయి.

– షేక్ ఫాతిమా, నరసరావుపేట

మహిళా సాధికారతే లక్ష్యం



మెప్మాలోని సభ్యులు ప్రతి ఒక్కరూ ఆర్థికంగా ఎదిగేందుకు రాష్ట్ర ప్రభుత్వం సహకారం అందిస్తోంది. ఇప్పటికే జగనన్న మహిళా మార్టులు, ఆహా క్యాంటీన్లు, అర్బన్ మార్కెట్ల నిర్వహణతో మహిళలు విజయం సాధించారు. అనుకున్న దానికంటే మంచి ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు. గతంలో మహిళా పొదుపు సంఘాలకు రుణాలు ఇవ్వాలంటే బ్యాంకులు ఎంతో ఆలోచించేవి. ఇప్పుడా పరిస్థితి లేదు. మహిళల్లో అద్భుతమైన వ్యాపార దక్షత ఉంది. వారు తయారు చేసే చేతి వస్తువులు, ఆహార పదార్థాలను ఈ-కామర్స్ సైట్ల ద్వారా విక్రయించేలా ప్రణాళిక రూపొందించాం. మహిళల ఆర్థిక ప్రగతే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోంది. వారిని మరో మెట్టు ఎక్కించేందుకు మెప్మా ద్వారా తయారీ యూనిట్లు కూడా నెలకొల్పే ఏర్పాట్లు చేస్తున్నాం. ఉచితంగా శిక్షణనిచ్చి ఆర్థిక సాయం చేసి వ్యాపార యూనిట్లు పెట్టిస్తాం. పట్టణ ప్రగతి యూనిట్లు నెలకొల్పే దిశగా సాయం అందిస్తాం.

– వి.విజయలక్ష్మి, మెప్మా మిషన్ డైరెక్టర్

ఆహా క్యాంటీన్‌తో ఉపాధి



గతంలోనూ పట్టణ మహిళా పొదుపు సంఘాలు ఉన్నా పావలా వడ్డీ రుణాలు తప్ప మిగతావి పట్టించుకోలేదు. ఈ ప్రభుత్వం వచ్చాక రుణాలు మంజూరు చేయడంతో పాటు అవగాహన ఉన్న రంగంలో వ్యాపారం దిశగా ప్రోత్సహించి ఆదాయ మార్గాన్ని కూడా చూపించింది. మెప్మా ప్రోత్సాహంతో ఆహా క్యాంటీన్ ఏర్పాటు చేసుకున్నాం. ఒక్కపూటకు అన్ని ఖర్చులు పోను రూ.1,000 లాభం వస్తోంది.

– శ్యామల, అమలాపురం

ప్రతి రూపాయి మాకే..



గత ప్రభుత్వంలో పట్టణ మహిళా పొదుపు సంఘాల పేరుతో చాలా వరకు బోగస్ సంఘాలు ఉండేవి. మాకు రావాల్సిన నిధులు వారికే పోయేవి. ఈ ప్రభుత్వం వచ్చాక ప్రతి సంఘాన్ని, ప్రతి సభ్యురాలి వివరాలను ఆన్‌లైన్ చేశారు. దీంతో బోగస్ సంఘాలు పోయాయి. ప్రభుత్వం ఇచ్చే ప్రతి రూపాయి ఇప్పుడు నేరుగా సంఘాలకే అందుతోంది. శిక్షణనిచ్చి మున్సిపల్ స్థలాల్లో వ్యాపారాలు పెట్టిస్తున్నారు. మమ్మల్ని ఆర్థికంగా ప్రోత్సహిస్తున్నారు.

– మీనాక్షి, విజయవాడ

రైతు భరోసా కేంద్రాల సేవలు భేష్

బజాజ్ ఇన్సూరెన్స్ వైస్ ప్రెసిడెంట్ ఆశిష్ అగర్వాల్



ఇన్సూరెన్స్ కంపెనీల అధికారులకు ఈ-క్రాప్ విధానాన్ని వివరిస్తున్న వ్యవసాయాధికారులు

జరుగుమల్లి (టంగుటూరు): ఆంధ్రప్రదేశ్‌లోని రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు మెరుగైన సేవలు అందుతున్నాయని బజాజ్ అలయెంజ్ జనరల్ ఇన్సూరెన్స్ వైస్ ప్రెసిడెంట్, అగ్రి బిజినెస్ హెడ్ ఆశిష్ అగర్వాల్‌లు ప్రశంసించారు. ప్రకాశం జిల్లా టంగుటూరు మండలంలోని తూర్పునాయుడుపాలెంలోని రైతు భరోసా కేంద్రాన్ని అగ్రి నేషనల్ ఇన్సూరెన్స్ మేనేజర్ సుదేష్ణ, బజాజ్ ఇన్సూరెన్స్ స్టేట్ మేనేజర్ శాంతి భూషణ్, ఒంగోలు ఏడీఏ బి.రమేష్ బాబుతో కలిసి గురువారం వారు సందర్శించారు. రబీ సీజన్ పంటల బీమాకు సంబంధించి (ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన) బజాజ్ ఇన్సూరెన్స్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకున్న నేపథ్యంలో ఈ-క్రాప్ నమోదు, పంట కోత ప్రయోగాలు తదితర వివరాల గురించి వ్యవసాయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం రైతులు సాగు చేస్తున్న పంటల్లో ఏ ఏ పంటలు లాభదాయకంగా ఉంటాయని రైతులను ఆరా తీశారు. పంట సాగు చేసిన వెంటనే ఈ-క్రాప్‌లో వివరాలు నమోదు చేయించుకుంటే ప్రకృతి వైపరీత్యాల సమయంలో నష్టం సంభవిస్తే బీమా వర్తిస్తుందని రైతులకు వివరించారు. రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులను పంపిణీ చేస్తున్న తీరు, గత సంవత్సరం రబీలో ఈ-క్రాప్ నమోదు చేయించుకున్న రైతుల రశీదులను ఈ సందర్భంగా వారు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. రైతు భరోసా కేంద్రాలు ఇతర రాష్ట్రాలకు మార్గదర్శకంగా ఉన్నాయని వారు కొనియాడారు. దేశంలోని ఇతర రాష్ట్రాల్లోనూ వీటిని ఏర్పాటు చేస్తే రైతులకు ప్రయోజనకరంగా ఉంటుందని ఆశిష్ అగర్వాల్ తదితరులు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి స్వర్ణలత, ఏఈవో ఎస్.వెంకటేశ్వర్లు, వీఏఏ ఎల్.గ్రేస్ రీమల్, పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు.

‘గ్రాంట్’ ముసుగు..‘కైండ్’ మిస్టరీ!

నిధులు కాజేసేందుకు చంద్రబాబు ‘స్కిల్’ ఇదీ

- ఆర్థిక సాయమూ లేదు.. వస్తు సహకారం అసలే లేదు
- రూ.330 కోట్ల ప్రాజెక్ట్ అమాంతంగా రూ.3,300 కోట్లకు
- టెండర్లు లేకుండా ఏకపక్షంగా కట్టబెట్టేందుకే ‘గ్రాంట్’ బుకాయింపు
- డిజైన్‌టెక్‌కు 34.88 శాతం లాభం

సాక్షి, అమరావతి: యువత శిక్షణ కోసం భారీగా ఆర్థిక సహాయం అందిస్తామని అప్పటిదాకా నమ్మబలికిన ప్రైవేట్ కంపెనీ ప్లేటు ఫిరాయించింది! భారీ లాభాన్ని వేసుకుని మరీ ప్రాజెక్టును దక్కించుకుని ప్రజాధనాన్ని కాజేసింది. రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) కుంభకోణంలో తవ్వేకొద్దీ కొత్త కోణాలు వెలుగులోకి వస్తున్నాయి. తొలుత జీవోలు, ఒప్పందాల్లో ఉన్న ‘గ్రాంట్ ఇన్ ఎయిడ్ (ఆర్థిక సహకారం) అనే పదం స్థానంలో తరువాత ‘గ్రాంట్ ఇన్ కైండ్ (వస్తు సహకారం) చేరింది. చివరకు ‘గ్రాంట్ ఇన్ కైండ్’ సైతం అదృశ్యమైంది. ఈ మాయాజాలంతో చివరకు టెండర్ల ప్రక్రియ అనేదే లేకుండా పోయింది. తద్వారా డిజైన్‌టెక్‌కు ఏకపక్షంగా కట్టబెట్టేసి రూ.371 కోట్లు చెల్లించేశారు. అందులో రూ.241 కోట్లను షెల్ కంపెనీల ద్వారా బాబు గూటికి చేరవేశారు.

Abstract of Cost Estimation Versions of Siemens Team – Analysis Report)

Cost Version	email date	Proposed total Project Cost – for one cluster (In Crores)	Contribution of M/s DesignTech & M/s Siemens (In Crores)	Contribution of Govt.. of AP (In Crores) (%=S.No.5X100 /Sl.No.3)	Total Capex + Opex for 6 Clusters (In Crores) (Actual cost shown in estimation version by Siemens team)	Margin amount/Profit shown in cost estimation (330 Cr - Sr.No.6) & Percentage (Sr.NO.7/330 *100) (for Sr.No.6)
Proposal Price = For 1 Cluster = Rs.55 Crores, For 6 Clusters = Rs.330 Crores						
V.1	23.12.2014	–	–	–	282.86 (For 1 Cluster= 47.14 Cr)	47.73 Cr (14.46 %)
V.2	27.12.2014	504.33	449.33	55 (10.91%)	295.08 (For 1 Cluster = 49.18 Cr)	34.92 Cr (10.58%)
V.4	29.12.2014	488.31	433.31	55 (11.26%)	227.39 (For 1 Cluster)= 37.90 Cr)	102.60 Cr (31%)
V.5 (1)	29.12.2014	488.95	433.95	55 (11.25%)	231.21 (For 1 Cluster= 38.54)	98.79 Cr (29.93%)
V.5 (2)	29.12.2014	512.74	457.74	55 (10.73)	232.41 (For 1 Cluster = 38.54)	97.58 Cr (29.6%)
V.6	30.12.2014	510.58	455.58	55 (10.77)	237.20 (For 1 Cluster = 39.53)	92.79 Cr (28.12)
V.7 (0)	31.12.2014	508.54	453.54	55 (10.82%)	246.89 (For 1 Cluster = 41.15)	83.10 (25.18%)
V.7(1) Final	9.01.2015	553.28	498.28	55 (9.94%)	214.88 (For 1 Cluster =35.81)	115.11 (34.88%)
V.7(1) Final	27.01.2015	553.28	498.28	55 (9.94%)	214.88 (For 1 Cluster =35.81)	115.11 (34.88%)
V.7(3)	26.02.2015	553.28	498.28	55 (9.94%)	214.88 (For 1 Cluster =35.81)	115.11 (34.88%)
V.7(4)	10.03.2015 & 13.03.2015	553.28	498.28	55 (9.94%)	214.88 (For 1 Cluster =35.81)	115.11 (34.88%)
V.7(5) (Final)	25.03.2015	553.28	498.28	55 (9.94%)	214.88 (For 1 Cluster = 35.81)	115.11 (34.88%)

స్కిల్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ ఏర్పాటు కోసం రూ.330 కోట్లు వ్యయం అవుతుంది అని రూపొందించిన నివేదిక.. కానీ ప్రాజెక్ట్ వ్యయాన్ని ఏకంగా రూ.3,300 కోట్లకు పెంచేసి ప్రజాధనం కొల్లగొట్టారు

34.88 శాతం లాభంతో..

ఏపీ ఎస్ఎస్‌డీసీ ప్రాజెక్టు ముసుగులో నిధులను కొల్లగొట్టాలని ముందుగానే నిర్ణయించుకున్న మాజీ సీఎం చంద్రబాబు ఆరు క్లస్టర్లుగా అంచనా వ్యయం నివేదికను రూపొందించాలని ఆదేశించారు. వివిధ అంశాలను ప్రాతిపదికగా చేసుకుని అధికారులు ఏడు నివేదికలు రూపొందించారు. వాటిల్లో ప్రాజెక్టు కనిష్ట వ్యయం రూ.214 కోట్లు కాగా గరిష్ట వ్యయం రూ.282 కోట్లుగా మాత్రమే ఉంది. బినామీ సంస్థ డిజైన్ టెక్ లాభం 34.88 శాతాన్ని కూడా కలిపి ఒక్కో క్లస్టర్‌కు రూ.55 కోట్లు చొప్పున మొత్తం ఆరు క్లస్టర్లకు రూ.330 కోట్లు అవుతుందని నివేదిక రూపొందించారు. అందులో 90 శాతం సీమెన్స్–డిజైన్ టెక్ భరిస్తాయని, మిగతా 10 శాతం నిధులను ప్రభుత్వం సమకూర్చాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అసలు ఈ ప్రాజెక్టు గురించే సీమెన్స్ కంపెనీకి తెలియదు. ఆ కంపెనీ 90 శాతం నిధులను సమకూర్చదని చంద్రబాబుకు స్పష్టంగా తెలుసు. 34.88 శాతం అంటే భారీ లాభమే. మరి లాభం ప్రస్తావన ఉన్న ప్రాజెక్టుకు ‘గ్రాంట్ ఇన్ ఎయిడ్’ ఎలా వస్తుందనే ప్రాథమిక అంశాన్ని కూడా చంద్రబాబు పరిగణలోకి తీసుకోలేదు. ప్రజల్ని మభ్యపెట్టేందుకే ఆ కంపెనీ పేరును వాడుకున్నారు.

అంచనాలు పెంచి వాటా నిధులు స్వాహా

ప్రాజెక్టు వ్యయాన్ని భారీగా పెంచేస్తే అందులో ప్రభుత్వం వాటా 10 శాతం కింద వెచ్చించాల్సిన నిధులు కూడా ఆ మేరకు పెరుగుతాయి. తద్వారా ఆ నిధులను షెల్ కంపెనీల ద్వారా అక్రమంగా మళ్లించేలా చంద్రబాబు పథకం వేశారు. అందుకే ఆరు క్లస్టర్లకు కలిపి రూ.330 కోట్లుగా ఉన్న ప్రాజెక్ట్‌ను ఏకంగా రూ.3,300 కోట్లకు అమాంతం అంచనాలు పెంచేసి ఖరారు చేశారు. సిమెన్స్ ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండానే ప్రభుత్వ వాటా 10 శాతం కింద జీఎస్టీతో కలిపి రూ.371 కోట్లను నిబంధనలకు విరుద్ధంగా చెల్లించేశారు. చంద్రబాబు ఆదేశాలతోనే నిధులు చెల్లించినట్లు ఆర్థిక శాఖ అధికారులు వాంగ్మూలం కూడా ఇచ్చారు. అందులో షెల్ కంపెనీల ద్వారా రూ.241 కోట్లు చంద్రబాబు గూటికి చేరాయి. అదే విషయం సీఐడీ దర్యాప్తులో ఆధారాలతో సహా వెల్లడైంది.

ఎయిడ్ లేదు.. కైండ్ అంత కంటే లేదు

ఏపీఎస్ఎస్‌డీసీ ప్రాజెక్టు వ్యయంలో 90 శాతం నిధులను సీమెన్స్ కంపెనీ ‘గ్రాంట్ ఇన్ ఎయిడ్’గా సమకూరుస్తుందని టీడీపీ సర్కారు జీవోలో పేర్కొంది. వాస్తవానికి ఈ ప్రాజెక్ట్ గురించి సీమెన్స్ కంపెనీకి ఏమాత్రం తెలియదు. ఢిల్లీలో ఆ కంపెనీ ఎండీగా ఉన్న సుమన్ బోస్ ద్వారా చంద్రబాబు ముఠా గూడుపుఠాణి నడిపించింది. జీవో జారీ చేసిన తరువాత డిజైన్ టెక్ కంపెనీని రంగంలోకి తెచ్చారు. సీమెన్స్–డిజైన్ టెక్ కంపెనీలు ప్రాజెక్ట్ వ్యయంలో 90 శాతాన్ని గ్రాంట్ ఇన్ ఎయిడ్‌గా సమకూరుస్తాయంటూ త్రైపాక్షిక ఒప్పందం కుదుర్చుకున్నారు. అసలు కథ ఇక్కడే మొదలైంది. సీమెన్స్ కంపెనీకి తెలియకుండా సుమన్ బోస్ నడిపిన ఉత్తర ప్రత్యుత్తరాల్లో (నేరుగా ముఖ్యమంత్రి హోదాలో ఉన్న చంద్రబాబుకు లేఖలు రాశారు) గ్రాంట్ ఇన్ ఎయిడ్ అనే పదం ఎక్కడా లేదు. ఆ స్థానంలో ‘గ్రాంట్ ఇన్ కైండ్ అని పేర్కొన్నారు. పోనీ ఆ విధంగానైనా సాఫ్ట్‌వేర్, ఇతర మౌలిక సదుపాయాలు ఉచితంగా అందించారా? అంటే అదీ లేదు. ప్రాజెక్టు వ్యయంగా చెప్పుకున్న రూ.3,300 కోట్లలో 90 శాతం కాదు కదా కనీసం ఒక్క రూపాయి విలువైన ఆర్థిక సహకారంగానీ వస్తు సహాయాన్ని గానీ అందించ లేదు. చంద్రబాబు వీటిని ఏమాత్రం పట్టించుకోకుండా నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ వాటా 10 శాతం కింద జీఎస్టీతో కలిపి రూ.371 కోట్లను డిజైన్‌టెక్‌కు చేరవేశారు. అంటే గ్రాంట్ ఇన్ ఎయిడ్ లేదు! గ్రాంట్ ఇన్ కైండ్ అంత కంటే లేదు! చివరికి చంద్రబాబు దోపిడీ మాత్రమే మిగిలిందని స్పష్టమైంది.

టెండర్లు లేకుండా కట్టబెట్టడానికే...

సుమన్ బోస్ నాటి సీఎం చంద్రబాబుతో సాగించిన ఉత్తర ప్రత్యుత్తరాల్లో ‘గ్రాంట్ ఇన్ ఎయిడ్’ అనే పదాన్ని ఎక్కడా వాడలేదు. చంద్రబాబు మాత్రం సీమెన్స్, డిజైన్ టెక్ కంపెనీలు 90 శాతం నిధులను ఆర్థిక సహాయంగా సమకూరుస్తాయని ఎందుకు చెబుతూ వచ్చారన్నది కీలకంగా మారింది. ఎందుకంటే...? గ్రాంట్ ఇన్ ఎయిడ్ అని ఉంటే టెండర్లు పిలవాల్సిన అవసరం లేదు. ఓ ప్రాజెక్టులో ప్రైవేటు కంపెనీలు లాభం తీసుకుంటే నిబంధనల ప్రకారం టెండర్లు పిలవాలి. టెండర్లు పిలిస్తే అర్హత ఉన్న ఎన్నో కంపెనీలు పోటీ పడతాయి. ప్రాజెక్ట్‌ను యథాతథంగా అమలు చేయాల్సి ఉంటుంది. అందుకే టెండర్ల ప్రక్రియ లేకుండా ఏకపక్షంగా నామినేషన్ విధానంలో డిజైన్‌టెక్‌కు ఈ ప్రాజెక్టు కట్టబెట్టడానికే చంద్రబాబు ఈ పథకం వేశారు. గ్రాంట్ ఇన్ ఎయిడ్ అనే ముసుగులో డిజైన్ టెక్‌కు కట్టబెట్టేశారు. తరువాత నిబంధనలకు విరుద్ధంగా ఆ కంపెనీకి రూ.371 కోట్లు విడుదల చేశారు. కమీషన్లు పోనూ అందులో రూ.241 కోట్లను హైదరాబాద్‌లోని తన బంగ్లాకు తరలించారు.

ఆర్టీసీ ఉద్యోగులకు రూ.1.10 కోట్ల బీమా

- రూ.45 లక్షల నుంచి ఏకంగా రూ.1.10 కోట్లకు పెంపు
- ఎస్‌బీఐతో కార్పొరేట్ శాలరీ ప్యాకేజీ ఒప్పందం



ఒప్పందం కుదుర్చుకుంటున్న ఆర్టీసీ, ఎస్‌బీఐ అధికారులు

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రజా రవాణా విభాగంలో సేవలందిస్తున్న ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమం దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఆర్టీసీ ఉద్యోగుల కార్పొరేట్ శాలరీ ప్యాకేజీ (బీమా)ని రూ.45 లక్షల నుంచి ఏకంగా రూ.1.10 కోట్లకు పెంచింది. ఈమేరకు ఆర్టీసీ గురువారం ఎస్‌బీఐతో కార్పొరేట్ శాలరీ ప్యాకేజీ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసిన తరువాత మూడేళ్ల క్రితం రూ.45 లక్షల కార్పొరేట్ శాలరీ ప్యాకేజీని అమలులోకి తెచ్చింది. తాజాగా దీన్ని ఏకంగా రూ.1.10 కోట్లకు పెంచడం విశేషం. కొత్త శాలరీ ప్యాకేజీ 2026 సెప్టెంబరు 2 వరకు అమలులో ఉంటుంది.

ఉద్యోగుల సంక్షేమానికి సీఎం జగన్ ప్రాధాన్యం : పినిపె విశ్వరూప్, రవాణా శాఖ మంత్రి

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం ద్వారా ఉద్యోగుల దీర్ఘకాలిక ఆకాంక్షను నెరవేర్చి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కొత్త చరిత్ర సృష్టించారని రవాణా శాఖ మంత్రి పినిపె విశ్వరూప్ పేర్కొన్నారు. శాలరీ ప్యాకేజీ ఒప్పందం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యమిస్తోందని చెప్పారు. అధిక పెన్షన్ విధానంతో అప్పటి వరకు రూ.5 వేలు పింఛన్ పొందిన ఉద్యోగులకు ఏకంగా రూ.40 వేల వరకు పెన్షన్ పెరిగిందన్నారు. ఇప్పుడు ప్రమాద బీమాను రూ.1.10 కోట్లకు పెంచడం ఉద్యోగుల కుటుంబాలకు భరోసానిస్తుందన్నారు. ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై ఆర్టీసీ ఎండీ సీహెచ్.ద్వారకా తిరుమలరావు కృతజ్ఞతలు తెలిపారు. సంస్థ అభివృద్ధికి ఉద్యోగులు చిత్తశుద్ధితో పని చేయాలని కోరారు. ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమ కార్యక్రమాల్లో భాగస్వామి కావడం పట్ల ఎస్‌బీఐ జనరల్ మేనేజర్ ఓం నారాయణ శర్మ సంతోషం వ్యక్తం చేశారు. రూ.1.10 కోట్ల ప్రమాద బీమాతో పాటు ఆర్టీసీ ఉద్యోగులు మరణిస్తే వారి పిల్లల చదువుల కోసం అబ్బాయిలకు రూ.8 లక్షలు, అమ్మాయిలకు రూ.10 లక్షల వరకు విద్యా రుణాలు అందిస్తున్నామన్నారు. ఉద్యోగుల పిల్లల వివాహ రుణాలను రూ.2 లక్షల నుంచి రూ.10లక్షలకు పెంచామన్నారు. కార్యక్రమంలో రవాణా శాఖ కమిషనర్ ఎంకే సిన్హా, ఆర్టీసీ ఈడీలు కేఎస్ బ్రహ్మానందరెడ్డి, ఏ.కోటేశ్వరరావు, కృష్ణమోహన్,ఎఫ్ఏ–సీఏ రాఘవరెడ్డి పాల్గొన్నారు.

ఈయూ హర్షం

ఆర్టీసీ ఉద్యోగులకు రూ.1.10 కోట్ల కార్పొరేట్ శాలరీ ప్యాకేజీని అమలు చేయడంపట్ల ఈయూ హర్షం వ్యక్తం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమంపై చిత్తశుద్ధితో కృషి చేస్తోందని కృతజ్ఞతలు తెలిపింది.ఈమేరకు ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.దామోదరరావు, జీవీ నరసయ్య ఓ ప్రకటన జారీ చేశారు.

ఆర్టీసీ ఉద్యోగులకు కార్పొరేట్ శాలరీ ప్యాకేజీ ఇలా..

- ప్రమాద బీమా రూ.30 లక్షల నుంచి రూ.85 లక్షలకు పెంపు
- రూపే డెబిట్ కార్డ్ లింకేజీ ద్వారా రూ.10 లక్షలు
- కొత్త రూపే కార్డ్ ద్వారా మరో రూ.10 లక్షలు
- సహజ మరణానికి రూ.5 లక్షలు
- మొత్తం మీద రూ.1.10 కోట్లు

రీజెన్సీ సిరామిక్స్ పునరుద్ధరణ

- ట్రయల్ రన్ సక్సెస్
- చెన్నైలో తొలి ఉత్పత్తి ప్రదర్శన
- మూడేళ్లలో ఆదాయ లక్ష్యం రూ.100 కోట్లు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: కేంద్రపాలిత ప్రాంతమైన యానాంలోని రీజెన్సీ సిరామిక్స్ గురువారం పునః ప్రారంభమైంది. కార్మికుల వివాదాల నేపథ్యంలో దశాబ్దంన్నర క్రితం యానాం రీజెన్సీ లాకౌట్ ప్రకటించింది. అప్పటి నుంచి ఫ్యాక్టరీ పునరుద్ధరణకు చేస్తున్న ప్రయత్నాలు ఎట్టకేలకు కొలిక్కివచ్చాయి. ప్రయోగాత్మకంగా ఉత్పత్తి కూడా ప్రారంభమైంది. రీజెన్సీ సిరామిక్స్‌ను తిరిగి పూర్తిస్థాయిలో మార్కెట్‌లోకి తీసుకొచ్చేందుకు యాజమాన్యం ఏర్పాట్లు పూర్తిచేసింది. సంక్లిష్టమైన డిజైన్‌లకు మారుపేరుగా నిలిచిన రీజెన్సీ సిరామిక్స్ తొలిసారి రీజెన్సీ నేచురల్ టైల్స్‌ను చెన్నైలో విడుదల చేసింది. రూ.70 కోట్ల ప్రారంభ పెట్టుబడితో ఉత్పత్తిని ప్రారంభించింది. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు కంపెనీ నాలుగు టైల్స్ తయారీ లైన్లలో మొదటి దానిని ప్రారంభించేందుకు సిద్ధం చేసింది. కంపెనీ మొదటి లైన్ రోజుకు 7 వేల చదరపు మీటర్లను ఉత్పత్తి చేయనుంది. దీనిని రోజుకు 25 వేల చదరపు మీటర్ల సామర్థ్యానికి విస్తరించనున్నారు. అన్ని పరిమాణాలు, రకాలు, గ్లేజ్డ్ విట్రిఫైడ్ టైల్స్, ఫుల్ బాడీ విట్రిఫైడ్ టైల్స్, పాలిష్డ్ విట్రిఫైడ్ టైల్స్, డబుల్ చార్జ్‌డ్ టైల్స్, వాల్ టైల్స్, ఎక్స్‌టీరియర్ టైల్స్, స్టెప్స్, రైజర్‌లలో ఉత్పత్తి చేయడానికి నిర్ణయించారు. రీజెన్సీ ఉత్పత్తులను దేశంలోనే దక్షిణాది, తూర్పు ప్రాంతాలకు విస్తరించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా రీజెన్సీ డైరెక్టర్ నరాల సత్యేంద్రప్రసాద్ ‘సాక్షి’తో మాట్లాడుతూ.. ఉమ్మడి తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కేరళ, ఒడిశా రాష్ట్రాల్లో వ్యాపారాన్ని విస్తరించనున్నట్టు చెప్పారు. వచ్చే మూడేళ్లలో రూ.100 కోట్లు ఆదాయం లక్ష్యంగా ఉత్పత్తిపై దృష్టి పెట్టామన్నారు. రాజధాని నగరాలతోపాటు మిగిలిన నగరాల్లో షోరూంలు ఏర్పాటు చేయనున్నట్టు ఆయన పేర్కొన్నారు. యానాంతోపాటు ఆంధ్రప్రదేశ్‌లో ఆర్థిక వ్యవస్థ బలోపేతంలో రీజెన్సీ భాగస్వామ్యం వహిస్తుందని ఆయన చెప్పారు.



పునరుద్ధరించిన రీజెన్సీ సిరామిక్స్ టైల్స్‌ను ప్రారంభిస్తున్న రీజెన్సీ డైరెక్టర్

క్లుప్తంగా...

ఢిల్లీ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫెయిర్‌లో ఏపీ భాగస్వామ్యం

నవంబర్ 14 నుంచి 27 వరకు ప్రగతి మైదాన్‌లో నిర్వహణ

సాక్షి, అమరావతి: ప్రతి సంవత్సరం న్యూఢిల్లీలో నిర్వహించే అతిపెద్ద ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫెయిర్‌లో రాష్ట్ర ప్రభుత్వం భాగస్వామ్యం కానుంది. ప్రగతి మైదాన్‌లో నవంబర్ 14 నుంచి 27వ తేదీ వరకు 'వసుదైక కుటుంబం–యునైటెడ్ బై ట్రేడ్' అనే థీమ్‌తో నిర్వహించే ఈ ట్రేడ్ ఫెయిర్‌లో మన రాష్ట్రంలో పెట్టుబడుల అవకాశాలను వివరించేందుకు ప్రత్యేకంగా పెవిలియన్‌ను ఏర్పాటు చేయనున్నారు. దేశ, విదేశాల నుంచి వచ్చే వ్యాపార ప్రతినిధులకు రాష్ట్రంలో ఉన్న సహజ వనరులు, తక్కువ వ్యయంతో సులభతర వాణిజ్యం వంటి అంశాలను వివరించే విధంగా 500 చదరపు మీటర్ల విస్తీర్ణంలో పెవిలియన్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు పరిశ్రమల శాఖ ఉన్నతాధికారులు వెల్లడించారు. రాష్ట్రంలోని హస్తకళలకు అంతర్జాతీయ ప్రచారం కల్పించే విధంగా 2డీ, 3డీ మోడల్స్‌ను ఏర్పాటు చేయడంతోపాటు రాష్ట్రంలో పెట్టుబడి అవకాశాలు, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను వివరిస్తూ భారీ ఎల్‌ఈడీ స్క్రీన్‌ను ఏపీ పెవిలియన్‌లో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలకు అద్దంపట్టే విధంగా ఈ పెవిలియన్‌ను తీర్చిదిద్దుతామని, దీనికి సంబంధించి ఆసక్తిగల సంస్థల నుంచి బిడ్లను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు.

'పాలమూరు-రంగారెడ్డి' జీవోపై సుప్రీంకోర్టుకు ఏపీ

ఎస్‌ఎల్‌పీ దాఖలు చేయాలని ప్రభుత్వ నిర్ణయం



సాక్షి, అమరావతి: పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి 90 టీఎంసీలు కేటాయించుకుంటూ తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల(జీవో)ను రద్దు చేయాలని సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్(ఎస్‌ఎల్‌పీ) దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆ జీవోపై విచారణ చేపట్టడం తమ పరిధిలోకి రాదంటూ ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన ఇంటర్ లోకేటరీ అప్లికేషన్(ఐఏ)ను తిరస్కరిస్తూ కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్(కేడబ్ల్యూడీటీ-2) బుధవారం తీర్పు ఇచ్చింది. ఈ అంశంపై మరో న్యాయస్థానాన్ని ఆశ్రయించే స్వేచ్ఛ ఏపీ ప్రభుత్వానికి ఉందని స్పష్టం చేసింది. దీంతో సుప్రీంకోర్టును ఆశ్రయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలకు నీటి కేటాయింపుల వల్ల రాష్ట్ర హక్కులకు విఘాతం కలుగుతుందని నివేదించనుంది. ఆ జీవోను రద్దు చేయడం ద్వారా ఏపీ హక్కులను పరిరక్షించాలని సుప్రీంకోర్టుకు విన్నవించనుంది.

కేంద్రీయ విద్యాలయ పూర్వ ప్రిన్సిపాల్‌పై సీబీఐ కేసు

తాటిచెట్లపాలెం (విశాఖ ఉత్తర): తాటిచెట్లపాలెంలోని కేంద్రీయ విద్యాలయ వాల్తేర్‌లో నకిలీ ధ్రువీకరణ పత్రాలతో విద్యార్థులకు ప్రవేశం కల్పించారనే అభియోగాలపై పాఠశాల పూర్వ ప్రిన్సిపాల్‌పై సీబీఐ కేసు నమోదు చేసింది. కేంద్రీయ విద్యాలయ వాల్తేర్‌లో ప్రిన్సిపాల్‌గా పనిచేసిన ఎస్.శ్రీనివాసరాజా రెండేళ్లలో 193 మంది విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి లంచం తీసుకుని నకిలీ ధ్రువీకరణపత్రాలతో విద్యార్థులకు అక్రమంగా ప్రవేశాలు కల్పించినట్టు సీబీఐ ఎఫ్ఐఆర్‌లో పేర్కొంది. కేంద్రీయ విద్యాలయ కమిషనర్ అనుమతి పొందిన తరువాత శ్రీనివాసరాజాపై చర్యలు తీసుకుంటామని సీబీఐ వెల్లడించింది. ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనివాసరాజా ఈ ఏడాది ప్రారంభంలో ఇక్కడి నుంచి బదిలీ అయ్యారు.

27న వామపక్షాల ధర్నా

రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మానం

సాక్షి, అమరావతి: విద్యుత్ ఛార్జీల పెంపుదలను, ప్రజా ఉద్యమాలపై నిర్బంధాన్ని నిరసిస్తూ ఈ నెల 27న అన్ని జిల్లా కలెక్టరేట్ల వద్ద ధర్నాలు నిర్వహించాలని వామపక్ష పార్టీలు తీర్మానించాయి. విజయవాడలో గురువారం పది వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుతో పాటు ముప్పాళ్ళ నాగేశ్వరరావు (సీపీఐ), కె.పోలారి(సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ), హరినాథ్ (లిబరేషన్), రామకృష్ణ (సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ), ఖాదర్ భాషా (ఎంసీపీఐయు), సుధీర్ (ఎస్‌యుసీఐసీ), ఎంఏ గఫూర్(సీఐటీయూ) మాట్లాడారు. విద్యుత్ ఛార్జీలను తగ్గించాలనే తీర్మానాన్ని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు ప్రవేశపెట్టారు.


శ్రీనివాసరావు బెయిల్ పిటిషన్‌పై వాదనలు పూర్తి

విశాఖ లీగల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై గతంలో విశాఖ ఎయిర్‌పోర్టులో జరిగిన హత్యాయత్నం కేసులో నిందితుడు జనపల్లి శ్రీనివాసరావు పెట్టుకున్న బెయిల్ పిటిషన్‌పై గురువారం ఇరువర్గాల వాదనలు పూర్తయ్యాయి. న్యాయమూర్తి తీర్పును రిజర్వులో ఉంచారు. ప్రస్తుతం శ్రీనివాసరావు విశాఖ కేంద్ర కారాగారంలో ఉన్నాడు. ప్రాసిక్యూషన్ తరఫున ఎన్‌ఐఏ ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్లు కోర్టుకు హాజరయ్యారు. కేసు విచారణ జరిపిన న్యాయమూర్తి ఈ నెల 29కి వాయిదా వేశారు.

ఓడీఎల్ అడ్మిషన్లు కఠినతరం

19కి పైగా కోర్సుల్లో ప్రవేశాలపై నిషేధం

వీటితోపాటు పీహెచ్‌డీ, ఎంఫిల్ కోర్సులూ చేపట్టరాదు	అభ్యర్థులు వీటిల్లో చేరేముందు వాటిని పరిశీలించుకోవాలి
	ఓడీఎల్ కోర్సుల నిర్వహణలో టెరిటోరియల్ నిబంధనలు
	సెంట్రల్ వర్సిటీల ద్వారా మాత్రమే దేశవ్యాప్త కోర్సులు
	స్టేట్ వర్సిటీలు ఆయా రాష్ట్రాల పరిధిలోనే చేపట్టాలి
వీటిని అందించే సంస్థలకు విధిగా యూజీసీ అనుమతి ఉండాలి	డీమ్డ్ వర్సిటీలు తమ క్యాంపస్ పరిధిలో మాత్రమే అందించాలి
	ఓడీఎల్, ఆన్‌లైన్ ప్రోగ్రాములను ఫ్రాంచైజీల ద్వారా అందించడంపై నిషేధం
	విధివిధానాలు ప్రకటించిన యూజీసీ



సాక్షి, అమరావతి: ఆన్‌లైన్, ఆన్‌లైన్ డిస్టెన్స్ లెర్నింగ్ (ఓడీఎల్) కోర్సులకు సంబంధించి యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) కీలక నిర్ణయం తీసుకుంది. ఓడీఎల్ ప్రోగ్రాముల పేరిట అనేక ఆన్‌లైన్ విద్యా సంస్థలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తూ ఇష్టానుసారంగా కోర్సులను అందిస్తామంటూ విద్యార్థులను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్న నేపథ్యంలో వాటిని నియంత్రించేందుకు యూజీసీ పటిష్ట విధివిధానాలను ప్రకటించింది. అండర్ గ్రాడ్యుయేషన్, పోస్టు గ్రాడ్యుయేషన్‌లలో ఓపెన్ డిస్టెన్స్ లెర్నింగ్, ఆన్‌లైన్ డిగ్రీ ప్రోగ్రాంలకు సంబంధించి తాజా నియంత్రణ నిబంధనలను విడుదల చేసింది. అలాగే, 2020లోనూ యూజీసీ కొన్ని మార్గదర్శకాలను వెల్లడించింది. యూజీ, పీజీ డిగ్రీలకు సంబంధించి ఆయా సంస్థల నిర్దేశిత ప్రమాణాలను పాటించేలా 2021లో మరికొన్ని సవరణలను ప్రతిపాదించింది. ఈ ప్రోగ్రాముల్లో కనీస బోధనా ప్రమాణాలుండేలా తాజాగా మరిన్ని నిబంధనలను రూపొందించింది.

ఈ అంశాల్లో ఓడీఎల్, ఆన్‌లైన్ ప్రోగ్రాంలకు నో..

ఓడీఎల్, ఆన్‌లైన్ ప్రోగ్రాంలలో కొన్ని అంశాలను మాత్రమే యూజీసీ అనుమతులిస్తోంది. ప్రాక్టికల్స్, ఇతర క్షేత్రస్థాయి ప్రయోగాలతో సంబంధమున్న అంశాల్లో ఓడీఎల్, ఆన్‌లైన్ ప్రోగ్రాంలను నిషేధించింది. అవి..

- ఇంజనీరింగ్, మెడికల్, ఫిజియోథెరపీ, ఆక్యుపేషన్ థెరపీ, పారామెడికల్, ఫార్మసీ, నర్సింగ్, డెంటల్, ఆర్కిటెక్చర్, లా, అగ్రికల్చర్, హార్టికల్చర్, హోటల్ మేనేజ్‌మెంట్, కేటరింగ్ టెక్నాలజీ, కలినరీ సైన్సెస్, ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్, విజువల్ ఆర్ట్స్, స్పోర్ట్స్, ఏవియేషన్.
- ఇవేకాక.. అధికారిక నియంత్రణ సంస్థలు అనుమతించని ప్రోగ్రాములు వేటినీ ఓడీఎల్, ఆన్‌లైన్ కోర్సుల కింద ఆయా సంస్థలు అందించడానికి వీల్లేదు. యోగా, టూరిజమ్ అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ వంటి అంశాల్లో యూజీ, పీజీ ప్రోగ్రాంలు అందించడానికీ వీల్లేదు. అలాగే, ఆయా సబ్జెక్టులలో ఎంఫిల్, పీహెచ్‌డీ ప్రోగ్రాంలను ఓడీఎల్, ఆన్‌లైన్ కోర్సులుగా అందించకూడదు. ఓడీఎల్, ఆన్‌లైన్ ప్రోగ్రాంలు అందించే ఉన్నత విద్యాసంస్థలు ఆయా కోర్సులకు సంబంధించి నియంత్రణ సంస్థల అనుమతుల పత్రాలు, అఫిడవిట్లు, ఇతర సమాచారాన్ని పూర్తిగా తమ వెబ్‌సైట్‌లో పొందుపరచాలి.

అడ్మిషన్లు తీసుకునే ముందే పరిశీలించాలి..

ఇక విద్యార్థులు ఆయా సంస్థలు అందించే ఓడీఎల్, ఆన్‌లైన్ కోర్సుల్లో చేరే ముందు అవి అధికారిక నియంత్రణ సంస్థల నుంచి అనుమతులు తీసుకున్నాయో లేదో ముందుగా పరిశీలించుకోవాలని.. అలాగే, ఆయా ఉన్నత విద్యాసంస్థల వెబ్‌సైట్లలో ఓడీఎల్, ఆన్‌లైన్ కోర్సులకు సంబంధించిన వివరాలను తనిఖీ చేసుకోవాలని యూజీసీ సూచించింది. అకడమిక్ సెషన్ల వారీగా అనుమతుల స్థితిని యూజీసీ వెబ్‌సైట్ 'హెచ్‌టీటీపీఎస్://డీఈబీ.యూజీసీ.ఏసీ.ఐఎన్'లో యూజీసీ అందుబాటులో ఉంచింది. అడ్మిషన్లు తీసుకునే ముందు యూజీసీ వెబ్‌సైట్‌లోని నోటీసులు, ఇతర ప్రజాసంబంధిత హెచ్చరికలను పరిశీలించాలని కోరింది.

యూజీసీ వెబ్‌సైట్లో ఆయా సంస్థల సమాచారం..

ఓడీఎల్ కోర్సులందించేందుకు అనుమతులున్న సంస్థల వివరాలను కూడా తమ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు యూజీసీ పేర్కొంది. ఆయా డిగ్రీ ప్రోగ్రాంల పేర్లు, వాటి కాలపరిమితి, ఆయా సబ్జెక్టుల అంశాలు యూజీసీ సవరణ నిబంధనలు–2024 ప్రకారం ఉన్నాయో లేవో సరిచూసుకోవాలి. నిషేధిత జాబితాల్లోని ప్రోగ్రాములుంటే కనుక వాటిలో చేరకుండా జాగ్రత్తపడాలి. ఇదిలా ఉంటే.. ఈ కోర్సులను అందించడానికి సంబంధించి కొన్ని విద్యాసంస్థలను డిబార్ చేసినట్లు యూజీసీ ప్రకటించింది. అందులో నర్సీ ముంజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ (మహారాష్ట్ర), శ్రీ వేంకటేశ్వర వర్సిటీ (ఆంధ్రప్రదేశ్) పెరియార్ యూనివర్సిటీ (తమిళనాడు) ఉన్నాయి. ఈ సంస్థలు 2023 జూలై–ఆగస్టు, 2024 జనవరి–ఫిబ్రవరి సెషన్లకు సంబంధించి ఓడీఎల్, ఆన్‌లైన్ కోర్సులు అందించకుండా డిబార్ చేసినట్లు వివరించింది.

ఫ్రాంచైజీలపై నిషేధం..

సెంట్రల్ వర్సిటీలు, రాష్ట్ర వర్సిటీలు, ప్రైవేటు వర్సిటీలు, డీమ్డ్ వర్సిటీలు ఏవైనా సరే తమ కేంద్ర కార్యాలయాల ద్వారా మాత్రమే అందించాలి. ఫ్రాంచైజీల రూపంలో ఓడీఎల్ ప్రోగ్రాములు అందించడానికి వీల్లేదు. అలాగే, లెర్నర్ సపోర్టు కేంద్రాలను నేరుగా ఆయా ఉన్నత విద్యాసంస్థలే నిర్వహించాలి. ఫ్రాంచైజీల ద్వారానో, ఔట్ సోర్సింగ్ ద్వారానో నిర్వహించేందుకు వీల్లేదు. ఈ ఓడీఎల్ ప్రోగ్రాంలు, ఆన్‌లైన్ కోర్సులకు సంబంధించి పూర్తిగా ఆయా ఉన్నత విద్యాసంస్థలే బాధ్యులుగా ఉండాలి. ఫ్రాంచైజీల ద్వారా అందించేందుకు యూజీసీ అనుమతించదు. ఆయా విద్యాసంస్థలు అందించే ప్రోగ్రాంలు యూజీసీ నియమ నిబంధనలకు లోబడి ఉంటేనే వాటికి అండర్ గ్రాడ్యుయేషన్, పోస్టు గ్రాడ్యుయేషన్ డిగ్రీలతో సమానత వర్తిస్తుంది. ఓడీఎల్, ఆన్‌లైన్ ప్రోగ్రాంలకు అడ్మిషన్లను కూడా నిర్ణీత గుర్తింపు ఉన్న కాలానికి మాత్రమే చేపట్టాలి.

టెరిటోరియల్ పరిధిలోనే కోర్సులు..

మరోవైపు.. ఓడీఎల్, ఆన్‌లైన్ ప్రోగ్రాంలను అందించే సంస్థల టెరిటోరియల్ పరిధిని కూడా యూజీసీ నిర్దేశించింది. ఆయా సంస్థలు తమ కోర్సులను అనుమతులున్న కాలంలో ఎక్కడి వారికైనా అందించవచ్చు. అయితే, వాటి కార్యకలాపాలు కేవలం తమ సంస్థకు నిర్దేశించిన పరిధిలోనే చేపట్టాలని యూజీసీ పేర్కొంది.

- సెంట్రల్ వర్సిటీలు వాటి చట్టంలో నిర్దేశించిన టెరిటోరియల్ నిబంధనల ప్రకారం ఈ ఓడీఎల్ ప్రోగ్రాంలను అమలుచేయవచ్చు.
- స్టేట్ వర్సిటీలు వాటి చట్టంలో పేర్కొన్న పరిధికి లోబడి.. లేదా తమ రాష్ట్ర పరిధిలో మాత్రమే ఈ ఓడీఎల్ కోర్సులను అమలుచేయాలి.
- ప్రైవేటు వర్సిటీలు కూడా తమ చట్టంలో నిర్దేశించుకున్న రాష్ట్ర పరిధికి మించి ప్రోగ్రాములను అందించరాదు. హెడ్ క్వార్టర్ పరిధిలో మాత్రమే ప్రోగ్రాంలను అందించవచ్చు. గుర్తింపు ఉన్న ఆఫ్ క్యాంపస్‌ల ద్వారా కూడా అమలుచేయవచ్చు.
- ప్రోగ్రాములను లెర్నర్ సపోర్టు కేంద్రాల ద్వారా అమలుచేయడానికి వీల్లేదు. డీమ్డ్ వర్సిటీలు తమ హెడ్ క్వార్టర్ పరిధిలో, కేంద్ర ప్రభుత్వ అనుమతి ఉన్న ఆఫ్ క్యాంపస్‌ల ద్వారా ఈ ప్రోగ్రాములను అమలుచెయ్యొచ్చు.

టీచర్లు, విద్యార్థులకు డిజిటల్ శిక్షణ అవసరం

- పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్ కుమార్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సురేష్‌కుమార్, డబ్ల్యూహెచ్‌వో ప్రతినిధులు

సాక్షి, అమరావతి: డిజిటల్ పరికరాల వాడకంతో విద్యార్థుల సమయం దుర్వినియోగం కావడమే కాకుండా వ్యసనంలా మారే అవకాశం ఉందని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ అన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్), వలంటరీ హెల్త్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సంస్థల ప్రతినిధులతో గురువారం సమగ్ర శిక్షా రాష్ట్ర కార్యాలయంలో కమిషనర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత సాంకేతిక యుగంలో డిజిటల్ వాడకానికి ప్రాధాన్యం పెరిగిందని, వాటిని సరైన రీతిలో వినియోగిస్తే ఎలాంటి హాని ఉండదని అన్నారు. సోషల్ మీడియా అతి వాడకం, తప్పుడు వార్తల ప్రభావం సైబర్ నేరాలకు పురిగొల్పుతాయని, స్మార్ట్ ఫోన్లు, ట్యాబ్ వంటి డిజిటల్ పరికరాలు, సోషల్ మీడియా వాడకం ప్రయోజనాలు, దుష్ప్రయోజనాలపై ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు, ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయా అంశాలపై రూపొందించిన మాడ్యూళ్లు, పోస్టర్లను కమిషనర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాఠశాల విద్య డైరెక్టర్ పి.పార్వతి, డబ్ల్యూహెచ్‌వో ప్రతినిధులు డాక్టర్ ట్రాన్ మిన్‌హు ఎన్‌జెన్, సోఫియా భావన బి.ముఖోపాధ్యాయ్ డాక్టర్ నాన్సీ ప్రీత్ కౌర్, జేవీ మోహన్‌రావు, షేక్ ఇస్మాయిల్, ఆర్.మన్మోహన్ పాల్గొన్నారు.

స్థూల దేశీయోత్పత్తిలో ఏపీ సూపర్

- జీఎస్‌డీపీలో టాప్ 10 రాష్ట్రాల్లో ఏపీ
- దేశ జీడీపీకి గణనీయంగా దోహదం
- ఫోర్బ్స్ ఇండియా వెల్లడి


సాక్షి, అమరావతి: దేశంలో పలు రాష్ట్రాల స్థూల దేశీయోత్పత్తి (జీఎస్‌డీపీ)లో టాప్ 10 రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ నిలిచింది. దేశ జీడీపీకి ఏపీ గణనీయంగా దోహదపడుతోందని ఫోర్బ్స్ ఇండియా వెల్లడించింది. ప్రస్తుత ఆర్థిక (2023–24) సంవత్సరంలో రాష్ట్రాల ఆర్థిక పరిస్థితులు, శ్రేయస్సులను ప్రతిబింబించే అంశాలను పరిగణనలోకి తీసుకుని ఆయా రాష్ట్రాల స్థూల దేశీయోత్పత్తుల ఆధారంగా ర్యాంక్‌లు ఇచ్చినట్లు ఫోర్బ్స్ ఇండియా పేర్కొంది. ఇందులో జీడీపీల్లో టాప్ 10 రాష్ట్రాల్లో ఏపీ 8వ ర్యాంక్‌లో, తెలంగాణ 9వ ర్యాంకులో నిలిచాయి. దేశంలో రెండో అతి పెద్ద తీర ప్రాంతాన్ని కలిగి ఉండటంతోపాటు సహజ వనరులు ఏపీలో సమృద్ధిగా ఉన్నాయని పేర్కొంది. వ్యవసాయం, టెక్స్‌టైల్స్, ఫార్మాస్యూటికల్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ వంటి రంగాలపై దృష్టి సారిస్తూ దేశ జీడీపీకి ఏపీ గణనీయంగా దోహదపడుతోందని వెల్లడించింది. కాగా, వచ్చే నాలుగేళ్లలో ఏపీ రాష్ట్ర స్థూల ఉత్పత్తి రూ.20 లక్షల కోట్లకు చేరుతుందని ఎస్‌బీఐ పరిశోధనాత్మక నివేదిక ఇటీవల అంచనా వేసింది. 2027 నాటికి దేశ జీడీపీలో 5% వాటాతో ఏపీ 7వ స్థానంలో నిలుస్తుందని ఎస్‌బీఐ నివేదిక తెలిపింది.

2023-24లో వివిధ రాష్ట్రాల స్థూల ఉత్పత్తి, ర్యాంకులు ఇలా

ర్యాంక్	రాష్ట్రం పేరు	(2023-24 జీఎస్‌డీపీల అంచనా (లక్షల కోట్లలో)
1	మహారాష్ట్ర	38.79
2	తమిళనాడు	28.3
3	గుజరాత్	25.62
4	కర్ణాటక	25
5	ఉత్తర ప్రదేశ్	24.39
6	పశ్చిమ బెంగాల్	17.19
7	రాజస్థాన్	15.7
8	ఆంధ్రప్రదేశ్	14.49
9	తెలంగాణ	14
10	మధ్యప్రదేశ్	13.87

ఏయూ ప్రొఫెసర్‌కి 'ఎంఎస్ సుబ్బులక్ష్మి' అవార్డు

పురస్కారంతో వచ్చిన నగదును 'ట్రస్ట్'కు విరాళమిచ్చిన సరస్వతి



ఏయూ క్యాంపస్: ఏయూ సంగీత విభాగం సీనియర్ ప్రొఫెసర్ సరస్వతి విద్యార్థికి డాక్టర్ ఎంఎస్ సుబ్బులక్ష్మి సంగీత ప్రాచార్య అవార్డు లభించింది. శ్రీ షణ్ముఖానంద ఫైన్ ఆర్ట్స్–సంగీత సభ ఎంఎస్ సుబ్బులక్ష్మి జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 16న ముంబైలోని శ్రీ షణ్ముఖానంద సంగీత సభ వేదికగా నిర్వహించిన కార్యక్రమంలో పద్మవిభూషణ్ డాక్టర్ ఆర్.చిదంబరం, పద్మవిభూషణ్ ఆచార్య మన్మోహన్ శర్మ చేతుల మీదుగా సరస్వతి ఈ పురస్కారాన్ని అందుకున్నారు. భారతీయ శాస్త్రీయ సంగీతానికి చేస్తోన్న సేవలను గుర్తిస్తూ ఆమెకు పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో గురువారం సరస్వతిని అభినందించారు. కాగా, సరస్వతికి అవార్డుతో పాటు రూ.లక్ష నగదు పురస్కారం రాగా..నగదును నగరానికి చెందిన త్యాగరాజ ఆరాధన ట్రస్ట్‌కి విరాళంగా ఆమె అందజేశారు.

విశాఖ రాజధానైతే అభివృద్ధి

వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి



సీతమ్మధార (విశాఖ ఉత్తర): విశాఖను రాజధానిగా చేసుకుంటే అభివృద్ధి జరుగుతుందని వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి చెప్పారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఉద్యోగులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ప్రభుత్వం చూసుకుంటుందన్నారు. దక్షిణాదిలో పెద్ద నగరాలున్నా అభివృద్ధి చెందే నగరంగా విశాఖను నీతిఆయోగ్ ఎంచుకుందని తెలిపారు. రూ.371 కోట్ల స్కిల్ స్కాంలో దొరికిపోయిన చంద్రబాబుకు న్యాయస్థానమే రిమాండ్ విధించిందని, ఎవరూ కుట్రలు చేయలేదని స్పష్టం చేశారు. చంద్రబాబుని అరెస్ట్ చేస్తే ఏపీలో ఎక్కడా ధర్నాలు లేవని, ఇతర రాష్ట్రాలు, దేశాల్లో వాళ్లకు అనుకూలమైన వ్యక్తులు ధర్నాల పేరుతో డ్రామాలాడుతున్నారని ఎద్దేవా చేశారు. కేంద్రం నిర్ణయం మేరకు ఎన్నికలకు సిద్ధమవుతామని చెప్పారు. వైఎస్సార్‌సీపీ సింగిల్‌గా పోటీ చేస్తుందని.. వైఎస్ జగన్ రెండో సారి సీఎంగా ప్రమాణ స్వీకారం చేయడం తథ్యమన్నారు. ఆయన వెంట నెడ్‌క్యాప్ చైర్మన్, విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజు ఉన్నారు.

లాభాల జాజికాయ

- ఉమ్మడి పశ్చిమలో విస్తరణకు యాక్షన్ ప్లాన్
- ఉద్యాన వర్సిటీ ఆధ్వర్యంలో మార్గదర్శనం



తాడేపల్లిగూడెం: సుగంధ ద్రవ్యాల్లో జాజికాయ, జాపత్రిల ప్రత్యేకత వేరు. వంటకాలకు ప్రత్యేక రుచిని అందించే ఈ సుగంధ ద్రవ్యాల్ని ఇప్పుడు ఉమ్మడి పశ్చిమలో పండించేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఈ పంట రాబోయే రోజుల్లో జిల్లాలో విస్తరించడానికి ఉద్యానవర్సిటీ ప్రయత్నాలు చేస్తోంది. జాజికాయ, జాపత్రి ఒకే చెట్టు నుంచి వస్తాయి. రాష్ట్ర ప్రభుత్వం పరిధిలో వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం మార్గదర్శకత్వంలో పామాయిల్, కొబ్బరి తోటల్లో అంతరపంటగా జాజికాయ మొక్కలు పెంచేలా ఉద్యాన వర్సిటీ రైతులను కార్యోన్ముఖుల్ని చేస్తుంది. ఈ మొక్కల పెంపకంలో మెళకువలు నేర్చుకొనేందుకు ఉద్యానవర్సిటీ పరిధిలోని కృషివిజ్ఞాన కేంద్రం రైతులు కేరళ వెళ్లి వచ్చారు.ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఎం.మురళీకృష్ణ వంటి అభ్యుదయ రైతులు ఈ సాగులో సత్ఫలితాలు సాధించారు. జాజికాయ సాగు లాభాలు రైతుల్ని ఆకర్షిస్తున్నాయి.

లాభాల పంట..

మిరిస్టికా ఫ్రాగ్రెన్స్ అనే శాస్త్రీయ నామంతో పిలిచే జాజికాయ సుగంధద్రవ్య పంటగా ఖ్యాతినొందింది. 25 నుంచి 35 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలో పెరిగే ఈ మొక్కల సాగుపై సుదీర్ఘ పరిశోధన జరుగుతూనే ఉంది. కేరళలోని ఐసీఏఆర్, ఐఐఎస్ఆర్, కేరళ వ్యవసాయ విశ్వవిద్యాలయం, సుగంధ ద్రవ్యాల బోర్డు జాజికాయ మీద విస్తృత పరిశోధనలు చేశాయి. విశ్వశ్రీ, కేరళశ్రీ, కొంకణ్ సుగంధ, కొంకణ్ స్వాద్, నోవా, కల్లింగల్ వంటి రకాలు సాగుకు అనుకూలంగా ఉన్నట్టు తేల్చారు. ఎపికోటైల్ గ్రాఫ్టింగ్ ద్వారా వాణిజ్యపరంగా జాజికాయ మొక్కలు పెంచుతున్నారు. ఉద్యాన అధికారులు సిఫార్సు చేసిన మొక్కలను పామాయిల్, కొబ్బరి తోటల్లో అంతర పంటగా నాటుకోవచ్చు. వక్కతో కలిపి కూడా సాగు చేసుకోవచ్చు. ఎక్కువగా తెగుళ్లు ఆశించని ఈ మొక్కలు ఐదు నుంచి ఆరు సంవత్సరాలలో పంటను అందిస్తాయి. పువ్వులు పూసిన ఏడు నుంచి తొమ్మిది నెలల్లో పండ్లు కోసి, బాహ్య భాగాన్ని వేరుచేసి జాపత్రిని, జాజికాయను వేరుచేస్తారు. తర్వాత మార్కెటింగ్ చేసుకోవచ్చు.

దిగుబడి ఇలా

500 కాయల నుంచి కిలో జాపత్రి వస్తుంది. 100 కాయల నుంచి కిలో జాజికాయలు వస్తాయి. కాయ తొక్క నుంచి క్యాన్సర్‌ను నివారించే వైన్ తయారీకి ప్రయత్నాలు జరుగుతున్నాయి. పశువులు, కోతులు, మేకలతో ఎలాంటి ఇబ్బంది ఉండదు.

ఉపయోగాలెన్నో...

జాజికాయలో ఉండే మిరిస్టిసిస్ మెదడు చురుగ్గా పనిచేసేందుకు సహకరిస్తుంది. మతిమరుపు లక్షణాలను తొలగిస్తుంది. శరీరంలోని వ్యర్థాలను పూర్తిగా తొలగించే శక్తి జాజికాయకు ఉంది. మూత్రపిండాల్లో ఉన్న రాళ్లను కరిగించడంలో, మానసికఒత్తిడి తగ్గించడంలో ఇవి క్రియాశీలక భూమిక పోషిస్తాయి. వీర్యకణాల ఉత్పత్తిని వృద్ధి చేస్తుంది.

ఉమ్మడి పశ్చిమలో..,

ఉమ్మడి పశ్చిమలో కలవపల్లికి చెందిన ఎం.మురళీకృష్ణ అనే అభ్యుదయ రైతు చాలా సంవత్సరాలుగా జాజికాయ మొక్కలను పెంచుతున్నారు. 2016లో పెంపకానికి చుట్టారు. ఆయిల్ ఫాం తోటల్లో అంతరసాగుగా వీటి పెంపకాన్ని చేపట్టారు. కేవీకే ఆత్మల సహకారంతో మేలు ఫలితాలు పొందుతున్నారు.

కేవీకే ప్రత్యేక దృష్టి

అంటుపద్ధతిలో జాజికాయ మొక్కలను తయారు చేసి, ఆశక్తి ఉన్న రైతులకు తక్కువ ధరకు అందించే విషయంపై ఉద్యానవర్సిటీ పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రం ప్రత్యేక దృష్టి సారించింది. ఆసక్తి కలిగిన రైతులతో కలిపి వర్సిటీ వీసీ టి.జానకీరామ్ పర్యవేక్షణలో విస్తరణ సంచాలకులు ఇ.కరుణశ్రీ నేతృత్వంలో కేరళ కోజికోడ్‌లో గత నెలలో రైతులకు శిక్షణ ఇచ్చారు.

రిమాండ్ ఖైదీ మృతిపై దుష్ప్రచారం చేయొద్దు

జైళ్ల శాఖ డీఐజీ రవికిరణ్

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి సెంట్రల్ జైలు రిమాండ్ ఖైదీ అనారోగ్యంతో మరణించిన ఘటనపై జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని జైళ్ల శాఖ డీఐజీ రవికిరణ్ ఖండించారు. ఆయన గురువారం మీడియాతో మాట్లాడారు. 'ధవళేశ్వరానికి చెందిన గంజేటి వీరవెంకట సత్యనారాయణ ఈనెల 6న రిమాండ్‌పై సెంట్రల్ జైలుకు వచ్చాడు. అప్పుడు చేసిన పరీక్షలో జ్వరంతో బాధపడుతున్నట్లు తేలింది. అలాగే వాంతులు, విరోచనాలు కూడా అవుతుండటంతో సిబ్బంది అతన్ని వైద్యం కోసం రాజమండ్రి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు అక్కడి నుంచి కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ సత్యనారాయణ బుధవారం మృతి చెందాడు' అని డీఐజీ రవికిరణ్ చెప్పారు. సత్యనారాయణ కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో అతని కుటుంబసభ్యులు అక్కడే ఉన్నారని తెలిపారు. జైలులో దోమల వల్ల చంద్రబాబుకు ప్రాణహాని ఉందంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఆయన ఖండించారు. ఎప్పటికప్పుడు ఫాగింగ్ చేయిస్తున్నామని.. లార్వా ఆనవాళ్లు లేకుండా నిర్మూలిస్తున్నామని చెప్పారు. దీనిపై తప్పుడు ప్రచారాలు చేయవద్దని కోరారు. సెంట్రల్ జైలులో 200 మంది సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారని చెప్పారు. ఖైదీల భద్రతకు ఎలాంటి ముప్పు లేదన్నారు.

రీస్టార్ట్ ప్యాకేజీని అమలు చేయండి

ఏపీ చాంబర్స్ వినతి

సాక్షి, అమరావతి: కోవిడ్ సమయంలో ఎంఎస్ఎంఈ రంగాన్ని ఆదుకోవడానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రీస్టార్ట్ ప్యాకేజీ కింద ప్రకటించిన విద్యుత్ రాయితీలను అమలు చేయాలని ఏపీ చాంబర్స్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. లాక్‌డౌన్ సమయంలో 2020–21 ఆర్థిక సంవత్సరంలో తొలి త్రైమాసికానికి సంబంధించిన మినిమం డిమాండ్ చార్జీలను మినహాయించగా, భారీ పరిశ్రమలకు ఫిక్స్‌డ్ చార్జీలను వడ్డీ లేకుండా చెల్లించడానికి అనుమతించింది. కానీ, వీటిని ఇంత వరకు డిస్కంలు అమలు చేయకపోగా, పూర్తి చార్జీలను వసూలు చేశాయని, ఇలా వసూలు చేసిన చార్జీలను భవిష్యత్ బిల్లుల్లో సర్దుబాటు చేయాలని ఏపీ చాంబర్స్ ప్రెసిడెంట్ పొట్లూరి భాస్కరరావు నేతృత్వంలో పరిశ్రమల ప్రతినిధులు గురువారం రాష్ట్ర ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. చార్జీలను తగ్గించడం ద్వారా ఈ రంగాన్ని ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు.

ట్రావెల్స్ బస్సును ఢీకొన్న లారీ.. ఇద్దరు డ్రైవర్ల దుర్మరణం

- మరో 12 మందికి గాయాలు
- వీరిలో ఇద్దరి పరిస్థితి విషమం



జేసీబీతో సహాయక చర్యలు చేపడుతున్న దృశ్యం

సంబేపల్లె: అన్నమయ్య జిల్లా సంబేపల్లె మండలం దేవపట్ల వద్ద జాతీయ రహదారిపై గురువారం రాత్రి లారీ ట్రావెల్ బస్సును ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందారు. 12 మంది బస్సు ప్రయాణికులు గాయపడ్డారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ప్రమాదం జరిగిన వెంటనే బాధితుల్ని మూడు 108 వాహనాల్లో రాయచోటి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాదంలో బస్సు డ్రైవర్ కె.వెంకటనారాయణ (37), లారీ డ్రైవర్ మృతిచెందారు. వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు, జమ్మలమడుగు ప్రాంతాలకు చెందిన 40 మంది తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లోని ఆలయాలు, ఇతర ప్రాంతాల సందర్శన కోసం గురువారం వీరాంజనేయ ట్రావెల్స్ బస్సులో బయలు దేరారు. గురువారం రాత్రి 9:30 ప్రాంతంలో సంతోషాల మధ్య సాగుతున్న పర్యటన.. ఎదురుగా లారీ రూపంలో పెనుగండమై ప్రమాదం సంభవించింది. బస్సు దేవపట్ల సమీపంలో వెళుతుండగా చిత్తూరు వైపు నుంచి వేగంగా వస్తున్న లారీ ఢీకొట్టింది. రెండు వాహనాల ఇంజన్లు నుజ్జునుజ్జయ్యాయి. రెండు వాహనాల డ్రైవర్లు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న సంబేపల్లె పోలీసులు వెంటనే ప్రమాదస్థలానికి చేరుకున్నారు. గాయపడినవారిలో పరిస్థితి విషమంగా ఉన్న ఇద్దరిని తిరుపతి ఆస్పత్రికి, మిగిలినవారిని రాయచోటి ఆస్పత్రికి తరలించారు. రెండు వాహనాలు ఇరుక్కుపోవడంతో జేసీబీ సాయంతో విడదీయాల్సి వచ్చింది. ప్రమాదస్థలాన్ని అన్నమయ్య జిల్లా అదనపు ఎస్పీ రాజకమల్ పరిశీలించారు. ఆయన వెంట రూరల్ సీఐ తులసీరామ్ ఉన్నారు. సంబేపల్లె పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఘటనా స్థలంలో వివరాలు సేకరిస్తున్న పోలీసులు

భూమిపై విర్రవీగుతూ నడవకు. నిశ్చయంగా, నీవు భూమిని చీల్చనూలేవు మరియు పర్వతాల ఎత్తుకు చేరనూలేవు!

– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, 22 సెప్టెంబర్ 2023

నారీలోకానికి నీరాజనం!

చిరకాలంగా మహిళాలోకం ఎదురుచూస్తున్న మహిళా రిజర్వేషన్ బిల్లు గురువారం రాజ్యసభ ఆమోదం కూడా పొందటంతో పార్లమెంటు ఆమోదముద్ర లభించినట్టయింది. నూతన పార్లమెంటు భవనం ప్రారంభమయ్యాక జరిగిన ప్రత్యేక సమావేశాల్లో ప్రవేశపెట్టిన తొలి బిల్లు ఇదే కావటం, దీన్ని దాదాపు అన్ని పక్షాలూ ఏకగ్రీవంగా ఆమోదించటం ఒక అరుదైన సన్నివేశం. మహిళా కోటాకు లోక్‌సభలో బుధవారం 454 మంది అనుకూలంగా ఓటేయగా, కేవలం ఇద్దరు మాత్రమే వ్యతిరేకించారు. రాజ్యసభలో హాజరైన మొత్తం సభ్యులు బిల్లుకు ఆమోదం తెలిపారు. ఇందుకు ఎన్డీఏ ప్రభుత్వాన్ని అభినందించితీరాలి. దశాబ్దాలుగా నేతల ఎన్నికల ప్రచార సభల్లో... చానెళ్ల చర్చల్లో మాత్రమే వినబడుతూ చట్టసభల్లో మాత్రం కనబడని బిల్లుకు ప్రాణప్రతిష్ఠ చేసి, పట్టాలెక్కించి అన్ని పార్టీలనూ అంగీకరింపజేయటం చిన్న విషయమేమీ కాదు. అయితే జనాభా లెక్కల సేకరణ, దాని ఆధారంగా జరిపే నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ ఒక కొలిక్కి వచ్చాకే కోటా అమలవుతుందనటం నిరాశ కలిగించే అంశం. ఏతావాతా 2029 తర్వాత మాత్రమే ఇది ఆచరణలోకొస్తుంది. అంటే... మరో ఆరేళ్ల వరకూ దీనికి మోక్షం కలగదు! విస్తట్లో అన్ని పదార్థాలూ వడ్డించి, తినడానికి ఇంకా ముహూర్తం ఆసన్నం కాలేదని చెప్పినట్టయింది. స్వాతంత్ర్యం సిద్ధించి 76 సంవత్సరాలు గడిచాక మాత్రమే మహిళా కోటా సాకారం కాగా, దాని అమలుకు మరింత సమయం పడుతుందనటం ఏమాత్రం భావ్యంకాదు. ఈ బిల్లు ఆమోదంలో కొట్టొచ్చినట్టు కనిపించే అంశం మరొకటుంది. ఇరవైయ్యేడేళ్ల క్రితం తొలిసారి లోక్‌సభలో బిల్లు ప్రవేశపెట్టినప్పుడే ఓబీసీ వర్గాల వాటా నిర్ధారించాలని బలహీనవర్గాలు పట్టుబట్టాయి. చట్టసభలో మాత్రమే కాదు... వెలుపల సైతం అనేక ప్రజాసంఘాలు 'కోటాలో కోటా' గురించి డిమాండు చేస్తూనే ఉన్నాయి. దాదాపు మూడు దశాబ్దాలు గడిచాక కూడా ఆ విషయం తేల్చకుండానే బిల్లు ఆమోదం పొందటం మనం ఆచరిస్తున్న విలువలను పట్టి చూపుతుంది. బిల్లుపై అన్ని పార్టీలనూ ఒప్పించిన అధికార పక్షానికి 'కోటాలో కోటా' గురించి నిర్దిష్టంగా తేల్చటం అంత కష్టమైన పనేమీ కాదు. ఎందుకనో ఆ పని చేయలేదు.

మహిళా కోటా బిల్లుకు తామే ఆద్యులమని, యూపీఏ ప్రభుత్వ కాలంలో 2010లో దీన్ని రాజ్యసభలో ప్రవేశపెట్టి ఆమోదం పొందామని కాంగ్రెస్ నేత సోనియాగాంధీ చెబుతున్నారు. కానీ ఆ బిల్లుకూ, ఇప్పుడు ఆమోదం పొందిన బిల్లుకూ సంబంధం లేదు. అసలు మహిళా కోటా బిల్లుకు అంతకన్నా పూర్వ చరిత్ర చాలా ఉంది. తొలిసారి 1996లో అప్పటి ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ నాయకత్వంలోని యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం లోక్‌సభలో బిల్లు ప్రవేశపెట్టగా, ఆ మరుసటి ఏడాది వచ్చిన ఐకె గుజ్రాల్ సర్కారు సైతం బిల్లు దుమ్ము దులిపింది. అప్పుడే ఓబీసీ కోటా సంగతేమిటన్న చర్చ మొదలైంది. వాజపేయి హయాంలోని ఎన్డీఏ ప్రభుత్వం వరసగా 1998, 1999, 2002, 2003 సంవత్సరాల్లో మహిళా కోటా బిల్లును గట్టెక్కించాలని ప్రయత్నించింది. కానీ ఓబీసీ కోటా విషయంలో దుమారం రేగి ఆగిపోయింది. 2008లో యూపీఏ ప్రభుత్వ హయాంలో కూడా ఒక ప్రయత్నం జరిగింది. 2010 మార్చి 9న రాజ్యసభ ఆమోదం కూడా పొందింది. కానీ లోక్‌సభలో ఎస్పీ, బీఎస్పీ తదితర పక్షాలు 'కోటాలో కోటా' కోరుతూ అడ్డుకున్నాయి. ఇప్పుడు ఓబీసీ కోటా తేల్చాలని చెబుతున్న కాంగ్రెస్ నేతలు తమ హయాంలో ఆ పని ఎందుకు చేయలేకపోయారో సంజాయిషీ ఇవ్వాలి. మరోపక్క కోటా చట్టంగా రూపుదిద్దుకున్న నాటినుంచి కేవలం పదిహేనేళ్లు మాత్రమే ఉంటుంది. ఆ లెక్కన 2029 వరకూ అమలే సాధ్యం కాని చట్టం మరో తొమ్మిదేళ్లపాటే అమల్లో ఉంటుంది. ఆ తర్వాత పొడిగింపు సంగతి ఏమవుతుందన్నది అప్పటి పరిస్థితులను బట్టి ఉంటుంది. ఈ పరిమితి ఏవిధంగా చూసినా సబబుగా లేదు.

అతి పెద్ద ప్రజాస్వామిక దేశంలో మహిళలకు 33 శాతం కోటా ఇవ్వటంలో జాప్యం జరగటం సమర్థించుకోలేనిది. లింగ వివక్ష, అసమానతలు, వేధింపులు అన్ని స్థాయిల్లోనూ ఉన్న సమాజంలో మహిళలను విధాన నిర్ణయాల్లో భాగస్వాములను చేయటం, వారి ప్రాతినిధ్యం పెంచటం ఎంతో అవసరం. అందువల్ల సమాజ నిర్మాణంలో తామూ భాగస్వాములమని, తమ ఆలోచనలకూ విలువుంటున్నదని స్త్రీలు గుర్తిస్తే అది వారి ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. మరింతమంది మహిళలు రాజకీయాల్లోకి రావడానికి వీలవుతుంది. సమాజంలో మహిళలపట్ల ఉన్న ఆలోచనా ధోరణి మారుతుంది. దీన్ని అవగాహన చేసుకోవటానికీ, ఆచరించటానికీ ఇంత సుదీర్ఘ సమయం పట్టడం విచారకరం. మనకన్నా ఎంతో చిన్న దేశాలూ, బాగా వెనక బడిన దేశాలూ సైతం మహిళలకు చట్టసభల్లో పెద్ద పీట వేసిన వైనం గమనిస్తే మహిళల విషయంలో మనం ఎంత వెనకబాటుతనాన్ని ప్రదర్శిస్తున్నామో అర్థమవుతుంది. రువాండా పార్లమెంటులో మహిళలు 61 శాతం ఉంటే... క్యూబా(53), నిగరాగువా(52), మెక్సికో, న్యూజిలాండ్ చట్ట సభల్లో 50 శాతం మహిళలుండి మన సమాజం తీరుతెన్నుల్ని ప్రశ్నిస్తున్నారు. ఆఖరికి దశాబ్దం క్రితం ప్రజాతంత్ర రిపబ్లిక్‌గా ఆవిర్భవించిన నేపాల్‌లో సైతం పార్లమెంటులో 33 శాతం మహిళలున్నారు. అమలుకు ఇంకా సమయం పడుతుందంటున్నారు గనుక ఈలోగా పార్లమెంటు చర్చలో వ్యక్తమైన అభిప్రాయాలకు అనుగుణంగా ఓబీసీ కోటా సంగతి తేల్చటం, చట్టం అమలుకు విధించిన పరిమితిని ఎత్తివేయటం అత్యంత కీలకమని కేంద్రం గుర్తించాలి. ఎన్నెన్నో అవాంతరాలను అధిగమించి సాకారం కాబోతున్న ఈ చట్టం భవిష్యత్తులో సమాజం మరింత పురోగతి సాధించటానికి నాంది కాగలదని ఆశించాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయణం, వర్ష ఋతువు భాద్రపద మాసం, **తిథి:** శు.సప్తమి ఉ.9.07 వరకు, తదుపరి అష్టమి, **నక్షత్రం:** జ్యేష్ఠ ప.12.26 వరకు, తదుపరి మూల. **వర్జ్యం:** రా.8.11 నుండి 9.44 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.15 నుండి 9.04 వరకు, తదుపరి ప.12.19 నుండి 1.07 వరకు, **అమృతఘడియలు:** తె.5.28 నుండి 7.01 వరకు (తెల్లవారితే శనివారం).

సూర్యోదయం : 5.52
సూర్యాస్తమయం: 5.56
రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు

నేర విచారణ ప్రక్రియ ఇలా...

ప్రజాస్వామ్యంలో అందరూ సమానులే. పేదలు–ధనికులు, చిన్న–పెద్ద అనే తారతమ్యాలు ఉండవు. అందరూ చట్టాన్ని గౌరవిస్తూ పాటించాల్సిందే. చట్టాలు అమలు చేయడానికి, శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు, న్యాయవ్యవస్థలు పని చేస్తాయి. బాధ్యత గల పౌరులు ఎవరైనా చట్టం తన పని తాను చేసుకుపోవడానికి సహకరించాలి. ప్రజాస్వామ్యంలో ప్రజలే ముఖ్య వాటాదారులు కాబట్టి, ప్రభుత్వ పరిపాలన ఎలా సాగుతోంది అనే అవగాహన కూడా వారికి ఉండాలి. ఆ అవగాహన వారికి ఉంటేనే ప్రజాప్రతినిధుల పనితీరును సరిగ్గా అవగతం చేసుకుని ప్రజాస్వామ్య పరిరక్షణకు తోడ్పడతారు.



ఏదైనా కాగ్నిజబుల్ అఫెన్స్ (గుర్తించతగిన నేరం) జరిగితే పోలీసు వారికి ప్రజల నుంచి ఎవరైనా ఫిర్యాదు చేయవచ్చు. మూడు సంవత్సరాలు అంతకు ఎక్కువ శిక్షపడే నేరాలను కాగ్నిజబుల్ అఫెన్స్‌లు అంటారు. ఇలాంటి కేసుల్లో పోలీసులు మేజిస్ట్రేట్ వారెంట్ లేకుండా ఇతర నిబంధనలకు లోబడి నిందితులను అరెస్టు చేయవచ్చు. కాగ్నిజబుల్ అఫెన్సులపై ఎవరైనా ఫిర్యాదు చేసినప్పుడు పోలీసులు దాని ఆధారంగా ప్రాథమిక సమాచార నివేదిక (ఎఫ్ఐఆర్) నమోదు చేసి సంబంధించిన మేజిస్ట్రేట్‌కు పంపిస్తారు. అది మొట్టమొదటి నివేదిక కాబట్టే దాన్ని ప్రాథమిక సమాచార నివేదిక అంటారు. మూడేళ్ళ కంటే తక్కువ శిక్షలు పడే నేరాలను నాన్-కాగ్నిజబుల్ అఫెన్సులు అంటారు. వీటిని కోర్టు ఉత్తర్వుల ఆధారంగానే పోలీసులు కేసు నమోదు చేస్తారు. ప్రైవేట్ కంప్లైట్ ఆధారంగా కోర్టు ఇచ్చే ఉత్తర్వుల మీద కూడా పోలీసులు కేసు నమోదు చేసి ముందుకు వెళ్ళవచ్చు.

ఎఫ్ఐఆర్ అనేది కాగ్నిజబుల్ అఫెన్సు జరిగింది అనే విషయాన్ని తెలియజేసే పత్రం మాత్రమే. ఒక నేరం జరిగినప్పుడు ప్రత్యక్ష సాక్షులు ఉండవచ్చు. అలాంటి సందర్భంలో సహజంగా నిందితుల పేర్లను పొందుపరచడం జరుగుతుంది. అయితే ఎఫ్ఐఆర్ ప్రాథమిక సమాచారాన్ని మాత్రమే ఇస్తుంది. పోలీసుల దర్యాప్తులోనే అందులోని నిజానిజాలు, నిందితుల పాత్రలు నిర్ధారించడం జరుగుతుంది. ఫిర్యాదులో నిందితుల పేర్లు లేవు కదా అని దాన్ని స్వీకరించకపోడానికీ, ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా ఉండటానికీ ఆస్కారం లేదు. ఉదాహరణకు దివంగత ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ హత్య కేసుకు సంబంధించిన ఎఫ్ఐఆర్‌లో నిందితుల పేర్లు లేవు. పోలీసుల దర్యాప్తులోనే ఆ పేర్లు, వారి పాత్రలు వెలుగులోకి వచ్చాయి. ముఖ్యంగా నిధుల దుర్వినియోగం, ప్రజల సొమ్ము కొల్లగొట్టడం వంటి ఆర్థిక నేరాలకు సంబంధించిన కేసుల్లో నిందితుల అందరి పేర్లు ఎఫ్ఐఆర్‌లో చేర్చడం మామూలుగా జరగదు. దర్యాప్తులో భాగంగా పోలీసులు అనేక పత్రాలను పరిశీలించడం, సాక్షుల వాంగ్మూలాలను నమోదు చేయడం జరుగుతుంది. ఆ తర్వాతే బాధ్యులైన నిందితుల పేర్లు వెలుగులోకి వస్తాయి.

అరెస్టు అయిన వ్యక్తికీ కొన్ని హక్కులు ఉంటాయి. అరెస్టు చేసే సమయంలో పోలీసులు నిందితుడికి అందుకు కారణాలు చెప్పాలి. బెయిలబుల్ అఫెన్సు అయితే ఆ విషయం తెలియపరుస్తూ బెయిల్ బాండ్స్ ఇస్తే విడుదల చేస్తామనీ నిందితుడికి వివరించాలి. నిందితుడికి సంబంధించిన వ్యక్తికి అరెస్టు కార్డ్ ఇవ్వాలి. ఎలాంటి సాక్ష్యాధారాలు ఇవ్వాల్సిన అవసరం లేదు. ఒక వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసినట్లైతే 24 గంటల్లో న్యాయమూర్తి ఎదుట హాజరు పరచాలని క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లోని (సీఆర్పీసీ) సెక్షన్ 167 చెప్తుంది. అయితే ఆ అరెస్టు వేరే ప్రాంతంలో జరిగితే ప్రయాణ సమయాన్ని అదనంగా పరిగణించాలనే నిబంధనా ఉంది. నేరంలో నిందితుడి పాత్రపై ప్రాథమిక ఆధారాలు ఉన్నాయని మేజిస్ట్రేట్ సంతృప్తి చెందితేనే 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపిస్తారు. కేవలం జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న వారినే పోలీసు కస్టడీకి కోరే అవకాశం ఉంది. ఈ ప్రక్రియ కూడా అరెస్టు చేసిన నాటి నుంచి 14 రోజుల్లో పూర్తి చేయాల్సి ఉంటుంది. నేరంలో నిందితుడి పాత్రపై కీలక విషయాలను రాబట్టడానికి పోలీసు కస్టడీ దోహదం చేస్తుంది.

జ్యుడీషియల్ రిమాండ్ కోరినప్పుడు నేరంలో నిందితుడి పాత్రపై ప్రాథమిక ఆధారాలు ఉన్నాయో లేదో నిర్ధారించే, కోర్టు తగిన ఆదేశాలు ఇస్తుంది. ఈ ఆధారాలు లేకుంటే జ్యుడీషియల్ రిమాండ్‌ను మేజిస్ట్రేట్ తిరస్కరించవచ్చు. ఇలా తిరస్కరించినప్పుడు నిందితునికి బెయిల్ ఇచ్చి పంపించివేస్తారు. జ్యుడీషియల్ రిమాండ్ దశలో నిందితుడిని నేరం చేశారా, లేదా? అనే అంశాన్ని న్యాయమూర్తి అడగరు. కేవలం పోలీసులు ఏమైనా ఇబ్బంది పెట్టారా, కొట్టారా? వంటివి మాత్రమే అడుగుతారు. పోలీసులు తనను కొట్టారని నిందితుడు వెల్లడిస్తే వెంటనే ఆస్పత్రికి పంపడానికీ, ఊండ్స్ సర్టిఫికెట్ తీసుకోవడానికీ తగిన చర్యలు తీసుకుంటారు. పోలీసు కస్టడీలో నిందితుడిని కొట్టారని రుజువైతే సంబంధిత పోలీసులపై అదే కోర్టులో కేసు పెట్టడానికి ఆస్కారం ఉంది.

పోలీసులు తమ దర్యాప్తులో భాగంగా సాక్షులను విచారించి వారి వాంగ్మూలాలను నమోదు చేస్తారు. సీఆర్పీసీలోని సెక్షన్ 161 కింద నమోదు చేసే ఈ వాంగ్మూలాల్లో సాక్షుల సంతకాలు తీసుకోకూడదు. ఈ వాంగ్మూలాలను సాక్ష్యాలుగానూ పరిగణించకూడదు. కేవలం వాటిని దర్యాప్తు నిమిత్తం, కోర్టులో సాక్షుల వాంగ్మూలాల కచ్చితత్వాన్ని నిర్ధారణ చేయడానికి ఉపయోగించవచ్చు. సీఆర్పీసీ సెక్షన్ 164 కింది సాక్షుల వాంగ్మూలాలను న్యాయమూర్తి నమోదు చేయవచ్చు. ఆ వాంగ్మూలాల కింద సాక్షుల సంతకాలు తీసుకుంటారు. అందువల్ల ఈ వాంగ్మూలానికి విరుద్ధంగా సాక్షి కోర్టులో సాక్ష్యం చెబితే అందుకు అతడు బాధ్యుడు అవుతాడు.

కేసు దర్యాప్తు పూర్తయిన తర్వాత అన్ని ప్రాథమిక ఆధారాలు ఉన్నప్పుడు పోలీసులు కోర్టులో నిందితుల విచారణ నిమిత్తం అభియోగపత్రాలు దాఖలు చేస్తారు. కేసులో ప్రాథమిక ఆధారాలు ఉంటేనే కోర్టు సీఆర్పీసీలోని సెక్షన్ 190 కింద నేరాన్ని కాగ్నిజెన్స్‌లోకి తీసుకుంటుంది. అభియోగం చేసిన నేరారోపణలపై ప్రాథమిక సాక్ష్యాలు లేకపోతే కోర్టు పరిగణనలోకి తీసుకోదు.

ఈ దశలో సదరు కేసు విచారణ అదే మేజిస్ట్రేట్ పరిధిలో ఉంటే దానికి సీసీ నంబర్ ఇస్తారు. అందులోని సెక్షన్ల ప్రకారం కేసు సెషన్స్ న్యాయమూర్తి ట్రయల్ నిర్వహించాల్సి ఉంటే పీఆర్సీ నంబర్ ఇచ్చి ఫైల్‌ను సంబంధిత కోర్టుకు పంపిస్తారు. చార్జ్‌షీట్‌ను కోర్టు పరిగణనలోకి తీసుకున్న తర్వాత సమన్లు జారీ చేయడం ద్వారా ఓ తేదీ ఖరారు చేసి నిందితులను న్యాయస్థానానికి పిలుస్తారు. నిందితుడు హాజరైన తర్వాత చార్జ్‌షీట్‌తో పాటు ప్రాసిక్యూషన్ వాళ్ళు కోర్టుకు సమర్పించిన ప్రతి డాక్యుమెంట్‌ను ఉచితంగా అందిస్తారు. ఈ తర్వాత హియరింగ్ డేట్ ఇచ్చి, ఆపై ఫ్రేమింగ్ ఆఫ్ చార్జెస్ ప్రక్రియ చేపడతారు. ఈ సందర్భంలో చార్జ్‌షీట్‌లోని ఆరోపణలను నిందితుల ముందు చదువుతారు. ఈ దశలో ఏ నిందితుడైనా తనపై ప్రాసిక్యూషన్ ఆరోపించిన సెక్షన్లు చెల్లవని భావిస్తే డిస్‌చార్జ్ పిటిషన్ వేసుకోవచ్చు. ఈ పిటిషన్లు డిస్మిస్ అయిన తర్వాత మాత్రమే నిందితులపై చార్జెస్ ఫ్రేమింగ్ జరుగుతుంది. ఈ దశలో న్యాయమూర్తి నిందితులను ఉద్దేశించి నేరం అంగీకరిస్తావా? అని ప్రశ్నిస్తారు. అంగీకరిస్తే (ప్లీడెడ్ గిల్టీ) వెంటనే శిక్ష విధిస్తారు. అంగీకరించకపోతే (డినై) కేసు ట్రయల్ నిర్వహిస్తారు.

కేసు ట్రయల్ దశలో న్యాయస్థానం సాక్షులకు సమన్లు జారీ చేస్తుంది. సాక్షుల విచారణ పూర్తయిన తర్వాత సీఆర్పీసీలోని సెక్షన్ 313 ప్రకారం నిందితులకు ఓ అవకాశం ఉంటుంది. ఏ నిందితుడిపై ఏ సాక్షి ఏం చెప్పాడనేది వారికి తెలియపరుస్తారు. దానిపై వాళ్లు ఏం చెప్పాలనుకున్నది తెలుసుకుని రికార్డు చేస్తారు. ఈ సందర్భంలోనే నిందితుల తరఫున ఎవరైనా సాక్షులు ఉన్నారా? అనేది న్యాయమూర్తి అడుగుతారు. అలాంటి వాళ్ళు ఉంటే లిస్ట్ ఆఫ్ డిఫెన్స్ విట్నెస్ రూపొందించి, వారికి సమన్లు ఇచ్చి కోర్టుకు పిలుస్తారు. ఆపై వీరి వాంగ్మూలం నమోదు, ప్రాసిక్యూషన్ నిర్వహించే క్రాస్ ఎగ్జామినేషన్ ప్రక్రియ జరుగుతాయి. ఇది పూర్తయిన తర్వాత నిర్ణీత సమయం ఇచ్చి, ఆపై వాదోపవాదాలు మొదలవుతాయి.

నిందితుడికి తెలియకుండా న్యాయమూర్తి సాక్ష్యాలు రికార్డు చేయరు. ప్రతి సాక్ష్యమూ అతడి ప్రత్యక్షంలోనే చేస్తారు. సీఆర్పీసీ సెక్షన్ 317 ఆధారంగా దాఖలు చేసే పిటిషన్ ద్వారా నిందితుడు కోరితేనే అతడి న్యాయవాది సమక్షంలో ఈ ప్రక్రియ పూర్తి చేస్తారు. ఏ దశలోనూ పౌరుడికి అన్యాయం జరగకూడదనే ఉద్దేశంతోనే చట్టంలో నిందితుడికి ఇన్ని సౌలభ్యాలు కల్పించారు. బాధ్యత గల పౌరులు ఎవరైనా చట్టం తన పని తాను చేసుకుపోవడానికి సహకరించాలి. వాదోపవాదాలు విన్న తర్వాత కోర్టు వారు ఓ తేదీ ఇచ్చి తీర్పు వెలువరిస్తారు.

– జస్టిస్ జి. కృష్ణ మోహన్ రెడ్డి
హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

అది మొదలు



నాజీలు, ఇతర తిరోగమన ప్రభుత్వాలు పుస్తకాలను నిషేధించడానికి కారణం, కొన్ని వర్గాల జనాలను సంఘం నుంచి మరింత వేరుచేసి, వారిని విమానవీకరణ చేయడానికి. అది పుస్తకాల నిషేధంతో మొదలవుతుంది.

– మార్క్ రఫాలో, నటుడు

పరిమితం



నిజం చెప్పాలంటే, ఇండియాలో 'స్త్రీవాద ఉద్యమం' అనేది పెద్దగా లేదు. ఉన్నదల్లా వివిధ స్త్రీవాద గ్రూపులు, కేవలం తమ వ్యక్తిగత అనుభవాల ఆధారంగా నడుపుతున్న చర్చ. మళ్లీ ఆ అనుభవాలను నడుపుతున్నవి వర్గం, కులం.

– సరయూ పాణి, న్యాయవాది

ఇది అన్యాయం



నియోజకవర్గాల పునర్విభజన వల్ల తమిళనాడు 8 లోక్‌సభ సీట్లు కోల్పోతుంది. కేరళ 8 సీట్లు కోల్పోతుంది. తెలంగాణ, ఆంధ్ర తలా 4 సీట్లు కోల్పోతాయి. జనాభాను ఉత్తమంగా నియంత్రించిన రాష్ట్రాలకు పునర్విభజన వల్ల అన్యాయం జరగనుంది.

– అద్వైద్, హిస్టారియన్

మనకే దెబ్బ



కెనడాలో స్థిరపడి, అక్కడ శాశ్వత నివాసం ఏర్పరుచుకోవాలనుకునే కనీసం ఐదుమంది నాకు వ్యక్తిగతంగా తెలుసు. తిప్పికొట్టే చర్యలకు గనక కెనడా పూనుకున్నదంటే, అది చాలామంది భారతీయులకు విపత్కరం అవుతుంది.

– అలీశాన్ జాఫ్రీ, జర్నలిస్ట్

వైఖరేమిటి?



చాలామంది సిక్కుల లాగే నేను ఖలిస్తాన్ ఆలోచనకు వ్యతిరేకం. దీన్నిలా ఉంచి, సిక్కులను ఖలిస్తానీలుగా ముద్ర వేస్తున్నవారిలో ఎందరు 'హిందూ రాష్ట్ర' ఆలోచనను వ్యతిరేకిస్తున్నారో చెప్పాలి. మీరు హిందూ రాష్ట్రకు మద్దతు తెలిపినట్టయితే, ఖలిస్తాన్ డిమాండ్‌ను వ్యతిరేకించే అర్హత లేదు.

– రమణ్‌దీప్ సింగ్ మాన్, ఇంజినీర్

అందరికీ అండ



ఒక విషయం స్పష్టం చేస్తాను: ట్రాన్స్‌ఫోబియా, హోమోఫోబియా, బైఫోబియా (భిన్న లైంగిక ధోరణుల పట్ల వ్యతిరేకత)లకు ఈ దేశం (కెనడా)లో స్థానం లేదు. ఈ గ్రూపుల పట్ల వ్యక్తమయ్యే ద్వేషాన్నీ, ద్వేష రూపాలనూ మేము తీవ్రంగా ఖండిస్తున్నాం. దేశవ్యాప్తంగా 2ఎస్ఎల్‌జీబీటీక్యూఐ+ కెనడియన్ల అందరికీ అండగా నిలబడతాం.

– జస్టిన్ ట్రూడో, కెనడా ప్రధాని

కలిసి పోరాడుదాం!



'హ్యూమన్' (మనిషి) అనే మాట లాటిన్ పదమైన హ్యూమస్ (మృత్తిక) నుంచి వచ్చింది. మనుషులం కూడా మృత్తికే. మృత్తికను కాపాడుకోవడమే మంచి వ్యవసాయం. మృత్తికను కాపాడుకోవడమే వాతావరణ మార్పుల మీద పోరాటం. అందుకే మృత్తిక ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి. దాని కోసం కలిసి పోరాడుదాం!

– వందనా శివ, పర్యావరణవేత్త

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

నవయుగ కవిచక్రవర్తికి జేజేలు!

సందర్భం




దొక్కా మాణిక్య వరప్రసాద్

జాషువ అచ్చమైన జాతీయకవి. విశ్వనరుడి భావన ఆయన సాహిత్య తాత్వికత. తెలుగు నుడికారం, ఇంపుసొంపులను పద్య లాలిత్యంతో పాఠకునికి అందించిన 'నవయుగ కవి చక్రవర్తి'. భారతీయ తత్వాన్ని ఆకళించుకున్న కళాప్రపూర్ణుడు. నిరంతరం జాతి పురోగమనాన్ని కాంక్షిస్తూ సంఘంలో ఉన్న అసమానతలు తొలగిపోవాలన్న దృఢ సంకల్పంతో శక్తిమంతమైన కావ్యాలను రాసిన పద్య భూషణుడన్న సాహిత్య విమర్శకుని మాటలు మహాకవికి అక్షరాలా అబ్బుతాయి. జాషువ కవిత్వం జాతీయ భావాలతో నిండి, మానవ జాతి శ్రేయస్సునూ, విశ్వకల్యాణాన్నీ కాంక్షిస్తూ చైతన్యశీలంగా ఉంటుంది. **'భరత ఖండంబు నా పాఠశాల / భాగవతంబు నా బాలశిక్ష'** అని పేర్కొన్న జాషువాకి ఈ దేశ భిన్నసంస్కృతి, సంప్రదాయాల పట్ల అపారగౌరవం వుంది. కాబట్టే ఆయన **'కులమతాలు గీచుకున్న గీతల జొచ్చి, పంజరాన గట్టువడను నేను / నిఖిల లోకమెట్లు నిర్ణయించిన నాకు తరుగు లేదు విశ్వనరుడ నే'**నని ప్రకటించాడు. దేశం సంస్కృతీ, భిన్న సంప్రదాయాలను గౌరవిస్తూ అందరూ ఐకమత్యంతో, సహనంతో సహజీవనం చెయ్యాలని కాంక్షించాడు. మనుష్యులంతా సమానమేనని మరణంలేని మానవతను ప్రకటించాడు.

'సింధు గంగానదీ జలక్షీరమొసుదు / కురిసి బిడ్డల పోషించుకొనుచున్న / పచ్చి బాలెంతరాలు మా భారతమాత / మాతలకు మాత సకల సంపత్సమేత' అని దేశాన్ని కీర్తించారు. భారతీయ చారిత్రక పురాణ పురుషులనూ, అందు నాయకులనూ వారి ఔన్నత్యాన్నీ బట్టి గొప్ప వ్యక్తులుగా చిత్రించారు. సగరుడు, మాంధాత్రి వంటి చక్రవర్తులు మొదలు అశోకుడు, గౌతమ బుద్ధుడు, కర్ణుడు, శివాజీ, మహాత్మాగాంధి, అంబేడ్కర్ వంటి నేటికాల మేధావుల వరకూ జాషువ రచనల్లో అత్యుత్తమంగా కన్పిస్తారు.

మొదటి ఖండికే భారతమాత ప్రశస్తికి అంకితమై దేశానికి నీరాజనం పట్టింది. తరతరాల భారతీయ స్త్రీ, పురుషుల పరాక్రమోన్నతినీ నదుల ప్రాభవాన్నీ, గానం చేసి **'గొన బుసిరిగల భాగ్యశాలివి నీవు, భారతాంబా మణి నమస్కారమమ్మ'** అని రెండు చేతుల నమస్కరించిన తీరు ఆయన దేశభక్తికీ, జాతీయతకీ నిదర్శనం.



గుర్రం జాషువ

స్వాతంత్ర్యం సిద్ధించిన పిమ్మట ఆనందాతిశయంతో **'తల్లి భారతి నేడు దక్కె మాకు / పదియు రెండగు పుణ్య నదులు నదంబులు / చిరకాలమునకు జేజిక్కె మాకు / అమర సమున్నతమైన హస్తినాపుర రత్న పీఠంబు...'** అని హర్షాతిరేకము ప్రకటించారు.

చికాగోలో జరిగిన విశ్వమత మహాసభలో వివేకానందుని అద్భుత ప్రతిభాపాటవాలనూ, అహింసాయుధంతో మహాత్మాగాంధీ సాధించిన స్వాతంత్ర్యాన్నీ, తెలుగు వాడైన తత్త్వవేత్త సర్వేపల్లి రాధాకృష్ణన్‌నూ, విశ్వకవి రవీంద్రునీ కొనియాడారు. అన్ని సంపదలు పుష్కలంగా ఉన్న దేశంలో ప్రజల మధ్య అనైక్యత, ప్రాంతాల వారిగా, మతాలవారిగా విడిపోయి, పరమత సహనం, పరజాతి సహనం లోపించి మానవజాతి సహజ గుణాల్ని కోల్పోయి అసహనంగా తయారయిందని చింతించారు.

కులం కారణంగా తనను హీనపరిచారని దేశ ప్రముఖులను స్తుతిస్తూనే తన నిందను సున్నితంగా చెప్పారు. జాతి సమైక్యత, సహన సహిత జీవనమే మహాకవి కవిత్వ తత్త్వంగా సాగింది.

బాపూజీ అంటే జాషువ కవికి అనిర్వచనీయమైన భక్తిభావం. మహాత్ముని నిత్యసత్యవ్రతుడిగా పేర్కొన్నారు. **'వడికిన నూలుపోగుతో ప్రపంచపు టేనుగు గట్టి అహింసా మార్గాన విరోధి గుండెలో పిడుగులు గుప్పువాడనీ, తన బోసినోట అమృత బిందువులను జిమ్మెడు వక్త'** అనీ మహాత్ముని వ్యక్తిత్వాన్ని గొప్పగా స్తుతించారు జాషువ. **'మహాత్ముని చెప్పుల జాడలోన కాలాడ చరించెదన్'** అనీ వెల్లడించారు. **'గోచిపాత గట్టుకొని జాతి మానంబు నిలపినట్టి ఖదరునేతగా, పండ్లు నూరుచున్న బహుమతంబులలోన సహన విద్య నేర్పు సాధకుండనీ, భార్య బిడ్డలున్న ప్రత్యక్ష దైవం'** అనీ 'విశ్వసామరస్య విజ్ఞాన సంధాత' అనీ బాపూజీని ప్రస్తుతించారు. **నిమ్న జాతుల కంటినీరంబు దుడిచి యాశ్వాసించు నిరుపేద బాంధవుడు** అని కొనియాడారు. భారత స్వాతంత్ర్య దీప్తి సుభాష్ చంద్రబోస్ వంటి నాయకులు ప్రదర్శించిన ధైర్యసాహసాలకు ముగ్ధుడై **'బోసు చరిత్ర మద్భుతమైనది, ఆయన మహాత్యాగి, మహనీయునకు కావ్య నమస్కారము చేయక నా చేతులూరు కొనక పోయినవి'** అని 'నేతాజీ' కావ్యాన్ని రచించారు.

భారతవీరుడు శీర్షికన కర్ణుని గుణగణాలను శౌర్య ప్రతాపాలను వర్ణించారు. కర్ణుని పరాక్రమం, సత్యసంధత కవిని ముగ్ధుని చేశాయి.

మనుషుల్లో పెరుగుతున్న అమానవీయ మౌఢ్యాలను ఖండిస్తూ **'మనుజులార మాది ఘనమైన మతమని / ఒకడు తరిమి తరిమి ఉగ్గడించు పెక్కు మతములిట్లు పేచీలు సాగింప మార్గమేది'** అని మహాకవి జాషువ అన్ని మతాల వారినీ ప్రశ్నించారు. మతం కంటే మానవత్వమే గొప్పదనీ, మానవత్వానికి మకుటధారణ చేయమన్నారు. కుల జాడ్యాన్ని వదిలి మానవతకు పట్టం కట్టాలని కోరారు.

భారత ఇతిహాస యుగం నుండి మొగలాయి యుగం వరకూ, స్వాతంత్ర్యోద్యమం నుండి స్వాతంత్ర్యానంతరం దేశంలో నెలకొన్న భిన్న సంఘర్షణల వరకూ జాషువ తన కవిత్వంలో బంధించారు. విశ్వమానవ లక్షణాలను పుణికి పుచ్చుకున్న జాషువ విశ్వకల్యాణానికై తన కవిత్వాన్ని ఆయుధంగా మలిచారు. జాషువ కవిత్వం నేటికినీ ప్రాసంగికతను కలిగి ఉందనటంలో అతిశయోక్తి లేదు. అనేక కష్టాలనూ, అవమానాలనూ ఎదుర్కొన్నప్పటికీ జాషువ మహాకవి మాత్రం భారతజాతి అభివృద్ధికి కులమతాలు లేని సమసమాజాన్ని కాంక్షించారు.

వ్యాసకర్త మాజీమంత్రి
(నేటి నుండి 28 వరకూ గుంటూరులో 'జాషువ జయంతి వారోత్సవాలు')

కారణాలుంటాయి సుమా!

గేసెన్ బౌద్ధ భిక్షువు, చిత్రకారుడు. ఏదేని చిత్రం వేయటానికి అతడు కోరే ప్రతిఫలం చాలా ఎక్కువగా ఉండేది. పరమలోభి అయిన చిత్రకారుడిగా అతడికి పేరు వచ్చింది.

జపాన్ దేశపు నాట్యకత్తె గెయిషా ఒకామె అతనికి ఓ చిత్రం వేయటానికి పని ఒప్ప జెప్పింది. 'నీవు ఎంత ఇచ్చుకోగలవు?' అడిగాడు గేసెన్. 'నీవు ఎంత అడిగితే అంత' అన్నది ఆ అమ్మాయి.

ఓ రోజు గేసెన్‌ను తన ఇంటికి పిలిపించుకొంది గెయిషా. ఓ కళా పోషకుడి గౌరవార్థం ఆ రోజు ఆమె విందు ఏర్పాటు చేసింది. గేసెన్ ఎంతో కళాత్మకంగా చిత్రాన్ని చిత్రించాడు. పని పూర్తయ్యాక గేసెన్ అత్యధిక మొత్తాన్ని అడిగి పుచ్చుకొన్నాడు. అప్పుడా గెయిషా కళాపోషకుడి వేపు తిరిగి 'ఈ కళాకారుడికి కావలసిందల్లా డబ్బు. అతడి చిత్రాలు అందంగా ఉంటాయిగానీ, అతడి మనస్సు మురికి. డబ్బు అతణ్ణి ఆ విధంగా తయారు చేసింద'ని అన్నది.



జ్యోతిర్మయం

తరువాత తెలిసింది, గేసెన్ తన చిత్రాలకు ఎవరినైనా అత్యధిక మొత్తంలో డబ్బు అడగటానికి ఈ కారణాలు ఉన్నవని:

అతడు పుట్టి పెరిగిన ప్రాంతం తరచు కరవు కాటకాల్తో బాధపడుతుండేది. డబ్బున్న వాళ్ళు బీదలకు సాయం చేసేవాళ్ళు కాదు. అందువల్ల గేసెన్ గిడ్డంగి నొకదాన్ని కట్టి, అందులో ఆపత్కాలంలో ఆదుకోవటానికి తగినన్ని ఆహార ధాన్యాల్ని నిల్వ ఉంచాలని అనుకొన్నాడు.

తన ఊరి నుండి పుణ్యక్షేత్రానికి వెళ్లేదారి అధ్వాన్నంగా ఉంది. యాత్రికులు చాలా కష్టపడుతుండేవారు. అతడా రహదారిని బాగు చేయాలనుకొన్నాడు.

గేసెన్ గురువుగారు కట్టిస్తున్న బౌద్ధ విహారం పూర్తి కాకుండానే మరణించారు. గేసెన్ విహారం కట్టడం పూర్తి చేసి, గురువుగారి కోరిక తీర్చాలనుకొన్నాడు.

గేసెన్ తను అనుకొన్న మూడు పనులు పూర్తి చేశాక, కుంచెలు వంటి చిత్ర కళా సామగ్రినంతటినీ బైట పారవేసి, పర్వత సానువుల్లో ఇల్లు కట్టుకొని, ప్రశాంత జీవనం సాగిస్తూ, మళ్లీ ఎప్పుడూ దేన్నీ చిత్రించలేదు.

– దీవి సుబ్బారావు

క్లుప్తంగా...

పాఠశాలల్లో క్రీడా మౌలిక వసతులకు రూ.30 కోట్లు

- సమగ్ర శిక్ష రాష్ట్ర ఏపీడీ శ్రీనివాసులరెడ్డి



పోటీలను ప్రారంభిస్తున్న శ్రీనివాసులరెడ్డి, భానుమూర్తి రాజు తదితరులు

రామవరప్పాడు: రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తోందని అన్ని జిల్లాల్లోని పాఠశాలలకు క్రీడా మౌలిక సదుపాయాలు కల్పించడానికి ప్రభుత్వం రూ.30 కోట్లు మంజూరు చేసిందని సమగ్ర శిక్ష రాష్ట్ర అదనపు ప్రాజెక్ట్ డైరెక్టర్ (ఏపీడీ) డాక్టర్ కేవీ శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్), ఎన్టీఆర్ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఏపీ ఆధ్వర్యంలో 67వ అంతర్ జిల్లాల అండర్–14, 17 బాలబాలికల రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌ను నున్నలోని వికాస్ గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో గురువారం ప్రారంభమయ్యాయి. 3 రోజుల పాటు జరిగే ఈ టోర్నీని శ్రీనివాసులరెడ్డి, ఎస్‌జీఎఫ్ ఏపీ సెక్రటరీ భానుమూర్తి రాజు, జెడ్పీటీసీ సువర్ణరాజు ప్రారంభించారు. ఈ పోటీల్లో ఉమ్మడి 13 జిల్లాల నుంచి 650 మంది రెజ్లర్లు పాల్గొన్నారు. శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ..విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధిస్తే ప్రొఫెషనల్ కోర్సుల్లో ప్రవేశాలు, ప్రభుత్వ ఉద్యోగాల్లో అదనపు రిజర్వేషన్ సౌకర్యాలు లభిస్తాయని చెప్పారు. భానుమూర్తి రాజు మాట్లాడుతూ..ఈ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన వారికి అక్టోబర్ 3 నుంచి మధ్యప్రదేశ్‌లోని విదిషాలో జరిగే స్కూల్ గేమ్స్ రెజ్లింగ్ నేషనల్స్‌లో ఏపీ తరఫున పాల్గొనేందుకు ఎంపిక చేస్తామని తెలిపారు.

అక్రమార్కుల చెర నుంచి వక్ఫ్ భూములను కాపాడండి

- ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషాకు అల్తాఫ్ బాబా వినతి

సాక్షి, అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా అక్రమార్కుల చెరలో ఉన్న కోట్లాది రూపాయల విలువైన వక్ఫ్ ఆస్తులను కాపాడాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషాకు అల్తాఫ్ బాబా విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్సీ రుహుల్లా, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ షేక్ ఖాజా సమక్షంలో గురువారం ఉపముఖ్యమంత్రి అంజాద్ బాషాకు అల్తాఫ్ బాబా వినతిపత్రం అందించారు. రాష్ట్రంలో ఆక్రమణలకు గురవుతున్న వక్ఫ్ భూములను రక్షించేలా తక్షణం చర్యలు తీసుకోవాలని కోరారు. విజయవాడ సమీపంలోని నిడమానూరులో సర్వే నంబర్ 201 నుంచి 203/2 వరకు 39.16 ఎకరాల ఖాజీ సర్వీసు, ఈనాం భూములు ఆక్రమణల చెరలో ఉన్నాయన్నారు. ఆ భూముల విలువ రూ.300 కోట్లకు పైగా ఉంటుందని తెలిపారు. 20 ఏళ్లుగా నలుగుతున్న న్యాయ వివాదాన్ని సత్వరం పరిష్కారమయ్యేలా కృషిచేసి, ఆ వక్ఫ్ ఆస్తులను కాపాడాలని అల్తాఫ్ బాబా కోరారు.

ముక్కంటీశుని సేవలో తమిళనాడు మాజీ సీఎం



గురుదక్షిణామూర్తి సన్నిధిలో పన్నీర్‌సెల్వం

శ్రీకాళహస్తి (తిరుపతి జిల్లా): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి పన్నీర్‌సెల్వం గురువారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ దక్షిణ గోపురం వద్ద పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు స్వాగతం పలికారు. అనంతరం సెల్వం ప్రత్యేక రాహుకేతు పూజలను చేయించుకుని స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ వేదపండితులు ఆయనను ఆశీర్వదించి ప్రసాదాలను అందజేశారు.

గంజాయి పట్టివేత



వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌ఈబీ సీఐ ప్రసాద్

నాయుడుపేట టౌన్ (తిరుపతి జిల్లా): నాయుడుపేట ఆర్టీసీ బస్టాండ్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న యువకుడిని అరెస్ట్ చేసిన ఎస్‌ఈబీ పోలీసులు 20.5 కేజీల గంజాయిని పట్టుకున్నారు. ఎస్‌ఈబీ కార్యాలయంలో సీఐ ఆర్‌యూవీఎస్ ప్రసాద్ వివరాలు వెల్లడించారు. బెంగళూరు జేసీ నగర్‌కు చెందిన కే రోహిత్ వైజాగ్‌లో మాధవన్ అనే వ్యక్తి వద్ద నుంచి 20.5 కేజీల గంజాయి కొనుగోలు చేసి నెల్లూరుకు రైలులో వచ్చాడు. అక్కడినుంచి ఆర్టీసీ బస్సులో నాయుడుపేట బస్టాండ్‌కు వచ్చి బెంగళూరు వెళ్లే బస్సు కోసం వేచి ఉండగా గురువారం ఎస్‌ఈబీ సీఐతో పాటు పోలీసులు యువకుడిని అదుపులోకి తీసుకుని గంజాయి స్వాధీనం చేసుకున్నారు. గంజాయి విలువ సుమారు రూ.3 లక్షలు ఉంటుంది.

ఆస్పత్రుల వ్యర్థాలపై నిఘా

నిబంధనల్ని పటిష్టం చేసిన ప్రభుత్వం

- ఉమ్మడి కృష్ణా జిల్లా నుంచి నిత్యం 1.40 టన్నుల బయో మెడికల్ వ్యర్థాలు
- ఆస్పత్రి యాజమాన్యాలకు కాలుష్య నియంత్రణ మండలి అవగాహన

లబ్బీపేట (విజయవాడ తూర్పు): ఆస్పత్రులలోని వ్యర్థాల (బయో మెడికల్స్) సేకరణ, నిర్వీర్యంపై ప్రభుత్వం నిబంధనల్ని కఠినతరం చేసింది. ఆస్పత్రి నుంచి సేకరించిన వ్యర్థాలు కంపెనీకి తీసుకెళ్లి నిర్వీర్యం చేసేవరకూ నిరంతరం నిఘా వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఎక్కడా బయో మెడికల్ వ్యర్థాలను బయట వేయకుండా.. కచ్చితంగా వాటిని నిర్వీర్యం చేసేలా వ్యవస్థను పటిష్టం చేశారు. వాహనాలకు జీపీఎస్ సిస్టమ్ అమర్చారు. ఆస్పత్రిలో వ్యర్థాలను సేకరించినప్పుడు, కంపెనీకి తరలించిన తర్వాత బ్యాగ్‌లను స్కాన్ చేసేలా బార్ కోడింగ్, కంపెనీ వద్ద ఆన్‌లైన్ ఎమిషన్ మోనిటరింగ్ సిస్టమ్ ఏర్పాటు వంటి విధానాలను అమలు చేస్తున్నారు. ప్రస్తుతం ఉమ్మడి కృష్ణాజిల్లాలో 17,200 బెడ్స్ ఉండగా.. నిత్యం 5 వేల బెడ్స్‌పై రోగులు చికిత్స పొందుతుంటారని కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) లెక్కలు చెబుతున్నాయి. ప్రతి రోజూ 1.20 టన్నుల నుంచి 1.40 టన్నుల బయో మెడికల్ వ్యర్థాల సేకరణ, నిర్వీర్యం జరుగుతున్నట్టు పీసీబీ అధికారులు చెపుతున్నారు.

తరలింపు.. నిర్వీర్యంపై నిఘా

బయో మెడికల్ వ్యర్థాలను సంబంధిత కంపెనీకి ఖచ్చితంగా తరలించేలా ప్రభుత్వం నిఘా పటిష్టం చేసింది. ప్రతి బ్యాగ్‌కు బార్ కోడింగ్ ఏర్పాటు చేశారు. ఆస్పత్రి నుంచి సేకరించేటప్పుడు బార్ కోడింగ్‌ను స్కాన్ చేయడంతో పాటు కంపెనీకి తరలించిన తర్వాత దానిని స్కాన్ చేయాల్సి ఉంది. అప్పుడే దానిని నిర్వీర్యం చేసేందుకు తరలించినట్టు నిర్ధారణ అవుతుంది. ఆస్పత్రి యాజమాన్యాలకు మొబైల్ యాప్ ప్రవేశపెట్టారు. ఈ యాప్‌లో ప్రతిరోజూ ఆస్పత్రిలో ఎన్ని పడకలపై రోగులు ఉన్నారు. ఆ రోజు వ్యర్థాలు ఎంత ఉన్నాయి అనే విషయాలను యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంది. బయో మెడికల్ వ్యర్థాలను తరలించే ప్రతి వాహనానికి జీపీఎస్ సిస్టమ్ ఏర్పాటు చేశారు. ఆస్పత్రి నుంచి సేకరించిన వ్యర్థాలు కంపెనీ వద్దకు వెళ్లాయా లేదా ఇతర ప్రాంతాలకు వెళ్లాయా అనే దానిపై నిఘా వేస్తారు. జగ్గయ్యపేట సమీపంలో బయో వ్యర్థాల నిర్వీర్యం ప్లాంట్ ఉంది. ఆ ప్లాంట్‌లో వ్యర్థాల నిర్వీర్యం ప్రక్రియను నిరంతరం ఆన్‌లైన్ ఎమిషన్ మోనిటరింగ్ సిస్టమ్ ద్వారా పరిశీలిస్తుంటారు. అక్కడ ఎంత డిగ్రీల్లో నిర్వీర్యం చేస్తున్నారు. ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వీర్యం సమయంలో వచ్చే పొగలో ఏమైనా రసాయనాలు ఉన్నాయా, హానికర కాలుష్యం వస్తోందా అనే అంశాలను పరిశీలిస్తారు.



బయో మెడికల్ వ్యర్థాలకు కలర్ కోడింగ్

వ్యర్థాలకు కలర్ కోడింగ్

ఆస్పత్రిలోని వ్యర్థాలకు కలర్ కోడింగ్‌ను ఏర్పాటు చేశారు. పసుపు, ఎరుపు, బ్లూ, తెలుపు నాలుగు రంగుల్లో ఉన్న బ్యాగుల్లో నిర్దేశించిన వ్యర్థాలను ఆస్పత్రి సిబ్బంది వేసేలా ఇప్పటికే అవగాహన కల్పించారు. పసుపు బ్యాగుల్లో మానవ శరీర సంబంధమైన వ్యర్థాలు, జంతు శరీర సంబంధమైన వ్యర్థాలు, మాయ, కలుషిత దూది, డ్రెస్సింగ్ క్లాత్, విషపూరిత వ్యర్థాలు, గడువు ముగిసిన మందులు, మాస్కులు వేస్తారు. వీటిని కంపెనీకి తరలించి 1,200 డిగ్రీల వద్ద నిర్వీర్యం చేస్తారు. ఎరుపు బ్యాగుల్లో సిరంజీలు, ఐవీ సెట్, కాథెటర్, గ్లౌజులు, బ్లడ్ బ్యాగ్స్, యూరిన్ బ్యాగ్స్, డయాలసిస్ కిట్, ఐవీ బాటిల్స్ వేసేలా ఏర్పాట్లు చేశారు. తెలుపు బ్యాగ్స్‌లో సూదులు, స్థిర సూదులు, సిరంజిలు, బ్లేడ్లు, శస్త్ర చికిత్స బ్లేడ్లు వేస్తారు. బ్లూ బ్యాగ్స్ గ్లాసుతో చేసిన ఇంజెక్షన్ బాటిల్స్, గాజు సీసాలు, ల్యాబ్ స్లైడ్స్, ఇంప్లాంట్స్, కత్తెరలు వేసేలా అవగాహన కల్పించారు.

అవగాహన కలిగిస్తున్నాం



ప్రతి ఆస్పత్రిలో వ్యర్థాలను నిబంధనల మేరకు కలర్ కోడింగ్ ఆధారంగా వేరు చేయాలని యాజమాన్యాలకు అవగాహన కల్పిస్తున్నాం. వ్యర్థాల తరలింపు, నిర్వీర్యం వంటి వాటిపై నిరంతర నిఘా ఏర్పాటు చేశాం. – పి.శ్రీనివాసరావు, ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్, కాలుష్యనియంత్రణ మండలి

నేడు తిరుమలలో గరుడ వాహన సేవ

- రాత్రి 7 గంటల నుంచి నిర్వహణ
- బ్రహ్మోత్సవాల్లో నాలుగోరోజున కల్ప వృక్ష వాహనం, సర్వభూపాల వాహనాలపై ఊరేగిన శ్రీవారు
- శ్రీవారికి శ్రీవిల్లిపుత్తూరు పుష్ప మాలలు, చెన్నై గొడుగుల సమర్పణ



సర్వభూపాల వాహనంపై ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు



సర్వభూపాల వాహన సేవలో పాల్గొన్న జస్టిస్ రామకృష్ణ ప్రసాద్, భూమన

తిరుమల: శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా విశిష్టమైన గరుడ వాహన సేవ శుక్రవారం రాత్రి 7 గంటలకే ఆరంభమవనుంది. ఈ సేవకు 2.5 లక్షల మందికిపైగా భక్తులు హాజరయ్యే అవకాశాలున్నాయి. గరుడ సేవను అర్ధరాత్రి తర్వాత 3 గంటల వరకు నిర్వహించనున్నారు. గరుడ సేవ కారణంగా శుక్రవారం నుంచి తిరుమలకు వచ్చే రెండో ఘాట్‌రోడ్డులో ద్విచక్ర వాహనాలను అనుమతించేది లేదని టీటీడీ తెలిపింది. కాగా, స్వామి ఊరేగే వాహనాలపై నాణేలు విసరవద్దని భక్తులకు టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి, ఈవో ధర్మారెడ్డి విజ్ఞప్తి చేశారు. భక్తులు విసిరే నాణేలు, మిరియాలు, ఉప్పు వంటి పదార్థాల వల్ల స్వామి వారికి అలంకరించే ఆభరణాలు విరిగిపోయే ప్రమాదం ఉందని చెప్పారు. కాగా, బ్రహ్మోత్సవాల్లో నాలుగో రోజైన గురువారం నాడు ఉదయం కల్పవృక్ష వాహనంపై ఉభయ దేవేరులైన శ్రీదేవి, భూదేవితో కలసి మలయప్ప పురవీధుల్లో వైభవంగా ఊరేగారు. సాయం సంధ్యావేళలో ఆలయం వెలుపల సహస్ర దీపాలంకార సేవ కోసం కొలువు మంటపంలో వేంచేపు చేశారు. వేయి నేతి దీపాల వెలుగులో ఉత్సవమూర్తులు ఊయలపై ఊగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం బంగారు, వజ్రవైఢూర్య ఆభరణాలతో ఉత్సవరులకు విశేష అలంకరణ చేశారు. రాత్రి సర్వభూపాల వాహనంపై స్వామి వారు వి హరించారు. ఈ వాహన సేవలో రాష్ట్ర హై కోర్టు న్యాయమూర్తి జస్టిస్ రామకృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

శ్రీవారికి శ్రీవిల్లి పుత్తూరు మాలలు, చెన్నయ్ గొడుగులు

తమిళనాడులోని శ్రీవిల్లి పుత్తూరు గోదాదేవి ధరించిన మాలలు గురువారం తిరుమలకు చేరుకున్నాయి. వీటిని శుక్రవారం శ్రీవారి వాహన సేవల్లో అలంకరిస్తారు. ద్వాపర యుగంలో గోదాదేవికి శ్రీకృష్ణుడు ఇచ్చిన వరం మేరకు శ్రీవిల్లిపుత్తూరు ఆలయంలో వెలసిన గోదాదేవి ధరించిన మాలలు శ్రీవారికి సమర్పించడం ఆనవాయితీ. శ్రీవిల్లి పు త్తూరు నుంచి తిరుమలకు వచ్చిన మా లలు, చిలుకలను శ్రీవారి ఆలయానికి అందజేశారు. హిందూ ధర్మార్థ ట్రస్ట్ సమితి(చెన్నై) నిర్వాహకులు ఆర్ఆర్ గోపాల్‌జీ.. తిరుమలేశునికి 9 కొత్త గొడుగులను సమర్పించారు.

వైజాగ్ ఓపెన్ గోల్ఫ్‌లో ఆధిక్యంలో అక్షయ్



విశాఖ స్పోర్ట్స్: వైజాగ్ ఓపెన్ గోల్ఫ్ రెండో రౌండ్ పూర్తయ్యేప్పటికి అక్షయ్ శర్మ ఆధిక్యంలోకి చేరుకోగా సన్విత్ బిష్ణోయ్, త్రిసూల్ చిన్నప్ప పోటీనిస్తున్నారు. ఒలింపియన్ ఉదయన్ మానే, పీజీటీఐ మెరిట్ లీడర్ ఓంప్రకాశ్, హాట్ ఫేవరెట్ హర్షజీత్‌లు వెనుకబడిపోయారు. తొలిరౌండ్‌లో ఆధిక్యాన్ని ప్రదర్శించిన మహ్మద్ సంజు గురువారం 3 హిట్స్ వెనుకబడిపోయాడు. వైజాగ్ ఓపెన్ గోల్ఫ్‌లో భాగంగా ఇక్కడి ఈస్ట్‌పాయింట్ గోల్ఫ్ కోర్స్‌లో రెండో రోజు టీస్ ఆఫ్‌తో గురువారం ఉత్సాహంగా సాగింది. భారత ప్రొఫెషనల్ గోల్ఫ్ టూర్ (పీజీటీఐ) ఆధ్వర్యంలో జరుగుతోన్న ఈ టోర్నీ రెండో రోజు 124 మంది గోల్ఫర్లు 42 మ్యాచ్‌ల్ని గురువారం కొనసాగించారు. చండీఘఢ్‌కు చెందిన అక్షయ్‌శర్మ 135 స్కోర్‌తో ఆధిక్యంలోకి రాగా సన్విత్, త్రిసూల్, శివేంద్ర 138 స్కోర్లతో సంయుక్తంగా రెండో స్థానంలో ఉన్నారు. సమర్థ్, మెరిట్ లీడర్ ఓం ప్రకాశ్, తొలిరోజు ఆధిక్యాన్ని ప్రదర్శించిన మహ్మద్ సంజు 139 స్కోర్‌తో పోటీనిస్తున్నారు.

పీఏఎల్‌పై ఉపాధ్యాయులకు శిక్షణ



ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్న హర్ష

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల సమగ్రాభివృద్ధి దిశగా అనేక వినూత్నమైన కార్యక్రమాలను రూపొందిస్తున్న ప్రభుత్వం... విద్యాబోధనలో కూడా నాణ్యతను పెంపొందించడంలో ఎప్పటికప్పుడు సరికొత్తగా ముందుకెళుతోంది. ఇందులో భాగంగా పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో పర్సనల్ అడాప్టివ్ లెర్నింగ్ (పీఏఎల్) కార్యక్రమంపై రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు గుంటూరులోని ఏసీ కళాశాలలో రెండు రోజులు శిక్షణ ఇస్తున్నారు. గురువారం ఉమ్మడి ప్రకాశం జిల్లా నుంచి అనంతపురం జిల్లా వరకు 30 పాఠశాలల ప్రధానోపాధ్యాయులతోపాటు గణితం, సైన్స్ ఉపాధ్యాయులు, ఫీల్డ్ మేనేజ్‌మెంట్ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. శుక్రవారం ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా నుంచి గుంటూరు జిల్లా వరకు 30 పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తారు. ఈ ఓరియెంటేషన్ కార్యక్రమంలో కన్వే జీనియస్ టీం ట్రైనర్లు హర్ష దేవగుప్తపు, రేష్మి కుమార్, ఉజ్వల్, సౌరభ్, ప్రోగ్రాం మేనేజర్ రూపేష్‌కుమార్ విద్యాబోధనలో సాంకేతిక అంశాలపై శిక్షణ ఇచ్చారు. తరగతి గదిలో విద్యార్థులు అభ్యసనంలో లీనమయ్యేలా చూసే విధానాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సెంటర్ స్క్వేర్ ఫౌండేషన్ ప్రతినిధులు ప్రద్యోత్, అనిరుధ్, పాఠశాల విద్యాశాఖ ఐటీ విభాగ ప్రతినిధులు రమేష్, వెంకట్రావు, సత్యం, పూర్ణచంద్రరావు, ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం పాల్గొన్నారు.

శ్రీసిటీలో చెన్నై రామచంద్రా హాస్పిటల్ వైద్య సేవలు

అక్టోబర్ 22 నుంచి అందుబాటులోకి



ఎంఓయూ పత్రాలతో శ్రీసిటీ ఎండీ, ఆసుపత్రి అధికారులు

వరదయ్యపాళెం (తిరుపతి జిల్లా): శ్రీసిటీ పారిశ్రామికవాడలో చెన్నైకు చెందిన శ్రీరామచంద్రా ఆస్పత్రి వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. అందుకు సంబంధించి శ్రీసిటీ యాజమాన్యం, రామచంద్రా హాస్పిటల్ యాజమాన్యంల మధ్య అవగాహనా ఒప్పందం (ఎంఓయూ) కుదిరినట్లు శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి చెప్పారు. శ్రీరామచంద్రా వర్సిటీ చాన్స్‌లర్ వీఆర్ వెంకటాచలం నుంచి ఒప్పంద పత్రాలను గురువారం మార్చుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రో చాన్స్‌లర్ ఆర్‌వీ సెంగుతువాన్ పాల్గొన్నారు. రామచంద్రా హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ఆర్‌బీ సుధాగర్ సింగ్ మాట్లాడుతూ..శ్రీసిటీ ప్రాంగణంలో అత్యున్నత ఆరోగ్య వైద్యసేవలు అందించడానికి తాము చొరవ చూపుతున్నట్లు చెప్పారు. ఈ వైద్య కేంద్రంలో 24 గంటలు వైద్యసేవలు అందుబాటులో ఉంటాయన్నారు. రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ.. శ్రీసిటీకి సంబంధించి ప్రతి అంశంలోనూ ప్రపంచస్థాయి సౌకర్యాలను అందించడం తమ లక్ష్యమని, అందులో భాగంగానే వైద్య సేవలకు సంబంధించి చెన్నైకు చెందిన శ్రీరామచంద్రా హాస్పిటల్‌ను ఎంచుకున్నట్లు తెలిపారు. అక్టోబర్ 22 నుంచి శ్రీరామచంద్రా హాస్పిటల్ వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు.

దంపతులను బలి తీసుకున్న పాతకక్షలు

- దాయాదుల మధ్య ఆస్తి గొడవలే కక్షలకు కారణం
- కృష్ణాజిల్లా అయ్యంకి గ్రామంలో దారుణం
- పరారీలో నిందితులు



మృతులు వీరకృష్ణ, వరలక్ష్మి (ఫైల్)

అయ్యంకి(మొవ్వ): గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో జరిగిన జంట హత్యలు కృష్ణాజిల్లాలో కలకలం రేపాయి. ఆస్తి తగాదాలు, పాత కక్షలు భార్య భర్తలను బలి తీసుకున్నాయి. మొవ్వ మండలం అయ్యంకి గ్రామంలో గురువారం చోటు చేసుకున్న ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. అయ్యంకి గ్రామానికి చెందిన వీరంకి చిన ఆంజనేయులుకు కుమారులు వీరంకి వీరకృష్ణ, వీరంకి పూర్ణచంద్రరావు, కుమార్తె అమ్ములు ఉన్నారు. ఆంజనేయులుకి గ్రామంలో 3.01 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఈ భూమి వల్ల ఏర్పడిన వివాదాల కారణంగా 2008లో తండ్రి చినఆంజనేయులును, 2012లో తమ్ముడు పూర్ణచంద్రరావును వీరకృష్ణ హత్య చేశాడనే ఆరోపణలొచ్చాయి. అయితే ఈ కేసుల్లో సరైన సాక్ష్యాధారాలు లేకపోవడంతో కోర్టు కేసును కొట్టివేసింది. కాగా, పూర్ణచంద్రరావు హత్యానంతరం అతడి భార్య స్వర్ణ, ముగ్గురు కుమారులు గణేశ్, లోకేశ్, భువనేశ్ అయ్యంకి గ్రామం విడిచి వెళ్లిపోయారు. ఇటీవల స్వర్ణ తన పొలానికి పట్టాదారు పాసు పుస్తకానికి అప్లయ్ చేయగా లింక్ డాక్యుమెంట్స్ లేవంటూ వీఆర్‌వో, ఆర్‌ఐలు రిజక్ట్ చేశారు. దీనిపై వివరణ కోరేందుకు తాజాగా ఆమె తన కుమారులు ముగ్గురితో కలిసి గురువారం మధ్యాహ్నం అయ్యంకిలోని వీఆర్‌వో కార్యాలయానికి వచ్చింది. ఈ సందర్భంగా పాస్‌పుస్తకాల విషయంలో స్వర్ణ కుటుంబానికి, అక్కడే ఉన్న వీరకృష్ణకు మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో కోపోద్రిక్తులైన స్వర్ణ కుమారులు వెంట తెచ్చుకున్న కత్తులతో పెదనాన్న వీరకృష్ణను విచక్షణా రహితంగా నరికి హత్య చేశారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న అన్న సమారాధన కార్యక్రమం వద్ద ఉన్న వీరకృష్ణ భార్య వరలక్ష్మిని సైతం కత్తులతో పొడిచి హత్యచేసి పరారయ్యారు. గుడివాడ డీఎస్పీ శ్రీకాంత్, పామర్రు సీఐ ఎస్.వెంకటనారాయణ, కూచిపూడి ఎస్ఐ డి.సందీప్ ఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. వారు మీడియాతో మాట్లాడుతూ.. పక్కా ప్లాన్‌తోనే వీరకృష్ణ, వరలక్ష్మి దంపతుల హత్య జరిగినట్లు తెలిపారు. వీరకృష్ణ తమ్ముడి భార్య స్వర్ణ, ఆమె కొడుకులే హత్యలకు కారణమని వెల్లడించారు. నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. మృతులకు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి సీఎం జగన్ ప్రాధాన్యం

ఏపీ సీఆర్ మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు



నాడు-నేడు జరిగిన అభివృద్ధి డిస్‌ప్లేను పరిశీలిస్తున్న కొమ్మినేని తదితరులు

గురజాల: ఆంధ్రప్రదేశ్ నాలుగున్నరేళ్లుగా ప్రగతిపథంలో ముందుకు సాగుతోందని ఏపీ సి.ఆర్. మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు అన్నారు. సీఎం వైఎస్ జగన్ అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. పల్నాడు జిల్లా గురజాలలో గురువారం '123 స్వచ్ఛ పాలిటిక్స్' వ్యవస్థాపకుడు షేక్ బడేజానీ ఆధ్వర్యాన 'ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి–వాస్తవాలు–వక్రీకరణలు'పై రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కొమ్మినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ పాలనలో ఏమైనా లోటుపాట్లు ఉంటే ప్రతిపక్షం తెలియజేస్తే అధికార పక్షం సరిదిద్దుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. ప్రస్తుతం సీఎం వైఎస్ జగన్ పాలనలో ఏమీ లోటుపాట్లు లేకపోవడంతో ప్రతిపక్షాలు అసత్య ప్రచారానికే పరిమితమయ్యాయని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిని, సీఎం జగన్ పాలనలో అభివృద్ధిని డిస్‌ప్లే ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్‌ఆర్టీ సొసైటీ చైర్మన్ మేడపాటి వెంకట్, ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వీవీఆర్ కృష్ణంరాజు పాల్గొన్నారు.

విశాఖ కేంద్రంగా పాలనా వికేంద్రీకరణకు అడుగులు

1,089వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు



తాడికొండ: విశాఖ కేంద్రంగా పాలన ద్వారా వికేంద్రీకరణకు అడుగులు పడి.. అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని బహుజన పరిరక్షణ సమితి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,089వ రోజు కొనసాగుతున్న రిలే దీక్షలో గురువారం పలువురు మాట్లాడారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన బాలకృష్ణ గతంలో ఎప్పుడూ ప్రజా సంక్షేమంపై మాట్లాడలేదని, కానీ నేడు అసెంబ్లీలో మీసం మెలివేయడం సిగ్గుచేటన్నారు. తండ్రి ఎన్టీఆర్‌ను చెప్పులతో కొట్టినప్పుడు అప్పుడు మీసం ఎందుకు తిప్పలేదు, తొడలు ఎందుకు కొట్టలేదో చెప్పాలని ప్రశ్నించారు. రామోజీ రావుకు చిట్‌ఫండ్ కేసుల్లో అరెస్టు తప్పదని హెచ్చరించారు. అసెంబ్లీకి వెళుతున్న సీఎం వైఎస్ జగన్ 3 రాజధానుల దీక్షా శిబిరం వద్ద తన వాహన శ్రేణిని వేగం తగ్గించి ముకుళిత హస్తాలతో అభివాదం చేయడంతో.. పలువురు జై జగన్ అంటూ నినాదాలు చేశారు. నాయకులు ఈపూరి ఆదాం, బేతపూడి సాంబయ్య, పెరికే వరప్రసాద్, మాదిగాని గురునాథం, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక అంశాల్లోనూ విద్యార్థులకు భాగస్వామ్యం

- ఉన్నత విద్యా మండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి
- ఏఎన్‌యూలో 'పాస్‌పోర్ట్ టూ లెర్నింగ్' ప్రారంభం



పీటూఎల్ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఆచార్య హేమచంద్రారెడ్డి తదితరులు

ఏఎన్‌యూ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆదేశాల మేరకు విద్యార్థుల్లో విద్య, నైపుణ్య లక్షణాలు పెంపొందించడంతో పాటు సామాజిక అంశాల్లోనూ భాగస్వాములను చేసేందుకు కృషి చేస్తున్నట్లు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి చెప్పారు. ఉన్నత విద్యామండలి, బీసీడీఈ, యునిసెఫ్ సంయుక్తంగా నిర్వహిస్తున్న పాస్‌పోర్ట్ టూ లెర్నింగ్(పీటూఎల్) కార్యక్రమం గురువారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ప్రారంభమైంది. ఈ సందర్భంగా హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి ఆలోచనలకు అనుగుణంగా రాష్ట్రంలో ఉన్నత విద్య చదువుతున్న 15 లక్షల మంది విద్యార్థులను పీటూఎల్‌లో భాగస్వాములను చేస్తున్నామన్నారు. సమాజానికి దిశానిర్దేశం చేసే చర్చలు యూనివర్సిటీల వేదికగా జరగాలన్నదే ఏపీ ప్రభుత్వ సంకల్పమన్నారు. ఇందులో భాగంగానే ఉన్నత విద్యలో 2 నెలల పాటు కమ్యూనిటీ సర్వీస్ ప్రోగ్రాంను తప్పనిసరి చేశామన్నారు. దానికి క్రెడిట్స్ విధానం కూడా అమల్లోకి తెచ్చామన్నారు. బోర్డ్ ఆఫ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ త్రూ ఎడ్యుకేషన్(బీసీడీఈ) చైర్మన్ నేదురుమల్లి రామ్‌కుమార్ మాట్లాడుతూ.. ఏపీలో అమలు చేస్తున్న సంస్కరణలు ఆదర్శనీయమన్నారు. నైపుణ్యం, సామాజిక బాధ్యత కలిగిన యువతను సమాజానికి అందించేందుకు సీఎం జగన్ కృషి చేస్తున్నారని చెప్పారు. విద్యార్థులకు అన్ని అంశాల్లో నైపుణ్యం పెంపొందించి ఆర్థిక స్థిరత్వం కలిగిన యువతగా తీర్చిదిద్దటమే లక్ష్యంగా పీటూఎల్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటివరకు 55 వేల మంది విద్యార్థులు ఇందులో భాగస్వాములయ్యారని తెలిపారు. యునిసెఫ్ హెచ్ఎఫ్ఓ చీఫ్ జెలాలెమ్ మాట్లాడుతూ.. యువత సామర్థ్యాన్ని పెంపొందించేందుకు ఏపీలో పీటూఎల్ వంటి కార్యక్రమాలను యునిసెఫ్ నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో బీసీడీఈ సీఈవో ఆచార్య దేవకుమార్, బీసీడీఈ ఏఎన్‌యూ కో–ఆర్డినేటర్ ఆచార్య కె.సునీత, యునిసెఫ్ ప్రతినిధులు శేషగిరి మధుసూదన్, భరత్ కుంద్రా, పీటూఎల్ ప్రతినిధి పల్లవ్ తివారీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినిపై టీడీపీ నాయకుడి లైంగిక వేధింపులు

- స్కూలుకు వెళుతుండగా ఆటోకు బైక్ అడ్డుపెట్టి తనతో రావాలని బాలికపై ఒత్తిడి
- బాలిక అంగీకరించకపోవడంతో కిందకు లాగిపడేశాడు
- తీవ్రంగా గాయపడిన విద్యార్థిని

ధర్మవరం: పదో తరగతి చదువుతున్న విద్యార్థినిపై ఓ టీడీపీ నాయకుడు లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ప్రేమించాలంటూ వేధిస్తూ ఏకంగా ఆటోలో ఉన్న ఆ బాలికను కిందకు లాగిపడేశాడు. ఈ ఘటన గురువారం శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం మండలం గొట్లూరులో జరిగింది. స్థానికులు, బాలిక తండ్రి తెలిపిన వివరాల ప్రకారం... గొట్లూరు గ్రామానికి చెందిన భాస్కర్ ఆర్మీలో ఉద్యోగం చేస్తున్నాడు. అతను 20 రోజుల కిందట సెలవుపై స్వగ్రామానికి వచ్చాడు. భాస్కర్ స్థానికంగా టీడీపీ నాయకుడిగా చలామణి అవుతూ ఆ పార్టీ కార్యక్రమాల్లో క్రియాశీలకంగా వ్యవహరిస్తుంటాడు. ఇటీవల గొట్లూరుకే చెందిన ఒక పదో తరగతి బాలికపై అతను కన్నేశాడు. యథావిధిగా ఆ బాలిక గురువారం పాఠశాలకు ఆటోలో వెళుతుండగా... ఆటోకు భాస్కర్ బైక్‌ను అడ్డుపెట్టి తనను ప్రేమించాలని, బైక్‌పై రావాలని ఆ బాలికను ఒత్తిడి చేశాడు. బాలిక తాను రానని చెప్పడంతో ఆటో నుంచి బలవంతంగా కిందకు లాగాడు. దీంతో కిందపడిపోయిన బాలికకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ క్రమంలో అక్కడ ఉన్నవారు అడ్డుకోవడానికి ప్రయత్నించగా, వారిపై భాస్కర్ దౌర్జన్యం చేశాడు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న బాలిక తల్లిదండ్రులు వచ్చి తమ కుమార్తెను తీసుకువెళ్లారు. అనంతరం ధర్మవరం రూరల్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి భాస్కర్ కొంతకాలంగా తన కుమార్తెను వేధిస్తున్నాడని విద్యార్థిని తండ్రి ఫిర్యాదు చేశాడు. కాగా, స్థానిక టీడీపీ నాయకుల సూచనలతో భాస్కర్ గ్రామం నుంచి పారిపోగా, అతని కోసం పోలీసులు గాలిస్తున్నారు.

మావోల జాడ కోసం ముమ్మర తనిఖీలు

- మావోయిస్ట్ వారోత్సవాల నేపథ్యంలో ఏవోబీలో కూంబింగ్



పెదబయలు ప్రాంతంలో బైక్‌లను తనిఖీ చేస్తున్న సీఆర్‌పీఎఫ్ జవాన్లు, పెదబయలు పోలీసులు

సాక్షి, పాడేరు: మావోయిస్ట్ పార్టీ 19వ వార్షిక వారోత్సవాలు గురువారం ఏవోబీ వ్యాప్తంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 27 వరకు జరగనున్న వీటిని విజయవంతం చేయాలని మావోయిస్ట్ పార్టీ పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైంది. అల్లూరి సీతారామరాజు జిల్లాతోపాటు సరిహద్దులో ఉన్న ఒడిశాలోని మల్కన్‌గిరి, కోరాపుట్, ఛత్తీస్‌గఢ్.తెలంగాణలోని మావోయిస్ట్ ప్రభావిత ప్రాంతాల్లో భద్రతా చర్యలను పోలీస్ శాఖ విస్తృతం చేసింది. జిల్లాతో పాటు సరిహద్దు రాష్ట్రాల్లోని అటవీ ప్రాంతాల్లో పోలీస్ కూంబింగ్ పార్టీలు అధికంగా సంచరిస్తున్నాయి. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధితోపాటు తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతాల్లోని ప్రధాన రోడ్లలో పోలీస్ బృందాలు వాహనాలను తనిఖీ చేస్తున్నాయి. చింతపల్లి, పాడేరు, రంపచోడవరం, చింతూరు సబ్ డివిజన్ల ఏఎస్పీలు, ఇంటెలిజెన్స్, స్పెషల్ బ్రాంచ్ అధికారులతో ఎస్పీ తుహిన్‌సిన్హా ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.

అదనపు బలగాల తరలింపు

ఏవోబీ వ్యాప్తంగా అన్ని అవుట్ పోస్టుల్లో అదనంగా పోలీస్ పార్టీలను అందుబాటులో ఉంచారు. వారోత్సవాలతో మావోయిస్ట్ పార్టీ కార్యకలాపాలను అడ్డుకునే లక్ష్యంతో పోలీస్ పార్టీలు, సీఆర్‌పీఎఫ్ జవాన్లు నిఘా పెంచాయి. ముందస్తు భద్రత చర్యలలో భాగంగా మారుమూల ప్రాంతాల నుంచి మండల కేంద్రాలకు వచ్చే ప్రయాణికుల లగేజీ బ్యాగులను కూడా క్షుణ్ణంగా సోదా చేస్తున్నారు. అనుమానిత వ్యక్తుల సమాచారాన్ని సేకరిస్తున్నారు. మారుమూల ప్రాంతాలకు పోయే నైట్‌హాల్ట్ ఆర్టీసీ సర్వీసులను మాత్రం సురక్షిత ప్రాంతాలకే పరిమితం చేశారు. చింతూరు మీదుగా భద్రాచలం బస్సు సర్వీసులను సాయంత్రం తరువాత కూనవరం మీదుగా పంపిస్తున్నారు. వారోత్సవాల తొలిరోజు గురువారం ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకపోవడంతో మారుమూల ప్రాంత ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

మహిళా బిల్లుకు పార్లమెంటు ఆమోదం

రాజ్యసభలో ఏకగ్రీవం

న్యూఢిల్లీ: మూడు దశాబ్దాల సుదీర్ఘ నిరీక్షణకు తెర పడింది. నారీ శక్తికి పార్లమెంటు సగౌరవంగా ప్రణమిల్లింది. నూతన భవనంలో తొట్టతొలిగా మహిళా రిజర్వేషన్ల బిల్లును ఆమోదించి సరికొత్త చరిత్ర లిఖించింది. ఈ చరిత్రాత్మక ఘట్టానికి రాజ్యసభ వేదికైంది. ఇప్పటికే లోక్‌సభ ఆమోదం పొందిన నారీ శక్తి విధాన్ అధినియమ్ బిల్లుకు గురువారం పెద్దల సభ సైతం జై కొట్టింది. లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఉద్దేశించిన 128వ రాజ్యాంగ సవరణ బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించింది. సభకు హాజరైన మొత్తం 214 మంది సభ్యులూ పార్టీలకు అతీతంగా బిల్లుకు మద్దతిచ్చారు. దాంతో అది ఏకగ్రీవంగా ఆమోదం పొందింది. మహిళా బిల్లు బుధవారమే లోక్‌సభలో మూడింట రెండొంతులకు పైగా మెజారిటీతో పాస్ అవడం తెలిసిందే. 454 మంది ఎంపీలు మద్దతివ్వగా ఇద్దరు మజ్లిస్ సభ్యులు మాత్రమే వ్యతిరేకించారు. ఈ రిజర్వేషన్లు 15 ఏళ్లపాటు అమల్లో ఉంటాయని కేంద్రం ప్రకటించింది. అనంతరం వాటి కొనసాగింపుపై అప్పటి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని చెప్పింది

పార్టీలకతీతంగా మద్దతు

అంతకుముందు బిల్లుపై జరిగిన చర్చలో రాజ్యసభ సభ్యులంతా ముక్త కంఠంతో మద్దతు పలికారు. కొందరు విపక్షాల సభ్యులు మాత్రం దీన్ని బీజేపీ ఎన్నికల గిమ్మిక్కుగా అభివర్ణించారు. తాజా జన గణన, నియోజకవర్గాల పునర్విభజన కోసం ఎదురు చూడకుండా బిల్లు అమలు ప్రక్రియను వీలైనంత వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. బిల్లును తక్షణం అమలు చేయాలని కేసీ వేణుగోపాల్ (కాంగ్రెస్) డిమాండ్ చేశారు. ఈ బిల్లు అంశాన్ని తొమ్మిదేళ్లుగా పట్టించుకోకుండా కేవలం రాజకీయ లబ్ధి కోసమే ఇప్పుడు హడావుడి చేస్తున్నారని ఆరోపించారు. ఓబీసీ మహిళలకూ దీన్ని వర్తింపజేయాలన్నారు. 2014, 2019ల్లో కూడా మహిళా బిల్లు తెస్తామని బీజేపీ వాగ్దానం చేసి మోసగించిందని ఎలమారం కరీం (సీపీఎం) ఆరోపించారు. మహిళలంటే మోదీ సర్కారుకు ఏ మాత్రమూ గౌరవం లేదన్నారు. మణిపూర్ హింసాకాండపై ప్రధాని మోదీ నిర్లిప్తతే ఇందుకు రుజువన్నారు. ఎన్నికల వేళ బిల్లు తేవడంలో ఆంతర్యం ఏమిటని రామ్‌నాథ్ ఠాకూర్ (జేడీయూ) ప్రశ్నించారు. 2011 జనాభా లెక్కల ఆధారంగా తక్షణం మహిళా రిజర్వేషన్లను అమలు చేయాలని కె.కేశవరావు (బీఆర్ఎస్), వైగో (ఎండీఎంకే) డిమాండ్ చేశారు. తక్షణం డీ లిమిటేషన్ కమిషన్ వేయాలని వారన్నారు. మహిళా బిల్లుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతు ఇస్తోందని ఆ పార్టీ సభ్యుడు వి.విజయసాయిరెడ్డి పునరుద్ఘాటించారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను రాజ్యసభకు, రాష్ట్రాల శాసన మండళ్లకు కూడా వర్తింపజేయాలని కోరారు. కర్ణాటక సీఎంగా, ప్రధానిగా మహిళా రిజర్వేషన్ల కోసం తాను తీసుకున్న చర్యలను జేడీ (ఎస్) సభ్యుడు దేవెగౌడ గుర్తు చేసుకున్నారు.

ఇప్పుడేం జరుగుతుంది?


రాష్ట్రపతి ఆమోద ముద్ర పడగానే మహిళా బిల్లు చట్ట రూపం దాలుస్తుంది. తర్వాత మెజారిటీ రాష్ట్రాల అసెంబ్లీలు దాన్ని ఆమోదించాల్సి ఉంటుంది. ఆ తర్వాత నూతన జన గణన, నియోజకవర్గాల పునర్విభజన అనంతరం రిజర్వేషన్లు అమల్లోకి వస్తాయి. ఇది 2029 కల్లా జరిగే అవకాశముందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా బుధవారమే పరోక్షంగా తెలిపారు.

ఏమిటీ బిల్లు?

- ఈ మహిళా రిజర్వేషన్ బిల్లును నారీ శక్తి విధాన్ అధినియమ్‌గా పేర్కొంటున్నారు.
- దీని కింద లోక్‌సభ, ఢిల్లీ సహా అన్ని రాష్ట్రాల అసెంబ్లీల్లో మహిళలకు మూడో వంతు, అంటే 33 శాతం సీట్లు రిజర్వ్ చేస్తారు.
- ప్రధానంగా పరోక్ష పద్ధతిలో ఎన్నికలు జరిగే రాజ్యసభ, రాష్ట్రాల శాసన మండళ్లకు ఈ రిజర్వేషన్లు వర్తించవు.

చరిత్రాత్మక క్షణాలివి!

ప్రధాని మోదీ భావోద్వేగం



మహిళా బిల్లు రాజ్యసభ ఆమోదం పొందిన క్షణాలను చరిత్రాత్మకమైనవిగా ప్రధాని నరేంద్ర మోదీ అభివర్ణించారు. బిల్లు పెద్దల సభ ఆమోదం పొందిన సమయంలో ఆయన సభలోనే ఉన్నారు. 'భారత మహిళలకు మరింత ప్రాతినిధ్యం, సాధికారత లభించే నూతన శకంలోకి మనమిక సగర్వంగా అడుగు పెట్టనున్నాం. ఇది కేవలం చట్టం మాత్రమే కాదు. మన దేశాన్ని నిరంతరం ఇంత గొప్ప స్థాయిలో తీర్చిదిద్దుతున్న, అందుకోసం తమ సర్వస్వాన్నీ నిరంతరం త్యాగం చేస్తూ వస్తున్నా సంఖ్యాకులైన మహిళామణులకు, మన మాతృమూర్తులకు మనం చేస్తున్న వందనమిది. వారి సహనశీలత, త్యాగాలు అనాదిగా మన గొప్ప దేశాన్ని మరింత సమున్నతంగా తీర్చిదిద్దుతూ వస్తున్నాయి' అంటూ మోదీ భావోద్వేగానికి లోనయ్యారు. 'ఉభయ సభల్లోనూ బిల్లుపై అర్థవంతమైన చర్చలు జరిగాయి. అవన్నీ పూర్తిగా విజయవంతమయ్యాయి. ఈ చర్చలు భవిష్యత్తులోనూ మనందరికీ ఎంతగానో ఉపకరిస్తాయి. బిల్లుకు మద్దతిచ్చిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు. ఈ స్ఫూర్తి భారతీయుల ఆత్మ గౌరవాన్ని సరికొత్త ఎత్తులకు చేరుస్తుంది' అని ఆయన పేర్కొన్నారు.

రాజ్యసభ, మండళ్లలో అసాధ్యం: నిర్మల

చరిత్రాత్మక మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించుకోవడం ద్వారా పార్లమెంటు నూతన భవనానికి శుభారంభం అందించే నిమిత్తమే ఈ సమావేశాలను ఏర్పాటు చేసినట్టు ఆర్థిక మంత్రి నిర్మల తెలిపారు. బిల్లుపై చర్చలో ఆమె మాట్లాడుతూ రాజ్యసభ, శాసన మండళ్లకు జరిగేవి పరోక్ష ఎన్నికలు గనుక మహిళలకు రిజర్వేషన్లు ఆచరణసాధ్యం కాదన్నారు.

పార్లమెంటు నిరవధిక వాయిదా

చరిత్రాత్మక మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించిన అనంతరం పార్లమెంటు ఉభయ సభలు గురువారం నిరవధికంగా వాయిదా పడ్డాయి. నిజానికి 18న మొదలైన ఈ పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు షెడ్యూల్ ప్రకారం 22వ తేదీ దాకా జరగాల్సి ఉంది. రాజ్యసభకు ఇది 261 సెషన్. కాగా, 17వ లోక్‌సభకు బహుశా ఇవే చివరి సమావేశాలని భావిస్తున్నారు.



కెనడా రాజధాని అట్టావాలోని భారత హైకమిషన్ కార్యాలయం



ఢిల్లీలోని కెనడా హైకమిషన్ కార్యాలయం

కెనడా పౌరులకు 'నో' వీసా

- భద్రతా కారణాలతో కెనడాలో కార్యకలాపాలు సాగడం లేదన్న కేంద్రం
- భారత హైకమిషన్లు, కాన్సులేట్లకు బెదిరింపులు వస్తున్నాయని వెల్లడి

న్యూఢిల్లీ: భారత్, కెనడా మధ్య ఉద్రిక్తతలు అంతకంతకూ రాజుకుంటున్నాయి. గత జూన్‌లో ఖలిస్తాన్ ఉగ్రవాది హర్‌దీప్ సింగ్ నిజ్జర్ హత్య వెనుక భారత్ హస్తం ఉందని కెనడా ప్రధానమంత్రి జస్టిన్ ట్రూడో ఆరోపించడంతో ఇరు దేశాలు ఢీ అంటే ఢీ అంటున్నాయి. ఇరు దేశాలు దౌత్య ప్రతినిధుల్ని వెనక్కి తీసుకునే వరకు వెళ్లిన ఈ వ్యవహారంలో కెనడాకు షాకిస్తూ భారత్ మరో నిర్ణయం తీసుకుంది. కెనడా పౌరులకు వీసాల మంజూరును భారత్ తాత్కాలికంగా నిలిపివేసింది. భద్రతా కారణాల రీత్యా ఈ వీసాలను ఆపేసినట్టు కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. కెనడాలో భారత హైకమిషన్లు, కాన్సులేట్లకు రక్షణ లేదని, వాటికి బెదిరింపులు వస్తున్నాయని అందుకే తాత్కాలికంగా వీసాలను నిలిపివేసినట్టుగా తెలిపింది. అంతేకాకుండా భారత్‌లో ఉన్న కెనడా దౌత్యసిబ్బంది సంఖ్య తగ్గించుకోవాలని చెప్పింది. మరోవైపు కెనడాలో భారత్ పౌరులు అప్రమత్తంగా ఉండాలన్న కేంద్రం సూచనల్ని కెనడా ప్రభుత్వం తిరస్కరించించి. ప్రపంచంలో కెనడా అత్యంత సురక్షితమైన దేశమని పేర్కొంది. తమ దేశంలో భారత పౌరులకు వచ్చే ఇబ్బందేమీ లేదని పేర్కొంది.

వీసాలు జారీ చేసే పరిస్థితి లేదు

వీసా దరఖాస్తులను పరిశీలించడానికి ఏర్పాటైన ఒక ప్రైవేటు ఏజెన్సీ బీఎల్ఎస్ ఇంటర్నేషనల్ గురువారం నాడు తాత్కాలికంగా వీసాల పరిశీలన నిలిపివేస్తున్నట్టు ప్రకటించింది. నిర్వహణ కారణాలతోనే ఆపేస్తున్నట్టు వెల్లడించింది. ఆ తర్వాత కాసేపటికే విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి అరిందమ్ బాగ్చి విలేకరులతో మాట్లాడుతూ ఇరు దేశాల మధ్య భద్రతా పరమైన ఉద్రిక్తతల కారణంగా వీసా దరఖాస్తుల ప్రక్రియ ముందుకు సాగడం లేదని తెలిపారు. ఇతర దేశాల నుంచి దరఖాస్తులు చేసుకునే కెనడియన్లకు కూడా వీసాలివ్వలేమని చెప్పారు. "కెనడా ప్రజలు భారత్ రాకుండా అడ్డుకోవాలన్నది మా విధానం కాదు. సరైన వీసాలు ఉన్న వారు (గతంలో వీసాలు మంజూరైన వారు) యధావిధిగా రాకపోకలు సాగించవచ్చు. వారు ఎప్పుడైనా మన దేశానికి రావొచ్చు. కానీ ఆ దేశంలోని పరిస్థితులు మన హైకమిషన్ కార్యకలాపాలకు ఆటంకం కలిగిస్తున్నాయి" అని బాగ్చి వివరించారు. ఇరు దేశాల మధ్య పరిస్థితుల్ని సమీక్షిస్తామని, భారత హైకమిషన్లు, దౌత్య కార్యాలయాలకు రక్షణ ఉందని తెలితే వీసాల జారీ పునరుద్ధరిస్తామని బాగ్చి స్పష్టం చేశారు.

ఉగ్రవాదులకు అడ్డాగా కెనడా

కెనడా ఉగ్రవాదులకు స్వర్గధామంగా మారిందని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి బాగ్చి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. కెనడా ప్రభుత్వం ఉగ్రవాదుల్ని పెంచి పోషిస్తోందని విమర్శించారు. కెనడాలో ఖలిస్తాన్ ఉగ్రవాదుల అరాచకాల ఆధారాలన్నింటినీ ఆ ప్రభుత్వానికి ఇచ్చామని, 20–25 మందిని మన దేశానికి అప్పగించాలని కోరినప్పటికీ స్పందన లేదన్నారు. ఉగ్రవాది నిజ్జర్ హత్య వెనుక భారత్ హస్తం ఉందని ట్రూడో చేసిన ఆరోపణలు రాజకీయ ప్రేరేపితమైనవని మండిపడ్డారు. నిజ్జర్ హత్య గురించి ఎలాంటి సమాచారం కెనడా పంచుకోలేదన్నారు.

అంతర్గత వ్యవహారాల్లో కెనడా జోక్యం

భారత అంతర్గత వ్యవహారాల్లో కెనడా దౌత్యవేత్తల జోక్యం పెరిగిపోతోందని బాగ్చి చెప్పారు. ఇరు దేశాల్లో దౌత్యవేత్తల విషయంలో సమానత్వం లేదన్నారు. 'కెనడాలో ఉన్న భారతీయ దౌత్యవేత్తల కంటే, మన దేశంలో కెనడా దౌత్యవేత్తలు ఎక్కువ మంది ఉన్నారు. వారి సంఖ్యను తగ్గించాల్సిన అవసరం ఉంది" అని అన్నారు. ఈ విషయాన్ని కెనడా దృష్టికి తీసుకువెళ్లినట్టు వివరించారు. ఇక భారత్‌లో ఉన్న కెనడా దౌత్య సిబ్బంది ఎంత మంది ఉన్నారో అంచనాలు వేస్తున్నామని కెనడా హైకమిషన్ వెల్లడించింది. భారత్‌లో కెనడా దౌత్యవేత్తలకి బెదిరింపులు వస్తున్నాయని వారికి భద్రత కల్పించాల్సిన బాధ్యత భారత ప్రభుత్వం పైనే ఉందన్నారు.

కెనడాలో మరో ఖలిస్తాన్ ఉగ్రవాది హత్య



చండీగఢ్: భారత్, కెనడా మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో కెనడాలో మరో ఖలిస్తానీ మద్దతుదారు హత్య జరిగింది. పంజాబ్ మోస్ట్ వాంటెడ్ క్రిమినల్‌లో ఒకరైన సుఖ్‌దూల్ సింగ్ అలియాస్ సుఖ దునెకె మృతి చెందినట్టుగా తెలుస్తోంది. దీనిపై కెనడా ప్రభుత్వం స్పందించలేదు. కెనడాలోని విన్నిపెగ్‌లో బుధవారం రాత్రి సుఖ్‌దూల్‌పై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి చంపేశారు. గ్యాంగ్ వార్‌లో భాగంగానే ఘటన జరిగిందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సుఖ్‌దూల్ సింగ్‌పై మన దేశంలో హత్య, హత్యాయత్నం, దోపిడీకి సంబంధించిన 18 కేసులు ఉన్నాయి. సుఖ్‌దూల్ హత్య తమ పనేనని లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ సామాజిక మాధ్యమాల్లో ప్రకటించింది. పంజాబ్‌లోని మోగా జిల్లా దునెకె కలాన్ గ్రామానికి చెందిన సుఖ్‌దూల్ 2017 డిసెంబర్‌లో నకిలీ ధ్రువపత్రాలతో కెనడాకు పరారయ్యాడు.

ప్రెసిడెన్షియల్ సూట్‌ను తిరస్కరించిన ట్రూడో

జీ-20 సదస్సుకు వచ్చినప్పుడు భిన్నంగా ప్రవర్తన

న్యూఢిల్లీ: కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో భారత్‌లో జీ20 సదస్సుకి వచ్చినప్పుడు కాస్త విభిన్నంగా వ్యవహరించినట్టుగా ప్రభుత్వ వర్గాలు తాజాగా వెల్లడించాయి. వివిధ దేశాల అధినేతల కోసం కేంద్ర ప్రభుత్వం హోటల్స్‌లో భారీగా భద్రత ఏర్పాట్లు చేసి ప్రెసిడెన్షియల్ సూట్‌లను సిద్ధం చేసింది. కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో కోసం హోటల్ లలిత్‌లో ప్రెసిడెన్షియల్ సూట్ ఏర్పాటు చేశారు. ట్రూడో దానిని తిరస్కరించి అదే హోటల్‌లో సాధారణ గదిలో బస చేశారు. ఖలిస్తాన్ ఉగ్రవాది నిజ్జర్ హత్య వెనుక భారత్ ప్రమేయం ఉందని అభాండాలు వేస్తున్న ట్రూడో తన భద్రతాధికారుల సూచన మేరకే ఇలా చేసినట్టుగా తెలుస్తోంది. అదే విధంగా ట్రూడో సొంత విమానానికి సాంకేతిక లోపాలు తలెత్తి ఆయన ప్రయాణం వాయిదా పడింది. అప్పుడు భారత్ ఎయిర్ ఇండియా వన్ విమానాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పినా ట్రూడో తిరస్కరించారు. తన విమానం సిద్ధమయ్యాక రెండు రోజుల తర్వాత సెప్టెంబర్ 12న బయల్దేరి వెళ్లారు.

జనవరిలో పాకిస్తాన్ ఎన్నికలు

ఇస్లామాబాద్: పాకిస్తాన్‌లో 2024 జనవరి చివరి వారంలో సాధారణ ఎన్నికలు జరగనున్నాయి. పాకిస్తాన్ ఎన్నికల సంఘం(పీఈసీ) గురువారం ఈ మేరకు ప్రకటించింది. నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియపై సమీక్ష జరిపామని, ఇందుకు సంబంధించిన ప్రాథమిక జాబితాను ఈ నెల 27వ తేదీన విడుదల చేస్తామని తెలిపింది. పార్టీలు తమ అభ్యంతరాలను వ్యక్తం చేయవచ్చని వాటిని పరిశీలించి నవంబర్ 30వ తేదీన తుది జాబితా ప్రకటిస్తామని పేర్కొంది. ఆ తర్వాత ఎన్నికల షెడ్యూల్ విడుదల చేస్తామని తెలిపింది. 2024 జనవరి చివరి వారంలో ఎన్నికలుంటాయని స్పష్టం చేసింది. పాక్ నేషనల్ అసెంబ్లీ ఆగస్టు 9వ తేదీన రద్దయిన విషయం తెలిసిందే.

వివేక్ రామస్వామికి పెరిగిన మద్దతు



వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష అభ్యర్థిత్వం కోసం రిపబ్లికన్ పార్టీలో కొనసాగుతున్న రేసులో భారత సంతతికి చెందిన వివేక్ రామస్వామి దూసుకు పోతున్నారు. తాజాగా సీఎన్ఎన్, న్యూహ్యాంప్‌షైర్ యూనివర్సిటీ సంయుక్తంగా నిర్వహించిన ఒపీనియన్ పోల్‌లో వివేక్ రామస్వామి మూడో స్థానం నుంచి రెండో స్థానానికి చేరుకున్నారు. డొనాల్డ్ ట్రంప్ తర్వాత పార్టీలో అత్యధికులు రామస్వామికే మద్దతు పలుకుతున్నారు. ఇన్నాళ్లూ ట్రంప్‌కి ప్రధాన పోటీదారుడిగా భావించిన ఫ్లోరిడా గవర్నర్ రాన్ డీశాంటిస్ అనూహ్యంగా రెండు స్థానాలు తగ్గిపోయి అయిదో స్థానానికి పడిపోయారు. భారత సంతతికి చెందిన వివేక్ రామస్వామి, నిక్కీ హేలి కంటే ఆయన వెనక బడిపోవడం అమెరికాలో రాజకీయ విశ్లేషకుల్ని ఆశ్చర్యచకితుల్ని చేస్తోంది. తాజా పోల్‌లో ట్రంప్ 39% మంది ఓటర్ల మద్దతుతో మొదటి స్థానంలో ఉన్నారు. ఇక రామస్వామికి 13% మంది మద్దతు లభిస్తే, దక్షిణ కరోలినా మాజీ గవర్నర్, భారత సంతతికి చెందిన నిక్కీ హేలి 12% ఓటర్ల మద్దతుతో మూడో స్థానంలో ఉన్నారు. న్యూజెర్సీ మాజీ గవర్నర్ క్రిస్ క్రిస్టీకి 11% మంది మద్దతుగా నిలిచినట్టు సీఎన్ఎన్ తన నివేదికలో వెల్లడించారు. ఇక ఫ్లోరిడా గవర్నర్ రాన్ డీశాంటీస్‌కు గత జులైలో నిర్వహించిన సర్వేలో 26% మంది మద్దతు పలికితే ఈ సారి ఘోరంగా 6శాతానికి పడిపోయింది. ముక్కుసూటిగా సాగే రామస్వామి ప్రసంగాలు, ఆయన విధానాలకు యువత అధికంగా ఆకర్షితులవుతున్నట్టు సీఎన్ఎన్ సర్వేలో తేలింది.

గోల్డీ బ్రార్ ముఠా సభ్యుల కోసం పంజాబ్ పోలీసుల వేట

చండీగఢ్: గ్యాంగ్‌స్టర్ గోల్డీ బ్రార్ ముఠా సభ్యులను పట్టుకునేందుకు పంజాబ్ పోలీసులు గురువారం విస్తృతంగా సోదాలు జరిపారు. సుమారు 5 వేల మంది పోలీసులు బృందాలుగా ఏర్పడి ఉదయం 7 గంటల నుంచి మొత్తం 1,200 ప్రాంతాల్లో తనిఖీలు జరిపినట్టు ప్రత్యేక డీజీపీ(శాంతిభద్రతలు) అర్పిత్ శుక్లా పీటీఐకి చెప్పారు.

ఓబీసీలపై కాంగ్రెస్ సవతి ప్రేమ

అధికారంలో ఉండగా వారి గురించి ఆలోచించనైనా లేదు: నడ్డా

- దేశానికి తొలి ఓబీసీ పీఎంను ఇచ్చింది బీజేపీయే
- మహిళా బిల్లుపై రాజ్యసభలో చర్చలో బీజేపీ చీఫ్
- రాహుల్ 'ఓబీసీ కార్యదర్శుల' వ్యాఖ్యలపై నిప్పులు



న్యూఢిల్లీ: చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ల ఓబీసీ కోటా కూడా కల్పించాలన్న కాంగ్రెస్ పార్టీపై బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా దుమ్మెత్తి పోశారు. వారిపై కాంగ్రెస్ ప్రేమ మాటలకే పరిమితమన్నారు. అధికారంలో ఉండగా ఓబీసీలకు కాంగ్రెస్ చేసిందేమీ లేకపోగా కనీసం వారి గురించి ఆలోచించను కూడా లేదని ఎద్దేవా చేశారు. నరేంద్ర మోదీ రూపంలో దేశానికి తొలి ఓబీసీ పీఎంను ఇచ్చింది బీజేపీయేనని గుర్తు చేశారు. మహిళా బిల్లుకు ఉద్దేశించిన 128వ రాజ్యాంగ సవరణ బిల్లుపై గురువారం రాజ్యసభలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. బిల్లుకు ఏకగ్రీవంగా మద్దతివ్వాలని అన్ని పార్టీల ఎంపీలను కోరారు. బిల్లును లోక్‌సభ బుధవారం ఆమోదించడం తెలిసిందే.

రాహుల్ ది ట్యూటర్ తెలివిడి

2004 నుంచి పదేళ్ల పాటు కాంగ్రెస్ సారథ్యంలోని యూపీఏ కూటమి పాలనలో కేంద్రంలో ఎందరు ఓబీసీ కార్యదర్శులున్నారో చెప్పాలని నడ్డా ప్రశ్నించారు. సర్వీసుల్లో ఉన్న అధికారులకు సంబంధించి ఓబీసీ రిజర్వేషన్లను కేవలం 1992లో సుప్రీంకోర్టు సూచన అనంతరం మాత్రమే అమలు చేశారని గుర్తు చేశారు. 90 మంది కేంద్ర ప్రభుత్వ కార్యదర్శుల్లో ఓబీసీలు కేవలం ముగ్గురే ఉన్నారన్న కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ఆరోపణలను ఉద్దేశించి ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. 'ట్యూటర్లను పెట్టుకుంటే చాలదు. నాయకుడు కావాలంటే చిత్తశుద్ధితో అందుకోసం ప్రయత్నించాలి' అంటూ ఎద్దేవా చేశారు. '303 మంది బీజేపీ లోక్ సభ సభ్యుల్లో 85 మంది ఓబీసీలే. ఇది కాంగ్రెస్ మొత్తం సభ్యుల కంటే కూడా చాలా ఎక్కువ! దేశవ్యాప్తంగా మా పార్టీకి ఉన్న ఎమ్మెల్యేల్లో 27 శాతం, ఎమ్మెల్సీల్లో ఏకంగా 40 శాతం ఓబీసీలే. మహిళా సాధికారత కోసం మోదీ సర్కారు ఎన్నో చర్యలు చేపట్టింది. కాంగ్రెస్ మాత్రం కేవలం మైనారిటీల సంతుష్టీకరణ, ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ట్రిపుల్ తలాక్ వంటి అంశాలను లేవనెత్తుతూ ఉంటుంది' అని నడ్డా అన్నారు.

రాజకీయ లబ్ధి కోసం కాదు

మహిళా బిల్లును తక్షణం అమల్లోకి తేవాలన్న విపక్షాల డిమాండ్‌ను నడ్డా తోసిపుచ్చారు. ప్రభుత్వం నిబంధనల ప్రకారం నడచుకుంటుందన్నారు. మహిళా బిల్లు ద్వారా లబ్ధి పొందడం బీజేపీ ఉద్దేశం కాదని స్పష్టం చేశారు. ఈ బిల్లు విషయంలో ప్రస్తుతం కేంద్రం అనుసరిస్తున్నదే సరైన, అత్యంత దగ్గర విధానమని చెప్పారు. అంతకుముందు కేంద్ర న్యాయ మంత్రి అర్జున్ రామ్ మేఘావల్ మహిళా బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టారు. దానికి సభ ఆమోదం లాంఛనమేనని భావిస్తున్నారు. అనంతరం మెజారిటీ రాష్ట్రాల అసెంబ్లీలు బిల్లును ఆమోదించాల్సి ఉంటుంది. ఆ తర్వాత జన గణన గణాంకాల ఆధారంగా జరిపే నియోజకవర్గాల పునర్విభజన తర్వాత మహిళా రిజర్వేషన్లు అమల్లోకి వస్తాయి.

వాగ్వాదం

రాజ్యసభలో మహిళా బిల్లుపై చర్చ సందర్భంగా విపక్ష నేత మల్లికార్జున ఖర్గే, జేపీ నడ్డా మధ్య వా గ్వాదం వాతావరణాన్ని ఒక్కసారిగా వేడెక్కించింది. బిల్లు అమలు కాలావధిపై విపక్షాల విమర్శలను నడ్డా విమర్శించడం ఇందుకు దారి తీసింది. ఖర్గే జోక్యం చేసుకుంటూ, బీజేపీకి దమ్ముంటే రిజర్వేషన్లను తక్షణం అమలు చేయాలని సవాలు చేశారు.

మన వైద్య విద్యార్థులకు శుభవార్త

- విదేశాల్లో ప్రాక్టీస్ చేయొచ్చు
- పీజీ సైతం కొనసాగించొచ్చు
- ఎన్ఎంసీకి డబ్ల్యూఎఫ్ఎంఈ గుర్తింపు
- దేశంలోని 706 మెడికల్ కళాశాలలకు సైతం
- మన వైద్య విద్యా ప్రమాణాలు అత్యుత్తమమన్న కేంద్రం



న్యూఢిల్లీ: భారతీయ వైద్య విద్యార్థులకు శుభవార్త. మన విద్యార్థులు ఇకపై విదేశాల్లోనూ ప్రాక్టీస్ చేసుకోవచ్చు. అంతేకాదు, పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదువునూ విదేశాల్లో కొనసాగించొచ్చు. దేశంలోని వైద్య కళాశాలలకు గుర్తింపు మంజూరు చేసే నేషనల్ మెడికల్ కమిషన్(ఎన్ఎంసీ)కి ప్రఖ్యాత ప్రపంచ వైద్య విద్య సమాఖ్య(డబ్ల్యూఎఫ్ఎంఈ)గుర్తింపు హోదా లభించింది. సంబంధిత అధికారిక గుర్తింపు లేఖ, సర్టిఫికెట్ త్వరలోనే ఎన్ఎంసీకి అందనుంది. డబ్ల్యూఎఫ్ఎంఈ గుర్తింపు ఫలితంగా మన మెడికల్ విద్యార్థులు అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌వంటి దేశాల్లో ప్రాక్టీస్ చేసుకునేందుకు, వైద్యవిద్యలో ఉన్నత చదువులు కొనసాగించేందుకు వీలు కలగనుంది. ఎన్ఎంసీ గుర్తింపుతో దేశంలో ప్రస్తుతం నడుస్తున్న 706 మెడికల్ కాలేజీలకు సైతం డబ్ల్యూఎఫ్ఎంఈ గుర్తింపు లభించినట్లయింది. ఇవేకాకుండా, వచ్చే పదేళ్లలో దేశంలో ఏర్పాటయ్యే కళాశాలలకు సైతం డబ్ల్యూఎఫ్ఎంఈ గుర్తింపు ఆటోమేటిక్‌గా లభించనుందని గురువారం కేంద్ర వైద్యశాఖ తెలిపింది. 'డబ్ల్యూఎఫ్ఎంఈ అక్రిడిటేషన్ మన దేశంలోని వైద్య విద్య నాణ్యతా ప్రమాణాలను ప్రపంచంలోని అత్యుత్తమ విధానాలు, పద్ధతులతో సమానంగా మెరుగుపర్చుకునేందుకు దోహదపడుతుంది. అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ వంటి డబ్ల్యూఎఫ్ఎంఈ గుర్తింపు అవసరమయ్యే దేశాల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ కొనసాగించేందుకు భారతీయ వైద్య విద్యార్థులకు ఈ అక్రిడిటేషన్‌తో అవకాశం ఏర్పడనుంది'అని ఒక ప్రకటనలో కేంద్రం తెలిపింది. మన దేశంలో అత్యుత్తమ ప్రమాణాలతో వైద్య విద్యను అందిస్తున్న విషయం డబ్ల్యూఎఫ్ఎంఈ గుర్తింపుతో మరోసారి రూఢీ అయిందని ఎన్ఎంసీలోని మెడికల్ రిజిస్ట్రేషన్ బోర్డ్ అండ్ ఎథిక్స్ సభ్యుడు డాక్టర్ యోగేందర్ మాలిక్ చెప్పారు. 'ఈ గుర్తింపు మన వైద్య విద్యార్థులకు ప్రపంచంలో ఎక్కడైనా తమ కెరీర్‌ను కొనసాగించే అవకాశం కల్పిస్తుంది. అదే సమయంలో అంతర్జాతీయ వైద్య విద్యార్థులకు సైతం భారతదేశం ఆకర్షణీయమైన గమ్యస్థానంగా మారనుంది'అని ఆయన తెలిపారు. 'మన వైద్య కళాశాలలు, నిపుణులు అంతర్జాతీయ గుర్తింపును, పేరును తెచ్చుకునేందుకు ఉపయోగపడుతుంది. వృత్తిపరమైన సహకారాన్ని, ఇతర దేశాలతో విద్యార్థుల మార్పిడికి వీలుకల్పిస్తుంది'వైద్య శాఖాధికారులు తెలిపారు. వైద్య విద్యలో నిరంతర అభివృద్ధి, ఆవిష్కరణలను, బోధన, సంస్థల నిర్వహణలో నాణ్యతా ప్రమాణాలను ప్రోత్సహిస్తుందని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా వైద్య విద్యలో ప్రమాణాలను పెంచే లక్ష్యంతో డబ్ల్యూఎఫ్ఎంఈ పని చేస్తుంది.

స్వాతి నాయక్‌కు నార్మన్ బోర్లాగ్ అవార్డు



వాషింగ్టన్: ప్రతిష్టాత్మక నార్మన్ బోర్లాగ్–2023 అవార్డుకు భారతీయ శాస్త్రవేత్త డాక్టర్ స్వాతి నాయక్ ఎంపికయ్యారు. ఇంటర్నేషనల్ రైస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఐఆర్ఆర్ఐ)లో పనిచేస్తున్న ఆమెను అద్భుతమైన మహిళా శాస్త్రవేత్తగా వరల్డ్ ఫుడ్ ప్రైజ్ ఫౌండేషన్ అభివర్ణించింది. చిన్న రైతులు సాగు చేసేందుకు వీలయ్యే ప్రశస్తమైన వరి వంగడాల రూపకల్పనలో విశేషమైన కృషి చేశారని కొనియాడింది. ఆహారం, పోషక భద్రత, ఆకలిని రూపుమాపేందుకు ప్రత్యేకమైన కృషి సల్పే 40 ఏళ్లలోపు శాస్త్రవేత్తలకు డాక్టర్ నార్మన్ బోర్లాగ్ పేరిట రాక్‌ఫెల్లర్ ఫౌండేషన్ ఈ అవార్డును అందజేస్తుంది. అక్టోబర్‌లో అమెరికాలోని అయోవాలో జరిగే కార్యక్రమంలో డాక్టర్ స్వాతి పురస్కా రాన్ని అందుకోనున్నారు. అమెరికాకు చెందిన హరిత విప్లవం రూపశిల్పి, నోబెల్ గ్రహీత నార్మన్ బోర్లాగ్. కాగా, డాక్టర్ స్వాతి నాయక్ ఒడిశాకు చెందిన వారు. ఈమె 2003–07లో ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బీఎస్సీ చదివారు.




ఎర్రచొక్కా.. తలపై పెట్టె..

రైల్వే కూలీ అవతారంలో రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ: కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ఇటీవల కాలంలో జనంతో మమేకమయ్యే కార్యకలాపాలకే అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. గురువారం ఉదయం న్యూఢిల్లీలోని ఆనంద్ విహారీ రైల్వే స్టేషన్‌లో ఆయన హఠాత్తుగా ప్రత్యక్షమయ్యారు. రైల్వే కూలీల ట్రేడ్‌మార్కు ఎర్రరంగు చొక్కా, భుజానికి బ్యాడ్జి ధరించి, తన తలపై సూట్‌కేసు మోసుకొని నడుస్తూ వారితో ముచ్చటించారు. రైల్వే పోర్టర్ల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దీనికి సంబంధించిన ఫోటోలను, వీడియోలను కాంగ్రెస్ పార్టీ సామాజిక మాధ్యమాల్లో షేర్ చేసింది. ఇటీవల కాలంలో రాహుల్‌ను కలుసుకోవాలంటూ ఆనంద్ విహారీలో రైల్వే పోర్టర్లు చేసిన వీడియో వైరల్‌గా మారింది. ఆ వీడియో చూశాకే రాహుల్ వారిని కలుసుకోవడానికి వెళ్లారు. "ఆనంద్ విహారీ టెర్మినల్‌లో పని చేసే కూలీ సోదరుల్ని ఇవాళ కలుసుకున్నాను. వారి సమస్యల్ని అడిగి తెలుసుకున్నాను. చాలా కాలంగా రైల్వే కూలీలను కలుసుకోవాలని అనుకుంటున్నాను. వారు కూడా నేను రావాలని కోరుకున్నారు. చెమటోడ్చి పని చేసే వారి ఆకాంక్షని తీర్చడం కోసమే కలుసుకున్నాను" అని రాహుల్ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు పెట్టారు.

ప్రజల్ని ప్రశ్నించకుండా చేసేందుకు.. విభేదాలు సృష్టిస్తున్నారు



పార్టీ అభిమానితో ప్రియాంకా గాంధీ

దుర్గ్: ప్రజల మనోభావాలను రెచ్చగొడుతూ వారిని రాజకీయ లబ్ధి కోసం బీజేపీ వాడుకుంటోందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ వాద్రా ఆరోపించారు. కులం, మతం ఆధారంగా ప్రజల్లో విభేదాలు కల్పించి, వారిని ప్రశ్నించకుండా చేయడమే ఆ పార్టీ ఉద్దేశమని విమర్శించారు. గురువారం ఆమె చత్తీస్‌గఢ్‌లోని దుర్గ్‌లో కాంగ్రెస్ నిర్వహించిన 'మహిళా సమృద్ధి సమ్మేళన్'లో ప్రసంగించారు. ఒకవైపు ప్రధాని మోదీ సన్నిహితులైన పారిశ్రామిక వేత్తలు రోజుకు రూ.1,600 కోట్లు పోగేసుకుంటుండగా మరోవైపు నిరుద్యోగం, అధిక ధరలతో జనం పడుతున్న ఇబ్బందులపై కేంద్రం మాట్లాడటం లేదన్నారు. ఈ సందర్భంగా చిన్నతనంలో తన తండ్రి, అప్పటి ప్రధాని రాజీవ్ గాంధీ తన సొంత నియోజకవర్గంలో పర్యటనలో ఉండగా జరిగిన ఘటనను గుర్తుకు తెచ్చుకున్నారు. 'నాన్న వైపు చూస్తూ ఓ మహిళ కేకలు వేస్తోంది. అక్కడ రోడ్లు బాగోలేవని ఆమె ఆరోపిస్తోంది. నాన్న వాహనం దిగి ఆమె వద్దకు వెళ్లి సమాధానం చెప్పారు. వాహనంలోకి వచ్చాక ఆ మహిళ తీరు చూసి మీరేమైనా బాధపడ్డారా?అని అడిగా. 'లేదు, ప్రశ్నించడం వాళ్ల పని. సమాధానం ఇవ్వడం నా కర్తవ్యం అని ఆయన అన్నారు' అని ప్రియాంక చెప్పారు. ప్రజలకు నేరుగా జవాబుదారీగా ఉండాలని అప్పట్లో ప్రధానమంత్రి సైతం భావించేవారని ఆమె వ్యాఖ్యానించారు.

రాష్ట్రంలో ఇసుక సంక్షోభం

సాక్షి, చెన్నై: ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దాడుల కారణంగా రాష్ట్రంలో ఇసుక సంక్షోభం ఏర్పడింది. క్వారీల నుంచి ఇసుక తరలింపు సమస్యగా మారడంతో ఈ ప్రభావం నిర్మాణ రంగంపై పడింది. అదే సమయంలో రాష్ట్రంలోని క్వారీలకు సంబంధించిన సమగ్ర వివరాలు సమర్పించాలని ప్రభుత్వానికి ఈడీ గురువారం నోటీసులు జారీ చేసింది. ఈ విషయంపై లారీ యజమానుల సంఘం నేత మునిరత్నం సీఎం స్టాలిన్‌కు లేఖ రాశారు. ఇసుక సంక్షోభం కారణంగా తమిళ, ఉత్తరాది కార్మికులు పనులు లేక అష్టకష్టాలు పడే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. అదే సమయంలో 2021 నుంచి రాష్ట్రంలోని ఇసుక క్వారీలలో జరిగిన తవ్వకాలు, కాంట్రాక్ట్‌లు, ఇతర వ్యవహారాలకు సంబంధించి సమగ్ర వివరాలను సమర్పించాలని ప్రభుత్వానికి ఈడీ నోటీసులు పంపించడం చర్చనీయాంశంగా మారింది.

న్యూస్‌రీల్

పన్నీరుకు వ్యతిరేకంగా పళణి పిటిషన్



పన్నీరు, పళణి (ఫైల్)

సాక్షి, చెన్నై: మాజీ సీఎం పన్నీరు సెల్వానికి వ్యతిరేకంగా అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళణి స్వామి గురువారం మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అన్నాడీఎంకే పూర్తిగా పళణి స్వామి గుప్పెట్లోకి చేరిన విషయం తెలిసిందే. పన్నీరు సెల్వం అండ్ బృందాన్ని ఆపార్టీ నుంచి బయటకు పంపించేశారు. అయినా, తమ పార్టీ పేరును, జెండాను, చిహ్నం, లేటర్ ప్యాడ్‌ను పన్నీరు సెల్వం ఉపయోగిస్తున్నారని, ఇందుకు చెక్ పెట్టే విధంగా ఉత్తర్వులుజారీ చేయాలని కోరుతూ పళణిస్వామి కోర్టు తలుపు తట్టారు. తమ పార్టీ పేరు, జెండా, చిహ్నం, లెటర్ ప్యాడ్‌ను ఆయన ఉపయోగించేందుకు వీలు లేదని, పార్టీకి సంబంధించి అన్నిరకాల అనుమతులు కోర్టుల ద్వారా తాను దక్కించుకున్నట్టు పిటిషన్‌లో వివరించారు. వాదనల అనంతరం ఈ పిటిషన్‌కు వివరణ ఇవ్వాలని పన్నీరు సెల్వంకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను అక్టోబరు 6వ తేదీకి న్యాయమూర్తి వాయిదా వేశారు. ఇదిలా ఉండగా పళణి స్వామికి కొడనాడు కేసును అంటకట్టే విధంగా ఇటీవల కాలంగా క్రీడల శాఖ మంత్రి ఉదయ నిధి స్టాలిన్ ఆరోపణలు, వ్యాఖ్యల తూటాలను పేల్చుతూ వస్తున్న విషయం తెలిసిందే. ఈ వ్యవహారంలో తన పేరును వాడటం, తనపై ఆరోపణలు చేయకుండా ఉదయ నిధికి స్టే విధించాలని పళణి స్వామి కోర్టును ఆదేశించారు. ఇందుకు స్పందించిన కోర్టు స్టే విధించింది.

కోవై జైలులో ఖైదీలు, వార్డెన్ల మధ్య ఘర్షణ

- 11 మందికి గాయాలు

తిరువొత్తియూరు: కోయంబత్తూరు సెంట్రల్ జైలులో 2,500 మందికి పైగా రిమాండ్ ఖైదీలున్నారు. గురువారం ఉదయం జైలులో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు వార్డెన్లు ఖైదీలను ఉంచే (వాల్మేడు) బ్లాక్‌లో గస్తీ తిరుగుతున్నారు. ప్రతి గదికి వెళ్లి పరిశీలించారు. ఆ సమయంలో ఓ గదిలోని ముగ్గురు వ్యక్తులు ఎప్పుడంటే అప్పుడు తమ వద్దకు వచ్చి తనిఖీలు చేయటం ఎందుకని ప్రశ్నించడంతో గార్డు, ఖైదీల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. చివరికి ఘర్షణగా మారింది. వారి శబ్దం విని తోటి వార్డెన్లు అక్కడికి వెళ్లారు. ఖైదీలు కూడా పెద్ద సంఖ్యలో గుమిగూడారు. ఖైదీలు అందరూ కలిసి వార్డెన్లకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇరువర్గాలు వాగ్వాదానికి దిగి పరస్పరం దాడి చేసుకున్నాయి. దీంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. కొందరు ఖైదీలు చెట్లు ఎక్కి ఇలా ఇబ్బంది పెడితే చేతులు నరికివేస్తామని బెదిరించారు. మరికొందరు ఖైదీలు వార్డెన్లపై దాడి చేశారు. ఈ ఘర్షణలో మోహన్ రాజ్, బాబు జాన్, విమల్‌రాజ్, రాహుల్ అనే నలుగురు వార్డెన్లు, ఏడుగురు ఖైదీలు గాయపడ్డారు. అధికారులు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనపై జైళ్లశాఖ డి.ఐ.జి షణ్ముగసుందరం దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత బలవన్మరణం

అన్నానగర్: తిరుపూర్ సెట్టిపాలైయం సమీపం ప్రియాంక నగర్‌కు చెందిన సురేష్ (35)భార్య స్వర్ణకళ (33). దంపతుల మధ్య తరచూ గొడవలు జరిగేవని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి ఆమె తన తండ్రికి ఇంట్లో సమస్యలను తెలియజేస్తూ వీడియోను పంపి తర్వాత విషం తాగి ఆత్మహత్య చేసుకుంది. ఈమేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా వీడియోలో తనపై అనుమానంతో భర్త వేధించడంతోనే ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు బాధితురాలు చెప్పినట్లు పోలీసులు వెల్లడించారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



ట్రోఫీలను అందజేస్తున్న నిర్వాహకులు

కొరుక్కుపేట: దేశంలోనే తొలిసారిగా నిర్వహించిన సికా కలినరీ ఛాలెంజ్ అండ్ ఎగ్జిబిషన్‌లో తమదైన ప్రతిభను చాటుకున్నవారికి బహుమతులను ప్రదానం చేశారు. సౌత్ ఇండియా చెఫ్ అసోసియేషన్ (సికా) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలో 1,500 మందికి పైగా చెఫ్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆచ్చి మసాలా వ్యవస్థాపకురాలు పద్మాసింగ్ ఐజాక్, సికా అధ్యక్షుడు చెఫ్ దాము, ప్రధాన కార్యదర్శి చెఫ్ శీతారామ్ ప్రసాద్ విజేతలకు ట్రోఫీలను అందజేశారు. ఇందులో జీఆర్‌టీ గ్రాండ్ విజేతగా నిలిచి డాక్టర్ చెఫ్ సౌందర్ రాజన్ మెమోరియల్ ట్రోఫీని కైవసం చేసుకున్నారు.

సీఎం ఫీల్డ్ సర్వే!

మహానగరం చెన్నై శివార్లలో చేపడుతున్న రోడ్డు పనులు, వర్షపు నీటి కాలువల నిర్మాణాలను సీఎం ఎంకే స్టాలిన్ ఫీల్డ్ సర్వే ద్వారా పరిశీలించారు. ఈమేరకు పెరుంగుడి, వేళచ్చేరిలో గురువారం ఆయన పర్యటించారు. రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న రోడ్డు పనుల పురోగతిపై నివేదిక ఇవ్వాలని ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు.



రోడ్డు పనులను పరిశీలిస్తున్న సీఎం స్టాలిన్

- పెరుగుండి, వేళచ్చేరిలో పర్యటన
- కాలువ పనులను పరిశీలించిన ముఖ్యమంత్రి
- రాష్ట్రవ్యాప్తంగా రోడ్ల స్థితిగతులపై నివేదికకు ఆదేశాలు

సాక్షి, చెన్నై: రెండు రోజుల క్రితం సచివాలయంలో జరిగిన సమీక్ష సందర్భంగా చెన్నై నగరం, శివారు ప్రాంతాల్లో రోడ్ల పరిస్థితిపై సీఎం స్టాలిన్ అసంతృప్తి వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. తానే స్వయంగా ఆయా ప్రాంతాల్లో పర్యటించనున్నట్లు ప్రకటించారు. దీంతో రాత్రికి రాత్రే అనేక మార్గాలలో అధికారులు ఆగమేఘాలపై రోడ్ల పునరుద్ధరణ, కొత్త నిర్మాణాలపై దృష్టి పెట్టారు. ఈనేపథ్యంలో గురువారం మెట్రోపాలిటన్ చెన్నై కార్పొరేషన్ పరిధిలోని రామ్ నగర్ 7వ క్రాస్ వీధి, 3వ మెయిన్ రోడ్డు వెస్ట్, రామన్ నగర్ 3వ మెయిన్ రోడ్డులో రూ. 85 లక్షలతో చేపడుతున్న రోడ్డు పనులను సీఎం స్టాలిన్ స్వయంగా పరిశీలించారు. అనంతరం రహదారుల విభాగం నేతృత్వంలో రూ. 4.5 కోట్లతో మనపాక్కం – కొలప్పక్కం రోడ్డు, మరో రూ. 2.23 కోట్లతో పూర్తి చేసిన రామాపురం – తిరువళ్లూర్ రోడ్డు పనులను తనిఖీ చేశారు.



అధికారులతో మాట్లాడుతూ..

సమన్వయంతో ముందుకు..

ఈశాన్య రుతుపవనాల సీజన్ నాటికి మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ విభాగం, హైవే విభాగం, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు, విద్యుత్ బోర్డు, నీటి సరఫరా బోర్డు, టెలికమ్యూనికేషన్ శాఖ, చెన్నై మెట్రో రైల్ అధికారులతో సమన్వయంతో పనిచేసి అన్ని పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులు కోరారు. అనంతరం తన క్యాంప్ కార్యాలయంలో మంత్రులు నెహ్రూ, అన్బరసన్, ఎం. సుబ్రమణియన్, సీఎస్ శివదాస్ మీనా, మెట్రో రైల్ ఎండీ సిద్ధిక్ తదితర అధికారులతో సీఎం సమావేశమయ్యారు. మెట్రో పనులు, రోడ్డు పనులపై సమీక్ష నిర్వహించారు. ప్రజలకు ఇబ్బందులు కలగని రీతిలో మెట్రో పనులు చేపట్టాలని ఆదేశించారు.

ప్రతివారం ప్రగతి నివేదిక..

ఈ సందర్భంగా సీఎం స్టాలిన్ ప్రధాన కార్యదర్శి శివదాస్ మీనాకు ప్రత్యేక ఆదేశాలు ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న రోడ్డు పనులు, రోడ్ల పరిస్థితి తదితర అంశాల గురించి వారానికి ఒకసారి సమీక్ష నిర్వహించి నివేదికను తనకు సమర్పించాలని ఆదేశించారు. అలాగే చెన్నై మెట్రో రైలు పనులు పనులు సజావుగా సాగేడంతో పాటు పనుల్లో వేగం పెంచాలని, త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం శివార్లలోని పెరుంగుడి మండలం పరిధిలోని ప్రాంతాలలో, వేళచ్చేరి పరిసరాల్లో పర్యటించారు. డ్రైనేజీ, వర్షపు నీటి కాలువల నిర్మాణాలను, రోడ్ల పరిస్థితిని పరిశీలించారు. తిరువళ్లూరు హైవే డివిజన్, అంబత్తూరు సబ్ డివిజన్, పూందమల్లి హైవే డివిజన్ పరిధిలోని వలసరవాక్కం – రామాపురం మార్గం, కోడంబాక్కం హైరోడ్డు మార్గం – శ్రీపెరంబదూరు, పూందమల్లి – ఆవడి రహదారుల పనులను త్వరితగతిన ముగించాలని ఆదేశించారు. కలైంజ్ఞర్ కరుణానిధి నగర్, అశోక్ నగర్, అళ్వార్ తిరునగర్, వలసరవాక్కం పరిసర ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా మెట్రో రైలు పనులు చేపట్టాలని, పనుల వేగం పెంచాలని సూచించారు.

జాక్‌పాట్

- ఓనం లాటరీలో కోవై యువకుడికి రూ. 25 కోట్లు

సాక్షి, చెన్నై: కేరళలో జరిగిన ఓనం ఉత్సవాల లాటరీ బంఫర్‌లో కోయంబత్తూరుకు చెందిన యువకుడికి రూ. 25 కోట్లు తగిలింది. ఒక్కసారిగా ఆ యువకుడు కోటీశ్వరుడు కావడంతో అతడి ఇంటి వద్ద సందడి నెలకొంది. వివరాలు.. కేరళ ప్రభుత్వం లాటరీ విక్రయాలను అధికారికంగా జరుపుతున్న విషయం తెలిసిందే. వారం లేదా పదిహేనురోజుల వ్యవధి లేదా పండుగ సందర్భంగా ప్రత్యేక బంఫర్ ఆఫర్ లాటరీల విక్రయాలను చేపట్టడం ఆనవాయితీగా వస్తోంది. మలయాళీల ముఖ్య పండుగ ఓనం సందర్భంగా తిరుఓనం బంపర్ లాటరీ విక్రయాలు జూలై నెల నుంచే జరిగాయి. మొదటి బహుమతి రూ. 25 కోట్లుగా ప్రకటించారు. 10 టికెట్లతో కూడిన సెట్ ధర రూ. 500గా ప్రకటించారు. 85 లక్షల లాటరీలను ముద్రించగా 75.76 లక్షలు అమ్ముడయ్యాయి. ఈ తిరు ఓనం లాటరీ డ్రా బుధవారం జరిగింది. ఇందులో తొలి బహుమతి రూ. 25 కోట్లు టీఈ–230662 నెంబరుకు తగిలింది. ఈ నెంబరు కలిగిన వ్యక్తి తమిళనాడులోని కోయంబత్తూరు జిల్లా అన్నూరుకు చెందిన నటరాజన్‌గా తేలింది. ఈ టికెట్‌ను 5 రోజుల క్రితం తాను కేరళ పాలక్కాడుకు వెళ్లిన సమయంలో వలయారులోని లాటరీ వ్యాపారి గురు స్వామి వద్ద నటరాజన్ కొనుగోలు చేసినట్టు తేలింది. డ్రైవర్ వృత్తిలో ఉన్న నటరాజన్ ఒక్క లాటరీతో కోటీశ్వరుడు కావడంతో అతడి ఇంటి వద్దకు బంధు గణం, మిత్రులు పరుగులు తీశారు. తన వద్ద ఉన్న లాటరీ టిక్కెట్టుతో పాలక్కాడుకు నటరాజన్ పరుగులు తీశారు. అన్ని రకాల పన్నులు, ఏజెంట్ కమీషన్లు పోగా నటరాజన్‌కు రూ. 12 కోట్ల నుంచి రూ.15 కోట్లు చేతికి అందే అవకాశం ఉందని లాటరీ విక్రయదారులు పేర్కొన్నారు. ఈ విషయం కోవైలో సంచలనంగా మారింది.

సిరుచ్చేరి – కిలాంబాక్కం మెట్రోకు బ్రేక్

సాక్షి, చెన్నై : సిరుచ్చేరి – కిలాంబాక్కం మెట్రో విస్తరణ పనులకు బ్రేక్ పడింది. ప్రస్తుతం ఈ మార్గంలో ప్రయాణికుల సంఖ్య తక్కువే కావడంతో ఈ పనులను నిలుపుదల చేసే విధంగా సాధ్యాసాధ్యాల పరిశీలన కమిటీ నివేదికను సమర్పించింది. చెన్నైలో రెండు మార్గాల్లో మెట్రో రైలు సేవలు జరుగుతున్నాయి. మరో మూడు మార్గాల్లో పనులు చేపడుతున్నారు. ఇందులో మాధవరం – సిరుచ్చేరి మార్గంలో కేలంబాక్కం మీదుగా కొత్తగా రూపుదిద్దుకుంటున్న కిలాంబాక్కం బస్ టెర్మినల్‌కు మెట్రో విస్తరణ పనులకు నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన సాధ్యాసాధ్యాల నివేదికను సిద్ధం చేశారు.ఈ నివేదికను మెట్రో ప్రాజెక్టు ఎండీ సిద్ధిక్ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి రమేష్ చంద్‌కు ఈ నివేదిక సమర్పించారు. ఇందులో సిరుచ్చేరి నుంచి కేలంబాక్కం మీదుగా కిలాంబాక్కం వరకు 23.5 కి.మీ దూరం 12 రైల్వే స్టేషన్లతో నిర్మాణాలకు రూ. 5,458 కోట్లు అంచనా వ్యయంగా నిర్ణయించామని వివరించారు. అయితే ఈమార్గంలో ప్రసుత్తం అభివృద్ధి అంతంత మాత్రమేనని, ప్రయాణికుల సంఖ్య తక్కువగానే ఉంటుందని పేర్కొంటూ.. ప్రస్తుతానికి ఈ మార్గం పనులకు బ్రేక్ వేస్తూ పేర్కొనడం గమనార్హం.



మెట్రో రైలు

ఆవడికి ఓకే..

కోయంబేడు నుంచి తిరుమంగళం – మొగ పేర్ మీదుగా ఆవడికి 16.7 కి.మీ దూరం విస్తరణ పనులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చే విధంగా నివేదిక సిద్ధం చేశారు. ఈ మార్గంలో 15 రైల్వే స్టేషన్లలతో రూ. 6,376 కోట్ల అంచనా వ్యయంతో పనులకు సాధ్య నివేదిక సమర్పించారు. అలాగే ఆవడికి కూత వేటు దూరంలో పట్టాభిరాం పరిసరాల్లో చేపడుతున్న అభివృద్ధిని పరిగణించి, అక్కడి వరకు పనులకు చేపట్టేందుకు వీలుగా నివేదిక రూపొందించి ఉండడం విశేషం.

మొదటి రాత్రే కాళరాత్రి..

- వివాహమైన రెండవ రోజే వరుడి ఆత్మహత్య

తిరువొత్తియూరు: చెంగల్పట్టు సమీపంలో వివాహమైన రెండవ రోజే వరుడు ముహూర్తపు చీరతో ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు.. కాంచీపురం జిల్లా కచేరి గ్రామానికి చెందిన శరవణన్ (27) ఓ ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్నాడు. చెంగల్పట్టుకు చెందిన బంధువుతో ఈనెల 17న శరవణన్‌కు వివాహం చేశారు. వధూవరులిద్దరూ వీరిద్దరూ చిన్న నాటి నుంచే స్నేహితులు. ఇక వివాహం అయిన తర్వాత వధూవరులు తిమ్మవరంలోని వధువు ఇంటికి వెళ్లారు. అక్కడ మంగళవారం రాత్రి శోభనం ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో బుధవారం తెల్లవారుజామున వధువు అరుస్తూ.. గదినుంచి పరుగులు తీసింది. వెంటనే ఆమె తల్లిదండ్రులు గదిలోకి వెళ్లి చూడగా అక్కడ వరుడు శరవణన్ వధువు ముహూర్తపు చీరతో ఉరికి వేలాడుతున్నాడు. చెంగల్పట్టు తాలూకా పోలీసులు శరవణన్ మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఒత్తిళ్లను అధిగమించేందుకు వర్క్‌షాప్

కొరుక్కుపేట: గ్రేటర్ చెన్నై పోలీస్ ఇన్‌స్పెక్టర్లు, సబ్ – ఇన్‌స్పెక్టర్లు పని తీరును మెరుగుపరిచేందుకు స్ట్రెస్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌పై ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని వేపేరిలోని పోలీస్ కమిషనర్ కార్యాలయంలో గ్రేటర్ చెన్నై పోలీస్ కమిషనర్ సందీప్ రాయ్ రాథోడ్ ప్రారంభించారు. ఈ శిక్షణ శిబిరంలో పోలీసులకు ఒత్తిడిని తగ్గించుకునేందుకు కుటుంబ జీవితాన్ని మెరుగుపరచడానికి, శారీరక ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి అవసరమైన కౌన్సెలింగ్ ఇచ్చారు. కానిస్టేబుళ్ల సంక్షేమం, ఫిర్యాదులు వినడం, పరిష్కరించడం, విధుల్లో ఉన్నప్పుడు కానిస్టేబుళ్ల పట్ల ఎలా ప్రవర్తించాలనే విషయాలపై తగిన సలహాలు అందించారు. మోటివేషనల్ స్పీకర్ డా.పి. ఆర్.సుబాస్ చంద్రన్ నేతృత్వంలో వర్క్‌షాప్ నిర్వహించి మానసిక ఆరోగ్యం, సామాజిక సమస్యలు, వాటిని ఎలా ఎదుర్కోవాలో అవగాహన కల్పించారు. ఈ వర్క్‌షాప్‌కు జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ కయల్విలి(హెడ్‌క్వార్టర్స్) డిప్యూటీ కమిషనర్లు శ్రీనివాసన్ (పరిపాలన), ఎస్ఎస్ మహేశ్వరన్ (ఆధునిక కంట్రోల్ రూమ్) హాజరయ్యారు. గ్రేటర్ చెన్నై పోలీస్‌కి చెందిన 217 మంది ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు.



వర్క్‌షాప్ ప్రారంభోత్సవంలో చెన్నై పోలీస్ కమిషనర్ సందీప్‌రాయ్ రాథోడ్

మా మధ్య విభేదాల్లేవు

- బీజేపీ అధ్యక్షుడు అన్నామలై వ్యాఖ్య

సాక్షి, చెన్నై: నరేంద్ర మోదీ మళ్లీ ప్రధాని కావాలని ఆకాంక్షించే వాళ్లతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై వ్యాఖ్యానించారు. కోయంబత్తూరులో నా మట్టి..నా ప్రజలు పాదయాత్రకు ముందుగా ఆయన మీడియాతో మాట్లాడారు. బీజేపీకి – అన్నాడీఎంకేకు మధ్య ఎలాంటి విభేదాలు లేవని స్పష్టం చేశారు. అయితే అన్నామలై(తన)తో ఆ పార్టీ నాయకులకు కొన్ని అభిప్రాయభేదాలు ఉండవచ్చునేమో అని పేర్కొన్నారు. తన వరకు ఎవరితోనూ వ్యక్తిగత విభేధాలు లేవని పేర్కొంటూ, ప్రధానిగా మళ్లీ నరేంద్ర మోదీ రావాలని ఆకాంక్షించే వారితో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. అలాంటి వారు తమ కూటమిలోనూ ఉంటారని పేర్కొన్నారు. కేంద్రంలో మూడోసారి ప్రధాని అభ్యర్థి నరేంద్ర మోదీని ప్రకటించినప్పుడు, తమిళనాడులో తమ కూటమి సీఎం అభ్యర్థి పళణి స్వామి అని ఎందుకు ప్రకటించరంటూ అన్నాడీఎంకే నేత సెల్లూరు రాజు డిమాండ్ చేయడాన్ని గుర్తు చేయగా, ఇందుకు సమాధానం తాను కాదని, పార్టీ పెద్దలు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఇదిలా ఉండగా, మాజీ సీఎం పన్నీరు సెల్వం మద్దతు నేత పుగలేంది మీడియాతో మాట్లాడుతూ, అన్నాడీఎంకే బీజేపీ కూటమిలో ఉన్నట్టా...? లేనట్టా..? అన్నది పళణి స్వామి స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఆ కూటమిలో లేదని ప్రకటించిన మరుక్షణమే పళణి స్వామికి జైలు జీవితం తప్పదని ఎద్దేవా చేశారు.



అన్నామలై

డ్రైవర్ ఖాతాలో 9 వేల కోట్లు

- అర్ధగంటలో పొరపాటును గుర్తించి నగదు వెనక్కి తీసుకున్న బ్యాంక్
- అంతలోపే రూ.21 వేలు మిత్రుడికి ట్రాన్స్‌ఫర్ చేసిన ఖాతాదారుడు
- తమదే తప్పంటూ నగదును వదులుకున్న బ్యాంకు అధికారులు

సాక్షి, చెన్నై : ఓ ప్రైవేటు బ్యాంకు సిబ్బంది పొరబాటు, సాంకేతిక సమస్యతో ఓ కారు డ్రైవర్ 34 నిమిషాల పాటు వేల కోట్లకు అధిపతి అయ్యాడు. ఇందులో రూ.21 వేలను తన మిత్రుడి ఖాతాలోకి ఆ డ్రైవర్ బదిలీ కూడా చేశారు. చివరకు పొరబాటును గుర్తించిన బ్యాంకర్లు ఆ మొత్తాన్ని వెనక్కి లాగేసుకున్నారు. గురువారం ఈ వ్యవహారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దిండుగల్ జిల్లా పళణి సమీపంలోని నైకారన్ పట్టికి చెందిన రాజ్‌కుమార్(28) డిప్లొమో ఇంజినీర్. ప్రస్తుతం చెన్నైలో కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కోడంబాక్కంలో బస చేసి ఉన్న రాజ్‌కుమార్‌కు పళణిలోని ఓ ప్రైవేటు బ్యాంక్‌లో ఖాతా ఉంది. ఇందులో కేవలం రూ. 105 బ్యాలెన్స్ పెట్టి ఉన్నాడు. ఈ పరిస్థితుల్లో రెండు రోజుల క్రితం అతడి బ్యాంక్ ఖాతాలో 9 వేల కోట్లు జమ చేసినట్టుగా సెల్ నెంబర్‌కు వచ్చిన ఎస్ఎంఎస్‌తో షాక్‌కు గురయ్యాడు. ఇది ఫేక్ మెసేజ్‌గా ఉంటుందని భావించి, తన మిత్రుడి దృష్టికి తీసుకెళ్లాడు. తక్షణం ఈ ఎస్ఎంఎస్ నిజమో కాదో తేల్చుకుందామని తన మిత్రుడి ఖాతాలోకి తన ఖాతా నుంచి తొలుత రూ. 1000, ఆ తర్వాత రూ.20 వేలు బదిలీ చేశాడు. మిత్రుడి ఖాతాలోకి రూ. 21 వేలు బదిలీ కావడంతో రాజ్‌కుమార్ ఆనందానికి అవధులు లేవు. తాను కోటీశ్వరుడైనంత ఆనందంలో మునిగిపోయాడు.

ఆనందం ఆవిరి..

ఆనందంలో ఉన్న రాజ్‌కుమార్‌కు ఆ ఎస్ఎంఎస్ వచ్చిన 34వ నిమిషంలో ఖాతాలో ఉన్న నగదు మాయమైంది. తమ పొరబాటును గుర్తించిన బ్యాంకర్లు ఆ మొత్తాన్ని వెనక్కి తీసుకోవడమే కాకుండా, రాజ్‌కుమార్ మరో ఖాతాకు బదిలీ చేసిన రూ. 21 వేల రాబట్టే ప్రయత్నం మొదలెట్టారు. పట్టభద్రుడైన రాజ్‌కుమార్ తనకు అన్ని వ్యవహారాలు తెలుసని పేర్కొంటూ ఎదురు తిరిగాడు. తన ప్రమేయం లేకుండా, తనకు సమాచారం ఇవ్వకుండా తన ఖాతా నుంచి ఎలా నగదు వెనక్కి తీసుకుంటారని ప్రశ్నించడం మొదలెట్టాడు. పోలీసు కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తానని బెదిరించడంతో బ్యాంకర్ల కాళ్ల బేరానికి వచ్చి, అతడ్ని బుజ్జగించి చెన్నై టీనగర్‌లోని ప్రధాన కార్యాలయానికి రప్పించారు. తర్వాత అతడి మిత్రుడి ఖాతాలో జమ చేసిన రూ. 21 వేలను బ్యాంకర్లు వదులుకోవాల్సి వచ్చింది. అంతేకాకుండా రాజ్‌కుమార్‌కు సొంతంగా కారు కొనుక్కున్నేందుకు రుణం ఇస్తామన్న ఆఫర్‌ను అధికారులు ఉంచడం గమనార్హం. ఈ వ్యవహారం తాజాగా మీడియాలో రావడంతో రూ.9 వేల కోట్ల వ్యవహారంపై ఐటీ, ఈడీ వర్గాలు దృష్టి పెట్టేనా..? అన్నది చర్చనీయాంశంగా మారింది.

జోక్యం చేసుకోం!

- కావేరి జలాల వ్యవహారంలో తేల్చిచెప్పిన సుప్రీంకోర్టు
- 5 వేల క్యూసెక్కుల నీటి విడుదలకు ఆదేశాలు



కావేరి నది

సాక్షి, చెన్నై: కావేరి యాజమాన్య సంస్థ, కావేరి జలాల పర్యవేక్షణ కమిటీ ఉత్తర్వుల వ్యవహారంలో జోక్యం చేసుకోబోమని సుప్రీం కోర్టు స్పష్టంచేసింది. తమిళనాడు, కర్ణాటకలు దాఖలు చేసిన మధ్యంతర పిటిషన్లను గురువారం తిరస్కరించింది. అయితే ఈ రెండు సంస్థల ఉత్తర్వుల మేరకు తమిళనాడుకు సెకనుకు 5 వేల క్యూ సెక్కుల నీటిని విడుదల చేసే విధంగా కోర్టు ఆదేశాలు ఇచ్చినట్లు రాష్ట్ర ప్రభుత్వ తరపు న్యాయవాది విల్సన్ తెలిపారు. వివరాలు.. తమిళనాడు – కర్ణాటక మధ్య కావేరి జలాల విడుదల వివాదం ఈ ఏడాది జఠిలంగా మారిన విషయం తెలిసిందే. కావేరి యాజమాన్య సంస్థ, కావేరి నది జలాల పర్యవేక్షణ కమిటీ ఇచ్చిన ఉత్తర్వులను కర్ణాటక బేఖాతరు చేసింది. దీంతో సుప్రీంకోర్టును రాష్ట్ర ప్రభుత్వం ఆశ్రయించింది. అదే సమయంలో కర్ణాటక సైతం పిటిషన్ వేసింది. ఈ రెండు పిటిషన్లు గురువారం సుప్రీం కోర్టులో విచారణకు వచ్చాయి. వాదనల సమయంలో తమిళనాడుకు 2,500 క్యూ సెక్కుల నీటిని విడుదల చేస్తామని కర్ణాటక కోర్టు ముందు కొత్త ప్రతిపాదనను ఉంచింది. యాజమాన్య సంస్థ, కమిటీ ఇచ్చిన ఉత్తర్వులకు వ్యతిరేకంగా నీటి శాతం తగ్గిస్తామని కర్ణాటక పేర్కొనడాన్ని కోర్టు ఏకీభవించ లేదు. చివరకు ఈ వ్యవహారంలో యాజమాన్య సంస్థ, కమిటీ ఇచ్చిన ఉత్తర్వులలో జోక్యంచేసుకోబోమని పేర్కొంటూ, పిటిషన్లను న్యాయమూర్తులు తిరస్కరించారు. ఈ వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వ తరపు న్యాయవాది విల్సన్ మీడియాతో మాట్లాడుతూ, కర్ణాటక నీటి తగ్గింపు వాదనను ప్రస్తావించడాన్ని కోర్టు ఏకీ భవించ లేదని, తమిళనాడుకు 5 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేయాల్సిందేనని ఆదేశాలు ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా కావేరి వ్యవహారంలో కర్ణాటకతో చర్చలకు అవకాశం లేదని నీటి పారుదల శాఖ మంత్రి దురై మురుగన్ స్పష్టం చేశారు.

నీట్‌తో ఫలితం సున్నా..!

- కేంద్రం ఈ విషయాన్ని గ్రహించినట్లుందని సీఎం స్టాలిన్ ఎద్దేవా
- తెరపైకి మరోసారి రద్దు డిమాండ్



నీట్ వ్యతిరేకత నిరసన (ఫైల్)

సాక్షి,చెన్నై : నీట్‌ను రద్దు చేయాలన్న నినాదం తమిళనాట మళ్లీ తెరమీదకు వచ్చింది. పీజీ కౌన్సెలింగ్‌లో కటాఫ్ మార్క్ సున్న అని జాతీయ వైద్య విద్యా కమిటీ ప్రకటించడాన్ని తమిళ పార్టీలు అస్త్రంగా చేసుకున్నాయి. నీట్‌ను రద్దు చేయాలని నేతలు పట్టుబట్టారు. ఆది నుంచి నీట్‌కు వ్యతిరేకంగా డీఎంకే ప్రభుత్వం ముందుకెళ్తున్న విషయం తెలిసిందే. తాజాగా పీజీ కౌన్సెలింగ్‌లో కటాఫ్ మార్కుల వ్యవహారంలో కేంద్ర వైద్య విద్యా కమిటీ చేసిన ప్రకటనను అస్త్రంగా చేసుకున్నారు. కటాఫ్ మార్కు సున్నాకు తగ్గించినట్టు, సున్న మార్కులు సాధించినా పీజీలో చేరవచ్చు అని తాజాగా వెలువడ్డ ప్రకటనను తమిళ పార్టీలు తీవ్రంగా పరిగణించాయి. నీట్ ఓ మోసపూరిత పరీక్ష అని, దీనిని రద్దు చేయాలని పట్టుబడుతూ నినాదాన్ని అందుకున్నారు. ఈ వ్యవహారంపై సీఎం స్టాలిన్ స్పందిస్తూ, నీట్ ఫలితం సున్న అన్నది ఇప్పటికైనా కేంద్రం గ్రహించినట్లుందని విమర్శించారు. కేవలం శిక్షణ కేంద్రాల కోసమే కేంద్రం ఈ పరీక్షను నిర్వహిస్తున్నారని మండిపడ్డారు. ఈ పరీక్ష కారణంగా ఎందరో విద్యార్థులు తమ ప్రాణాలను కోల్పోయారని గుర్తు చేస్తూ, ఇకనైనా ఈ పరీక్షను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. క్రీడల శాఖ మంత్రి ఉదయ నిధి స్టాలిన్ పేర్కొంటూ, నీట్ వ్యవహారంలో కేంద్రం అతి పెద్ద కుట్ర చేస్తున్నట్టు తాజాప్రకటన స్పష్టం చేసిందని ధ్వజమెత్తారు. పీఎంకే నేత అన్బుమణి రాందాసు స్పందిస్తూ, నీట్ కటాఫ్ మార్కు సున్నగా నిర్ణయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కోట్లు ఉన్న వారికే అర్హత అన్నట్టుగా కేంద్రం తీరు ఉందని మండి పడ్డారు. ఎండీఎంకే నేత వైగో మాట్లాడుతూ, ఇది మోస పూరిత పరీక్ష అని, ఇకనైనా అందరూ కలిసి కట్టుగా ఈ పరీక్షను అడ్డుకోవాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.

క్లుప్తంగా

విస్తృతంగా సాంకేతికత ఆధారిత సేవలు

సాక్షి, చెన్నై: సాంకేతికత ఆధారిత సేవలను ప్రజలకు విస్తృతం చేయడమే లక్ష్యంగా ప్రత్యేక చర్యలు చేపట్టామని కోగ్నోజ్ సంస్థ సహ వ్యవస్థాపకుడు లోకేష్ నిగమ్ తెలిపారు. ఇందు కోసం ఏర్పాటు చేసిన కాన్వెర్జ్ ఏఐ సాఫ్ట్‌వేర్‌ను గురువారం స్థానికంగా ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రజాసేవలకు టెక్నాలజీ ఆధారిత కార్యక్రమాలను విశదీకరించారు. ఏఐ(ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్) ఆధారిత నియామక పరిష్కారంగా సాఫ్ట్‌వేర్ ఉంటుందన్నారు. అంతే కాకుండా వ్యక్తిత్వ లక్షణాలు, సామర్థ్యాలు, ప్రేరణ, ఇంటర్వ్యూలు, భావోద్వేగాల అంచనాకు దోహదకరంగా పేర్కొన్నారు. సవాళ్లను ఎదుర్కొనడం, పరిష్కరించడం, అధిక ఖర్చులు, అధిక అట్రిషన్ రేట్లు, ఉత్పాదకతలకు పొడిగింపు, నైపుణ్యాలు, ఉద్యోగ పాత్ర, సుదీర్ఘమైన నియామక ప్రక్రియలు ఉన్న ఈ సాఫ్ట్ వేర్ ఓ కొత్త ఒరవడి అని పేర్కొన్నారు.

అయ్యనార్ శిల్పం లభ్యం

అన్నానగర్: వడనెర్‌కుంద్రం గ్రామంలో గురువారం 8వ శతాబ్దానికి చెందిన అయ్యనార్ శిల్పం లభించింది. విల్లుపురం శాసనాల పరిశోధకుడు వీరరాఘవన్, అశివిక పరిశోధకుడు సురేందర్ విల్లుపురం జిల్లాలోని గ్రామాల్లో లభించిన అయ్యనార్ శిల్పాలపై పరిశోధనలు చేశారు. శాస్త్రవేత్త ఉత్రాదం తెలిపిన సమాచారం మేరకు గురువారం మరక్కాణం తాలూకా వడనెర్ కుంద్రం గ్రామంలో తవ్వకాలు చేపట్టారు. ఆ సమయంలో 8వ శతాబ్దానికి చెందిన పల్లవర్ కొరటవాయి, విష్ణు, 15వ శతాబ్దానికి చెందిన అయ్యనార్ విగ్రహం లభించాయి. అయ్యనార్ శిల్పం 334 అడుగుల పొడవు, 3 అడుగుల వెడల్పుతో ఉందని పేర్కొన్నారు.

ఎద్దు దాడిలో గాయపడ్డ వ్యక్తి మృతి

తిరువళ్లూరు: ఎద్దు దాడిలో తీవ్రంగా గాయపడి చెన్నై వైద్యశాలలో చికిత్స పొందుతూ వచ్చిన ఓ వ్యక్తి గురువారం మృతి చెందాడు. వివరాలు.. తిరువళ్లూరు జిల్లా మన్నవేడు గ్రామానికి చెందిన సాల్మన్ కుమారుడు థామస్(56) ఇతడికి జత ఎద్దులున్నాయి. వీటిని మేపడానికి రెండు రోజుల క్రితం పొలం వద్దకు వెళ్లినట్టు తెలుస్తోంది. ఈ సమయంలో ఒక ఎద్దు థామస్‌పై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు థామస్‌ను చెన్నై వైద్యశాలకు తరలించారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం మరణించాడు. మృతుడు కుమారుడు కన్నన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెంగల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కార్తీక బ్రహ్మోత్సవాలకు.. పందకాల పూజ


ఆలయ ప్రాంగణంలో పందకాల పూజ చేస్తున్న శివాచార్యులు

వేలూరు: తిరువణ్ణామలై అరుణాచలేశ్వరాలయ కార్తీక బ్రహ్మోత్సవాలకు పందకాల పూజ గురువారం శివాచార్యుల వేద మంత్రాల మధ్య వైభవంగా ప్రారంభమైంది. వివరాలు.. ఏటా అరుణాచలేశ్వరాలయంలో కార్తీక బ్రహ్మోత్సవాలు పది రోజుల పాటు నిర్వహించడం ఆనవాయితీ. ఆఖరి రోజు ఆలయం వెనుక వైపున ఉన్న శివుడిగా భావించే మహా కొండపై సాయంత్రం 6 గంటలకు మహా దీపాన్ని వెలిగించడంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. ఈ దీపాన్ని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాలు, రాష్ట్రాల నుంచి సుమారు 20 లక్షల మంది భక్తులు వస్తుంటారు. ఈ సంవత్సరం కార్తీక బ్రహ్మోత్సవాలు నవంబర్ 17వ తేదీన ధ్వజారోహణంతో ప్రారంభమై 27న ఉదయం భరణి దీపం, సాయంత్రం మహాదీపంతో ముగుస్తాయి. ఈ కార్తీక బ్రహ్మోత్సవాలకుగాను ఆలయంలో విశేష అలంకరణలు, పందిళ్లు ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం ఉదయం 4.30 గంటలకు శివాచార్యుల వేద మంత్రాల నడుమ భక్తులు ఆలయంలోని మూడవ ప్రాకారంలోని సంపత్ వినాయకుడి సన్నిధిలో పందకాలను ఉంచి ప్రత్యేక పూజలు, అభిషేక ఆరాధన పూజలు జరిపారు. అక్కడ నుంచి వేద మంత్రాల నడుమ శివాచార్యులు భక్తులు పందకాలను హరోం హరా.... నామస్మరణాల మధ్య రాజగోపురం ఎదుటకు తీసుకొచ్చారు. అనంతరం రథం వీధిలో నిలిచి ఉంచిన రథానికి ప్రత్యేక పూజలు చేసి పందకాలను నాటారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ మురుగేష్, ఆలయ జాయింట్ కమిషనర్ జ్యోతి, దేవదాయ శాఖ చైర్మన్ జీవానందం, భక్తులు పాల్గొన్నారు. అనంతరం ఆలయ జేసీ దీపోత్సవాలకు ఉపయోగించే వివిధ పంచరథాలతో పాటు ఉత్సవమూర్తులను తెరిచి మరమ్మతు పనులను ప్రారంభించారు.

కొడుంగయూర్‌లో ఇద్దరు రౌడీల అరెస్టు

• గంజాయి, కత్తులు, బైకు స్వాధీనం

తిరువొత్తియూరు: చెన్నై కొడుంగయూరులో వాహనాల తనిఖీలో పోలీసులు ఇద్దరు రౌడీలను అరెస్టు చేసి వారి వద్ద ఉన్న గంజా, కత్తులను, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. చెన్నై కొడుంగయూర్ ముత్తమ్మ నగర్ రెండవ బ్లాక్ ప్రాంతంలో కొడుంగయూరు పోలీస్ ఇన్‌స్పెక్టర్ శరవణన్ నేతృత్వంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో సందేహాస్పదంగా బైకుపై వస్తున్న ఇద్దరిని పోలీసులు అడ్డుకొని ప్రశ్నించారు. వారు పొంతన లేని సమాధానం చెప్పడంతో బైక్‌తో సహా ఇద్దరిని పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి విచారణ చేపట్టా. వారు కొడుంగయూరు ముత్తమిల్ నగర్ ప్రాంతానికి చెందిన ఇమ్రాన్ (39), మనలి చిన్న షేకాడు ప్రాంతానికి చెందిన అశోక్ కుమార్ (40) అని తెలిసింది. ప్రముఖ రౌడీలు అయినా వారి బైకు నుంచి కత్తి, గంజాయి ప్యాకెట్లను, బైకును స్వాధీనం చేసుకున్నారు. వారిపై ఇప్పటికే పలు కేసులు నమోదైనట్లు తెలిసింది. దీంతో ఇద్దరిని పోలీసులు కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో జవాన్ దుర్మరణం

అన్నానగర్: ఉప్పిలియాపురం సమీపంలో గురువారం తెల్లవారుజామున బైక్ ప్రమాదంలో పారామిలటరీ సైనికుడు మృతి చెందాడు. వివరాలు.. తిరుచ్చి జిల్లా ఉప్పిలియాపురం పక్కనే ఉన్న సోపానాపురం పంచాయతీ కంచెరిమలై పుత్తూరుకు చెందిన రవి (52) పారామిలటరీ జవాన్‌గా పని చేసన్నారు. ఇటీవల సెలవుపై స్వగ్రామానికి వచ్చాడు. ఈ క్రమంలో గురువారం తెల్లవారుజామున కంచెరిమలై పుత్తూరు నుంచి ఉప్పిలియాపురం వైపు బైక్‌లో వస్తుండగా స్పీడ్ బ్రేకర్ వద్ద అదుపు తప్పి కిందపడిపోయాడు. తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఉప్పిలియాపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అత్యాచారం కేసులో నిందితుడికి 32 ఏళ్లు జైలు


నిందితుడు (ఫైల్)

తిరువళ్లూరు: బాలికను కిడ్నాప్ చేసి అత్యాచారం చేసిన యువకుడికి 32 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.28 వేలు జరిమానా విధిస్తూ తిరువళ్లూరు జిల్లా మహిళా కోర్టు న్యాయమూర్తి గురువారం తీర్పు వెలువరించారు. వివరాలు.. తిరువళ్లూరు జిల్లా కున్నవలం గ్రామానికి చెందిన బాల (23). ఇతనికి అదే ప్రాంతానికి చెందిన 17 ఏళ్ల యువతితో చాలా కాలం నుంచి పరిచయం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ పరిచయాన్ని ఆసరాగా చేసుకుని యువతిని 2020 ఫిబ్రవరి 25న ఆంధ్రప్రదేష్ రాష్ట్రం నగరికి తీసుకెళ్లి అక్కడ అత్యాచారం చేసినట్లు తెలుస్తుంది. అనంతరం యువతిని అక్కడే వదిలిపెట్టి ఇంటికి వచ్చేశాడు. యువతి ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు కనకమ్మ సత్రం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా మరుసటి రోజు బస్సు ద్వారా ఇంటికి చేరిన యువతి తనకు జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పి పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు కేసు నమోదు దర్యాప్తు చేపట్టారు. అప్పట్లో బాలను అరెస్టు చేసిన రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు విచారణ తిరువళ్లూరు మహిళా కోర్టులో సాగింది. విచారణ పూర్తయిన నేపథ్యంలో యువకుడు మైనర్ యువతిని కిడ్నాప్ చేసి అత్యాచారం చేసినట్లు నిర్ధారణ కావడంతో మహిళా కోర్టు న్యాయమూర్తి సుభద్రాదేవి గురువారం తీర్పును వెలువరించారు.

ముగ్గురు పోలీసులపై సస్పెన్షన్ వేటు

కొరుక్కుపేట: నేరాలకు పాల్పడిన ముగ్గురు పోలీసులు సస్పెండ్ అయ్యారు. వివరాల్లోకి వెళితే.. శివగంగైలోని బస్టాండ్ సమీపంలో టాస్మాక్ దుకాణం ఉంది. దీనికి సమీపంలోనే మూతపడిన మరో దుకాణం అనుమతితో బార్‌గా నడుస్తోంది. శివగంగ ఆర్మ్డ్ ఫోర్స్ పోలీసులు షణ్ముఖవేల్, దాస్ మోహన్ పోలీసు యూనిఫాం ధరించి బార్‌లోకి వెళ్తున్న దృశ్యం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ విషయంపై ఎస్పీ అరవింద్ విచారణ జరిపారు. ఇందులో టాస్మాక్‌కు వెళ్లేది నిజమేనని తేలటంతో ఇద్దరినీ బుధవారం సస్పెండ్ చేశారు. అదేవిధంగా దేవకోట్ నగర్ పోలీస్ స్టేషన్‌లో సిలంబరసన్ పోలీసుగా పనిచేస్తున్నాడు. ఆయన డబ్బుతో జూదం ఆడినట్లు ఫిర్యాదు వచ్చింది. విచారణ జరిపిన ఎస్పీ సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

బ్రెయిన్ డెడ్ యువతి ఊపిరితిత్తుల దానం

• గుజరాతీ మహిళకు అరుదైన చికిత్స



మీడియాతో మాట్లాడుతున్న వైద్యుల బృందం

సాక్షి, చెన్నై: గుమ్మిడిపూండి సమీపంలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో బ్రెయిన్ డెడ్‌కు గురైన యువతి ఊపిరితిత్తులతో ఓ గుజరాతీ మహిళకు రెలా వైద్యులు ఊపిరి పోశారు. అవయవ మార్పిడి శస్త్రచికిత్స విజయవంతంతో రెండు వారాల్లో ఆ మహిళ ఆరోగ్యవంతురాలయ్యారు. క్రోంపేటలోని రెలా ఆస్పత్రి ఆవరణలో గురువారం ఈ అవయవ మార్పిడి శస్త్ర చికిత్స గురించి ఆస్పత్రి చైర్మన్ ప్రొఫెసర్ మహ్మద్ రెలా, క్లీనికల్ హెడ్ డాక్టర్ ఆర్ మోహన్ బృందం మీడియాకు వివరించారు. గుజరాత్ రాష్ట్రం వడోదరకు చెందిన డింపాల్ షా(42) కొన్నేళ్లుగా ఊపిరితిత్తుల సమస్యతో బాధ పడుతూ వచ్చారు. శ్వాస తీసుకోవడంలో ఎదురైన తీవ్ర సమస్యలతో క్రోం పేట రెలాలో చేరారు. ఆమెకు ఐఎల్‌డీ వ్యాధి ఆమెకు సోకినట్లు వైద్యులు గుర్తించారు. ఫైబ్రోటిక్ ఊపిరితిత్తుల వ్యాధి కూడా ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది, కొన్ని సార్లు దీనిని హైపర్ సెన్సిటివిటీ న్యుమోనైటిస్ లేదా బర్డ్ బ్రీడర్స్ ఊపిరితిత్తుల వ్యాధి అని పిలుస్తారు, ఇది పావురం రెట్టల వల్ల వస్తుందన్నారు.

అవయవ దానంతో..

డింపాల్ షా పరిస్థితి క్షీణించడంతో ఆమెకు రెండు ఊపిరితిత్తుల మార్పిడి అవశ్యమైంది. దాతకోసం ఎదురు చూశారు. ఈ సమయంలో రోడ్డుప్రమాదం రూపంలో యువతికి బ్రెయిన్ డెడ్ కావడం, ఆమె కుటుంబం అవయవదానానికి ముందుకు రావడంతో డింపాల్ షాకు శస్త్రచికిత్స నిర్వహణకు రెలా వైద్యులు సిద్ధమయ్యారు. ఆ యువతి ఊపిరితిత్తులు, ఈ మహిళకు అన్ని రకాలుగా సరిపోవడం కలిసి వచ్చిన అంశంగా మారింది. ఈనెల ఐదవ తేదీ రాత్రి కొన్ని గంటల పాటు శస్త్ర చికిత్స నిర్వహించారు. రెండు వారాల్లో ఆ మహిళ ఆరోగ్యవంతురాలయ్యారు.

38 ఏళ్ల యువకుడి అరుదైన చికిత్స



డాక్టర్లతో యువకుడు

సాక్షి, చెన్నై : మెదడులో రెండు మిర్రర్ ఇమేజ్ ట్యూమర్లతో బాధ పడుతున్న 38 ఏళ్ల యువకుడికి చెన్నై గ్లెనెగల్స్ గ్లోబల్ హెల్త్ సిటీ వర్గాలు అరుదైన శస్త్ర చికిత్సను నిర్వహించారు. గురువారం స్థానికంగా జరిగిన సమావేశంలో ఆ హెల్త్ సిటీ డాక్టర్ నిగెల్ పి సిమ్స్ మీడియాకు శస్త్ర చికిత్స గురించి వివరించారు. చెన్నైకు చెందిన ఈ యువకుడు తీవ్ర తలనొప్పితో ఆస్పత్రికి వచ్చినట్టు , పరిశోధించగా అతడి మెదడులో ఎడమ , కుడి భాగాలలో రెండు చోట్ల మిర్రర్ ఇమేజ్ పద్ధతిలో రెండు కణితులు ఉండటాన్ని గుర్తించామన్నారు. పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారకుండా 10 గంటలకు పైగా శ్రమించి శస్త్ర చికిత్సను చేశామన్నారు. ఒక్కో కణితి 5 ఇన్‌టూ 7 సె.మీ ఉండటంతో ఇదో అరుదైన సంఘటనగా గుర్తించామన్నారు. డాక్టర్ దినేష్ నాయక్ మాట్లాడుతూ, దేశంలో లక్ష మందిలో ఐదు నుంచి పది మందిలో బ్రెయిన్ ట్యూమర్ సమస్యలు ఉన్నాయని పేర్కొన్నారు. మెదడులో కణితి ఉన్న పక్షంలో తీవ్ర తలనొప్పి, వాంతులు, బలహీనత, పక్షవాతం, చూపు మందగించడం, వినికిడి సమస్య, జ్ఞాపక శక్తి తగ్గడం వంటి మార్పులు వస్తాయని, తక్షణం వైద్యులను సంప్రదించి చికిత్స చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆ హెల్త్ సిటీ సీఈఓ డాక్టర్ అలోక్ ఖుల్లర్, మార్కెటింగ్ హెడ్ భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

• సేవకుల బృందం


పార్కిన్సన్స్ రోగులకు సేవలు అందించేందుకు వీలుగా గురువారం చెన్నై హోలిస్టిక్ పేషంట్ కేర్ సపోర్ట్ గ్రూప్‌ను ఏర్పాటు చేశారు. పళ్లికరణైలోని డాక్టర్ కామాక్షి మెమోరియల్ ఆసుపత్రిలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ రాజేశ్వరి రామచంద్రన్ నేతృత్వంలో ఈబృందం తమ సేవలకు శ్రీకారం చుట్టింది. - సాక్షి, చెన్నై

ఇంద క్రైమ్ తప్పిల్లై చిత్ర ఫస్ట్ లుక్ పోస్టర్


పోస్టర్ విడుదల చేస్తున్న యూనిట్ సభ్యులు

తమిళ సినిమా: మధురియా ప్రొడక్షన్స్ పతాకంపై మనోజ్ కృష్ణస్వామి నిర్మిస్తున్న చిత్రం ఇంద క్రైమ్ తప్పిల్లై దేవకుమార్ కథ, దర్శకత్వ బాధ్యతలను నిర్వహిస్తున్న ఈ చిత్రంలో ఆడుగళం నరేన్, బుల్లితెర నటుడు పాండి కమల్ ప్రధాన పాత్రలు పోషిస్తుండగా, నటి మేఘ్నా ఎలన్ కథానాయకిగా నటిస్తున్నారు. నటుడు వెంకట్రావు మూర్తి కాలనీ తదితరులు ముఖ్యపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి ఏఎంఎం కార్తికేయన్ ఛాయాగ్రహణం, పరిమళవాసన్ సంగీతం అందిస్తున్నారు. షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్ర టైటిల్ ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇంద క్రైమ్ తప్పిల్లై అంటే ఈ నేరం తప్పుకాదని అర్థం టైటిల్ చూస్తుంటే ఇదేదో క్రైమ్ థ్రిల్లర్ కథా చిత్రంగా ఉంటుందనిపిస్తోంది. కాగా ఈ చిత్ర ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదలై చిరుతైగళ్ పార్టీ అధ్యక్షుడు, పార్లమెంటు సభ్యుడు తొళ్ తిరుమావళవన్ చేతుల మీదుగా ఆవిష్కరించినట్లు చిత్రవర్గాలు మీడియాకు విడుదల చేస్తున్న ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కథను మాత్రమే నమ్మి రూపొందిస్తున్న చిత్రం ఇదని చెప్పారు. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలోనే వెల్లడించనున్నట్లు దర్శకుడు పేర్కొన్నారు.

కోలీవుడ్ టాక్స్



కావాల్సింది సానుభూతి కాదు!

తమిళసినిమా: నటి మమతా మోహన్‌దాస్ గురించి ఇప్పుడు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం ఉండదు. 2005లోనే తెరంగేట్రం చేసిన ఈ మలయాళీ భామ ఆ తరువాత తెలుగు, తమిళ భాషల్లో సత్తాచాటారు. సుమారు 18 ఏళ్ల పాటు కథానాయకిగా కొనసాగుతున్న ఈ బహుభాషా నటి తన జీవితంలో పలు ఎత్తుపల్లాలను చవి చూశారు. ముఖ్యంగా క్యాన్సర్ మహమ్మారిని జయించడంతో పాటు మళ్లీ నటిగా రీ ఎంట్రీ ఇచ్చారు. క్యాన్సర్ వ్యాధిని జయించడం గురించి మమతా మోహన్‌దాస్ ఓ భేటీలో పేర్కొంటూ ఆ వ్యాధిపై అవగాహన ఉంటే దాని నుంచి బయటపడడం సాధ్యమేనని పేర్కొన్నారు. క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు సానుభూతి చాలా లభిస్తుందన్నారు. అయితే దాన్ని ఆశిస్తే కలిగే నష్టాలే ఎక్కువ అన్నారు. అలాంటి సానుభూతి తనకు అక్కరలేదని తాను వున్న ఊరిని వదిలేశానని, సినిమాలను కూడా పక్కన పెట్టానని చెప్పారు. ఆసుపత్రిలో ఉండే చికిత్స పొందినట్లు తెలిపారు. ఆ సమయంలో తాను తల్లిదండ్రుల ఆదరాభిమానాలను మాత్రమే ఆశించానని చెప్పారు. క్యాన్సర్ వ్యాధిని జయించే వరకు కేరళ సమీపంలోకి రాలేదన్నారు. అయితే ఈ వ్యాధి నుంచి బయటపడ్డ అంతకుముందు రూపం మళ్లీ రాదని, ఈ విషయాన్ని గ్రహించాలని చెప్పారు. కాగా ప్రస్తుతం మమతామోహన్‌దాస్ మలయాళంలో మూడు చిత్రాలు, తమిళంలో విజయ్ సేతుపతికి జంటగా మహరాజా చిత్రంతో పాటు ఊమై విళిగల్ అనే మరో సినిమాలో నటిస్తున్నారు.

నిర్మాణాంతర కార్యక్రమాల్లో ముస్తఫా ముస్తఫా


ముస్తఫా ముస్తఫా చిత్రంలో సతీష్, మౌనిక చిన్నకోట్ల

తమిళసినిమా: స్నేహం నేపథ్యంలో రూపొందిన చిత్రాలు ప్రేక్షకుల ఆదరణను ఎప్పుడు కోల్పోలేదనే చెప్పారు. ఇందుకు ఈ మధ్య వచ్చిన కన్నుమ్ కన్నుమ్ కొల్‌లైయడిత్తాల్, సూదు కవ్వుమ్ వంటి చిత్రాలే ఓ ఉదాహరణ. కాగా ఆ తరహాలో తాజాగా రూపొందుతున్న చిత్రం ముస్తఫా ముస్తఫా. ది మాపోగోస్ పతాకంపై ప్రదీప్ మహదేవన్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి కథ, దర్శకత్వం బాధ్యతలను ప్రవీణ్ నిర్వహిస్తున్నారు. సతీష్ సురేష్ రవి హీరోలుగా నటిస్తున్న ఇందులో నటి మౌనిక చిన్న కోట్ల, మానస చౌదరి హీరోయిన్లుగానూ, నటుడు కరుణాకరన్, పుగళ్, పావెల్ నవగీతం, ఐశ్వర్యా దత్తా, వీజే మహేశ్వరి, వీజే పార్వతి, లివింగ్టన చామ్స్, దీప్స్, ఉమా పద్మనాబన్, వినోద్ తదితరులు ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు. చిత్ర వివరాలను దర్శకుడు వెల్లడిస్తూ ఇది స్నేహం నేపథ్యంలో సాగే డార్క్ కామెడీ కథా చిత్రంగా ఉంటుందన్నారు. ఇందులో సతీష్‌కు జంటగా మౌనిక చిన్న కోట్ల, సురేష్‌రెడ్డికి జంటగా మానస చౌదరి నటిస్తున్నట్లు చెప్పారు. చిత్ర షూటింగ్‌ను చెన్నై పరిసర ప్రాంతాలలో నిర్మించి పూర్తి చేసినట్లు చెప్పారు. ప్రస్తుతం నిర్మాణ కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయని, విడుదల తేదీని త్వరలోనే అధికారికంగా వెల్లడించనున్నట్లు తెలిపారు.


రష్మిక మందన్న

రష్మిక ఆశలన్నీ ఆ చిత్రం పైనే..

తమిళసినిమా: పుష్ప చిత్రం వరకు టాలీవుడ్‌లో క్రేజీ కథానాయకిగా రాణించిన నటి రష్మిక మందన్న. ఆ చిత్ర సక్సెస్ ఈ కన్నడ బ్యూటీని బాలీవుడ్ వరకు తీసుకెళ్లింది. ఇక్కడ వరకు బాగానే ఉన్నా బాలీవుడ్‌లోనే రష్మిక సినీ కెరీర్ ఆశించిన స్థాయిలో లేదు. ఈమె హిందీలో నటించిన తొలి చిత్రం గుడ్ బై పూర్తిగా నిరాశపరిచింది. ఆ తరువాత నటించిన మిషన్ మంజ్ను కూడా ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయింది. ప్రస్తుతం యానిమల్ చిత్రం ఒకటే రష్మిక చేతిలో ఉంది. రణ్‌బీర్ కపూర్ కథానాయకుడిగా నటించిన ఈ చిత్రంలో అనిల్ కపూర్, బాబిడియోల్ వంటి భారీ తారాగణం నటిస్తోంది. దీనికి తెలుగు దర్శకుడు సందీప్ రెడ్డి వంగ దర్శకత్వం వహించారు. ఈ చిత్రంపైనే నటి రష్మిక ఆశలన్నీ. ఇంకా చెప్పాలంటే ఈమె బాలీవుడ్ కెరీర్ ఈ చిత్రం రిజల్ట్‌పైనే ఆధారపడి ఉంటుందని చెప్పాలి. ఇకపోతే తమిళంలో రష్మికకు పెద్దగా క్రేజ్ లేదు. కారణం ఇక్కడ ఈమె నటించిన తొలి చిత్రం సుల్తాన్ ఫ్లాప్ అయ్యింది. ఇక వారియర్స్ చిత్రం ఒకే అనిపించుకున్న అందులో రష్మిక పాత్ర గ్లామర్‌కు, సాంగ్స్‌కు మాత్రమే పరిమితం అయిందనే విమర్శలను ఎదుర్కొన్నారు. దీంతో హిందీ చిత్రం యానిమల్ హిట్ కాకపోతే నటి రష్మిక టాలీవుడ్‌నే నమ్ముకోవాల్సిన పరిస్థితి. అయితే తెలుగులో అల్లు అర్జున్ సరసన నటిస్తున్న పుష్ప–2 చిత్రంపై భారీ అంచనాలు ఉన్నాయి. ఈ చిత్రం విడుదల తరువాత తెలుగులో మరిన్ని అవకాశాలు వస్తాయని భావించవచ్చు. కాగా ప్రస్తుతం పుష్ప–2 తో పాటు రెయిన్ బో అనే హీరోయిన్ ఓరియంటెడ్ కథా చిత్రంలో నటిస్తోంది.

సెల్వమణి వ్యాఖ్యలను వక్రీకరించారు



ఐమా చిత్ర ఆడియో ఆవిష్కరణలో యూనిట్ సభ్యులు

తమిళసినిమా: ఐమా చిత్రం శుక్రవారం తెరపైకి రానుంది. తమిళ్ ఎగ్జాటిక్ ఫిలిమ్స్ పతాకంపై షణ్ముఖ రామస్వామి నిర్మించి ప్రతి నాయకుడిగా నటించిన ఈ చిత్రంలో యూనిస్, ఎల్విన్ జులియట్ యువ జంటగా నటించిన ఈ చిత్రానికి రాహుల్ ఆర్.కృష్ణ దర్శకత్వం వహించారు. విష్ణు కన్నన్ ఛాయాగ్రహణం, కేఆర్ రాహుల్ సంగీతం అందించిన ఐమా చిత్రం ఆడియో ఆవిష్కరణ కార్యక్రమం బుధవారం సాయంత్రం స్థానిక సాలిగ్రామంలోని ప్రసాద్ ల్యాబ్‌లో జరిగింది. ఇందులో నటుడు, డిస్ట్రిబ్యూటర్స్ సంఘం అధ్యక్షుడు కె.రాజన్, దర్శకుడు పేరరసు, కేబుల్‌శంకర్ తదితర సినీ ప్రముఖులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత, ప్రతినాయకుడు షణ్ముఖ రామస్వామి మాట్లాడుతూ తాను ఐటీ రంగానికి చెందిన వ్యక్తినని, సినిమా రంగంపై చాలా ఆసక్తి ఉందన్నారు. తనకు నటన అంటే ఇంకా ఇష్టం అన్నారు. అయితే అవకాశాలు అడగటం తెలియదన్నారు. అందుకే నటుడు కావడం కోసమే నిర్మాతగా మారినట్లు చెప్పారు. చిత్రం బాగా వచ్చిందని తెలిపారు. దర్శకుడు పేరరసు మాట్లాడుతూ ఐమా అంటే దైవశక్తి అని అర్థం అన్నారు. ఇందులో అధికంగా కేరళకు చెందిన కళాకారులు నటించారని పేర్కొన్నారు. స్టార్ హీరోలు నటిస్తున్న తమిళ చిత్రాల షూటింగ్‌ను ఇతర రాష్ట్రాల్లో భారీ సెట్స్ వేసి రూపొందిస్తున్నారన్నారు. దీంతో ఆయా రాష్ట్రాలకు చెందిన కళాకారులు, సాంకేతిక వర్గమే పని చేస్తున్నారని పేర్కొన్నారు. తమిళ చిత్రాల్లో మన కళాకారులం, సాంకేతిక వర్గాన్ని పని కల్పించాలన్నారు. ఇదే విషయాన్ని ఇటీవల పెప్సీ అధ్యక్షుడు ఆర్‌కే సెల్వమణి ఒక భేటీలో పేర్కొన్నారని, దాన్ని కొందరు వక్రీకరించారని, తెలుగు నటుడు పవన్ కల్యాణ్ దీనిపై స్పందిస్తూ ఆర్‌కే సెల్వమణి వ్యాఖ్యలు సముచితం కాదని, స్వార్థ పూరితంగా ఉన్నాయని పేర్కొనడం తగదన్నారు. మన కళాకారులకు, సాంకేతిక వర్గానికి పని ఇవ్వాలని కోరడం తప్పు కాదని దర్శకుడు పేరరసు పేర్కొన్నారు.

క్లుప్తంగా

పౌష్టికాహారంపై అవగాహన


పౌష్టికాహారం అందజేస్తున్న జ్ఞానమణి

పళ్లిపట్టు: ఆర్కేపేటలో గురువారం పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించారు. చిన్నారుల తల్లులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఆల్ ది చిల్డ్రన్ ట్రస్టు ద్వారా చిన్నారులకు పౌష్టికాహార వారోత్సవాలు దిగువ బాలాపురంలో నిర్వహించారు. ఇందులో యూనియన్ చిల్డ్రన్ డెవలప్‌మెంట్ అధికారి జ్ఞానమణి పాల్గొని చిన్నారులకు అవగాహన కల్పించారు. ఆల్ ది చిల్డ్రన్ ట్రస్టు కో–ఆర్డినేటర్ రజినీ పాల్గొన్నారు.

కూలీకి యావజ్జీవ శిక్ష

అన్నానగర్: మహిళ హత్య కేసులో కృష్ణగిరి కోర్టు ఓ కూలీకి గురువారం యావజ్జీవ శిక్ష విధించింది. కృష్ణగిరి సమీపంలోని కనకముట్లకు చెందిన లక్ష్మి(40) భర్త నుంచి విడిపోయి 16 ఏళ్లుగా ఒంటరిగా జీవిస్తోంది. ఇతని బంధువు దురై (50). వీరిద్దరూ మేకల కాపరులు. జూన్ 8, 2022న వారు పెరియ కల్కుండు హిల్స్‌లో మేకలు మేపుతుండగా పర్కూరు నక్కల్‌పట్టి ఇరులార్ కాలనీకి చెందిన కూలీ తిమ్మరాజ్(36) లక్ష్మిని లైంగికంగా వేధించి హత్య చేశాడు. ఈ కేసుపై న్యాయమూర్తి సుధ గురువారం తీర్పు వెలువరించారు. నేరం రుజువు కావడంతో తిమ్మరాజుకు జీవిత ఖైదు విధిస్తూ తీర్పునిచ్చారు.

ఎనిమిది నెలల్లో 412 మంది నిందితుల అరెస్ట్

కొరుక్కుపేట: చెన్నైలో గత ఎనిమిది నెలల్లో హత్యలు, చోరీలు, దోపిడీలకు పాల్పడిన 412 మందిని గ్యాంగ్‌స్టర్ చట్టం కింద నగర పోలీసులు అరెస్టు చేశారు. చెన్నై పోలీసు పరిధిలో చట్టాన్ని అతిక్రమిస్తున్న వ్యక్తులను అరెస్టు చేసి చర్యలు తీసుకోవాలని పోలీస్ కమిషనర్ సందీప్ రాయ్ రాథోడ్ ఇటీవల ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు 12 పోలీసు జిల్లాల్లో డిప్యూటీ కమిషనర్ల ఆధ్వర్యంలో అసిస్టెంట్ కమిషనర్ల అరెస్టులు, చర్యలు తీసుకుంటున్నారు. ప్రజాశాంతికి విఘాతం కలిగించే నేరాలకు పాల్పడిన 279 మంది రైడర్లు, దొంగతనాలు, దోపిడీలు, మనీలాండరింగ్ నేరాలకు పాల్పడిన 71 మందిని, గంజాయి, మాదక ద్రవ్యాలు విక్రయిస్తున్న 49 మందిని గూండా నిరోధక చట్టం కింద అరెస్టు చేసి జైలుకు పంపారు. ఇందులో ముఖ్యంగా మోస్ట్ వాంటెడ్‌గా ఉన్న ఆదంబాక్కం అంబేడ్కర్ నగర్‌కు చెందిన లోకేష్ (22)ని అరెస్ట్ చేసినట్టు పోలీసులు వెల్లడించారు.

రౌడీపై కత్తులతో దాడి

తిరువొత్తియూరు: ఎర్నావూరు నేతాజీ నగర్‌కు చెందిన సూర్య (22) రౌడీ. ఇతనిపై పలు కేసులు ఉన్నాయి. ఈక్రమంలో బుధవారం రాత్రి సూర్య కాశిమేడు చేపలపట్టు హార్బర్ వద్ద చేపలు వేలం వేసేందుకు వచ్చాడు. ఆ సమయంలో అతన్ని వెంబడిస్తూ వచ్చిన ఏడుగురు అతనిపై కత్తులతో దాడి చేసి పారిపోయారు. అక్కడున్న జాలర్లు కాశిమేడు హార్బర్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడకు చేరుకుని తీవ్రంగా గాయపడ్డ సూర్యను స్టాన్లీ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

50 సవర్ల బంగారు నగలు స్వాధీనం

- బ్యాంక్ ఉద్యోగి అరెస్ట్

వేలూరు: బంగారు నగలను చోరీ చేసిన బ్యాంకు ఉద్యోగిని పోలీసులు అరెస్ట్ చేశారు. వేలూరు తొరప్పాడి సమీపంలోని రామ్‌శెట్టినగర్‌కు చెందిన బాలాజీ ఐటీ ఉద్యోగి, భార్య మోహనప్రియ ప్రభుత్వ పాఠశాలలో టీచర్. బాలాజీ తల్లి, భార్య, పిల్లలతో కలిసి మిద్దెపైన జీవిస్తున్నాడు. ఈ నేపథ్యంలో బాలాజీ కుటుంబసభ్యులతో కలిసి ఈనెల 3న తిరువణ్ణామలైకు వెళ్లి తిరిగి సాయంత్రం ఇంటికి వచ్చారు. అయితే ఇంటి వెనుక తలుపులు తెరిచి ఉండడంతో దిగ్భ్రాంతి చెంది లోపలికి వెళ్లి చూడగా బీరువాలో ఉంచిన 50 సవర్ల బంగారు నగలు చోరీకి గురైనట్లు గుర్తించారు. ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. పోలీసులు ఆ ప్రాంతంలోని సీసీటీవీ కెమెరాలను పరిశీలించగా బాలాజీ పక్కింట్లో నివసిస్తున్న బంధువు బ్యాంకు ఉద్యోగి వెంకటేష్ ఇంటికి వచ్చి వెళ్లినట్లు తెలిసింది. దీంతో అతన్ని అదుపులోకి తీసుకొని విచారించగా నగలను చోరీ చేసి తిరువణ్ణామలైలోని ప్రైవేటు బ్యాంకులోని లాకర్‌లో ఉంచినట్లు నేరం అంగీకరించాడు. పోలీసులు నగలను స్వాధీనం చేసుకొని నిందితుడు వెంకటేశన్‌ను అరెస్ట్ చేశారు.

తమిళనాడు భాషా మైనారిటీలకు ఘన విజయం

కొరుక్కుపేట: తమిళనాడు పాఠశాలల్లో మాతృభాషను నేర్చుకునే మన రాజ్యాంగ హక్కును సమర్థిస్తూ గురువారం చారిత్రాత్మక తీర్పునిచ్చిన భారత సుప్రీంకోర్టు, న్యాయమూర్తి, మాజీ ప్రధాన న్యాయమూర్తి, మద్రాసు హైకోర్టు (2014–17) న్యాయమూర్తి సంజయ్ కిషన్‌కౌల్‌కు తమిళనాడు భాషాపరమైన మైనారిటీల ఫోరమ్ (లింఫాట్) కృతజ్ఞతలు తెలిపింది. యాదృచ్ఛికంగా, ఆయన మద్రాసు హైకోర్టు (2016)లో మన మాతృభాషకు మొదటి ఉపశమనాన్ని అందించారు. ప్రస్తుతం (2023) సుప్రీంకోర్టు తీర్పు ద్వారా శాశ్వత రక్షణ కల్పించారు. ఉత్తర్వులలో ఇలా పేర్కొన్నారు. తమిళనాడు పాఠశాలల్లోని ఏ విద్యార్థి అయినా, తమిళం కాకుండా ఇతర భాషలను అభ్యసించడాన్ని ఎంచుకుంటే, ఉత్తీర్ణత కోసం నిర్దేశించిన కనీస మార్కులు మార్క్‌షీట్‌లో కనిపించే మార్కులతో ఆ భాషను అభ్యసించడానికి అనుమతించబడతారని పేర్కొంది. దీంతో భారత సర్వోన్నత న్యాయస్థానానికి లింఫాట్ చైర్మన్ ప్రొఫెసర్ సీఎంకే రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

గరుడ గోవిందుని విహారానికి వేళాయె!

- తిరుమలలో గరుడ సేవకు విస్తృత ఏర్పాట్లు
- గ్యాలరీల్లో నిరంతరాయంగా అన్నప్రసాదాలు
- రీఫిల్లింగ్‌తో అధిక సంఖ్యలో భక్తులకు దర్శనం
- పకడ్బందీగా భద్రత


కాంతులీనుతున్న శ్రీవారి ఆలయ మహద్వారం

తిరుమల: శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం గరుడ సేవ నిర్వహించనున్నారు. ఈ క్రమంలో శ్రీవారి దర్శనార్థం పెద్దసంఖ్యలో తరలిరానున్న భక్తుల సౌకర్యార్థం టీటీడీ విస్తృతంగా ఏర్పాట్లు చేపట్టింది. దాదాపు 2 లక్షల మంది భక్తులు గ్యాలరీల్లో వేచి ఉండేలా సన్నద్ధం చేసింది. గరుడ సేవ దర్శనం కోసం ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్లలో వేచి ఉండే భక్తులను సుపథం, సౌత్ వెస్ట్ కార్నర్, గోవిందనిలయం నార్త్ వెస్ట్ గేట్, నార్త్ ఈస్ట్ గేట్ల ద్వారా గ్యాలరీల్లోకి అనుమతించేలా ఏర్పాట్లు చేసింది. గరుడ వాహన సేవను రాత్రి 7 గంటలకు ప్రారంభించి భక్తులందరూ దర్శించుకునేలా రాత్రి 2 గంటల వరకు కొనసాగించేలా ప్రణాళిక రూపొందించింది. శ్రీవారి దర్శనార్థం భక్తులు తమ వంతు వచ్చే వరకు సంయమనంతో వేచి ఉండాలని సూచించింది.

అందుబాటులో అన్నప్రసాదం

మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనంలో ఉదయం 8 నుంచి రాత్రి ఒంటి గంట వరకు నిరంతరాయంగా అన్నప్రసాదాలు అందించేందుకు సన్నాహాలు పూర్తి చేసింది. గ్యాలరీల్లోనూ ఉదయం నుంచిరాత్రి వరకు పులిహోర, టమాట బాత్, బిసిబేళా బాత్ తదితర అన్నప్రసాదాల ప్యాకెట్లు పంపిణీ చేసేందుకు సన్నద్ధమైంది. అలాగే భక్తుల కోసం 2.50 లక్షల మజ్జిగ ప్యాకెట్లు సిద్ధం చేసింది. భక్తుల దాహార్తిని తీర్చేందుకు నాలుగు మాడ వీధుల్లోని గ్యాలరీల్లో 524 తాగునీటి డ్రమ్ములను ఏర్పాటు చేసింది.

పటిష్ట భద్రత

బ్రహ్మోత్సవాలకు దాదాపు 1,130 మంది టీటీడీ సిబ్బందితోపాటు 3,600 మంది పోలీసులతో పటిష్టంగా భద్రతా ఏర్పాట్లు చేశారు. గరుడసేవకు ప్రత్యేకంగా 1,200 మంది పోలీసులతో అదనపు భద్రత కల్పించారు. ఆలయ మాడ వీధులు, ఇతర ప్రాంతాల్లో 2,770 సీసీ కెమెరాల ద్వారా కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి పర్యవేక్షిస్తున్నారు. ఘాట్ రోడ్లలో భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని గురువారం సాయంత్రం 6 గంటల నుంచి శనివారం ఉదయం 6 గంటల వరకు ద్విచక్ర వాహనాల రాకపోకలను రద్దు చేశారు.

చెన్నై నుంచి గొడుగులు

గరుడసేవ రోజున శ్రీవారికి అలంకరించేందుకు హిందూ ధర్మార్థ సమితి వారు చెన్నై నుంచి తొమ్మిది గొడుగులను ఊరేగింపుగా గురువారం తీసుకువచ్చారు. సమితి ట్రస్టీ ఆర్ ఆర్ గోపాల్‌జీ ఆధ్వర్యంలో తిరుమలకు చేరుకున్న గొడుగులకు టీటీడీ అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. ఆలయం ముందు గొడుగులను టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డికి అందించారు. మాడ వీధుల్లో ఊరేగించిన అనంతరం ఆలయంలోకి తీసుకెళ్లారు. గోపాల్‌జీ మాట్లాడుతూ ఈనెల 16న చెన్నై నుంచి 11 గొడుగుల ఊరేగింపు ప్రారంభమైందన్నారు. చెన్నైలోని చెన్నకేశవ పెరుమాళ్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు. బుధవారం రాత్రి తిరుచానూరు పద్మావతి అమ్మవారికి 2 గొడుగులను సమర్పించినట్టు చెప్పారు. సుమారు 19 ఏళ్లుగా తిరుమల శ్రీవారికి గరుడ సేవలో అలంకరణ నిమిత్తం గొడుగులు అందజేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ లోకనాథం పాల్గొన్నారు.

శ్రీవిల్లిపుత్తూరు నుంచి విశేష మాలలు

గరుడసేవలో శ్రీవారికి అలంకరించేందుకు తమిళనాడులోని శ్రీవిల్లిపుత్తూరు నుంచి గోదాదేవి మాలలు గురువారం తిరుమలకు చేరుకున్నాయి. ముందుగా బేడి ఆంజనేయస్వామి ఆలయం వద్ద పెద్దజీయర్ మఠానికి మాలలను తీసుకొచ్చారు. పెద్దజీయర్‌స్వామి, తిరుమల చిన్నజీయర్‌స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డి, తమిళనాడు దేవదాయ శాఖ జాయింట్ కమిషనర్ సెల్లదొరై, శ్రీవిల్లిపుత్తూరు ఆలయ ఈఓ ముత్తురాజ, ట్రస్టుబోర్డు సభ్యుడు మనోహరన్ ఆధ్వర్యంలో మంగళవాయిద్యాల నడుమ మాడవీధుల్లో ఊరేగించి శ్రీవారి ఆలయంలోకి తీసుకెళ్లారు. ఈఓ ధర్మారెడ్డి మాట్లాడుతూ శ్రీవిల్లిపుత్తూరులో గోదాదేవికి అలంకరించిన మాలలను గరుడసేవ రోజు శ్రీవారికి అలంకరించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. గోదాదేవిని శ్రీవారి దేవేరి భూదేవి అవతారంగా పురాణాల్లో పేర్కొన్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఢిల్లీ స్థానిక సలహామండలి అధ్యక్షులు వేమిరెడ్డి ప్రశాంతి, డిప్యూటీ ఈఓ లోకనాథం, శ్రీవిల్లిపుత్తూరు ఆలయ స్థానాచార్యులు రంగరాజన్, సుదర్శన్ పాల్గొన్నారు.


శ్రీవిల్లి పుత్తూరు మాలలు


మాడ వీధుల్లో శ్రీవిల్లి పుత్తూరు మాలల ఊరేగింపు


గరుడ సేవ సందర్భంగా ఏర్పాటు చేసిన క్యూలు


రోడ్డుపై వేసిన ఫెన్సింగ్

కాంచిన కనులదే భాగ్యం..

- కాణిపాకంలో నయనానందకరంగా బ్రహ్మోత్సవాలు
- మూషిక వాహనంపై విహరించిన లంబోదరుడు
- రంజింపజేసిన సాంస్కృతిక ప్రదర్శనలు


శ్రీకాళహస్తి దేవస్థానం నుంచి పట్టు వస్త్రాలను తీసుకొస్తున్న ఆలయ చైర్మన్, ఈఓ

కాణిపాకం(యాదమరి): కాణిపాకంలో బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. శనివారం ఉదయం మూలస్థానంలోని స్వయంభు వినాయకస్వామికి గంధం, విశేష ద్రవ్యాలతో అభిషేకం అనంతరం సుందరంగా అలంకరించి పూజలు చేశారు. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో అశేష సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం మూషిక వాహన ఉభయదారులకు ప్రత్యేక దర్శనం కల్పించి, తీర్థ ప్రసాదాలు అందించారు. రాత్రి తొమ్మిది గంటలకు మూషిక వాహన సేవ ప్రారంభమైంది. ముందుగా సిద్ధి, బుద్ధి సమేత గణనాథుని ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి ఊరేగింపుగా అలంకార మండపంలో కొలువుదీర్చారు. ప్రత్యేక పూజల అనంతరం ఆలయ అధికారులు, ఉభయదారులు భుజాలపై మోసుకుంటు ఊరేగింపుగా తీసుకెళ్లి మూషిక వాహనంలోఅధిష్ఠింపజేశారు. తదుపరి మేళతాళాలతో, మంగళ వాయిద్యాల నడుమ తిరువీధులలో, పుర వీధుల్లో ఊరేగింపు నయనానందకరంగా సాగింది. అడుగడుగునా భక్తులు కర్పూర నీరజనాలు సమర్పించారు.

నేడు చిన్న, పెద్దశేష వాహన సేవలు

బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం ఉదయం స్వామి వారు చిన్నశేష వాహనంపై, రాత్రి పెద్ద శేష వాహనంపై ఊరేగనున్నారు. వేకువజామున ప్రత్యేక అభిషేకపూజల అనంతరం భక్తులకు దర్శనం ఉంటుంది.


చిన్నారుల నృత్య ప్రదర్శన

శ్రీశైలం, శ్రీకాళహస్తి ఆలయల నుంచి పట్టువస్త్రాలు

కుమారునికి తండ్రి ఆలయాల నుంచి పట్టు వస్త్రాలను సమర్పించారు. గురువారం ఉదయం శ్రీశైల భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి దేవాలయం నుంచి ఈఓ లవన్న, బోర్డు సభ్యులు జగదీశ్వర్ రెడ్డి, విజయలక్ష్మి పట్టువస్త్రాలను తీసుకొచ్చారు. మధ్యాహ్నం శ్రీకాళహస్తీశ్వర స్వామి ఆలయం నుంచి దేవస్థానం చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈఓ సాగర్ బాబు, బోర్డు సభ్యులు స్వామివారి పట్టు వస్త్రాలను తీసుకొచ్చారు. వారికి కాణిపాకం ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు మేళతాళాలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఈ వస్త్రాలను స్వామి సన్నిధిలో ఉంచి ప్రత్యేక పూజలు చేశారు.

బాధిత పిల్లలకు విముక్తి


తల్లిదండ్రులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్

వేలూరు: తిరుపత్తూరు జిల్లా మాడపల్లిలోని అన్నానగర్ ప్రాంతంలో పిల్లలను పాఠశాలకు పంపకుండా ఇంట్లోనే బంధించినట్లు కలెక్టర్ భాస్కర్‌పాండియన్‌కు సమాచారం అందింది. దీంతో కలెక్టర్ నేరుగా వెళ్లి విచారణ చేశారు. ఆ సమయంలో తల్లిదండ్రులు ఇద్దరూ మద్యంతో పాటు మత్తు పదార్థాలకు బానిస కావడంతో పిల్లలకు ఆహారం కూడా పెట్టకుండా ఇంట్లోనే ఉంచుతున్నట్లు స్థానికులు తెలిపారు. దీంతో ఇద్దరు పిల్లలను కలెక్టర్ కారులో ఎక్కించుకుని సమీపంలోని ప్రభుత్వ హాస్టల్‌లో వదిలి పెట్టి వెంటనే ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. అనంతరం తల్లిదండ్రులు ఇద్దరికి కౌన్సెలింగ్ ఇచ్చారు. దేవదాయశాఖ కమిషనర్ భాను, అధికారులు పాల్గొన్నారు.

చిన్నారి హత్య కేసులో బాబాయ్ అరెస్ట్

అన్నానగర్: చిన్నారి హత్య కేసులో బాబాయ్‌ను అరెస్ట్ చేశారు. కళ్లకురిచ్చి జిల్లా తిరుకోవిలూరు సమీపంలోని తిరుప్పలపండాల్ గ్రామం మారియమ్మన్ ఆలయ వీధికి చెందిన గురుమూర్తి (24). ఇతని భార్య జగదీశ్వరి. ఈ దంపతులకు తిరుమూర్తి (2) కుమారుడు, భువనేశ్వరి అనే నెల కుమార్తె ఉన్నారు. గురుమూర్తి బెంగళూరులో లగేజీ ఆటో నడుపుతున్నాడు. గురుమూర్తి తమ్ముడు రాజేష్ (22) కూడా బెంగళూరులో ఆటో నడుపుకుంటూ కొన్ని రోజులకు స్వగ్రామానికి వచ్చాడు. ఈ క్రమంలో జగదీశ్వరిపై మనసుపడి కోరిక తీర్చాలంటూ వదినను కోరాడు. నిరాకరించి అతన్ని మందలించింది. దీంతో కక్ష పెంచుకున్న రాజేష్ 17వ తేదీన ఇంట్లో ఆడుకుంటున్న తిరుమూర్తిని హత్య చేసి మృతదేహాన్ని స్పీకర్ బాక్స్‌లో దాచి పెట్టాడు. తిరుమూర్తి కనపడకపోవడంతో తిరుప్పలపండాల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. చిన్నారి అదృశ్యంపై గ్రామానికి చెందిన మహిళలు బుధవారం జగదీశ్వరితో మాట్లాడుతున్నారు. అప్పుడు ఓ మహిళ చేయి స్పీకర్ బాక్స్‌పై పడి పెట్టె కిందపడింది. స్పీకర్ బాక్సులో చిన్నారి శవం బయటపడింది. పోలీసులు రాజేష్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. తన కోరికను వదిన నిరాకరించడంతో ప్రతీకారంగా ఆమె కుమారుడుని చంపినట్లు రాజేష్ పోలీసులకు చెప్పాడు. పోలీసులు అతన్ని అరెస్టు చేశారు.

అందుబాటులో వరి కొనుగోలు కేంద్రాలు


కేజీ.కండ్రిగ ప్రభుత్వ వరి కొనుగోలు కేంద్రం

తిరుత్తణి: రైతులను ఆదుకునే విధంగా ప్రభుత్వ వరి కొనుగోలు కేంద్రాల్లో సకాలంలో వరి కొనుగోలు చేసి బకాయిలు సకాలంలో జమచేస్తున్నందున రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తిరుత్తణి సమీపంలోని కేజీ.కండ్రిగలోని ప్రభుత్వ వరి కొనుగోలు కేంద్రంలో చుట్టు పక్కల గ్రామాలకు చెందిన రైతులు తమ పేర్లు నమోదు చేసుకుని వరి సరఫరా చేస్తున్నారు. ప్రైవేటు మార్కెట్ ధర కంటే అధికంగా టన్నుకు ప్రభుత్వం రూ.2,310 మద్దతు ధర ప్రకటించి కొనుగోలు చేస్తున్నందున రైతులు ప్రభుత్వ వరి కొనుగోలు కేంద్రాలకు సరఫరాకు ఆసక్తి చూపుతున్నారు. వర్షాకాలం కావడంతో వరి తడిచి నిరుపయోగం కాకుండా రైతులను ఆదుకునేందుకు వీలుగా వెంటనే కొనుగోలు చేస్తుండడంతో రైతులు పంట దిగుబడి చేసి వెంటనే సరఫరా చేస్తున్నట్లు రైతుల ఖాతాల్లో వారంలో బకాయిలు చెల్లిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

వేర్వేరు చోట్ల ఆరుగురి ఆత్మహత్య

అన్నానగర్: చెన్నైలో వేర్వేరు చోట్ల గురువారం ఆరుగురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. చెన్నై రాయపేటకు చెందిన ప్రతాప్‌కుమార్ (40). ఇతని భార్య కాంచన. ఈమె అనారోగ్యంతో బాధపడుతోంది. దీంతో మనస్తాపానికి గురైన ప్రతాప్ కుమార్ గురువారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అదేవిధంగా పశ్చిమ ప్రాంతం పాలెం పుష్పవతి అమ్మన్ కోయిల్ వీధికి చెందిన దిలిప్ (34) కారు డ్రైవర్. ఇతని భార్య రీతూ. రీతూకు ఆరోగ్యం బాగా లేకపోవడంతో దిలీప్ మాత్రమే పనికి వెళ్తున్నాడు. కుటుంబపోషణ భారం కావడంతో బుధవారం రాత్రి మద్యం తాగి దిలీప్ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అదేవిధంగా కన్నగినగర్‌కు చెందిన మీనా (36). మానసిక వ్యాధితో బాధపడుతున్న ఆమె గురువారం ఉదయం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తురైపాక్కం ప్రాంతానికి చెందిన షణ్ముకప్రియాన్ (24) కుటుంబ కలహాలతో విషం తాగి ఆత్మహత్యకు పాల్పడింది. వడపళనికి చెందిన అరుల్‌రాజ్ (48) అప్పుల బాధ తాళలేక ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వేలాచ్చేరి నెహ్రూనగర్ జీవానందం వీధికి చెందిన తవరగణేష్ (31). మద్యానికి బానిసైన గణేష్ బుధవారం రాత్రి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ కేసులకు సంబంధించి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నకిలీ పత్రాలు సృష్టించి భూమి విక్రయం

- చెన్నైకు చెందిన వృద్ధుడు అరెస్ట్


అరెస్టయిన వృద్ధుడు

తిరువళ్లూరు: మూడు కోట్ల విలువైన భూములకు నకిలీ పత్రాలను సృష్టించి విక్రయించిన వృద్ధుడిని పోలీసులు 23 సంవత్సరాల తరువాత అరెస్టు చేశారు. చెన్నై ఆట్రంతాంగెల్ ప్రాంతానికి చెందిన నటరాజన్ కుమారుడు వెంకటేషన్. ఇతడికి తిరువళ్లూరు జిల్లా పొన్నేరి పాడియనల్లూరు ప్రాంతంలో 78 సెంట్ల భూమి వుంది. ఈ భూమికి తామే వారసులమని చెన్నైకు చెందిన రామయ్య నకిలీ పత్రాలను సృష్టించారు. అనంతరం నటరాజన్‌కు వారసులుగా అదే గ్రామానికి చెందిన రఘుపతి అనే వ్యక్తిని చూపించి 2000వ సంవత్సరంలో విక్రయించాడు. ఈ సంఘటనపై బాధితులు అప్పట్లో చెన్నై కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. అయితే ఇంత వరకు నిందితులను అరెస్టు చేయలేదు. ఈ నేపథ్యంలో ఇటీవల ఆవడి కమిషనర్ శంకర్ నేతృత్వంలో జరిగిన గ్రీవెన్స్‌డేకు హాజరై 23 సంవత్సరాలుగా మూలన పడ్డ తన కేసుపై ఫిర్యాదు చేశాడు. వెంటనే స్పందించిన కమిషనర్ డిప్యూటీ కమిషనర్ పెరుమాల్ నేతృత్వంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి విచారణ చేశారు. విచారణలో తిరువీకేనగర్‌కు చెందిన వెంకయ్య కుమారుడు రామయ్య(73) పొన్నేరిలోని వెంకటేషన్‌కు చెందిన భూములకు నకిలీ పత్రాలు సృష్టించడంతో పాటు నకిలీ వ్యక్తులను వారసులుగా చూపించి విక్రయించినట్టు గుర్తించారు. అనంతరం కేసులో ప్రధాన నిందితుడిగా వుంటూ పరారీలో ఉన్న రామయ్యను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

నైపుణ్యాలను పెంపొందించడమే లక్ష్యం



మాట్లాడుతున్న పాండియరాజన్

కొరుక్కుపేట: ఉపాధికి అవసరమైన నైపుణ్యాలను పెంపొందించడమే లక్ష్యంగా మా సంస్థ ముందుకెళుతోందని మాఫాయ్ గ్రూప్ అధినేత, మాజీ మంత్రి పాండ్యరాజన్ పేర్కొన్నారు. గురువారం ఏర్పాటైన సమావేశంలో మాఫాయ్ (సియల్ కొత్తగా రెండు రకాల సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇందులో సాంకేతికతను వినియోగిస్తూ హెచ్‌ఆర్ ఫిర్యాదులను పరిష్కరించే విధంగా ఈజీకామ్ అలాగే నైపుణ్యాలను మెరుగుపరుస్తూ నాయకులను తయారు చేసే విధంగా ట్రాన్సిషన్ కోచింగ్ అకాడమీని ప్రారంభించినట్లు పాండ్యరాజన్ ప్రకటించారు. మాఫాయ్ ఎండీ రాజీవ్‌కృష్ణన్ పాల్గొన్నారు.



ఇంకో నాలుగు రోజులు అసెంబ్లీ సమావేశాలు


బీఏసీ సమావేశంలో స్పీకర్ తమ్మినేని సీతారాం, సీఎం వైఎస్ జగన్ తదితరులు

సాక్షి, అమరావతి: అసెంబ్లీ సమావేశాలు ఈ నెల 22, 25, 26, 27 తేదీల్లో నిర్వహించాలని నిర్ణయించినట్లు చీఫ్ విప్ ముదునూరి ప్రసాద్ రాజు, కో–ఆర్డినేటర్ టూ లెజిస్లేటివ్ అఫైర్స్ గడికోట శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. సమావేశాలు ప్రారంభమైన గురువారం వారు అసెంబ్లీ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడారు. స్పీకర్ చాంబర్‌లో స్పీకర్ తమ్మినేని సీతారాం అధ్యక్షతన జరిగిన బీఏసీ (బిజినెస్ అడ్వయిజరీ కమిటీ) సమావేశం నిర్వహించారని, ఆ సమావేశం ముందుకు 13 అంశాలు రాగా, 8 అంశాలపై సభలో చర్చించాలని నిర్ణయించినట్లు తెలిపారు. కొన్ని బిల్లుల ఆమోదం కూడా ఉంటుందని చెప్పారు. స్కిల్ స్కామ్‌పై అసెంబ్లీలో టీడీపీ సభ్యులు గురువారం వాయిదా తీర్మానం ఇచ్చారని, వారి కోరిక మేరకు శుక్రవారం చర్చ ఉంటుందని తెలిపారు. 25, 26, 27 తేదీల్లో మహిళ సాధికారత, అసైన్డ్ ల్యాండ్స్, ఆరోగ్యం, ఫైబర్ నెట్, ఎండోమెంట్, వ్యవసాయం తదితర అంశాలపై చర్చ ఉంటుందన్నారు. బీఏసీ సమావేశంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, బుగ్గన రాజేంద్రనాథ్, జోగి రమేష్ పాల్గొన్నారని చెప్పారు. టీడీపీ తరఫున ఎవరూ పాల్గొనలేదన్నారు.

సభలో సీఎం తరఫున బదులిచ్చే మంత్రులు వీరే..

సాక్షి, అమరావతి: ప్రస్తుత అసెంబ్లీ కార్యక్రమాల సమయంలో సీఎం జగన్‌కు సంబంధించిన శాఖల అంశాలపై ఆయన తరఫున సమాధానం చెప్పే బాధ్యతలను పలువురు మంత్రులకు అప్పగిస్తూ ఏపీ శాసన సభ గురువారం బులెటిన్ జారీ చేసింది. సాధారణ పరిపాలనపై కాకాణి, శాంతి భద్రతలపై వనిత, న్యాయ, న్యాయపాలనపై ఆదిమూలపు సురేష్, ఎన్ఆర్ఐ సాధికారత–సంబంధాలు, ప్రభుత్వ రంగ సంస్థలపై బుగ్గన సమాధానమిస్తారని పేర్కొంది.

రజకులను కించపరిచిన వారిపై చర్యలు తీసుకోవాలి

• ఎమ్మెల్యే మల్లాది



సాక్షి, అమరావతి: బెంగళూరుకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రాష్ట్రంలోని రజకులను కించపరిచేలా వ్యాఖ్యలు చేశారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు డిమాండ్ చేశారు. శాసన సభలో జీరో అవర్‌లో ఆయన మాట్లాడుతూ.. రజకులను కించపరిచేలా వ్యాఖ్యలు చేయకూడదని గతంలో ప్రభుత్వం జీవో 504 ను జారీ చేసిందని తెలిపారు. ఈ జీవోను పరిగణనలోకి తీసుకుని సంబంధిత సాఫ్ట్‌వేర్ ఉద్యోగిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఘటనపై ఇప్పటికే విజయవాడ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదులు అందినట్టు తెలిపారు. ఈ అంశాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవాలని కోరారు. అదే విధంగా పలువురు ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లోని సమస్యలను జీరో అవర్‌లో సభ దృష్టికి తెచ్చారు.

కించపరిచినందుకే మీసం తిప్పా

• ఎమ్మెల్యే బాలకృష్ణ



సాక్షి, అమరావతి: తనను, తెలుగు సినిమా పరిశ్రమను కించపరచడం వల్లే అసెంబ్లీలో తాను మీసం తిప్పానని హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ చెప్పారు. మంత్రి అంబటి రాంబాబు తనకు వేలు చూపించి మీసం మెలేసి తొడకొట్టారన్నారు. అసెంబ్లీ నుంచి సస్పెండైన తర్వాత ఆయన మీడియాతో మాట్లాడారు. తన నటనా వృత్తిని అవమానించడం వల్లే స్పందించినట్టు చెప్పారు. తాను భయపడేవాడిని కాదని, హుందాగా ఉంటాను కాబట్టి.. ఏం చేసినా కామ్‌గా ఉంటాననుకున్నారని, కానీ తాను స్పందించడంతో వాళ్లకు మతిపోయినంత పనైందని చెప్పారు. అసెంబ్లీలో తెలుగు సినిమా కళాకారులను వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు ఘోరంగా అవమానించారని ఆరోపించారు. చంద్రబాబుపై పెట్టిన కేసులు ఎత్తేయాలని, బేషరతుగా ఆయనకు క్షమాపణ చెప్పాలని తాము సభలో డిమాండ్ చేశామన్నారు. ఆయన వెంట టీడీపీ ఎమ్మెల్యేలు కింజరాపు అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, నిమ్మల రామానాయుడు తదితరులున్నారు. తొలుత ఉదయం తుళ్లూరు మండలం వెంకటపాలెంలోని ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించిన టీడీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అసెంబ్లీకి పాదయాత్రగా వచ్చారు.

అసెంబ్లీ సాక్షిగా.. బరితెగింపు!

శాసనసభలో చిల్లర చేష్టలతో టీడీపీ ఎమ్మెల్యేల వీరంగం.. నిండు సభలో అసభ్య సైగలతో లేకి ప్రవర్తన

సాక్షి, అమరావతి: అసెంబ్లీ వేదికగా టీడీపీ గురువారం ఇంకో మెట్టు దిగజారింది. సభలో ఏం మాట్లాడాలో తెలియక అడ్డగోలుగా వ్యవహరించింది. బూతులు మాట్లాడుతూ.. స్పీకర్‌ను అడ్డుకుంటూ.. సభా సంప్రదాయాలను మంటగలుపుతూ అధికార పక్ష సభ్యులను రెచ్చగొట్టడమే లక్ష్యంగా పెట్టుకుంది. ఉదయం 9 గంటలకు సభలో క్వశ్చన్ అవర్‌లో కల్యాణమస్తు పథకంపై ఎమ్మెల్యే వి.కళావతి అడిగిన ప్రశ్నకు మంత్రి మేరుగు నాగార్జున సమాధానం చెబుతుండగా.. ప్రతిపక్ష నేత, మాజీ సీఎం చంద్రబాబు అరెస్ట్ అంశంపై వాయిదా తీర్మానం కింద చర్చించాలంటూ టీడీపీ ఎమ్మెల్యేలు బాలకృష్ణ, బుచ్చయ్య చౌదరి, బాలవీరాంజనేయస్వామి, చిన్నరాజప్ప తదితరులు నినాదాలు చేస్తూ స్పీకర్ పోడియంలోకి చొచ్చుకువెళ్లారు. వీరితోపాటు పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, ఉండవల్లి శ్రీదేవి కూడా కేకలు వేస్తూ వెళ్లి వారితో కలిశారు. ఇరు వైపుల నుంచి స్పీకర్ చైర్‌ను చుట్టుముట్టి ఆయనపై పేపర్‌లు విసురుతూ నినాదాలు చేశారు. గత ప్రభుత్వంలో జరిగిన అవినీతిలో చంద్రబాబు పాత్రపై టీడీపీ వాయిదా తీర్మానం కోరిందని, ఆ సభ్యులకు కావాల్సినంత సమయం ఇచ్చి చర్చిద్దామని, అంతవరకు సంయమనం పాటించాలని శాసన సభ వ్యవహారాల మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ స్పీకర్ ద్వారా టీడీపీ సభ్యులకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా వారు వినిపించుకోలేదు. సభ ప్రారంభమైనప్పటి నుంచి 28 నిమిషాలపాటు వారు నినాదాలు చేస్తూనే వికృత చేష్టలకు పాల్పడ్డారు. స్పీకర్ కుర్చీని సైతం లాగి పడేసేందుకు యత్నించారు. ఈ క్రమంలో జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు కల్పించుకుని చంద్రబాబు అరెస్టు అంశం కోర్టు తేలుస్తుందని, ఆ విషయం అక్కడ వాదించుకోవాలని సూచించారు. సభలో టీడీపీ సభ్యులు ఇలా రెచ్చగొట్టేలా ప్రవర్తించవద్దని, సభా మర్యాదలకు భంగం కలుగుతుందని చెబుతుండగా, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి స్పీకర్ టేబుల్‌పై ఉన్న


శాసనసభలో అసభ్యకరంగా సైగలు చేస్తున్న ఎమ్మెల్యే బాలకృష్ణ

పత్రాలను విసిరేసి, కంప్యూటర్ మానిటర్‌ను లాగిపడేశారు. మరో ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ గ్లాసులో నీటిని టేబుల్‌పై పోయడంతో పలు పేపర్లు తడిచిపోయాయి. అయినా స్పీకర్ తమ్మినేని సంయమనంతో వారికి నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు.

ఎథిక్స్ కమిటీతో విచారణకు సిఫారసు

శాసనసభలో ఉద్దేశపూర్వకంగా ప్రభుత్వ ఆస్తికి నష్టం చేకూరిస్తే 365 నియమావళి ప్రకారం సదరు సభ్యుల నుంచి ఆ మొత్తాన్ని రాబడతామని స్పీకర్ సీతారాం చెప్పారు. వైఎస్సార్‌సీపీ బహిష్కృత ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, టీడీపీ ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్‌లు ఫైల్ చించి వేయడం, బాటిల్‌ను పగలగొట్టడం, స్పీకర్ పోడియం వద్ద మానిటర్, వైర్లను తుంచి వేయడం గర్హనీయమన్నారు. సభా మర్యాదలను కాలరాస్తూ ప్రతిపక్ష సభ్యుల అనుచిత ప్రవర్తన, సభాపతి స్థానాన్ని ధిక్కరిస్తూ చోటుచేసుకున్న ఘటనలను పూర్తిగా పరిశీలించి సమగ్ర నివేదిక ఇవ్వాలని ఎథిక్స్ కమిటీకి సిఫారసు చేశారు. అనంతరం ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, అనగాని సత్యప్రసాద్‌లను సెషన్ మొత్తం సస్పెండ్ చేశారు.

సరైన ఫార్మేట్‌లో వస్తే చర్చకు సిద్ధం

సభలో టీడీపీ సభ్యుల వ్యవహార శైలి క్రిమినల్ చర్యల కిందకు వస్తుందని మంత్రి బుగ్గన మండిపడ్డారు. ప్రతిపక్ష సభ్యులు సరైన ఫార్మేట్‌లో వాయిదా తీర్మానం ఇస్తే ప్రభుత్వం చర్చించేందుకు సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. అయినప్పటికీ ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేస్తూ సభను అటంకపరుస్తూ ఉండటంతో తొలుత 15మంది సభ్యులను ఒక రోజు సభ నుంచి సస్పెండ్ చేయాలని కోరుతూ తీర్మానాన్ని ప్రతిపాదించారు. ఈ క్రమంలో టీడీపీ సభ్యులు పయ్యావుల కేశవ్, బెందాళం అశోక్, కింజారపు అచ్చెన్నాయుడు, నందమూరి బాలకృష్ణ, ఆదిరెడ్డి భవాని, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, నిమ్మకాయల చినరాజప్ప, ఘన వెంకటరెడ్డి నాయుడు, గద్దె రామ్మోహన్‌రావు, నిమ్మల రామానాయుడు, మంతెన రామరాజు, గొట్టిపాటి రవికుమార్, ఏలూరి సాంబశివరావు, డోలా బాలవీరాంజనేయస్వామిలతోపాటు ఉండవల్లి శ్రీదేవిని ఒక రోజు సభ నుంచి సస్పెండ్ చేస్తున్నట్టు స్పీకర్ ప్రకటించారు. అయితే వారు బయటకు వెళ్లకుండా నినాదాలు చేస్తూ సభకు అడ్డుతగలడంతోపాటు బిజినెస్ రూల్స్‌కు విరుద్ధంగా సెల్‌ఫోన్లతో వీడియోలు చిత్రీకరిస్తుండగా అధికార పక్ష సభ్యులు రోజా, ఉషశ్రీ చరణ్‌లు స్పీకర్ దృష్టికి తీసుకెళ్లారు. తొలుత పయ్యావుల కేశవ్‌ను ఒక రోజే సస్పెండ్ చేసినా.. నిబంధనలు తుంగలో తొక్కి వీడియోలు చిత్రీకరించినందుకు ప్రస్తుత సభాకాలం మొత్తానికి సస్పెండ్ చేస్తున్నట్టు స్పీకర్ ప్రకటించారు. సస్పెండ్ అయిన సభ్యులు ఎంతకీ సభలోనే నినాదాలు చేస్తుండటంతో వారిని బయటకు పంపించాలని స్పీకర్ మార్షల్స్‌ను ఆదేశించారు.

సెల్‌ఫోన్లు సభ బయటే..

శాసనసభలో సభ్యులు సెల్‌ఫోన్ల వినియోగంపై స్పీకర్ స్పష్టమైన రూలింగ్ ఇవ్వాలని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు. జీరో అవర్‌లో మాట్లాడిన మంత్రి.. ప్రతిపక్ష సభ్యులు నిబంధనలకు విరుద్ధంగా సెల్‌ఫోన్లు పట్టుకుని వీడియోలు తీయడాన్ని తప్పుపట్టారు. 'సెల్‌ఫోన్లు సభలోకి తీసుకురావచ్చా? తీసుకొస్తే వీడియోలు తీయొచ్చా? స్పీకర్ రూలింగ్ ఇవ్వాలి' అని కోరారు. రూలింగ్ ఇచ్చిన తర్వాత కూడా నియమాలను ఉల్లంఘిస్తే ఎటువంటి శిక్ష విధించాలో కూడా చెప్పాలన్నారు. లేకుంటే సభలో వీడియోలు తీసి సామాజిక మాధ్యమాల్లో తమకు నచ్చినట్టు చిత్రీకరించుకుని సమాజాన్ని తప్పుదారి పట్టిస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. అయితే రూలింగ్‌పై స్పీకర్ స్పందిస్తూ ఎటువంటి ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్, ఫోన్లు, కెమెరాలు సభలో వినియోగించకూడదని బిజినెస్ రూల్స్‌లో స్పష్టంగా ఉన్నాయని చదివి వినిపించారు. అయినప్పటికీ సభ్యుల సెల్‌ఫోన్లను సభ వెలుపలే డిపాజిట్ చేసిన తర్వాత లోనికి వచ్చేలా విధానాన్ని తీసుకొస్తామన్నారు. జీరో అవర్ అనంతరం సభను శుక్రవారానికి వాయిదా వేశారు.

మీసం మెలేసి కవ్వించిన బాలకృష్ణ

మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతుండగా హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ మీసం మెలేసి 'చూసుకుందాం రా' అన్నట్టు వేలు చూపిస్తూ కవ్వించారు. బాలకృష్ణ చర్యలను తప్పుబట్టిన మంత్రి రాంబాబు మీసాలు మెలేయడానికి ఇదేమి సినిమా కాదని హితవుపలికారు. ఈలోగా వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు కొందరు కలుగజేసుకుని టీడీపీ ఎమ్మెల్యేల తీరును తప్పుపడుతూ మాట్లాడారు. ఇరుపక్షాల మధ్య కొద్దిసేపు మాటల యుద్ధం నడిచింది. గందరగోళ పరిస్థితుల మధ్య సభ అదుపు తప్పుతుండటంతో స్పీకర్ సభను కొద్ది నిమిషాలు వాయిదా వేశారు. తిరిగి 11.05 గంటలకు సభ ప్రారంభం కాగానే.. టీడీపీ సభ్యులు మళ్లీ స్పీకర్‌ను ముట్టడించేందుకు యత్నిస్తుండగా మార్షల్స్ వారిని అడ్డుకున్నారు. ఇక్కడా బాలకృష్ణ రెండోసారి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలను చూస్తూ వికృతంగా చప్పట్లు కొట్టారు. దీంతో మరోసారి రభస మొదలైంది. మంత్రి బుగ్గన మాట్లాడుతూ స్పీకర్ పట్ల అవమానకరంగా ప్రవర్తించి సభా మర్యాదలకు భంగం కలిగించిన టీడీపీ సభ్యులపై చర్యలు తీసుకోకుంటే ఇదే అలవాటైపోతుందని, వారిపై చర్యలు తీసుకోవాలని సిఫారసు చేశారు. టీడీపీ సభ్యులు పట్టు వీడకపోవడంతో వారి నినాదాల మధ్య స్పీకర్ అనౌన్స్‌మెంట్ ఇచ్చారు. 'సభ అత్యంత గౌరవించే సభాపతి స్థానాన్ని టీడీపీ సభ్యులు చుట్టుముట్టారు. సభాపతిని అగౌరవ పరిచేలా కాగితాలు విసిరివేశారు. ప్రజాస్వామ్యహితంగా నిరసన తెలుపకుండా సభ ఔన్నత్యాన్ని కించపరిచేలా తొడలు చరుస్తూ, మీసాలు మెలివేస్తూ వికృత చేష్టలకు ఒడిగట్టారు' అని ఆవేదన వ్యక్తంచేశారు. వెల్‌లోకి వచ్చి మీసాలు మెలివేసిన ఎమ్మెల్యే బాలకృష్ణ సభా సంప్రదాయాలకు తిలోదకాలు ఇచ్చారన్నారు. దీనిని మొదటి తప్పుగా భావిస్తున్నామని.. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా చూసుకోవాలని హెచ్చరించారు.

ఉద్దేశ పూర్వకంగానే టీడీపీ రాద్ధాంతం

• ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా

శాసన సభ వేదికగా అవినీతికి పాల్పడి, పేద విద్యార్థులను మోసం చేసిన వ్యక్తికి వత్తాసు పలుకుతూ ప్రతిపక్ష సభ్యులు రాద్ధాంతం చేయడం సిగ్గుచేటని ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా మండిపడ్డారు. ఉద్దేశ పూర్వకంగా స్పీకర్ స్థానాన్ని అగౌరవ పరుస్తూ ప్రభుత్వ ఆస్తులను నాశనం చేస్తున్న సభ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ట్రెజరీ బెంచ్ సభ్యులను రెచ్చగొట్టేలా ప్రతిపక్షం వ్యవహరిస్తోందన్నారు. చంద్రబాబు దోపిడీకి పూర్తి ఆధారాలున్నందునే జైలుకు వెళ్లగా, దాని నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే టీడీపీ సభ్యులు సభాకాలాన్ని దుర్వినియోగం చేస్తున్నారన్నారు.

మండలిలోనూ మితిమీరిన టీడీపీ

- చైర్మన్ పోడియం పైకి ఎక్కి నినాదాలు
- సభా మర్యాద పాటించాలని చైర్మన్ మోషేన్ రాజు పలుమార్లు విన్నపం.. అయినా వినని టీడీపీ సభ్యులు
- అలా అయితే.. నా సీటులో కూర్చోండి అంటూ చైర్మన్ ఆగ్రహం
- ఇది పెద్దల సభ. సభ గౌరవాన్ని నిలబెట్టండి అంటూ వ్యాఖ్య
- మూడు విడతలు వాయిదా వేసినా తీరు మారని టీడీపీ
- సభను శుక్రవారానికి వాయిదా వేసిన చైర్మన్


టీడీపీ సభ్యులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న చైర్మన్ మోషేన్‌రాజు

సాక్షి, అమరావతి: శాసన మండలిలోనూ తెలుగుదేశం పార్టీ సభ్యులు చైర్మన్ పోడియం పైకి ఎక్కి మితిమీరి వ్యవహరించారు. తెలుగుదేశం పార్టీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబు అరెస్టు వ్యవహారంపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నప్పటికీ, టీడీపీ ఎమ్మెల్సీలు ఉద్దేశపూర్వకంగా పోడియం పైకి వచ్చి సభా కార్యక్రమాలను అడ్డుకున్నారు. గురువారం శాసన మండలిలో చంద్రబాబు అరెస్టు వ్యవహారంపై చర్చకు పట్టుపడుతూ టీడీపీ ఎమ్మెల్సీలు వాయిదా తీర్మానం ఇచ్చారు. సీపీఎస్‌పై చర్చ కోరుతూ పీడీఎఫ్ ఎమ్మెల్సీలు మరో వాయిదా తీర్మానం ఇచ్చారు. సభ ప్రారంభం కాగానే ఈ రెండు వాయిదా తీర్మానాలను తిరస్కరిస్తున్నట్టు మండలి చైర్మన్ మోషేన్‌రాజు ప్రకటించారు. దీంతో టీడీపీ ఎమ్మెల్సీలు పోడియం వద్దకు వెళ్లి నినాదాలు మొదలెట్టారు. పోడియంపైకి రావడం మంచిది కాదని, సభ్యులు తమ స్థానాల్లో కూర్చోవాలని చైర్మన్ చెప్పారు. అయినా పరిస్థితి సానుకూలంగా లేకపోవడంతో సభను కొద్దిసేపు వాయిదా వేశారు.

సభ తిరిగి ప్రారంభమయ్యాక కూడా..

వాయిదా అనంతరం సభ తిరిగి ప్రారంభమవుతుండగా, చైర్మన్ రాకముందే టీడీపీ ఎమ్మెల్సీలు పోడియం పైన చేరారు. చైర్మన్ లోపలికి వస్తూనే, పోడియంపైన టీడీపీ సభ్యులను చూసి తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఇటీవలే కొత్తగా ఎన్నికై తొలిసారి సమావేశాలకు హాజరవుతున్న టీడీపీ ఎమ్మెల్సీ శ్రీకాంత్ కూడా పోడియంపైన ఉండడం చూసి.. 'శ్రీకాంత్ గారూ మీరు కొత్తగా వచ్చారు. సభ మొదలు కాకమునుపే మీరు పోడియం పైకి రావడం సభా మర్యాద కాదు. కిందకు దిగండి' అని సూచించారు. అయినా టీడీపీ ఎమ్మెల్సీలు పోడియంపైనే ఉన్నారు. దీంతో చైర్మన్ తన సీటులో కూర్చోకుండా.. టీడీపీ ఎమ్మెల్సీలను ఉద్దేశించి 'సభ మొదలుకాక మునుపే పోడియంపైకి వచ్చి కూర్చుంటే ఎలా? లేకపోతే ఇక్కడ (తాను కూర్చునే సీటును చూపిస్తూ) కూర్చొండి వచ్చి' అంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సభ్యులు తమకు ఉండే ప్రివిలేజీ మేరకు వారు చెప్పదలుచుకున్నది సభలో చెప్పవచ్చు గానీ, ఇలా ప్రవర్తించడం మర్యాద అనిపించుకోదన్నారు. ఇది పెద్దల సభ అని, మర్యాద పాటించి సభ గౌరవాన్ని నిలబెట్టాలని విజ్ఞప్తి చేశారు. ఇలానే ప్రవర్తిస్తే కఠిన చర్యలు ఉంటాయని తీవ్రంగా హెచ్చరించారు. అప్పటికీ టీడీపీ ఎమ్మెల్సీలు వెళ్లకపోవడంతో 'మీకు కావాల్సింది కూడా అదేనా..' అని చైర్మన్ అన్నారు. పీడీఎఫ్ ఎమ్మెల్సీ సాబ్జీ స్పెషల్ మెన్షన్ వినిపించే సమయంలోనూ టీడీపీ ఎమ్మెల్సీలు ఆందోళన చేస్తుండడంతో మంత్రి జోగి రమేష్ జోక్యం చేసుకుని చంద్రబాబు అరెస్టు వ్యవహారంపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అయితే, టీడీపీ ఎమ్మెల్సీలే మండలి ప్రతిష్టను, చైర్మన్ స్థానాన్ని అగౌరవపరిచేలా వ్యవహరిస్తున్నారని అన్నారు.

టీడీపీ వర్సెస్ వైఎస్సార్‌సీపీ

చైర్మన్ ఎంత చెప్పినా వినకుండా టీడీపీ ఎమ్మెల్సీలు పోడియంపైనే ఉండి నినాదాలు చేశారు. ఇందుకు ప్రతిగా అధికార వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీలు పలువురు తమ స్థానాల వద్ద నిల్చొని 'అవినీతి పరుడు చంద్రబాబు డౌన్ డౌన్' అంటూ నినాదాలు చేశారు. ఈ సమయంలో మండలి చైర్మన్ మోషేన్‌రాజు రెండోసారి సభను వాయిదా వేశారు. సభ తిరిగి ప్రారంభమయ్యాక కూడా పరిస్థితిలో మార్పు రాకపోవడంతో మరోసారి వాయిదా వేశారు. నాలుగో విడత సభ ప్రారంభమయ్యాక కూడ టీడీపీ ఎమ్మెల్సీల తీరులో మార్పు లేకపోవడంతో సభను శుక్రవారానికి వాయిదా వేస్తున్నట్టు మండలి చైర్మన్ ప్రకటించారు.

కళ్యాణమస్తు, షాదీతోఫా ఆపే ప్రసక్తే లేదు

• అసెంబ్లీలో మంత్రి నాగార్జున



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, భవన నిర్మాణ కార్మికుల పిల్లలు వివాహాలను గౌరవప్రదంగా నిర్వహించుకోవాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కళ్యాణమస్తు, షాదీతోఫా పథకాలను ఆపే ప్రసక్తే లేదని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున స్పష్టంచేశారు. ఈ పథకాలను ఆపేస్తోందంటూ చేస్తున్న అసత్య ప్రచారాన్ని, ప్రభుత్వంపై బురదజల్లడాన్ని టీడీపీ మానుకోవాలని అన్నారు. మంత్రి అసెంబ్లీలో గురువారం ఉదయం ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యుల ప్రశ్నలకు సమాధానమిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పథకాల ద్వారా నిరుపేదలకు మరింత ఆర్థిక చేయూత ఇచ్చే సంకల్పంతో అనేక మార్పులు తీసుకొచ్చారని చెప్పారు. చంద్రబాబు ప్రభుత్వం 17,709 మంది లబ్ధిదారులకు రూ.68.68 కోట్లు ఎగ్గొట్టిందని చెప్పారు. ఆ డబ్బు కూడా తమ ప్రభుత్వం చెల్లించిందని తెలిపారు. చంద్రబాబు ప్రభుత్వంలో కళ్యాణమస్తు పథకం కింద ఎస్సీలకు రూ.40 వేలు ఇవ్వగా, ఇప్పుడు వైఎస్ జగన్ ప్రభుత్వం రూ.లక్ష ఇస్తోందని తెలిపారు. వీరు కులాంతర వివాహాలు చేసుకుంటే ఇచ్చే మొత్తాన్ని రూ.75 వేల నుంచి రూ.లక్షకు పెంచామన్నారు. గిరిజనులకు గతంలో రూ.50 వేలు ఇవ్వగా, ఈ రోజు రూ. లక్ష ఇస్తున్నామని, కులాంతర వివాహాలు చేసుకుంటే ఇచ్చే మొత్తాన్ని రూ.75 వేల నుంచి రూ.1.20 లక్షలకు పెంచామని తెలిపారు. బీసీ వర్గాలకు ఇచ్చే మొత్తాన్ని రూ.35 వేల నుంచి రూ.50 వేలకు, వీరు కులాంతర వివాహం చేసుకుంటే ఇచ్చే మొత్తాన్ని రూ.50 వేల నుంచి రూ.75 వేలకు పెంచామని వివరించారు. మైనార్టీలకు గతంలో రూ.50 వేలే ఇస్తే, ప్రస్తుతం రూ.లక్ష ఇస్తున్నామని చెప్పారు. వికలాంగులకు గతంలో రూ.లక్ష ఇవ్వగా, ఈరోజు రూ.1.50 లక్షలు ఇస్తున్నామన్నారు. భవన నిర్మాణ కార్మికులకు గతంలో రూ.20 వేలు ఇస్తే, ప్రస్తుతం రూ.40 వేలు ఇస్తున్నట్లు చెప్పారు. కొత్తగా దూదేకుల, నూర్‌బాషా సామాజికవర్గాల వారిని మైనార్టీలుగా పరిగణించి, వారికి కూడా రూ.లక్ష చొప్పున ఇస్తున్నామని చెప్పారు. ఈ విధంగా ఈ 4 ఏళ్లలో 35 వేల దంపతులకు రూ.267 కోట్ల లబ్ధి చేకూర్చామన్నారు. ఈ పథకాల ద్వారా ఆర్థిక సాయం ఒక్కటే కాదు.. బాల్య వివాహాలను అరికట్టడంతో పాటు వారి అక్షరాస్యతను పెంపొందించేలా నిబంధనలు పెట్టామన్నారు. మొదటి వివాహం చేసుకున్న వారికి మాత్రమే ఈ ఆర్థిక సాయం అందిస్తున్నామని చెప్పారు. అత్యంత సమర్థవంతంగా పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. ఎమ్మెల్యే విశ్వసరాయ కళావతి మాట్లాడుతూ నిరుపేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, వికలాంగులకు కళ్యాణమస్తు, షాదీ తోఫా పథకాలు వరమేనని చెప్పారు. గొప్ప ఆశయంతో ఈ పథకాలను అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆయా వర్గాలు జీవితాంతం రుణపడి ఉంటాయని అన్నారు.

గూండాలు, సైకోల్లా టీడీపీ సభ్యులు

మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ధ్వజం

మీడియా పాయింట్

సాక్షి, అమరావతి: శాసన సభలో ప్రతిపక్ష టీడీపీ సభ్యులు గూండాలు, సైకోల్లా వ్యవహరించారని వైఎస్సార్‌సీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు చెప్పారు. వారు గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ.. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో చంద్రబాబు అరెస్టుపై టీడీపీ సభ్యులు సభ ప్రారంభంలోనే చేసిన రచ్చను తీవ్రంగా తప్పుబట్టారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌పై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, తగిన ఫార్మాట్‌లో వస్తే ఎంతసేపైనా చర్చిద్దామని చెబుతున్నా వినిపించుకోకుండా పోడియం వద్దకు వెళ్లి స్పీకర్‌ను చుట్టుముట్టి, ఆయనపై కాగితాలు విసిరి, మానిటర్‌ను, గ్లాసును పగులగొట్టి టీడీపీ సృష్టించిన గందరగోళం సభా కార్యకలాపాలకు తీవ్ర విఘాతం కలిగించిందని తెలిపారు. హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ సభలో మీసం మెలేసి, తొడగొట్టడాన్ని తీవ్రంగా ఖండించారు. సభ్యుల వ్యాఖ్యలు వారి మాటల్లోనే..

రచ్చకోసమే అసెంబ్లీకి..



టీడీపీ నేతలు రచ్చ కోసమే అసెంబ్లీకి వస్తున్నారు. ఏదో ఒక కారణంతో సభ నుంచి పారిపోతున్నారు. సభలో రేపు స్కిల్ డెవలప్‌మెంట్ పైన చర్చిస్తున్నాం. 26న ఫైబర్ నెట్, 27న ఇన్నర్ రింగ్ రోడ్డుపై చర్చ ఉంది. ధైర్యం ఉంటే టీడీపీ చర్చకు రావాలి. సభలో బాలకృష్ణ నిజమైన సైకోలా కనిపించాడు.

– ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

స్కామ్ జరలేదని చెప్పరేం?



స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్ జరగలేదని టీడీపీ చెప్పడంలేదు. స్పీకర్ చర్చిద్దామని చెబుతున్నా టీడీపీ ముందుకు రావడంలేదు. చంద్రబాబును అరెస్టు చేయకూడదని అంటున్నారే తప్ప స్కిల్ స్కామ్ గురించి మాట్లాడటంలేదు. చంద్రబాబును ఎందుకు అరెస్టు చేశారో ప్రజలకు తెలిపేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఫైబర్ నెట్ కేసులో కూడా అవినీతి జరిగింది. ఈ ఐదు రోజుల్లో చంద్రబాబు అవినీతిపై చర్చించి ప్రజలకు పూర్తి వివరాలు వెల్లడిస్తాం.

– ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి


సభాపతి పట్ల అమర్యాదగా ప్రవర్తించారు



సభలో టీడీపీ సభ్యులు దారుణంగా వ్యవహరించారు. బాలకృష్ణ సినిమాల్లో మాదిరిగా తొడలు కొడుతూ, మీసాలు తిప్పడం దురదృష్టకరం. సస్పెన్షన్ తర్వాత కూడా టీడీపీ సభ్యులు సభా మర్యాదలను పాటించలేదు. పయ్యావుల కేశవ్ సెల్ ఫోన్‌తో చిత్రీకరించాలని చూశారు. సభ నుంచి బయటకు వచ్చి ప్రజలకు వేరే విధమైన సంకేతాలు ఇవ్వాలన్నదే వారి ప్రయత్నం. టీడీపీ వారు మీసాలు తిప్పినా, తొడలు కొట్టినా జనం నమ్మే పరిస్థితి లేదు.

– మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ


ఫ్లూటు జింక ముందు ఊదు.. సింహం లాంటి జగన్ ముందు కాదు



టీడీపీ సభ్యులు సభలో గూండాలు, సైకోల్లా ప్రవర్తించారు. స్పీకర్ చైర్ మీద గౌరవం లేకుండా స్పీకర్ చుట్టూ చేరి అరుస్తూ పేపర్లు చింపేసి మొహం మీద విసిరేశారు. మానిటర్, మంచి నీటి గ్లాస్ పగులగొట్టారు. శాసన సభ సమావేశాలను బాలకృష్ణ షూటింగ్ అనుకుంటున్నాడేమో. మీసాలు తిప్పుతూ, తొడలు కొడుతున్నాడు. ఏ రోజూ ప్రజా సమస్యలను ప్రస్తావించని బాలకృష్ణ.. బావ కళ్లల్లో ఆనందం చూడటానికి అసెంబ్లీకి వచ్చినట్టున్నాడు. తండ్రి ఎన్టీఆర్ మీద చెప్పులు వేసినప్పుడు చంద్రబాబుపై బాలకృష్ణ మీసాలు తిప్పి ఉంటే రాష్ట్ర ప్రజలు హర్షించేవారు. చంద్రబాబు అవినీతి చేసి దొరికిపోయిన దొంగ. బాలకృష్ణా.. ఫ్లూటు జింక ముందు ఊదు.. సింహం వంటి జగన్ ముందు కాదు. బాలకృష్ణకు తెలిసిందల్లా షూటింగ్‌లకు వెళ్లడం... ఈవెంట్లలో ఆడవాళ్లను గౌరవం లేకుండా మాట్లాడటం. సభలో చర్చ జరిగితే చంద్రబాబు అవినీతి ఆధారాలను పెద్ద స్క్రీన్లపై చూపిస్తామనే భయంతోనే టీడీపీ రివర్స్ డ్రామా ఆడింది. దమ్ము, ధైర్యం ఉంటే బాలకృష్ణ చర్చకు సిద్ధమై సభకు రావాలి. ఎంత సేపైనా చర్చించేందుకు మేం సిద్ధం. సెంట్రల్ జైలు చంద్రబాబు కట్టిందేనని వాళ్లే చెబుతున్నారు. అంటే ఇన్నాళ్లూ అక్కడ ఖైదీలకు ఏ సదుపాయాలూ లేకపోయినా పర్లేదు కానీ చంద్రబాబుకు ఉండాలా?.

– మంత్రి ఆర్కే రోజా

బాబుకు తప్పించుకునే అవకాశం లేదు



స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో సాక్ష్యాధారాలతో దొరికిన చంద్రబాబుకు తప్పించుకొనే అవకాశం లేదు. చంద్రబాబు అనేక పాపాలు, నేరాలు, ఘోరాలకు పాల్పడ్డారు. కాంగ్రెస్‌ని, ఎన్టీఆర్‌ని వెన్నుపోటు పొడిచారు. ఒక ఎమ్మెల్సీని కొంటూ దొరికారు. మీడియా బలంతో బయట పడ్డారు. చివరికి చట్టానికి దొరికారు. కోట్లు ఖర్చు పెట్టి పెద్దపెద్ద లాయర్లను తెచ్చారు. వారు కూడా నేరం జరగలేదని అనటంలేదు. టెక్నికల్ అంశాలనే ప్రస్తావిస్తున్నారు. టీడీపీ సభ్యులు అసెంబ్లీ వేదికగా చంద్రబాబు పాపాలను ఒప్పుకోవాలి. దొంగను పట్టుకుంటే సానుభూతి రాదు. నకిలీ సర్వేలతో సానుభూతి పొందాలని చూస్తే ఉపయోగం లేదు.

– మంత్రి అంబటి రాంబాబు

కోర్టులకు వెళ్లి స్టేలు తెచ్చుకోవడం బాబు నైజం



స్కిల్ స్కామ్‌లో అడ్డంగా దొరికిన చంద్రబాబు రాజమండ్రి జైల్లో కూర్చుని సత్య హరిశ్చంద్రుడిని అంటూ బిల్డప్ ఇస్తున్నాడు. కోర్టులకు వెళ్లి స్టేలు తెచ్చుకోవడం బాబు నైజం. స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో యువతను దోచుకున్నాడు. సభలో బాలకృష్ణ తీరు చాలా అభ్యంతరకరంగా ఉంది. ఎమ్మెల్యేగా ఏనాడైనా బాలకృష్ణ ప్రజల సమస్యలపై చర్చించాడా? తండ్రిని వెన్నుపోటు పొడిచినప్పుడు, ఆయనపై చెప్పులు వేయించినప్పుడు బాలకృష్ణ పౌరుషం ఏమైంది? కక్ష సాధించాలంటే చంద్రబాబును ఎప్పుడో అరెస్టు చేసే వాళ్లం.

– ఎమ్మెల్సీ పోతుల సునీత

టీడీపీ సభ్యులకు భయం



చంద్రబాబు అవినీతిపై చర్చ అంటే టీడీపీ సభ్యులకు భయం. వారు చంద్రబాబు అరెస్టు పైనే మాట్లాడుతున్నారు. స్కిల్ స్కామ్‌పై చర్చిద్దామంటే పారిపోతున్నారు. స్కామ్‌పై చర్చిస్తే దొరికిపోతామన్నది వారి ఆందోళన. చంద్రబాబును ఎందుకు అరెస్ట్ చేశారో ప్రజలకు తెలిపేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఈ సమావేశాల్లోనే కచ్చితంగా చంద్రబాబు అవినీతిపై చర్చించి నిజానిజాలను ప్రజల ముందుంచుతాం.

– ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు

సాక్షి ఫ్యామిలీ
చెన్నై
శుక్రవారం ॥ 22-9-2023

ఫ్యాషన్

నేచర్ నేస్తం



నిత్యాశెట్టి

యువ ఆలోచనల్లో పర్యావరణం కళగా రూపుదిద్దుకుంటోంది ఫ్యాషన్ వేర్‌లో ప్రత్యేకతతో పాటు నేచర్ పట్ల బాధ్యతనూ తెలుసుకుంటుంది. మనవైన చేనేతలు పెద్దవాళ్లకే సూట్ అవుతాయన్న ఆలోచన నుంచి మోడర్న్ టర్న్ తీసుకుంటోంది. హ్యాండ్లూమ్స్‌తో ఇండోవెస్టర్న్ స్టైల్స్ ఆకట్టుకునేలా డిజైన్ చేయిస్తోంది హైదరాబాద్ వాసి, నటి, మోడల్ నిత్యాశెట్టి. హ్యాండ్లూమ్స్‌తో తన జర్నీ ఎప్పుడూ ప్రత్యేకమే అని చెబుతోంది నిత్య.





‘‘హ్యాండ్లూమ్స్ అంటే నేటితరం చీరలు, కుర్తా పైజామా వరకే అనుకుంటారు. కానీ, యువత ధరించేందుకు వీలుగా రెగ్యులర్ వేర్‌గా, ఫ్యాషన్ వేర్‌గా హ్యాండ్లూమ్స్‌ను తీసుకు రావాలనుకున్నాను. ఇందుకు.. పోచంపల్లి, పుట్టపాక, పెడన, ఒరిస్సా, భువనేశ్వర్ హ్యాండ్లూమ్స్ వారిని కలిశాను. వీటిలో నుంచి చందేరీ, ఇక్కత్, చికంకారి, శిబోరీ, బాందినీ, టై అండ్ డై .. వంటివి డ్రెస్ డిజైన్స్‌లో ప్రధానంగా తీసుకున్నాను. హ్యాండ్లూమ్స్‌తో బ్లేజర్లు, ఖఫ్తాన్స్, ప్లాజో, లాంగ్ అండ్ షార్ట్ ఫ్రాక్స్, షర్ట్స్.. నేటి యువతకు మెచ్చేలా మెన్ అండ్ ఉమెన్‌కి క్యాజువల్ అండ్ ఆఫీస్‌వేర్ ‘ఇతిహాస’ పేరుతో రూపొందిస్తున్నాం. ఈ ఇండో–వెస్టర్న్ స్టైల్స్‌తో నేటితరానికి మన హ్యాండ్లూమ్స్‌ని దగ్గర చేయాలని, చేనేత కారులకు ఉపాధి అవకాశాలను మెరుగుపరచాలన్నదే నా ఆలోచన.







ప్రొఫెషనల్స్ కాదు...

ఈ డ్రెస్సులు ధరించడానికి మోడల్స్ ఎవరూ ప్రొఫెషనల్స్ కాదు. సాఫ్ట్‌వేర్, వెయిట్రెస్, ఇంటీరియర్ డిజైనర్, డెంటిస్ట్.. ఇలా ఇతర రంగాలలో ఉద్యోగాలు చేసుకుంటున్న వారు నేను చేసే డ్రెస్సులకు మోడల్స్‌గా చేస్తున్నారు. ఏ రంగంలో ఉన్నవారైనా వీటి ద్వారా దుస్తులు మన క్యారెక్టర్‌ని చూపాలన్నదే మెయిన్. మేకప్ వంటి హంగులేవీ లేకుండా నేచరల్‌గా మా డిజైన్స్‌ని ప్రెజెంట్ చేయాలనుకున్నాను. దీనివల్ల అందరికీ రీచ్ అయ్యే అవకాశం ఉంటుంది. ఇటీవల నేషనల్ హ్యాండ్లూమ్ డే రోజున నిర్వహించిన ఫ్యాషన్ షోలో మా డిజైన్స్‌ని కూడా ప్రదర్శించి, మాదైన ప్రత్యేకతను చూపాం. హ్యాండ్లూమ్ ఎగ్జిబిషన్స్‌లో స్టాల్స్ పెట్టి, మా వర్క్‌ని మరింత మందికి చేరువయ్యేలా చూస్తున్నాను. బ్రెజిల్‌లో జరగబోయే కార్యక్రమానికి తెలుగు రాష్ట్రాల నుంచి పది యూనిట్స్ వెళుతున్నాయి. అందులో మా ఇతిహాస కూడా ఉండటం నాకు చాలా ఆనందాన్నిస్తుంది’’ అని వివరిస్తున్నారు నిత్య.

రిఫ్రిజిరేటర్‌లో ప్రతిదీ... తోసేయకండి

సీజన్‌తో పనిలేకుండా అన్నిరకాల ఆహార పదార్థాలను రిఫ్రిజిరేటర్‌లో పెట్టేస్తుంటారు కొందరు. అయితే అన్నింటిని రిఫ్రిజిరేటర్‌లో పెట్టాల్సిన అవసరం లేదని చెబుతున్నారు నిపుణులు. ఐదురకాల ఆహారాలను రిఫ్రిజిరేటర్లో పెట్టాల్సిన అవసరం అసలు లేదు. అవేంటో చూడండి...

- సాస్, జామ్, జెల్లీలను రిఫ్రిజిరేటర్‌లో పెట్టాల్సిన అవసరంలేదు.
- టొమాటోలను ఫ్రిడ్జ్‌లో పెట్టడడం వల్ల వాటిలోని సహజసిద్ధమైన రుచి పోతుంది. వీటిని బయట ఉంచితేనే తాజాగా.. రుచిగా ఉంటాయి.
- అరటి పండ్లు త్వరగా పండిపోతాయని రిఫ్రిజిరేటర్‌లో పెడుతుంటారు. ఇది మంచిది కాదు. అరటిపండ్లను గది ఉష్ణోగ్రత వద్ద ఉంచితేనే మంచిది.
- బ్రెడ్ స్లైసులను రిఫ్రిజిరేటర్‌లో ఉంచితే త్వరగా పాడైపోతాయి.
- పీచ్, ప్లమ్, బ్లాక్‌బెర్రీ, ఆవకాడోలను రిఫ్రిజిరేటర్‌లో కంటే బయటే ఉంచాలి.



మెంటలిస్ట్

ఆకట్టే కనికట్టు

సుహానీ షాను ఇండియాలో ఏకైక ఫీమేల్ మెంటలిస్ట్ అంటారు. ఇప్పటికి 5000 ప్రదర్శనలు ఇచ్చిన సుహానీ స్టేజ్ మీద ప్రేక్షకులను దిగ్భ్రమ పరిచే చమత్కారాలు చేస్తుంది. సంప్రదాయ మేజీషియన్ల వేషంలో కాకుండా ఆధునికమైన ఆహార్యంలో ఆమె భ్రాంతిని, విభ్రాంతిని, కనికట్టును ప్రదర్శిస్తుంది. అందుకే దేశంలోని ఏదో ఒక నగరంలో ఆమె ప్రదర్శనకు సంబంధించిన ప్రకటన కనపడుతూనే ఉంటుంది. సుహానీ సక్సెస్ స్టోరీ.

సుహానీ షా తన షోలో మిమ్మల్ని స్టేజ్ మీదకు పిలుస్తుంది. మీరెవరో ఆమెకు తెలియదు. ఆమెతో మీరు ఎప్పుడూ మాట్లాడి ఉండరు. ‘మీకు ఇష్టమైన పాట తలుచుకుని మనసులో పాడుకోండి’ అంటుంది. మీరు ఒక నిమిషం మనసులో పాడుకుంటారు. అప్పుడు సుహానీ షా



సుహానీ షా

తన చేతిలోని సెల్‌ఫోన్‌లో ఒక పాట మ్యూట్‌లో ప్లే చేసి పక్కన పెట్టి, మీరు ఏ పాట అనుకున్నారో మైక్‌లో చెప్పండి అంటుంది. ‘మౌనంగానే ఎదగమని’ అని మీరు అంటారు. ఆ ఫోన్‌లో చూడండి అంటుంది. ఆశ్చర్యం. అందులో అదే పాట అప్పటికే ప్లే అవుతూ ఉంటుంది. మీరు మనసులో అనుకున్న పాట ఆమెకు ఎలా తెలిసింది?

అదే మైండ్ రీడింగ్.

మళ్లీ ఇంకొకరిని పిలుస్తుంది. ‘ఎవరినైనా మీకు పరిచయమున్న వ్యక్తిని తలుచుకోండి’ అంటుంది. అతను తలుచుకుంటాడు. ఫ్రెండా? అడుగుతుంది. బంధువు అంటాడు. మీరు కళ్లు మూసుకుని ఆ మనిషిని మీ ఎదురుగా ఊహించుకోండి అంటుంది. ఆ తర్వాత తన చేతిలో ఉన్న పలక మీద ఒక పేరు రాసి పక్కన పెడుతుంది. కళ్లు తెరిచి మీరు తలుచుకున్న వ్యక్తి పేరు చెప్పండి అంటుంది. అతను చెప్తాడు. పలక చూపిస్తుంది. ఆశ్చర్యం. ఆ పలక మీద అప్పటికే ఆమె ఆ పేరు రాసి ఉంది.

అదీ మైండ్ రీడింగే.

ఇలాంటివి చేసే మహిళ మన దేశంలో సుహానీ షా ఒక్కర్తే ఉంది. అందుకే ఆమె భారత దేశ ఏకైక ఉమన్ మెంటలిస్ట్.

చిన్నప్పటి నుంచి

సుహానీ షాది రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్. ఏడేళ్ల నుంచే మేజిక్ చేయడం మొదలెట్టింది. ఆ మేజిక్‌లు పెద్ద హిట్ అయ్యేసరికి స్కూల్‌కు వెళ్లే వీలే కలగలేదు. దేశ విదేశాలు మేజిక్‌లు చేస్తూ వెళ్లింది. దాంతో 14 ఏళ్ల వరకు ఆమెకు రాయడం రాదు. 16 ఏళ్ల వరకు ఇంగ్లిష్ మాట్లాడటం రాదు. కాని ఇప్పుడు నాలుగైదు భాషలు అనర్గళంగా మాట్లాడుతుంది. ‘సాకులు చెప్పొద్దు’ అంటుంది ఎవరైనా ఏదైనా రాదు అంటే. ‘నేర్చుకోవాలనే సంకల్పం ముఖ్యం’ అంటుంది. సుహానీ షా మొదట మేజిక్‌లు చేస్తూ, తర్వాత ఇల్యూషన్స్ చేస్తూ, ఆ తర్వాత మైండ్ రీడర్‌గా మారింది.

మెంటలిస్ట్ అంటే?

మెజీషియన్‌లాగా సంగీతం, ఎక్విప్‌మెంట్, హంగామా ఏమీ ఉండదు. సరికొత్త ఆహార్యంలో ఒక్కరే వచ్చి స్టేజ్ మీద నుంచి ప్రేక్షకులను ఆకట్టుకోవాలి. ఎదురుగా కూచున్న వారిలో ఒకరి పెళ్లిరోజు ఏదో చెప్పడం, ఒకరి ఫోన్ తీసుకుని అన్‌లాక్ చేయడం, ఒకరి గతాన్ని చెప్పడం, మరొకరి భవిష్యత్తును చెప్పడం, మనసులో అనుకున్న అంకెలు తెలియచేయడం... ఇవన్నీ మెంటలిస్ట్ చేస్తారు. సుహానీ షా తాను ఒక్కతే స్టేజ్ మీద నిలబడి ప్రేక్షకులను ఆశ్చర్య పరుస్తుంది. ‘ఇందుకు దివ్యశక్తులు ఏమీ అక్కర్లేదు. సాధనతో సాధించిన స్కిల్ ఇది’ అంటుంది సుహానీ షా. ‘మామూలు మేజిక్‌లు చాలా కాలం చేశాక దీనికంటే పై స్థాయికి వెళ్లాలని ఎదుటివాళ్ల మైండ్ రీడింగ్ చేయాలని కొన్నాళ్ల పాటు హిమాలయాలకు వెళ్లి షో డిజైన్ చేస్తూ కూచున్నాను. మూడు నాలుగేళ్లుగా మెంటలిస్ట్‌గా షోలు చేస్తున్నాను’ అంటుంది సుహానీ.

మోటివేషనల్ స్పీకర్

సుహానీ కేవలం షోస్ మాత్రమే చేయదు. యూట్యూబ్‌లో పర్సనాల్టీ డెవలప్‌మెంట్ మీద వీడియోలు చేస్తుంది. ఆమెకు గోవాలో హిప్నో క్లినిక్ ఉంది. దురవాట్లను మాన్పించడంలో ఆమె వ్యక్తులకు సాయపడుతుంటుంది. ‘జీవితంలో ఏ పనీ చేయనివారు ఏదో ఒకటి సాధించాలని అనుకోని వారు తమ జీవితాలను వృథా చేసుకుంటున్నట్టు లెక్క’ అంటుందామె.

సుహానీకి లక్షల కొద్ది అభిమానులు ఉన్నారు. ఆమె షోస్ నగరాల్లో జరుగుతూనే ఉంటాయి. ఈసారి మీ దృష్టికి వస్తే వెళ్లి చూడండి.

వంటిల్లు

22 క్యారట్ టేస్ట్

పచ్చిగా, కచ్చాపచ్చాగా, ఉడికించి... ఎలా తిన్నా టేస్టీగానే ఉంటుంది క్యారట్. అందుకే కరకరల క్యారట్‌ను మరింత రుచిగా ఇలా కూడా వండుకోవచ్చని చెబుతోంది ఈ వారం వంటిల్లు...



క్యారట్ ఫ్రిట్టర్స్

కావలసినవి: క్యారట్ – మూడు; ఉల్లిపాయ – ఒకటి; వెల్లుల్లి పేస్టు – టీస్పూను; కొత్తిమీర తరుగు – రెండు టేబుల్ స్పూన్లు; ఎండుమిర్చి తరుగు – టీస్పూను; మిరియాల పొడి – అరటీస్పూను; గుడ్డు – ఒకటి; గోధుమ పిండి – నాలుగు టేబుల్ స్పూన్లు; వంటసోడా – టీస్పూను; ఉప్పు – రుచికి సరిపడా; నూనె – ఫ్రైకి సరిపడా.

తయారీ: ● క్యారట్‌లను శుభ్రంగా కడిగి తొక్కతీసి సన్నగా తురుముకోవాలి ● ఉల్లిపాయను ముక్కలు తరగాలి ● గిన్నెలో క్యారట్ తురుము, ఉల్లిపాయ ముక్కలు, వెల్లుల్లి పేస్టు, కొత్తిమీర తరుగు, ఎండుమిర్చి తరుగు, మిరియాల పొడి, వంటసోడా వేసి కలపాలి ● రుచికి సరిపడా ఉప్పు, గుడ్డుసొన వేసి పదినిమిషాలు పక్కన పెట్టుకోవాలి ● పదినిమిషాల తరువాత గోధుమపిండి వేసి ఉండలు లేకుండా చక్కగా కలపాలి ● బాణలిలో టేబుల్ స్పూను నూనెవేసి వేడెక్కిన తరువాత ఈ మిశ్రమాన్ని చిన్నచిన్న వడల్లా వేసి కాల్చాలి ● రెండు వైపులా గోల్డెన్ బ్రౌన్ కలర్‌లోకి మారేంత వరకు కాల్చితే క్యారట్ ఫ్రిట్టర్స్ రెడీ.



క్యారట్ మూంగ్‌దాల్ సలాడ్

కావలసినవి: క్యారట్ తురుము – కప్పు; పెసర పప్పు –పావు కప్పు; పచ్చికొబ్బరి తురుము – రెండు టేబుల్ స్పూన్లు; పచ్చిమిర్చి తరుగు – రెండు టీస్పూన్లు; నిమ్మరసం – రెండు టీస్పూన్లు; ఉప్పు – రుచికి సరిపడా; కొత్తిమీర తరుగు – టేబుల్ స్పూను.

తయారీ: ● పెసరపప్పుని శుభ్రంగా కడిగి గంటసేపు నానబెట్టుకోవాలి ● నానిన పప్పులో నీళ్లు వంపేసి పప్పుని పెద్ద గిన్నెలో వేయాలి ● ఈ పప్పులో క్యారట్ తురుము, కొబ్బరి, పచ్చిమిర్చి తురుము, నిమ్మరసం, ఉప్పువేసి చక్కగా కలపాలి ● చివరిగా కొత్తిమీర తరుగుతో వేసి సర్వ్‌చేసుకోవాలి.



క్యారట్ డిలైట్

కావలసినవి: క్యారట్స్ – అరకేజీ; పంచదార – అరకప్పు; కార్న్‌ఫ్లోర్ – పావు కప్పు; నీళ్లు – కప్పు; నెయ్యి – రెండు టేబుల్ స్పూన్లు; ఎండుకొబ్బరి తురుము – గార్నిష్‌కు సరిపడా.

తయారీ: ● క్యారట్ తొక్కతీసి శుభ్రంగా కడిగి ముక్కలు తరగాలి ● ముక్కలు మునిగే అన్ని నీళ్లు పోసి రెండు విజిల్స్ రానిచ్చి, చల్లారనివ్వాలి ● ముక్కలు చల్లారాక పేస్టులా గ్రైండ్ చేయాలి ● మెత్తని పేస్టుని వడగట్టాలి ● వడగట్టిన పేస్టులో పంచదార, కార్న్‌ఫ్లోర్, నీళ్లు వేసి కలపాలి ● మిశ్రమాన్ని చక్కగా కలిపిన తరువాత మందపాటి బాణలిలో వేయాలి ● మీడియం మంట మీద తిప్పుతూ ఉడికించాలి ● మిశ్రమం చిక్కబడినప్పుడు నెయ్యి వేసి తిప్పాలి ● అడుగంటుతున్నప్పుడు తీసి నెయ్యి రాసిన ప్లేటులో సమానంగా పోయాలి ● గంట తరువాత నచ్చిన ఆకారంలో ముక్కలు కోసి, కొబ్బరి తురుము అద్దుకుని సర్వ్ చేసుకోవాలి.



క్యారట్ పొరియాక్

కావలసినవి: క్యారట్ ముక్కలు – కప్పున్నర; నూనె – రెండు టేబుల్ స్పూన్లు; ఆవాలు – పావు టీస్పూను; జీలకర్ర – పావు టీస్పూను; ఎండు మిర్చి – రెండు; కరివేపాకు – రెండు రెమ్మలు; ఉల్లిపాయ – ఒకటి (సన్నగా తరగాలి); పచ్చిమిర్చి చీలికలు – మూడు; ఉప్పు – అరటీస్పూను; పసుపు – అర టీస్పూను; ఇంగువ – చిటికడు; పచ్చికొబ్బరి తురుము – పావు కప్పు.

తయారీ: ● క్యారట్ ముక్కలను మెత్తగా ఉడికించి పక్కన పెట్టుకోవాలి ● మందపాటి బాణలిలో నూనెవేసి కాగనివ్వాలి ● వేడివేడి నూనెలో ఆవాలు, జీలకర్ర, ఎండు మిర్చి వేసి చిటపటలాడనివ్వాలి ● ఇవి వేగాక కరివేపాకు ఉల్లిపాయ తరుగు, పచ్చిమిర్చి వేసి తిప్పాలి ● ఐదునిమిషాలు మగ్గాక పసుపు, ఇంగువ వేసి కలపాలి ● ఇప్పుడు ఉడికించిన క్యారట్ ముక్కలు, రుచికి సరిపడా ఉప్పు, కొబ్బరి తురుము వేసి మూతపెట్టి మగ్గనివ్వాలి ● నూనె పైకి తేలిన తరువాత దించేసి సర్వ్‌చేసుకోవాలి.



క్యారట్ చట్నీ

కావలసినవి: నూనె – టీస్పూను; పచ్చిమిర్చి – ఆరు; వెల్లుల్లి రెబ్బలు – రెండు; అల్లం తరుగు – టీస్పూను; చింతపండు – గోలీకాయంత; క్యారట్ – మీడియంసైజు మూడు; కొత్తిమీర తరుగు – టేబుల్ స్పూను; కరివేపాకు – రెండు రెమ్మలు; వేయించిన వేరుశనగ గింజలు – రెండు టేబుల్ స్పూన్లు; పచ్చికొబ్బరి తురుము – టేబుల్ స్పూను; జీలకర్ర – టీస్పూను; ఉప్పు – రుచికి సరిపడా.

తాలింపు కోసం: నూనె – టీస్పూను; ఆవాలు – టీస్పూను; జీలకర్ర – టీస్పూను; మినపప్పు – అర టీస్పూను; పచ్చిశనగపప్పు – అరటీస్పూను; ఎండు మిర్చి – రెండు; ఇంగువ – చిటికెడు; కరివేపాకు – రెమ్మ.

తయారీ: ● బాణలిలో నూనెవేసి పచ్చిమిర్చి, అల్లం, వెల్లుల్లిపేస్టు వేసి పచ్చివాసన పోయేంత వరకు వేయించాలి ● ఇవన్నీ వేగిన తరువాత చింతపండు వేసి నిమిషం తర్వాత దించేయాలి ● ఇదే బాణలిలో క్యారట్, కొత్తిమీర తరుగు, కరివేపాకు వేసి పచ్చివాసన పోయేంతవరకు వేయించాలి ● ఇప్పుడు వేయించిన పచ్చిమిర్చి మిశ్రమం, క్యారట్ తురుము, వేరుశనగ గింజలు, కొబ్బరి తురుము, జీలకర్ర, రుచికి సరిపడా ఉప్పు వేసి గ్రైండ్ చేయాలి ● చట్నీ మెత్తగా గ్రైండ్ చేసాక... తాలింపు దినుసులతో తాలింపు పెట్టి చట్నీలో వేయాలి ● ఈ క్యారట్ చట్నీ ఇడ్లీ, దోశ, రోటి, అన్నంలోకి మంచి కాంబినేషన్.

క్యారట్ చికెన్ కప్స్

కావలసినవి: క్యారట్ తురుము – కప్పు; వెల్లుల్లి తురుము – పావు కప్పు; బాదం పప్పు పొడి – ముప్పావు కప్పు; చీజ్ తురుము – ముప్పావు కప్పు; కొత్తిమీర తరుగు – టేబుల్ స్పూను; గుడ్డు – ఒకటి; చికెన్ ఖీమా – అరకప్పు; ఉప్పు, మిరియాలపొడి – రుచికి సరిపడా.

తయారీ: ● పెద్ద గిన్నెలో క్యారట్, వెల్లుల్లి, చీజ్ తురుములు, కొత్తిమీర చికెన్ ఖీమా, రుచికిసరిపడా ఉప్పు, మిరియాలపొడి వేసి కలపాలి ● చివరిగా గుడ్డుసొనను కూడా వేసి కలపాలి ● ఈ మిశ్రమాన్ని మఫిన్ ట్రేలో వేసి ఇరవై నిమిషాల పాటు బేక్ చేయాలి ● గోల్డెన్ బ్రౌన్ కలర్‌లో క్రిస్పీగా మారితే చికెన్ క్యారట్ కప్స్ రెడీ.





అవును... ఇది నిజమే!

బ్రూస్‌లీ గ్రేట్ ఫైటర్ మాత్రమే కాదు... చక్కగా బొమ్మలు గీసేవాడు. కవిత్వం రాసేవాడు. మార్షల్ ఆర్ట్స్ ట్రైనింగ్ సమయంలో సొంతంగా వెపన్స్ తయారుచేసేవాడు. 'మ్యాన్ ఆఫ్ మెనీ టాలెంట్స్'గా పేరు తెచ్చుకున్నాడు.

యువర్స్

● టెక్.. టాక్



ఫెయిర్ ఫోన్5

డిస్‌ప్లే: 6.46 అంగుళాలు రిఫ్రెష్‌రేట్: 90 హెచ్‌జడ్
రిజల్యూషన్: 1224×2700 పిక్సెల్స్
వోఎస్: ఆండ్రాయిడ్ 13
మెమోరీ: 256జీబి 8జీబి ర్యామ్ ఫ్రంట్ కెమెరా: 50 ఎంపీ
బ్యాటరీ: 4200 ఎంఏహెచ్ కనెక్టివిటీ: 5జీ

వన్‌ప్లస్ ప్యాడ్



ఆల్ ప్లే, ఆల్ డే అంటూ ఊరిస్తోంది వన్‌ప్లస్. వన్‌ప్లస్ సెకండ్ ఆండ్రాయిడ్ ట్యాబ్లెట్ పాడ్ గో వచ్చే నెలలో లాంచ్ అవుతుంది. బడ్జెట్ సెగ్మెంట్‌ను దృష్టిలో పెట్టుకొని దీన్ని రూపొందించినట్లు తెలుస్తుంది. క్వాడ్-స్పీకర్ సెటప్, లార్జ్ డిస్‌ప్లే, 2కే రిజల్యూషన్, 120 హెచ్‌జడ్ రిఫ్రెషర్ రేట్, 3.5 ఎంఎం హెడ్‌ఫోన్ జాక్...కొన్ని సాంకేతిక విషయాలు.

డైసన్ జోన్స్ హెడ్ ఫోన్స్



గృహోపకరణాలకు ప్రసిద్ధిగాంచిన డైసన్ కంపెనీ నాయిస్-క్యాన్సిలింగ్ హెడ్‌ఫోన్స్ 'డైసన్ జోన్'ను అక్టోబర్ 4న లాంచ్ చేయనుంది. 'గంటల కొద్దీ ధరించినా కంఫర్టబుల్ గానే ఉంటుంది. రకరకాల ఫేస్‌షేప్‌లను దృష్టిలో పెట్టుకొని డిజైన్ చేశాం' అంటుంది కంపెనీ. ●పవర్డ్ బై 40ఎంఎం డ్రైవర్స్ ●బ్యాటరీ లైఫ్: 4 గంటలు ● సపోర్ట్- మైడైసన్ యాప్ (యూజర్‌లు ఆడియో సెట్టింగ్స్‌ను మోడీఫై చేసుకోవడానికి, మ్యూజిక్ స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్‌తో కనెక్ట్ కావడానికి)

మైక్రోసాఫ్ట్ పెయింట్ యాప్‌లో కొత్త ఫీచర్

పెయింట్ ఇమేజ్ ఎడిటర్‌కు లేయర్, ట్రాన్స్‌పరెన్సీ సపోర్ట్ జోడిస్తున్నట్లు మైక్రోసాఫ్ట్ ప్రకటించింది. క్లిష్టమైన డిజిటల్ ఆర్ట్ కోసం, ట్రాన్స్‌పరెంటీ పీఎన్‌జీలను సేవ్ చేయడానికి ఇది యూజర్‌లకు ఉపయోగపడుతుంది.



ఫొటోషాప్ ఫీచర్‌లాగే ఇమేజ్‌లలో లేయర్లు జోడించడానికి, తీసివేయడానికి ఉపకరిస్తుంది. కొత్త లేయర్ బటన్ టూల్‌బార్‌లో చూడవచ్చు. ఇక్కడ క్లిక్ చేస్తే ఇమేజ్ కుడి వైపున ఒక ప్యానెల్ ఓపెన్ అవుతుంది. ఇక్కడ కొత్త లేయర్స్‌ను యాడ్ చేసుకోవచ్చు లేదా ఆర్డర్‌ను చేంజ్ చేసుకోవచ్చు. ఈ నెల ప్రారంభంలో పెయింట్ యాప్‌కు ఉపకరించే ఫీచర్‌ని మైక్రోసాఫ్ట్ తీసుకువచ్చింది. దీని ద్వారా ఏదైనా ఇమేజ్‌కు సంబంధించి బ్యాక్‌గ్రౌండ్‌ను తొలగించవచ్చు. కొత్తగా ప్రకటించిన లేయర్స్ ఫీచర్‌తో కలిసి పెయింట్‌ను ఫొటోషాప్‌కు ప్రత్యామ్నాయంగా ఉపయోగించే అవకాశం ఉంది.

● సక్సెస్ స్టోరీ

హై-స్పీడ్ స్టార్

కొత్త ఆలోచనే కొండంత ఆస్తి



సారవ్ కుమార్

వివిధ రకాల పరికరాలు, రోబోట్‌లు తయారుచేసే సరదా ఢిల్లీకి చెందిన సారవ్ కుమార్‌ను ఈవీ స్టార్టప్ 'యూలర్' వరకు తీసుకెళ్లింది. కాలుష్య సమస్యకు పరిష్కారంగా తయారు చేసిన ఈ కంపెనీ త్రీ-వీలర్స్ సక్సెస్‌ఫుల్‌గా దూసుకుపోతున్నాయి. ఫ్లిప్‌కార్ట్, బిగ్‌బాస్కెట్‌లాంటి పెద్ద కంపెనీలు 'యూలర్' క్లయింట్స్‌గా ఉన్నాయి....

'బెటర్ ఫ్యూచర్' అంటూ కుటుంబంతో బిహార్ నుంచి ఢిల్లీకి వెళ్లి స్థిరపడ్డాడు సారవ్ కుమార్ తండ్రి.

సారవ్ కుమార్‌కు గణితం అంటే ఇష్టం. రోబోట్‌ల తయారీపై ఆసక్తి. ఇక తండ్రికి గణితంతో పాటు సైన్స్ కూడా ఇష్టం. ఇద్దరూ సైన్స్‌కు సంబంధించిన విషయాలను ముచ్చటించుకునేవాళ్లు. ఢిల్లీలోని డీపీఎస్ ఆర్‌కే పురం స్కూల్లో చదివే రోజుల్లో రోబోట్‌ల తయారీలో ఎక్కువ సమయం గడిపేవాడు సారవ్.

ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ ఆ తరువాత కార్నెల్ యూనివర్శిటీలో చదువుకునే రోజుల్లో కూడా ఏరియల్ వెహికిల్స్ నుంచి అండర్ వాటర్ వెహికిల్స్ వరకు ఏదో ఒకటి తయారుచేస్తూనే ఉండేవాడు. హార్డ్‌వేర్ అండ్ సాఫ్ట్‌వేర్ కాంబినేషన్‌ను ఎంజాయ్ చేసేవాడు.

ఆ ఆనందం తనను మరో స్థాయికి తీసుకువెళ్లింది.

ఒక విజయం సాధించిన తరువాత 'వాట్ నెక్స్ట్?' అనే ప్రశ్న వేసుకుంటాడు సారవ్.

2017లో 'క్యూబ్26' కంపెనీని వేరే కంపెనీకి అమ్మాడు.

ఆ తరువాత స్విస్ గణితశాస్త్రవేత్త లియోన్‌హర్డ్ యూలర్ పేరు మీద 'యూలర్ మోటర్స్' కంపెనీ ప్రారంభించాడు. యూలర్ మోటార్ కంపెనీ కాలుష్య సమస్య తలెత్తని త్రీ-వీలర్‌లను తయారు చేస్తుంది.

'మన దేశంలో ఎన్నో పట్టణాలు తీవ్రమైన కాలుష్య సమస్యని ఎదుర్కొంటున్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకొని కాలుష్య సమస్యకు పరిష్కారంగా త్రీ-వీలర్స్‌ను తయారు చేశాం' అంటాడు సారవ్.

ఈ త్రీ వీలర్స్‌కు సంబంధించి లిథియం ఎనర్జీ బ్యాటరీ ప్యాక్‌లను సారవ్ కుమార్ అతని బృందం సొంతంగా తయారుచేసింది. 'యూలర్'కు తనదైన చార్జింగ్ నెట్‌వర్క్, యాప్ ఉన్నాయి. దీని ద్వారా యూజర్‌లు తమ వాహనాలను మానిటర్ చేయవచ్చు.

'వాహనం తయారు చేయడం సవాలు కాదు. తయారీ ప్రక్రియ సంతోషాన్ని ఇస్తుంది. అయితే అసలు సిసలు సమస్య ఫండింగ్. మీ కస్టమర్ ఎవరు? అనే ప్రశ్నకు సరియైన సమాధానం చెప్పినప్పుడు ఫండింగ్ కష్టం కాదు' అంటాడు సారవ్.



> డబ్బు కోసం కష్టపడడం తప్పేమీ కాదు. అయితే అది మాత్రమే ప్రాధాన్యత కాదు. సమాజానికి తిరిగి ఏం ఇస్తున్నామనేది ముఖ్యం.
> – సారవ్ కుమార్

సారవ్ రంగంలోకి వచ్చినప్పుడు ఎలక్ట్రిక్ వెహికిల్ ఇండస్ట్రీ శైశవ దశలోనే ఉండడం, ఇకామర్స్ కంపెనీలు ఈవీల వైపు పెద్ద ఎత్తున రాకపోవడం సారవ్‌కు కలిసి వచ్చింది. 'ఎలక్ట్రిక్ వెహికిల్ కంపెనీ నిర్మాణంలో రైట్ ప్రాడక్ట్, చార్జింగ్ సిస్టమ్, ఫైనాన్సింగ్ ముఖ్య పాత్ర పోషిస్తాయి' అంటాడు సారవ్.

దేశవ్యాప్తంగా 'యూలర్' రెండు వందల చార్జింగ్ స్టేషన్‌లను నిర్మించింది.

'అంతర్గత దహన ఇంజిన్ (ఐసీఐ) పనితీరు, బ్యాటరీ ప్యాక్‌కు సంబంధించి ఇన్‌బిల్ట్ థర్మల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, లిక్విడ్ కూలింగ్ టెక్నాలజీ మార్కెట్‌లో మాకు ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చాయి. పోటీలో ముందుండేలా చేశాయి' అంటాడు సారవ్.

చిన్నగా ప్రస్థానం మొదలు పెట్టిన 'యూలర్' ఇప్పుడు పన్నెండు ఎకరాల పరిధిలో నెలకు మూడు వేల వాహనాలను తయారుచేసే ఫ్యాక్టరీ నిర్మించడం వరకు ఎదిగింది.

'సామాజిక బాధ్యత' అనేది సారవ్‌కు ఇష్టమైన మాట.

● ఇంగ్లిష్ ఇడియమ్

వెయిటింగ్ ఇన్ వింగ్స్



ఒక మంచి అవకాశం కోసం సన్నద్ధంగా ఉండడం, ఎదురు చూడడం. లేదా ఒక బాధ్యత, పదవి నిర్వహించడానికి రెడీగా ఉండే సందర్భంలో వాడే మాట ఇది.

ఉదా: ది టీమ్ హ్యాజ్ సెవెరల్ టాలెంటెడ్ యంగ్ ప్లేయర్స్ వెయిటింగ్ ఇన్ ది వింగ్స్.

● గేమింగ్

ఆ ఆయుధం తీస్తే... ఇక అంతే!



సోల్స్‌లైక్ వీడియో గేమ్ 'లైస్ ఆఫ్ పీ' ఇటీవల విడుదల అయింది. 1883 కాలానికి చెందిన 'ది అడ్వెంచర్స్ ఆఫ్ పినోక్యో' నవలను ఆధారంగా చేసుకొని రూపొందించిన గేమ్ ఇది. థర్డ్-పర్సన్ పర్స్పెక్టివ్ నుంచి ఆడే గేమ్. ప్లేయర్ హ్యూమనాయిడ్ పినోక్యోని కంట్రోల్ చేయవచ్చు. క్రాట్ నగరాన్ని అన్వేషించవచ్చు. బయోమెకానికల్ ఎనిమీస్‌తో పోరాడవచ్చు. సంప్రదాయ ఆయుధాలైన కత్తులు, గొడ్డళ్లను ఉపయోగించి పినోక్యో తన శత్రువులపై పోరాడుతాడు. పినోక్యోకు గ్యాడ్జెట్స్‌తో కూడిన మెకానికల్ ఆర్మ్ ఉంటుంది. శత్రువులపై పోరాడే సందర్భంలో ఇది ఉపయోగపడుతుంది. ఈ గేమ్‌లో 30 రకాల ఆయుధాలు ఉంటాయి.

ఇంజిన్: అన్‌రియల్ ఇంజిన్ 4; **ప్లాట్‌ఫామ్స్:** ప్లేస్టేషన్ 4, ప్లేస్టేషన్ 5, విండోస్, ఎక్స్‌బాక్స్ వన్, ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్
జానర్: యాక్షన్ రోల్-ప్లేయింగ్ **మోడ్:** సింగిల్-ప్లేయర్


● మ్యూజిక్ వరల్డ్

సుస్వరాల తరాన

దిల్లీకి చెందిన తరాన మర్వాహ్ కంపోజర్, సింగర్, మల్టీ-ఇన్‌స్ట్రుమెంటలిస్ట్. ఏడు సంవత్సరాల వయసు నుంచే పియానో ప్లే చేసేది. రకరకాల మ్యూజిక్ స్టైల్స్‌ను నేర్చుకుంది. జీవితంలోని సకల కోణాలను సంగీత స్వరాలలో ప్రతిఫలింపజేయడం తనకు ఇష్టం. 'కోమోరేబీ' అనే మ్యూజిక్ ప్రాజెక్ట్‌ను స్టార్ట్ చేసి రకరకాల జానర్‌లను మిక్స్ చేసింది. బాల్యంలో ఎన్నో కామిక్స్, యానిమేషన్‌లు తనపై ప్రభావం చూపాయి. ఆ ప్రభావంతో పాటను కథలా చెప్పాలనేది తన పాలసీగా మారింది.

'జపాన్ లార్జర్-దేన్-లైఫ్ కల్చర్, ఫాంటాస్టిక్ స్టోరీలైన్స్, ప్లాట్స్, విజువల్స్ అంటే నాకు ఇష్టం. నేను మ్యూజిషియన్ కావడానికి అదే ఇన్‌స్పిరేషన్' అంటుంది తరాన. జపనీస్ యానిమేషన్ 'కోమోరేబీ'ని స్ఫూర్తిగా తీసుకొని అదే పేరుతో డెబ్యూ ఈపీని తీసుకు వచ్చింది. తరాన చేయి తిరిగిన గేమర్ కూడా. డిఫరెంట్ మీడియమ్స్‌లో ఎన్నో గేమ్స్ ఆడింది. అయితే ఆ అనుభవం వృథా పోలేదు. ఆ హుషారు, దూకుడు మ్యూజిక్‌లోకి తెచ్చుకోవడానికి ఉపయోగపడింది. 'మేడ్ ఇన్ హెవెన్' 'దహాద్' 'మోడ్రన్ లవ్'లాంటి పాపులర్ వోటీటీ షోలకు మ్యూజిక్ అందించింది తరాన.





సినిమా

నా సామి రంగ.. యాక్షన్ స్టార్ట్

'నా సామి రంగ' మొదలైంది అంటున్నారు నాగార్జున. కొరియోగ్రాఫర్ విజయ్ బిన్నీ దర్శకత్వంలో నాగార్జున హీరోగా నటిస్తున్న చిత్రం 'నా సామి రంగ'. పవన్‌కుమార్ సమర్పణలో శ్రీనివాసా చిట్టూరి నిర్మిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ గురువారం హైదరాబాద్‌లో ఓ భారీ యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరణతో మొదలైంది. స్టంట్ కొరియోగ్రాఫర్ వెంకట్ మాస్టర్ ఈ యాక్షన్‌ను డిజైన్ చేశారు. ''నాగార్జునగారు ఫుల్ మాస్ పాత్రలో కనిపిస్తారు'' అని యూనిట్ పేర్కొంది. సంక్రాంతికి రిలీజ్ కానున్న ఈ చిత్రానికి సంగీతం: యం.యం. కీరవాణి.



● నాగార్జున

నమ్మకం నిజమైంది – నవీన్ పొలిశెట్టి

'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' ప్రేక్షకులకు బాగా నచ్చడంతో వాళ్లే మా సినిమాను ప్రమోట్ చేశారు. ప్రమోషన్ టూర్ కోసం గత 25 రోజుల్లో 75 సిటీస్‌కి వెళ్లాను. అమెరికాలో ప్రమోషన్‌కి వెళ్లినప్పుడు హోటల్‌లో నిద్రపోయే టైమ్ ఉండేది కాదు. ఈస్ట్ నుంచి వెస్ట్‌కు ప్రయాణం చేసే విమానంలోనే నిద్రపోయేవాణ్ణి. ప్రేక్షకులకు కృతజ్ఞతలు చెప్పుకోవడానికి వెళ్లా కాబట్టి నాకు కష్టం అనిపించలేదు" అని హీరో నవీన్ పొలిశెట్టి అన్నారు. పి. మహేశ్‌బాబు దర్శకత్వంలో అనుష్కా శెట్టి, నవీన్ లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి'. వంశీ, ప్రమోద్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 7న విడుదలైంది. ఈ సందర్భంగా నవీన్ పొలిశెట్టి విలేకరులతో చెప్పిన విశేషాలు.



● మంచి సినిమా చేశాం.. ప్రేక్షకులకు నచ్చుతుందనే నమ్మకం ఉండేది. అది నిజమైంది. తెలుగులో వసూళ్లు నెమ్మదిగా మొదలైనా ఆ తర్వాత పుంజుకున్నాయి.. మూడో వారంలోనూ మంచి వసూళ్లు ఉన్నాయి. అమెరికాలోనూ మూడో వారంలో మంచి వసూళ్లు ఉండటంతో మరిన్ని స్క్రీన్స్ పెంచుతున్నారు. యూకే, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిల్యాండ్‌లోనూ షోలు పెంచుతున్నారు. మా మంచి ప్రయత్నాన్ని ఆదరించినందుకు ప్రేక్షకులకు హ్యాట్సాఫ్. ● నా తొలి చిత్రం 'ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ' నేను బాగా నటించగలనని నిరూపించింది. నా సినిమా మంచి వసూళ్లు సాధిస్తుందనే నమ్మకం 'జాతి రత్నాలు' చిత్రంతో ప్రొడ్యూసర్స్, బయ్యర్స్‌లో వచ్చింది. 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి'తో నేను కేవలం కామెడీ మాత్రమే కాదు.. భావోద్వేగాలు కూడా పండించగలను అని నిరూపించుకున్నా. ● తెలుగులో చిరంజీవి, ప్రభాస్‌గార్లు, హిందీలో ఆమిర్ ఖాన్‌గారు ఇష్టం. అలాగే అన్ని జానర్స్ సినిమాలను ఇష్టపడతాను. హిందీలో రాజ్‌కుమార్ హిరాణీగారి చిత్రాలంటే ఇష్టం. తెలుగులో 'జగదేక వీరుడు అతిలోక సుందరి, భైరవ ద్వీపం, ఆదిత్య 369' వంటి సినిమాలు చేయాలనుంది. ప్రస్తుతం మూడు సినిమాలు ఉన్నాయి

బర్త్ డే లుక్



● కృతీ శెట్టి

హీరోయిన్ కృతీ శెట్టి ఫ్యాన్స్‌కు డబుల్ ధమాకా. ఎందుకంటే.. కృతీ హీరోయిన్‌గా నటిస్తున్న రెండు చిత్రాల్లోని ఫస్ట్ లుక్స్ ఆమె బర్త్ డే సందర్భంగా గురువారం విడుదలయ్యాయి. శర్వానంద్ హీరోగా, కృతీ శెట్టి హీరోయిన్‌గా శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఒక షెడ్యూల్ మినహా ఈ సినిమా చిత్రీకరణ పూర్తయింది. కృతీ బర్త్ డే సందర్భంగా ఆమె ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ ఏడాదిలోనే విడుదల కానుంది. ఈ సినిమాకు సహనిర్మాత: వివేక్ కూచిభొట్ల, సంగీతం: హేషమ్ అబ్దుల్ వాహబ్. మరో వైపు మలయాళంలో కృతీ శెట్టి చేస్తున్న తొలి చిత్రం 'అజయింటే రందం మోషణం'. ఈ సినిమాలో కృతీ చేస్తున్న లక్ష్మీ పాత్ర లుక్ విడుదలైంది.

హుషారుగా...



● ఫల్గుణి, సంతోష్

సంతోష్ శోభన్, ఫల్గుణి ఖన్నా జంటగా సుభాష్ చంద్ర దర్శకత్వం వహించిన చిత్రం 'జోరుగా హుషారుగా షికారు పోదమ'. ప్రవీణ్ నంబారు, సృజన్ ఎరబోలు నిర్మించారు. ఈ చిత్రం మోషన్ పోస్టర్‌ని డైరెక్టర్ క్రిష్ రిలీజ్ చేసి, మాట్లాడుతూ– ''జోరుగా హుషారుగా షికారు పోదమ' విజువల్స్ అద్భుతంగా ఉన్నాయి. మ్యూజిక్ బాగుంది. ఈ సినిమా పెద్ద హిట్టవ్వాలి'' అన్నారు. ''కొత్తవారిని ప్రోత్సహించాలనే ఈ సినిమా తీశాను'' అన్నారు ప్రవీణ్ నంబారు. ''ఈ చిత్రం చూస్తున్నంత సేపు ప్రేక్షకులు నవ్వుకుంటారు'' అన్నారు సుభాష్ చంద్ర. ''ఈ సినిమాతో మా అందరికీ మంచి పేరు రావాలని కోరుకుంటున్నాను'' అన్నారు సంతోష్ శోభన్. ఈ చిత్రానికి కెమెరా: సాయి సంతోష్, సంగీతం: నాగవంశీ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: రోహిత్ కృష్ణ వర్మ.

ఇక ఆ పేరుతో పిలుస్తారు! – అనసూయ



''శ్రీకాంత్ అడ్డాలగారి పేరు చెప్పగానే 'సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు, బ్రహ్మోత్సవం' వంటి కుటుంబ కథా చిత్రాలు గుర్తొస్తాయి. అలాంటి ఆయన 'పెదకాపు 1' వంటి కథ చెప్పినప్పుడు షాక్ అయ్యా. అలాగే ఈ మూవీలో ఆయన విలన్‌గా చేస్తున్నారని ముందు నాకు తెలీదు. అయితే ప్రతి దర్శకుడిలో ఒక నటుడు ఉంటాడు. ఎలా చేయాలో మొదట చేసి చూపించేది దర్శకులే. శ్రీకాంత్‌గారి నటన నటన చూసి ప్రేక్షకులు సర్‌ప్రైజ్ అవుతారు'' అని అనసూయ భరద్వాజ్ అన్నారు. విరాట్ కర్ణ, బ్రిగడ సాగ జంటగా శ్రీకాంత్ అడ్డాల దర్శకత్వం వహించిన చిత్రం 'పెదకాపు 1'. మిర్యాల సత్యనారాయణ రెడ్డి సమర్పణలో మిర్యాల రవీందర్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 29న విడుదల కానుంది. ఈ చిత్రంలో ఓ కీలక పాత్ర పోషించిన అనసూయ భరద్వాజ్ మాట్లాడుతూ– ''సందీప్ కిషన్ 'మైఖేల్' సినిమాలో నా నటన చూసిన కెమెరామేన్ ఛోటా కె. నాయుడుగారు 'పెదకాపు 1'లో నేను చేసిన పాత్రకి అనసూయ అయితే బాగుంటుందని దర్శక-నిర్మాతలకు చెప్పారు. ఇందులో నేను చేసిన పాత్ర కోసం ఇతర భాషల నుంచి కూడా కొందర్ని అనుకున్నారు. అలాంటి బలమైన పాత్ర కోసం ఆడిషన్ ఇచ్చి ఎంపిక అయ్యాననే తృప్తి నాకు ఉంది. ఈ చిత్రంలో నా పేరు నాకు చాలా కొత్తగా అనిపించింది. సినిమా విడుదల తర్వాత అందరూ నన్ను ఆ పేరుతోనే పిలుస్తారనే నమ్మకం ఉంది. నా పాత్రలో కొన్ని బోల్డ్ డైలాగ్స్ కూడా ఉన్నాయి. 'రంగస్థలం'లో రంగమ్మత్తగా నన్ను ఎక్కువగా గుర్తుపెట్టుకున్నారు ప్రేక్షకులు. అయితే నేను మాత్రం విభిన్నమైన పాత్రలు చేయడానికి ప్రయత్నిస్తున్నాను'' అన్నారు.

మట్టికథ హత్తుకుంటుంది



● అజయ్, అప్పిరెడ్డి

అజయ్ వేద్, మాయ, కనకవ్వ, దయానంద్ రెడ్డి, బలగం సుధాకర్ రెడ్డి ప్రధాన పాత్రల్లో నటించిన సినిమా 'మట్టి కథ'. పవన్ కడియాల దర్శకత్వంలో అప్పిరెడ్డి నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా విలేకర్ల సమావేశంలో అజయ్ వేద్ మాట్లాడుతూ– ''ప్రేక్షకులకు నచ్చే చిత్రం 'మట్టికథ'' అన్నారు. ''2003లో ఈ సినిమా కథ జరుగుతుంది. న్యూ మిలీనియం టైమ్‌లో బాగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ నగరానికి సమీపంలో ఉన్న ఓ ఊరిపై ఈ ప్రభావం ఎలా పడింది? అన్నదే ఈ చిత్రకథ. మా చిత్రాన్ని ఫిలిం ఫెస్టివల్స్‌కు పంపిస్తే 9 అంతర్జాతీయ అవార్డులు వచ్చాయి'' అన్నారు పవన్ కడియాల. ''ప్రేక్షకుల హృదయాలను హత్తుకునే చిత్రం 'మట్టికథ'' అన్నారు అప్పిరెడ్డి.

క్యాసెట్‌తో ముడిపడింది – రక్షిత్ శెట్టి



''దర్శకుడు హేమంత్ మొదటి సినిమా 'గోధి బన్న సాధారణ మైకట్టు'లో హీరోగా నటించాను. ఇప్పుడు 'సప్త సాగరాలు దాటి'కి కలిసి పని చేశాం. రెండు సినిమాలకే కన్నడ పరిశ్రమకు మరో మంచి దర్శకుడు దొరికాడనిపించింది. 'సప్త సాగరాలు దాటి' కథని కవితాత్మకంగా ఎంతో అందంగా తీశారు'' అని రక్షిత్ శెట్టి అన్నారు. ఆయన హీరోగా నటించి, నిర్మించిన కన్నడ చిత్రం 'సప్త సాగర దాచే ఎల్లో'. హేమంత్ ఎం. రావు దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో రుక్మిణీ వసంత్ హీరోయిన్. ఈ నెల 1న కన్నడలో విడుదలైన ఈ చిత్రాన్ని టీజీ విశ్వప్రసాద్, రక్షిత్ శెట్టి కలిసి 'సప్త సాగరాలు దాటి' పేరుతో నేడు తెలుగులో రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా రక్షిత్ శెట్టి మాట్లాడుతూ– ''2010 సమయంలో జరిగే కథ ఇది. క్యాసెట్లతో ముడిపడి ఉంటుంది. నటుడిగా నిరూపించుకునేందుకు దర్శకత్వం మానేశాను. మంచి కథ రెడీ చేసుకుని, మళ్లీ దర్శకత్వం చేయాలనుకుంటున్నాను. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ వంటి పెద్ద సంస్థతో కలిసి నా సినిమా రిలీజ్ చేయడం హ్యాపీగా ఉంది. కన్నడంలో మూడు చిత్రాలు కమిట్ అయ్యాను'' అన్నారు.

రీల్స్

కేబుల్‌రెడ్డి కథ



● సుహాస్

సుహాస్ టైటిల్ రోల్ చేస్తున్న చిత్రం 'కేబుల్ రెడ్డి'. షాలిని కొండేపూడి హీరోయిన్‌గా నటిస్తున్నారు. శ్రీధర్ రెడ్డి దర్శకత్వంలో బాలు వల్లు, ఫణి ఆచార్య, మణికంఠ జేఎస్ నిర్మిస్తున్న ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను గురువారం విడుదల చేశారు. ''2000 సమయంలో ఈ సినిమా కథనం సాగుతుంది. ఈ చిత్రంలో గ్రామీణ యువకుడిగా కనిపిస్తారు సుహాస్'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: స్మరణ్ సాయి, కెమెరా: మహి రెడ్డి పండుగుల.

అందమైన మోసం



● సూర్య తేజ

పబ్లిసిటీ డిజైనర్ ధని ఏలే తనయుడు సూర్య తేజ ఏలే హీరోగా పరిచయం అవుతున్న క్రైమ్ కామెడీ ఫిల్మ్ 'భరత నాట్యం'. 'సినిమా ఈజ్ ది మోస్ట్ బ్యూటీఫుల్ ఫ్రాడ్ ఇన్ ది వరల్డ్' (సినిమా అనేది ప్రపంచంలో అత్యంత అందమైన మోసం) ఉపశీర్షిక. ఈ చిత్రంలో మీనాక్షీ గోస్వామి హీరోయిన్. కేవీఆర్ మహేంద్ర దర్శకత్వంలో పాయల్ సరాఫ్ నిర్మించారు. షూటింగ్ పూర్తయిన ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ''కేవీఆర్ మహేంద్రతో కలిసి సూర్య తేజ ఈ సినిమాకు కథ, స్క్రీన్‌ప్లే, డైలాగ్స్ అందించారు. పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. 'భరత నాట్యం' టైటిల్ ఎందుకు పెట్టామనేది సినిమాలో తెలుస్తుంది'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: వివేక్ సాగర్, కెమెరా: వెంకట్ ఆర్. శాఖమూరి.

నీ వెంటే..



● బాలు, స్నేహ

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు బాలు–స్నేహ జంటగా నటించిన లవ్‌స్టోరీ ఫిల్మ్ 'నీ వెంటే నేను'. అన్వర్ దర్శకత్వంలో వెంకట్రావు మోటుపల్లి నిర్మించారు. 'సినీ బజార్' అనే డిజిటల్ థియేటర్‌లో ఈ చిత్రం అక్టోబరు 6న 177 దేశాల్లో విడుదల కానుందని చిత్ర యూనిట్ వెల్లడించింది. ఈ సందర్భంగా విలేకర్ల సమావేశంలో సినీబజార్ సీఈవో రత్నపురి వెంకటేష్ భాస్కర్ మాట్లాడుతూ– ''నీ వెంటే నేను'తో టాలీవుడ్‌కు ఎంట్రీ ఇస్తున్నందుకు హ్యాపీగా ఉంది'' అన్నారు.

వాస్తవ ఘటనలతో...



● నికిత, టీవీ రవి

నికిత శ్రీ, పృథ్వీరాజ్ (పెళ్లి), థర్టీ ఇయర్స్ పృథ్వీ, నాగమహేష్, జయవాణి కీలక పాత్రల్లో టీవీ రవి నారాయణన్ దర్శకత్వంలో 'భ్రమర' సినిమా షురూ అయింది. జి. మురళీ కృష్ణ నిర్మిస్తున్నారు. తొలి సీన్‌కి తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ చైర్మన్ అనిల్ కూర్మాచలం కెమెరా స్విచ్చాన్ చేయగా, నిర్మాత బెక్కం వేణుగోపాల్ క్లాప్ ఇచ్చారు. నిర్మాత టి. రామసత్యనారాయణ గౌరవ దర్శకత్వం వహించారు. ''వాస్తవ ఘటనల ఆధారంగా థ్రిల్లర్ నేపథ్యంలో తెరకెక్కుతున్న చిత్రం 'భ్రమర'' అన్నారు టీవీ రవి నారాయణన్. ఈ చిత్రానికి సహనిర్మాత: కల్యాణ్ చక్రవర్తి.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	571	66,230
నిఫ్టీ ▽	159	19,742

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలిరెండు రాత్రి 11.30 ముగింపు)		
నాస్‌డాక్	13,333	▽ 136
డోజోన్స్	34,296	▽ 145
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,679	▽ 53
డాక్స్	15,572	▽ 210
షాంఘై	3,085	▽ 24
నికాయ్	32,571	▽ 453

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై		
బంగారం (24 క్యారట్)	59,072	▽ 245
బంగారం (22 క్యారట్)	58,835	▽ 244
వెండి (కిలో)	71,971	▽ 233

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	82.53	84.16
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	101.23	103.89
€	యూరో	ఒకటి	88.01	91.35
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	54.50	58.23
AUS$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	53.49	55.32
S$	సింగపూర్ డాలర్	ఒకటి	59.07	61.01
SAR	సౌదీ రియాల్	ఐదు	21.19	22.79
UAE D	యూఏఈ దిర్హామ్	ఐదు	21.69	23.50
¥	చైనా యువాన్	ఐదు	10.25	12.33

పడుతున్న పొదుపులు.. పెరుగుతున్న అప్పులు

- కుటుంబాల ముఖచిత్రాన్ని ఆవిష్కరించిన ఎస్‌బీఐ రీసెర్చ్
- 2020-21లో జీడీపీలో పొదుపు రేటు 11.5 శాతం
- 2022-23లో 5.15 శాతానికి డౌన్
- ఇదే ఆర్థిక సంవత్సరం రూ. 8.2 లక్షల కోట్లు పెరిగిన రుణాలు
- రూ. 15.6 లక్షల కోట్లకు చేరిక
- విమర్శలను తోసిపుచ్చిన ఆర్థికశాఖ



ముంబై: భారత్‌లో వ్యక్తులుసహా చిన్న స్థాయి కుటుంబ సంస్థల (హౌస్‌హోల్డ్ సెక్టార్) ఆర్థిక పరిస్థితులపై ఎస్‌బీఐ రీసెర్చ్ కీలక అంశాలను ఆవిష్కరించింది. దీని ప్రకారం కరోనా తర్వాత వీటి పొదుపురేట్లు ఒకవైపు పడిపోతుండగా మరోవైపు అప్పులు పెరిగిపోతున్నాయి. వీటి నికర ఆర్థిక (ఫైనాన్షియల్) పొదుపు రేటు 2022 ఏప్రిల్–2023 మార్చి ఆర్థిక సంవత్సరంలో దాదాపు 55 శాతం క్షీణించి స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో 5.15 శాతానికి పడిపోయింది. గడచిన 50 సంవత్సరాల్లో ఇంత తక్కువ స్థాయి ఆర్థిక పొదుపు రేటు నమోదు ఇదే తొలిసారి. 2020-21లో ఈ రేటు 11.5 శాతంగా ఉంది. మహమ్మారికి ముందు ఆర్థిక సంవత్సరంలో (2019-20) ఈ రేటు 7.6 శాతం. అటు ప్రభుత్వం, ఇటు నాన్ ఫైనాన్షియల్ సంస్థలకు (ఈపీఎఫ్ఓ వంటివి) పొదుపు నిధులే ప్రధాన ఆర్థిక వనరు కావడం గమనార్హం. ఇక 2022-23 ఆర్థిక సంవత్సరంలో హౌస్‌హోల్డ్ సెక్టార్ రుణభారం రూ. 8.2 లక్షల కోట్లు పెరిగి రూ.15.6 లక్షల కోట్లకు చేరుకుంది. ప్రాథమికంగా బ్యాంకుల నుంచి భారీ మొత్తంలో రుణాలు తీసుకున్నట్లు తాజా అధికారిక విశ్లేషణ వెల్లడించింది. అయితే ఇందుకు సంబంధించి కొన్ని వర్గాల నుంచి వ్యక్తమైన ఆందోళనలను కేంద్ర ఆర్థికశాఖ తోసిపుచ్చడం గమనార్హం. ఫైనాన్షియల్ రంగంలో పొదుపు రేటు తగ్గడంపై ఆందోళన పడాల్సింది ఏమీ లేదని, వివిధ ఇతర భౌతిక పొదుపు ప్రాడక్టుల్లో ప్రజలు పెట్టుబడులు పెడుతున్నారని వివరణ ఇచ్చింది. ఎస్‌బీఐ రీసెర్చ్ చెబుతున్న అంశాలు క్లుప్తంగా...

- 2022-23లో పెరిగిన హౌస్‌హోల్డ్ సెక్టార్ రుణం రూ.8.2 లక్షల కోట్లలో బ్యాంక్ రుణాలు రూ.7.1 లక్షల కోట్లు. ఇందులో దాదాపు 55 శాతం భాగం గృహాలు, విద్య, వాహనాల కొనుగోళ్లకు వెళ్లింది.
- ఈ కాలంలో బీమా, ప్రావిడెంట్ ఫండ్‌లు, పెన్షన్ ఫండ్ పథకాల్లో రూ. 4.1 లక్షల కోట్ల పెరుగుదల ఉంది.
- హౌస్‌హోల్డ్ రంగం రుణం జీడీపీ నిష్పత్తిలో చూస్తే, 2020 మార్చిలో 40.7 శాతం. 2023 జూన్‌లో ఇది 36.5 శాతానికి పడింది.
- ఫైనాన్షియల్ పొదుపు నుండి తగ్గిన మొత్తంలో ప్రధాన భాగం భౌతిక (పొదుపు) ఆస్తులవైపు మళ్లింది. తక్కువ వడ్డీరేట్ల వ్యవస్థ దీనికి కారణం.
- సంవత్సరాలుగా హౌస్‌హోల్డ్ సెక్టార్‌లో 80–90 శాతం భౌతిక పొదుపులు (ఫైనాన్షియల్ రంగంలో కాకుండా) నివాసాలు, ఇతర భవనాలు, నిర్మాణాలు, యంత్ర పరికరాల విభాగంలో ఉన్నాయి.
- వాస్తవానికి, 2011-2012లో హౌస్‌హోల్డ్ పొదుపులో మూడింట రెండు వంతుల కంటే ఎక్కువ భౌతిక ఆస్తుల వాటా ఉంది. అయితే ఇది 2020-21లో 48 శాతానికి తగ్గింది. 2022-23లో ఈ తరహా పొదుపులు మళ్లీ దాదాపు 70 శాతానికి చేరే అవకాశం కనబడుతోంది. రియల్టీ రంగం పురోగతికి ఇది సంకేతం.

నివేదిక పరిధి ఇదీ...

పొదుపులు, అప్పులకు సంబంధించి ఈ నివేదికలో ఎస్‌బీఐ రీసెర్చ్ 'హౌస్‌హోల్డ్ సెక్టార్' అని పేర్కొంది. అంటే జాతీయ ఖాతా (నేషనల్ అకౌంట్స్)కు సంబంధించి వ్యక్తులతోపాటు, వ్యవసాయ, వ్యవసాయేతర వ్యాపారాలు, ప్రభుత్వేతర, కార్పొరేటేతర చిన్న వ్యాపార సంస్థలు, ఏకైక (ప్రొప్రైటరీ) యాజమాన్యాలు, భాగస్వామ్యాలు, లాభాపేక్షలేని సంస్థలు వంటి అన్‌ఇన్‌కార్పొరేటెడ్ సంస్థలు ఈ పరిధిలో ఉంటాయి.

నిర్మా చేతికి గ్లెన్‌మార్క్ లైఫ్

- 75 శాతం వాటా కొనుగోలు
- డీల్ విలువ రూ. 5,652 కోట్లు



న్యూఢిల్లీ: అనుబంధ సంస్థ గ్లెన్‌మార్క్ లైఫ్ సైన్సెస్‌లో 75 శాతం వాటాను నిర్మా గ్రూప్‌నకు విక్రయిస్తున్నట్లు హెల్త్‌కేర్ దిగ్గజం గ్లెన్‌మార్క్ ఫార్మాస్యూటికల్స్ తాజాగా పేర్కొంది. డీల్ విలువ రూ. 5,652 కోట్లుకాగా.. ఇందుకు బోర్డు ఓకే చెప్పినట్లు తెలియజేసింది. షేరుకి రూ. 615 ధరలో 75 శాతం వాటా అమ్మకానికి నిర్మా లిమిటెడ్‌తో తప్పనిసరి ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు వెల్లడించింది. ఈ లావాదేవీ తదుపరి గ్లెన్‌మార్క్ లైఫ్‌లో గ్లెన్‌మార్క్ ఫార్మా వాటా 7.84 శాతానికి పరిమితంకానుంది. కాగా.. మెజారిటీ వాటా కొనుగోలు నేపథ్యంలో నిబంధనల ప్రకారం గ్లెన్‌మార్క్ లైఫ్ వాటాదారులకు నిర్మా లిమిటెడ్ ఓపెన్ ఆఫర్‌ను ప్రకటించవలసి ఉంటుంది. ప్రస్తుత ప్రమోటర్ల వాటా 82.84 శాతాన్ని మినహాయిస్తే 17.15 శాతం వాటాకు ఓపెన్ ఆఫర్ వర్తించనుంది.

రుణ భారం తగ్గింపు

కంపెనీకి కీలక విభాగాలైన డెర్మటాలజీ, రెస్పిరేటరీ, అంకాలజీపై మరింత దృష్టి సారించేందుకు తాజా లావాదేవీ తోడ్పడగలదని గ్లెన్‌మార్క్ ఫార్మా చైర్మన్, ఎండీ గ్లెన్ సాల్డానా పేర్కొన్నారు. అంతేకాకుండా వాటాదారుల విలువ బలపడేందుకు సైతం వీలున్నట్లు తెలియజేశారు. వాటా విక్రయ నిధులను రుణ చెల్లింపులకు వినియోగించనున్నట్లు తెలియజేశారు. కంపెనీ స్థూల రుణ భారం రూ. 4,600 కోట్లుకాగా.. పన్ను తదుపరి రూ. 5,000 కోట్లు లభించే వీలుంది. కంపెనీ తదుపరి దశ వృద్ధికి తాజా డీల్ సహకరించగలదని గ్లెన్‌మార్క్ లైఫ్ ఎండీ, సీఈవో యాసిర్ రాజ్వీ పేర్కొన్నారు. దీర్ఘకాలంలో వాటాదారులకు మరింత విలువ చేకూరగలదని అభిప్రాయపడ్డారు. ఇకపై కొత్త(నిర్మా) యాజమాన్యంలో స్వతంత్ర ఏపీఐ కంపెనీగా కార్యకలాపాలు నిర్వహించనున్నట్లు తెలియజేశారు. ఈ కంపెనీ పలు గ్లోబల్ ఫార్మా సంస్థలకు ప్రొడక్టులను సరఫరా చేస్తోంది. ఇక నిర్మా.. డిటర్జెంట్లు, డిష్ వాషింగ్ బార్, సబ్బుల తయారీలో పేరొందిన సంగతి తెలిసిందే.

తాజా పరిణామంతో గ్లెన్‌మార్క్ లైఫ్ షేరు 1.2% నీరసించి రూ. 627 వద్ద నిలవగా.. గ్లెన్‌మార్క్ ఫార్మా 3.3% పతనమై రూ. 828 వద్ద ముగిసింది.

నేటి నుంచి ఆజియో 'ఆల్ స్టార్స్ సేల్' ఆఫర్



బెంగళూరు: ఆన్‌లైన్ ఈ ఫ్యాషన్ రిటైలర్ ఆజియో 'ఆల్ స్టార్స్ సేల్' పేరుతో సరికొత్త ఆఫర్ ప్రకటించింది. జాతీయ, అంతర్జాతీయ ఫ్యాషన్‌కు సంబంధించి 5,500 బ్రాండ్లకు చెందిన 15 లక్షల భిన్న స్టైల్ వస్త్రాలు అందుబాటులో ఉంచింది. ఉత్తమ బ్రాండ్లపై ప్రత్యేక డీల్స్‌తో 50% నుంచి 90% వరకు డిస్కౌంట్లు అందిస్తుంది. సెప్టెంబర్ 22(నేటి)తో ప్రారంభమయ్యే ఈ అద్భుత ఆఫర్ రోజుకు ఆరు గంటలు పరిమిత కాలం మాత్రమే అందుబాటులో ఉంటుంది. సేల్ సమయంలో ఉత్తమ షాపింగ్ చేసిన వారు ప్రతి ఆరు గంటలకు ఐఫోన్ 14 ప్రో మ్యాక్స్, యాపిల్ మ్యాక్‌బుక్ ఎయిర్ ఎం2, రూ.లక్ష విలువైన బంగారం, శాంసంగ్ ఎస్23 అల్ట్రా గెలుచుకోవచ్చు. ఐసీఐసీఐ క్రెడిట్, డెబిట్ కార్డులపై పదిశాతం వరకు డిస్కౌంట్ పొందొచ్చు.

కియా కార్ల ధరలు ప్రియం

న్యూఢిల్లీ: వాహన తయారీ సంస్థ కియా ఇండియా సెల్టోస్, కరెన్స్ మోడళ్ల ధరలను 2 శాతం వరకు పెంచుతోంది. అక్టోబర్ 1 నుంచి కొత్త ధరలు అమలులోకి రానున్నాయి. రియల్ డ్రైవింగ్ ఎమిషన్ (ఆర్‌డీఈ) నిబంధనలకు అనుగుణంగా అన్ని మోడళ్లను తీర్చిదిద్దడంతో ఈ ఏడాది ఏప్రిల్‌లో కంపెనీ కార్ల ధరలను పెంచింది.



ఏప్రిల్ తర్వాత చాలా కంపెనీలు మోడళ్ల ధరలను సవరించాయని కియా ఇండియా సేల్స్, మార్కెటింగ్ నేషనల్ హెడ్ హర్‌దీప్ ఎస్ బ్రార్ తెలిపారు. 'ముడిసరుకు వ్యయం పెరుగుతోంది. కొత్త సెల్టోస్ విడుదల చేశాం. ఈ మోడల్ అభివృద్ధికి పెద్ద ఎత్తున ఖర్చు అయింది. ధరలు పెంచేందుకు ఇదే సరైన సమయం అని భావిస్తున్నాం' అని వివరించారు.

టీవీఎస్ మోటార్స్ ఈ-రేసింగ్ ఛాంపియన్‌షిప్



బెంగళూరు: టీవీఎస్ మోటార్స్ దేశంలోనే తొలి ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన రేసింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు(టీవీఎస్ ఎలక్ట్రిక్ వన్ మేకింగ్ ఛాంపియన్‌షిప్) నిర్వహించనున్నట్లు ప్రకటించింది. ప్రత్యేకంగా తయారు చేసిన ఎలక్ట్రిక్ టీవీఎస్ అపాచీ ఆర్‌టీఈ రేస్ మోటార్‌సైకిళ్లతో ఈ పోటీలు జరగనున్నాయి. ఈవీ మోటార్ రేసింగ్ ఉత్పత్తుల తయారీలోకి ప్రవేశించిన మొట్టమొదటి భారత కంపెనీ తమదేనని టీవీఎస్ మోటార్స్ తెలిపింది. భారత్‌లో మోటార్‌స్పోర్ట్స్‌లను ప్రోత్సహించడం, సుస్థిర రవాణా పరిష్కారాలకు కట్టుబడి ఉన్నట్లు పేర్కొంది.

మూడో రోజూ మార్కెట్ డీలా

- ఫెడ్ కఠిన ద్రవ్య విధాన వైఖరి వ్యాఖ్యల ప్రభావం
- 19,750 దిగువకు నిఫ్టీ



ముంబై: దలాల్ స్ట్రీట్ మూడో డీలా పడింది. ద్రవ్యోల్బణ కట్టడి లక్ష్యంలో భాగంగా ఈ ఏడాది మరో దఫా వడ్డీరేట్ల పెంపు ఉండొచ్చని అమెరికా ఫెడరల్ రిజర్వ్ సంకేతాలివ్వడం సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. విదేశీ ఇన్వెస్టర్ల అమ్మకాలు, డాలర్ ఇండెక్స్, బాండ్లపై రాబడులు, క్రూడాయిల్ ధరలు పెరగడం అంశాలు సైతం ప్రతికూల ప్రభావం చూపాయి. ముఖ్యంగా ఆటో, బ్యాంకింగ్, ఫైనాన్స్ రంగాల షేర్లలో విక్రయాలు వెల్లువెత్తడంతో సెన్సెక్స్ 571 పాయింట్లు నష్టపోయి 66,230 స్థాయి వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 672 పాయింట్లు క్షీణించి 66,129 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది. నిఫ్టీ 159 పాయింట్లు కోల్పోయి 19,742 వద్ద నిలిచింది. ఒక్క టెక్ షేర్లకు మాత్రం కొనుగోళ్ల మద్దతు లభించింది. విదేశీ ఇన్వెస్టర్లు రూ.3,007 కోట్ల షేర్లు అమ్మేయగా.., సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1,158 కోట్ల షేర్లను కొన్నారు. సెన్సెక్స్ మూడు రోజుల పతనంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.5.50 లక్షల కోట్లు హరించుకుపోయి రూ.317 లక్షల కోట్లకు దిగివచ్చింది. ఫెడ్ రిజర్వ్ ఈ దఫా కీలక వడ్డీరేట్లను యథాతథంగా ఉంచినప్పటికీ.., ద్రవ్యోల్బణ రేటు లక్ష్యం కంటే అధికంగా ఉండటంతో రానున్న రోజుల్లో కఠిన ద్రవ్య విధాన వైఖరిని అమలు చేస్తుందనే అంచనాలతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో బేరిష్ ట్రెండ్ నెలకొని ఉంది.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- నష్టాల మార్కెట్లోనూ ఈఎంఎస్ లిస్టింగ్ విజయవంతమైంది. బీఎస్‌ఈలో ఇష్యూ ధర(రూ.211)తో పోలిస్తే 33% ప్రీమియంతో రూ.281.55 వద్ద లిస్టయ్యింది. ట్రేడింగ్‌లో 38% వరకు బలపడి రూ.291 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి 32.58% లాభంతో రూ.280 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.1,553 కోట్లుగా నమోదైంది.
- బ్యాంకింగ్ షేర్ల పతనంలో భాగంగా ఐసీఐసీఐ బ్యాంకు 3% నష్టపోయి రూ.959 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో రూ.957 కనిష్టాన్ని తాకింది. దాదాపు రూ.20 వేల మార్కెట్ క్యాపిటలైజేషన్ ఆవిరైంది.
- ఆఫర్ ఫర్ సేల్ ప్రారంభంతో ఎస్‌జేవీఎన్ షేరు 13% క్షీణించి రూ.71.08 వద్ద స్థిరపడింది. ఆఫర్ ద్వారా కేంద్రం 4.92% వాటా విక్రయించనుంది.



వన్డే ప్రపంచకప్‌కు నోర్జే, మగాలా దూరం

వచ్చే నెలలో భారత్ వేదికగా జరిగే వన్డే ప్రపంచకప్ ప్రారంభానికి ముందే దక్షిణాఫ్రికా క్రికెట్ జట్టుకు రెండు దెబ్బలు తగిలాయి. గాయాల కారణంగా ఇద్దరు పేస్ బౌలర్లు అన్రిచ్ నోర్జే, సిసంద మగాలా ఈ మెగా ఈవెంట్‌కు దూరం కానున్నారని హెడ్ కోచ్ రాబ్ వాల్టర్ తెలిపారు. ఈ ప్రతిష్టాత్మక టోర్నీ కోసం ఇప్పటికే ప్రకటించిన దక్షిణాఫ్రికా తుది జట్టులో నోర్జే, మగాలాలను ఎంపిక చేశారు. అయితే వెన్ను నొప్పి నుంచి నోర్జే, మోకాలి గాయం నుంచి మగాలా పూర్తిగా కోలుకోకపోవడంతో ప్రపంచకప్ టోర్నీకి దూరంగా కావాల్సి వచ్చింది. నోర్జే స్థానంలో ఆల్‌రౌండర్ ఫెలుక్వాయో, మగాలా స్థానంలో లిజాద్ విలియమ్స్‌ను ఎంపిక చేశారు. 29 ఏళ్ల నోర్జే దక్షిణాఫ్రికా తరఫున 22 వన్డేలు ఆడి 36 వికెట్లు, 32 ఏళ్ల మగాలా ఎనిమిది వన్డేలు ఆడి 15 వికెట్లు తీశారు.



ప్రపంచకప్‌కు ఉప్పల్ స్టేడియం సిద్ధం

దాదాపుగా పూర్తయిన ఏర్పాట్లు



దుర్గాప్రసాద్

సాక్షి, హైదరాబాద్: వన్డే వరల్డ్ కప్ మ్యాచ్‌ల నిర్వహణ కోసం ఉప్పల్‌లోని రాజీవ్‌గాంధీ స్టేడియం అన్ని విధాలా సిద్ధమైందని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ప్రకటించింది. హెచ్‌సీఏ పర్యవేక్షకుడు, ఏకసభ్య కమిటీ చైర్మన్ జస్టిస్ ఎల్. నాగేశ్వరరావు తరఫున ప్రతినిధిగా వ్యవహరిస్తున్న రిటైర్డ్ ఐపీఎస్ కె. దుర్గాప్రసాద్ వరల్డ్ కప్‌కు సంబంధించి ఏర్పాట్ల గురించి వెల్లడించారు. బీసీసీఐ ప్రత్యేకంగా కేటాయించిన నిధులతో స్టేడియంలో కొత్తగా అనేక అభివృద్ధి చేపట్టినట్లు ఆయన వివరించారు. 'స్టేడియంలో ఐసీసీ ప్రమాణాలకు అనుగుణంగా చక్కటి అవుట్ ఫీల్డ్‌ను సిద్ధం చేశాం. ప్రేక్షకులకు కల్పించే సౌకర్యాలను ఎంతో మెరుగుపర్చాం. వారి కోసం స్టేడియంలో మూడు వైపులా నార్త్, సౌత్, ఈస్ట్‌లలో కనోపీలను ఏర్పాటు చేశాం. సౌత్‌లో కొన్నాళ్ల క్రితం పాడైపోయిన కనోపీని పునరుద్ధరించాం. పాతవాటి స్థానంలో కొత్తగా ఫ్లడ్‌లైట్లను కూడా ఏర్పాటు చేశాం. ఎల్‌ఈడీ లైట్లు ఉండటం ఈసారి ప్రత్యేకత' అని దుర్గా ప్రసాద్ చెప్పారు. స్టేడియం సామర్థ్యం 39 వేలు కాగా, 11 వేలు పాత సీట్లను తొలగించి వాటి స్థానంలో కొత్తవి సిద్ధం చేసినట్లు ఆయన వివరించారు. వరుసగా రెండు రోజుల్లో రెండు మ్యాచ్‌లు ఉండటంతో ఎలాంటి సమస్యా లేదని, వాటిని సమర్థంగా నిర్వహించగలమని విశ్వాసం వ్యక్తం చేసిన దుర్గాప్రసాద్... అభిమానులు పెద్ద సంఖ్యలో ఈ మ్యాచ్‌లపై ఆసక్తి చూపిస్తున్నారని చెప్పారు. ఉప్పల్ స్టేడియంలో అక్టోబర్ 6, 9, 10 తేదీల్లో ప్రపంచ కప్ మ్యాచ్‌లు ఉన్నాయి.



'అసలు'కు ముందు ఆఖరి సమరం!

నేడు భారత్, ఆస్ట్రేలియా తొలి వన్డే • శ్రేయస్, సూర్య, అశ్విన్ ఫామ్‌పై దృష్టి

మధ్యాహ్నం గం.1:30 నుంచి స్పోర్ట్స్–18 చానెల్‌లో, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం



శ్రేయస్



కమిన్స్



అశ్విన్

మొహాలి: ప్రపంచకప్‌లో భారత్, ఆస్ట్రేలియా మధ్య మ్యాచ్‌కు మరో 16 రోజుల సమయం ఉంది. కానీ దానికి ముందు తమ బలం తేల్చుకునేందుకు ఇరు జట్లు ద్వైపాక్షిక సిరీస్‌తో సన్నద్ధమయ్యాయి. భారత్, ఆస్ట్రేలియా మధ్య మూడు వన్డేల పోరులో భాగంగా నేడు తొలి మ్యాచ్ జరగనుంది. ఆసియా కప్ గెలిచిన ఉత్సాహంలో టీమిండియా బరిలోకి దిగుతుండగా, ఇటీవల దక్షిణాఫ్రికా గడ్డపై ఆసీస్ సిరీస్ ఓడింది. భారత టాప్ ప్లేయర్లు ఈ సిరీస్ తొలి రెండు వన్డేల నుంచి విశ్రాంతి తీసుకోగా... మరోవైపు విశ్రాంతి తర్వాత కంగారూ జట్టు ప్రధాన ఆటగాళ్లు ఇప్పుడు బరిలోకి దిగుతుండటం విశేషం. ఈ నేపథ్యంలో సిరీస్ ఆసక్తకరంగా సాగే అవకాశం ఉంది.

ఆ ముగ్గురే కీలకం...

భారత జట్టుకు సంబంధించి ఈ సిరీస్‌లో ముగ్గురి ఆటపై అందరి దృష్టీ కేంద్రీకృతమైంది. అక్షర్ పటేల్ గాయం నేపథ్యంలో వరల్డ్‌కప్ జట్టులో చోటు ఆశిస్తున్న అశ్విన్ ఎలా ఆడతాడనేది ఆసక్తికరం. ఏడాదిన్నర తర్వాత అతను వన్డే టీమ్‌లోకి వచ్చాడు. పేరుకే గాయం నుంచి కోలుకున్నా శ్రేయస్ అయ్యర్ ఆసియా కప్‌లో పూర్తి ఫిట్‌గా లేక మళ్లీ మ్యాచ్‌లకు దూరమయ్యాడు. అతను వరల్డ్‌కప్ టీమ్‌లో కొనసాగగలడా అనేందుకు ఈ సిరీసే సమాధానమిస్తుంది. ఆటతో పాటు ఫిట్‌నెస్‌ను కూడా శ్రేయస్ నిరూపించుకోవాల్సి ఉంది. మరోవైపు మిడిలార్డర్‌లో సూర్యకుమార్ యాదవ్ ఇంకా చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్ ఆడలేదు. ఆసీస్ జట్టు కొన్నాళ్ల క్రితం భారత్‌లో పర్యటించినప్పుడు మూడు వన్డేల్లోనూ సూర్య మొదటి బంతికే అవుటయ్యాడు. ఇలాంటి స్థితిలో ఈ ముగ్గురు తమదైన రీతిలో సత్తా చాటాల్సి ఉంది. ఇతర ఆటగాళ్లలో గిల్, రాహుల్, ఇషాన్ కిషన్ ఫామ్‌లో ఉండగా, జడేజా బ్యాటింగ్ ఇంకా బలహీనంగానే ఉంది. ఆసియా ఫైనల్లో చెలరేగిన సిరాజ్ అదే జోరు కొనసాగించాలని భావిస్తున్నాడు. అశ్విన్‌తో పోటీ పడుతున్న వాషింగ్టన్ సుందర్ బలమైన ప్రత్యర్థిపై ఎలాంటి ప్రభావం చూపిస్తాడనేది ఆసక్తికరం.

కమిన్స్, స్మిత్ సిద్ధం...

ఆస్ట్రేలియా జట్టు వన్డే కెప్టెన్‌గా ఎంపికై దాదాపు ఏడాది అవుతున్నా వేర్వేరు కారణాలతో కమిన్స్ రెండు మ్యాచ్‌లలోనే నాయకత్వం వహించాడు. గాయంతో ఇటీవలి దక్షిణాఫ్రికా టూర్‌కూ అతను దూరమయ్యాడు. ఇప్పుడు భారత్‌తో సిరీస్‌లో మళ్లీ ఫామ్‌ను అందుకునేందుకు కమిన్స్ బరిలోకి దిగుతున్నాడు. అతనిలాగే స్టీవ్ స్మిత్ కూడా కొంత విరామం తర్వాత వచ్చాడు. భారత గడ్డపై చక్కటి రికార్డు ఉన్న స్మిత్ కెప్టెన్సీలోనే ఆ జట్టు ఇక్కడ సిరీస్ కూడా గెలుచుకుంది. వార్నర్, మిచెల్ మార్ష్, లబుషేన్‌లతో జట్టు బ్యాటింగ్ పటిష్టంగా ఉంది. మిడిలార్డర్‌లో క్యారీ, గ్రీన్, స్టొయినిస్‌లాంటి ఆటగాళ్లు జట్టుకు పెద్ద బలం. మ్యాక్స్‌వెల్, స్టార్క్ ఈ మ్యాచ్ బరిలోకి దిగడం లేదు. భారత సంతతికి చెందిన స్పిన్నర్ తన్వీర్ సంఘాకు తుది జట్టులో అవకాశం దక్కవచ్చు. అనూహ్యంగా హెడ్ గాయపడటంతో టీమ్ ప్రణాళికల్లో కొంత మార్పు జరిగినా ఆ లోటు కనిపించకుండా ఆడగల సమర్థులు టీమ్‌లో ఉండటం ఆసీస్‌కు సానుకూలాంశం.

పిచ్, వాతావరణం

సాధారణంగా బ్యాటింగ్‌కు అనుకూలమైన పిచ్. అయితే ఇక్కడ నాలుగేళ్లుగా వన్డే జరగలేదు. కానీ ఐపీఎల్‌లో భారీ స్కోర్లు నమోదయ్యాయి. మ్యాచ్ రోజు వర్షసూచన లేదు.

4 భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య మొహాలీలో ఇప్పటి వరకు నాలుగు మ్యాచ్‌లు జరిగాయి. నాలుగు మ్యాచ్‌ల్లోనూ భారత జట్టు ఓడిపోయింది.

67 స్వదేశంలో ఆస్ట్రేలియా జట్టుతో ఇప్పటి వరకు భారత్ 67 మ్యాచ్‌లు ఆడింది. 30 మ్యాచ్‌ల్లో భారత్ గెలిచింది. 32 మ్యాచ్‌ల్లో ఆస్ట్రేలియా విజయం సాధించింది. మరో ఐదు మ్యాచ్‌ల్లో ఫలితం తేలలేదు.

అంతిమ్ అదరహో

- ప్రపంచ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం సొంతం
- పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత



బెల్‌గ్రేడ్: భారత మహిళా టీనేజ్ రెజ్లర్ అంతిమ్ పంఘాల్ అద్భుతం చేసింది. హరియాణాకు చెందిన 19 ఏళ్ల అంతిమ్ ప్రపంచ సీనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం సొంతం చేసుకుంది. గురువారం జరిగిన మహిళల 53 కేజీల విభాగం కాంస్య పతక బౌట్‌లో అండర్–20 'డబుల్ ప్రపంచ చాంపియన్' అంతిమ్ 16–6 పాయింట్ల తేడాతో ప్రపంచ మూడో ర్యాంకర్, యూరోపియన్ చాంపియన్ ఎమ్మా జోనా డెనిస్ మాల్మ్‌గ్రెన్ (స్వీడన్)పై విజయం సాధించింది. ఈ గెలుపుతో అంతిమ్ వచ్చే ఏడాది జరిగే పారిస్ ఒలింపిక్స్‌కు కూడా అర్హత సాధించింది. భారత రెజ్లింగ్ సమాఖ్యపై నిషేధం కొనసాగుతున్న నేపథ్యంలో ఈ మెగా టోర్నీలో భారత రెజ్లర్లు యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ పతాకంపై పోటీపడుతున్నారు. అంతిమ్ 2022, 2023 ప్రపంచ అండర్–20 చాంపియన్‌షిప్‌లో 53 కేజీల విభాగాల్లో స్వర్ణ పతకాలు సాధించడంతోపాటు 2023 ఆసియా సీనియర్ చాంపియన్‌షిప్‌లో రజత పతకం గెలిచింది.

8 ప్రపంచ సీనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో పతకం గెలిచిన ఎనిమిదో భారతీయ రెజ్లర్‌గా అంతిమ్ పంఘాల్ గుర్తింపు పొందింది. గతంలో అల్కా తోమర్ (2006: కాంస్యం), బబిత ఫొగాట్ (2012: కాంస్యం), గీతా ఫొగాట్ (2012: కాంస్యం), వినేశ్ ఫొగాట్ (2019, 2022: కాంస్యాలు), పూజా ధాండ (2018: కాంస్యం), అన్షు మలిక్ (2021: రజతం), సరితా మోర్ (2021: కాంస్యం) ఈ ఘనత సాధించారు.

'పూర్తి స్థాయి జట్టుతో ఆడాల్సింది'

సునీల్ గావస్కర్

మరో పక్షం రోజుల్లో ప్రపంచకప్ ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆస్ట్రేలియాతో జరిగే పోరును ఒక ద్వైపాక్షిక సిరీస్‌లా కాకుండా వామప్ మ్యాచ్‌ల తరహాలోనే భారత్ చూస్తున్నట్లుగా అనిపిస్తోంది. భారత జట్టు ఎంపికను చూస్తే వారి ఆలోచనలు ఎలా ఉన్నాయో తెలుస్తుంది. రోహిత్, కోహ్లి, పాండ్యాలాంటి వారిని పక్కన పెట్టడంతో బ్యాటింగ్ బాగా బలహీనంగా మారిపోయింది. వరల్డ్‌కప్‌కు ముందు జాగ్రత్త కోసం బౌలర్లకు విశ్రాంతినిచ్చారంటే అర్థం చేసుకోవచ్చు. స్వదేశంలో గత రెండు వన్డే సిరీస్‌లను కూడా ఆస్ట్రేలియానే గెలుచుకుంది. అలాంటప్పుడు ప్రపంచకప్‌కు ముందు జరిగే ఈ సిరీస్‌లో గెలిస్తే టీమిండియా మరింత ఉత్సాహంతో ప్రపంచకప్ బరిలోకి దిగేది. సీనియర్లు లేకపోవడం వల్ల ఆ అవకాశం తగ్గిందనేది వాస్తవం. ఇలాంటి సిరీస్‌ను తక్కువ చేసి చూడటం భారత అభిమానులను నిర్ఘాంతపరిచేదే. ఆస్ట్రేలియా జట్టు ప్రపంచకప్ ఫేవరెట్‌లలో ఒకటని అంతా ముక్తకంఠంతో చెబుతున్నారు. ఆసియా కప్ గెలిచిన జోరులో అలాంటి జట్టును భారత్ ఓడిస్తే ఎంతో బాగుండేది. అలా కాకుండా ఇప్పుడు ఆసీస్ గెలిస్తే వారి ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ఆసియా కప్‌లో బంగ్లాదేశ్‌పై సీనియర్లకు విశ్రాంతినిస్తే ఏం జరిగిందో చూశాం. వరల్డ్‌కప్ జట్టులోకి ఎంపికైన అక్షర్ పటేల్ సమయానికి కోలుకోకపోతే అశ్విన్, వాషింగ్టన్ సుందర్‌లలో ఎవరికి అవకాశం లభిస్తుందో చూడాలి. ఈ సిరీస్‌లో బాగా ఆడితే తుది జట్టులో తమ స్థానం కోసం షమీ, శార్దుల్ కూడా పోటీ పడవచ్చు. శ్రేయస్ అయ్యర్ కూడా తాను పూర్తి ఫిట్‌గా ఉన్నానని నిరూపించుకోవాలి. వరల్డ్‌కప్‌ను దృష్టిలో ఉంచుకొని ఈ సిరీస్ కోసం జట్టును సెలక్టర్లు ఎంపిక చేసి ఉండవచ్చు. వచ్చే సోమవారం జరిగే బీసీసీఐ ఏజీఎం సమయానికి ఆసీస్ సిరీస్ గెలవ రాదని వారు కోరుకోవాలి.

సెమీస్‌లో భారత్

హాంగ్జౌ (చైనా): ఆసియా క్రీడల మహిళల టి20 క్రికెట్ ఈవెంట్‌లో భారత జట్టు సెమీఫైనల్లోకి ప్రవేశించింది. మలేసియాతో గురువారం జరిగిన క్వార్టర్ ఫైనల్ వర్షం కారణంగా రద్దయింది. దాంతో అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) ర్యాంకింగ్స్‌లో మెరుగైన ర్యాంక్‌లో ఉన్నందుకు భారత జట్టుకు సెమీఫైనల్ బెర్త్ ఖరారైంది. 15 ఓవర్లకు కుదించిన ఈ మ్యాచ్‌లో తొలుత భారత్ 15 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 173 పరుగులు చేసింది. షఫాలీ వర్మ (39 బంతుల్లో 67; 4 ఫోర్లు, 5 సిక్స్‌లు), జెమీమా (29 బంతుల్లో 47 నాటౌట్; 6 ఫోర్లు), రిచా ఘోష్ (7 బంతుల్లో 21 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్) దూకుడుగా ఆడారు. అనంతరం మలేసియా ఇన్నింగ్స్‌లో రెండు బంతులు పూర్తయ్యాక వర్షం రావడంతో ఆట నిలిచిపోయింది. మరోవైపు భారత ఫుట్‌బాల్ జట్లకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. భారత పురుషుల జట్టు 1–0తో బంగ్లాదేశ్‌ను ఓడించగా... భారత మహిళల జట్టు 1–2తో చైనీస్ తైపీ చేతిలో ఓటమి పాలైంది.


రాజ్యసభ | ఏపీ ఇన్ పార్లమెంట్

పెద్దల సభల్లోనూ

మహిళలకు రిజర్వేషన్

మహిళా రిజర్వేషన్ బిల్లుపై చర్చలో విజయసాయిరెడ్డి విజ్ఞప్తి

ఏపీలో 50శాతానికి మించి ఇస్తున్నారని వెల్లడి



సాక్షి, న్యూఢిల్లీ : రాజ్యసభ, రాష్ట్రాల శాసన మండళ్లలోనూ మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని వైఎస్సార్‌సీపీ సభ్యుడు వి.విజయసాయిరెడ్డి కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాజ్యసభలో గురువారం మహిళా రిజర్వేషన్ బిల్లుపై జరిగిన చర్చలో ఆయన పాల్గొన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఈ బిల్లుకు విస్పష్టంగా మద్దతు తెలుపుతోందని ప్రకటించారు. లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు ఉద్దేశించిన ఈ బిల్లులో రాజ్యసభ, రాష్ట్రాల శాసన మండళ్లలో మహిళల రిజర్వేషన్‌ను విస్మరించడం తగదన్నారు. వీటిల్లోని సభ్యులు తమ టర్మ్ పూర్తవగానే రిటైర్ అవుతుంటారని, అందువల్ల రాజ్యసభ, మండళ్లలో కూడా మహిళలకు రిజర్వేషన్లు కల్పించేందుకు రాజ్యాంగంలోని ఆర్టికల్ 80, 171లను సవరించాలని ఆయన న్యాయశాఖా మంత్రికి విజ్ఞప్తి చేశారు. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్ కల్పించే చరిత్రాత్మక బిల్లును ఈ రోజున సభలో ప్రవేశపెట్టినందున ఏటా జరుపుకునే అంతర్జాతీయ మహిళా దినోత్సవం మాదిరిగానే చరిత్రలో మహిళల ఔన్నత్యాన్ని చాటి చెప్పేలా సెప్టెంబర్ నెలను చారిత్రక మహిళా మాసంగా జరుపుకునేలా ప్రకటించాలని విజయసాయిరెడ్డి విజ్ఞప్తి చేశారు.

1992లో రాజ్యాంగంలోని 73, 74 ఆర్టికల్స్‌ను సవరించడం ద్వారా పంచాయతీలు, మున్సిపాలిటీల్లో మహిళలకు మూడింట ఒక వంతు రిజర్వేషన్ కల్పించారని.. అయితే ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ జగన్ నాయకత్వంలోని ప్రభుత్వం చట్టబద్ధంగా నిర్దేశించిన 33 శాతానికి మించే పంచాయతీలు, స్థానిక సంస్థల్లో ప్రాతినిధ్యం కల్పించి మహిళాభ్యున్నతిపట్ల తమ చిత్తశుద్ధిని చాటుకుందని విజయసాయిరెడ్డి గుర్తు చేశారు. ఏపీలో తమ ప్రభుత్వం మహిళలకు ఏ విధంగా పెద్దపీట వేసిందో గణాంకాలతో వివరించారు.

ఏపీలో మహిళలకు 50 శాతానికి పైగానే..

- స్థానిక సంస్థల్లో 1,356 స్థానాలకుగాను 688 స్థానాలను అంటే దాదాపు 51 శాతం స్థానాలను మహిళలతో భర్తీచేసినట్లు తెలిపారు.
- 13 జిల్లా పరిషత్ చైర్మన్ పదవుల్లో ఏడింటిని మహిళలకు (అంటే 54 శాతం) కేటాయించామని.. జెడ్పీ వైస్ చైర్మన్ పోస్టులు 26 ఉంటే.. 15 పోస్టులను (అంటే 58 శాతం) మహిళలే అలంకరించారన్నారు.
- అలాగే, మున్సిపల్ కార్పొరేషన్లలో మొత్తం 36 మేయర్, డిప్యూటీ మేయర్ పోస్టులలో 50 శాతం.. అంటే 18 పోస్టుల్లో మహిళల నియామకం జరిగిందన్నారు.
- 671 మున్సిపల్ కార్పొరేషన్, వార్డు సభ్యుల పదవుల్లో 53.8 శాతం పదవులు మహిళలకే దక్కాయన్నారు.
- ఇక రాష్ట్రంలోని 73 మున్సిపల్ చైర్మన్ పదవుల్లో 45 మంది మహిళలు (అంటే 62 శాతం) చైర్‌పర్సన్‌లుగా ఎన్నికయ్యారన్నారు.
- 2,124 మున్సిపల్ వార్డు సభ్యుల పదవుల్లో 1,061 పదవులకు.. గ్రామ సర్పంచ్‌లలో 57 శాతం, ఎంపీటీసీల్లో 54 శాతం, మండలాధ్యక్షుల్లో 53 శాతం, జెడ్పీటీసీల్లో 53 శాతం మహిళా సభ్యులే ఉన్నారన్నారు.
- అలాగే వార్డు, విలేజ్ వలంటీర్లలో 53 శాతం.. వార్డు, గ్రామ సచివాలయ అధికారుల్లో 51 శాతం మంది మహిళలే ఉన్నారని విజయసాయిరెడ్డి తెలిపారు.

పర్యావరణ పెన్ను.. విత్తనాలు మొలకెత్తును

పేపర్‌తో తయారు చేసిన 'యూజ్ అండ్ త్రో' పెన్నుల వెనుక విత్తనాలు

- వాడి పడేశాక మట్టిలో కలసిపోయి విత్తనాలు మొలకెత్తేలా రూపకల్పన
- ప్రయోగాత్మకంగా వినియోగంలోకి తెచ్చిన పాఠశాల విద్యాశాఖ



పర్యావరణహిత పెన్నులు

గుంటూరు (ఎడ్యుకేషన్): సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల తయారీ, వినియోగంపై నిషేధం విధించిన రాష్ట్ర ప్రభుత్వం ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా పర్యావరణానికి హాని కలిగించని ఉత్పత్తులను ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా ప్రభుత్వ కార్యాలయాల్లో ఉపయోగించే పెన్నులను సైతం పర్యావరణ అనుకూల విధానంలో ఉపయోగిస్తోంది. యూజ్ అండ్ త్రో (వాడిపారేసే) ప్లాస్టిక్ పెన్నులు భూమిలో కలిసిపోయేందుకు వందల ఏళ్లు పడుతుంది. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో పనిచేసే అధికారులు, ఉద్యోగులు రాష్ట్రవ్యాప్తంగా వందలు, వేల సంఖ్యలో పెన్నులను వాడి పారేస్తుండటంతో పర్యావరణానికి హాని కలిగించని పెన్నుల తయారీ, వినియోగంపై ప్రభుత్వం దృష్టి సారించింది. తొలుత విద్యాశాఖలో ప్రయోగాత్మకంగా పర్యావరణ అనుకూల పెన్నుల వినియోగాన్ని అమల్లోకి తెచ్చింది.

కాగితం పొరలతో..

కాగితం పొరలతో తయారు చేసిన పెన్నులకు మందపాటి అట్టతో రూపొందించిన క్యాప్ ఉంచిన పెన్నులను రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారులు జిల్లాల వారీగా నిర్వహిస్తున్న వివిధ శిక్షణ కార్యక్రమాల్లో పాల్గొంటున్న ఉపాధ్యాయులకు ఉచితంగా అందజేస్తున్నారు. ప్యాడ్‌తో పాటు పేపర్ పెన్నులను ఇస్తూ.. పర్యావరణ పరిరక్షణకు నడుం బిగిస్తున్నారు. ప్రత్యేకంగా పేపర్ పెన్నుల ఉత్పత్తిదారులకు ఆర్డర్ ఇచ్చి పెన్నులు తయారు చేయిస్తున్నారు. వీటిని వాడిన తరువాత పడేస్తే అవి మట్టిలో కలిసిపోతాయి. మరో విశేషం ఏమిటంటే.. ఆ పెన్నుల వెనుక భాగంలో అమర్చిన చిన్న గొట్టంలో నవధాన్యాలు, వివిధ దినుసులు, పూల మొక్కల విత్తనాలను అమర్చారు. బీన్స్, సన్‌ఫ్లవర్, మెంతులు తదితర విత్తనాలను కూడా అమర్చుతున్నారు. పెన్నును వాడి పారేసిన తరువాత ఇంటి పెరట్లోనో, రోడ్డు పక్కన మట్టిలోనో పారవేస్తే పెన్ను భూమిలో కరిగిపోయి.. అందులోని విత్తనాలు మొలకెత్తుతాయి. ప్రస్తుతం బల్క్ ఆర్డర్లపై తయారు చేస్తున్న ఈ ఎకో ఫ్రెండ్లీ పెన్నును కేవలం రూ.20కే కొనుగోలు చేయవచ్చు. గురువారం గుంటూరు నగరంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి శిక్షణ కార్యక్రమానికి వచ్చిన ఉపాధ్యాయులకు ఎకో ఫ్రెండ్లీ పెన్నులను విద్యాశాఖ అధికారులు పంపిణీ చేశారు.

చంద్రబాబు కస్టడీపై తీర్పు నేటికి వాయిదా

హైకోర్టు తీర్పు కోసం వేచి చూద్దామన్న ఏసీబీ కోర్టు


- శుక్రవారం హైకోర్టు తీర్పివ్వకుంటే తాము తీర్పునిస్తామని స్పష్టీకరణ
- శుక్రవారంనాటి కేసుల విచారణ జాబితాలో లేని చంద్రబాబు కేసు
- దీంతో ఉదయం 10.30కి తీర్పు వెలువరించాల్సి ఉన్న ఏసీబీ కోర్టు

సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో అరెస్టయిన మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నుంచి మరింత సమాచారం రాబట్టాల్సి ఉన్నందున, ఆయన్ని ఐదు రోజుల పాటు తమ కస్టడీకి అప్పగించాలంటూ సీఐడీ దాఖలు చేసిన పిటిషన్‌లో ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం తన తీర్పును శుక్రవారానికి వాయిదా వేసింది. వాస్తవానికి గురువారమే తీర్పు ఇవ్వాల్సి ఉంది. అయితే, సీఐడీ నమోదు చేసిన కేసులు కొట్టేయాలని, రిమాండ్ సైతం చట్ట విరుద్ధంగా ప్రకటించాలని కోరుతూ చంద్రబాబు దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు తీర్పు వెలువరించాల్సి ఉంది. దీంతో ఏసీబీ కోర్టు తన తీర్పును శుక్రవారానికి వాయిదా వేసింది. చంద్రబాబు పిటిషన్‌పై హైకోర్టు శుక్రవారం తీర్పు వెలువరిస్తే పోలీసు కస్టడీపై తన నిర్ణయాన్ని వాయిదా వేస్తామని, ఒకవేళ హైకోర్టు తీర్పు వెలువరించకుంటే శుక్రవారం ఉదయం 10.30 గంటలకే తీర్పునిస్తామని న్యాయస్థానం స్పష్టం చేసింది. జ్యుడిషియల్ రిమాండ్ ముగింపు గడువు దగ్గర పడుతున్నందున, ఈరోజే కస్టడీ పిటిషన్‌పై ఉత్తర్వులు జారీ చేయాలని సీఐడీ న్యాయవాదులు పట్టుబట్టారు. చంద్రబాబును ఐదు రోజుల పాటు సీఐడీ కస్టడీకి ఇవ్వాలని కోరామని చెప్పారు. న్యాయస్థానం మాత్రం చంద్రబాబు పిటిషన్ హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న విషయాన్ని గుర్తు చేసింది. చంద్రబాబు పిటిషన్‌పై హైకోర్టు శుక్రవారం తీర్పు ఇస్తుందని తాము భావించడంలేదని సీఐడీ తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి చెప్పారు. దీనిపై న్యాయస్థానం చంద్రబాబు తరఫు న్యాయవాదుల అభిప్రాయం కోరింది. తీర్పు నేడు ఇవ్వాలా లేక శుక్రవారానికి వాయిదా వేయాలా అన్నది కోర్టు ఇష్టమని చంద్రబాబు తరఫు సీనియర్ న్యాయవాది దమ్మాలపాటి శ్రీనివాస్ తెలిపారు. అనంతరం న్యాయస్థానం స్పందిస్తూ.. శుక్రవారం హైకోర్టు తీర్పు వెలువరిస్తుందేమో చూద్దామని తెలిపింది.

ఇదిలా ఉంటే.. చంద్రబాబు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై హైకోర్టు శుక్రవారం తీర్పు వెలువరించడంలేదు. శుక్రవారం నాటి హైకోర్టు కేసుల విచారణ జాబితాలో చంద్రబాబు కేసు లిస్ట్ కాలేదు. దీంతో ఏసీబీ కోర్టు శుక్రవారం ఉదయం తన తీర్పును వెలువరించి తీరాల్సి ఉంటుంది.

ఇన్నర్ రింగ్ రోడ్డు కేసు.. బాబు బెయిల్ పిటిషన్‌పై విచారణ 26కి వాయిదా

- హైకోర్టు ఉత్తర్వులు
- ఏసీబీ కోర్టులో ఉన్న వ్యాజ్యాలపై విచారణ జరపొచ్చని వెల్లడి
- ఈ పిటిషన్‌తో సంబంధం లేదని స్పష్టీకరణ



సాక్షి, అమరావతి: అమరావతి మాస్టర్ ప్లాన్, ఇన్నర్ రింగ్ రోడ్ అలైన్‌మెంట్ డిజైన్ల ముసుగులో సాగిన భూ దోపిడీపై సీఐడీ 2022 లో నమోదు చేసిన కేసులో బెయిల్ కోరుతూ మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు దాఖలు చేసిన పిటిషన్‌లో తదుపరి విచారణ ఈ నెల 26కి వాయిదా పడింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కంచిరెడ్డి సురేష్‌రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. చంద్రబాబు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై జస్టిస్ సురేష్‌రెడ్డి విచారణ జరిపారు. చంద్రబాబు తరఫు న్యాయవాది ఎస్.ప్రణతి స్పందిస్తూ.. ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో పీటీ వారెంట్ కోసం సీఐడీ దాఖలు చేసిన పిటిషన్‌పై ఏసీబీ కోర్టు ఈరోజే (గురువారం) విచారణ జరపనుందని, అందువల్ల ఈ బెయిల్ పిటిషన్‌పై విచారణను సోమవారానికి వాయిదా వేయాలని కోర్టును కోరారు. సీఐడీ తరఫున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ యడవల్లి నాగ వివేకానంద స్పందిస్తూ.. పీటీ వారెంట్‌తో పాటు చంద్రబాబును కస్టడీకి అప్పగించాలంటూ కూడా పిటిషన్ వేశామని చెప్పారు. ఏసీబీ కోర్టులో ఉన్న వ్యాజ్యాల విచారణకు హైకోర్టులో చంద్రబాబు బెయిల్ పిటిషన్ అడ్డంకి కాదని ఉత్తర్వుల్లో నమోదు చేయాలని కోర్టును కోరారు. విచారణను వాయిదా వేయడానికి అభ్యంతరం లేదన్నారు. సీఐడీ తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ జోక్యం చేసుకుంటూ.. సోమవారం తాను ఇతర కేసుల్లో వాదనలు వినిపించాల్సి ఉన్నందువల్ల విచారణను బుధవారానికి వాయిదా వేయాలని కోరారు. ఇరుపక్షాల అభ్యర్థనలను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి మధ్యేమార్గంగా విచారణను మంగళవారానికి వాయిదా వేశారు. ఆరోజు మధ్యాహ్నం 2.15 గంటలకు విచారణ జరుపుతానని చెప్పారు. ఈ బెయిల్ పిటిషన్ ప్రభావానికి లోను కాకుండా ఏసీబీ కోర్టు తన ముందు వ్యాజ్యాల్లో విచారణను కొనసాగించవచ్చునని న్యాయమూర్తి తన ఉత్తర్వుల్లో తేల్చి చెప్పారు.

టీడీపీ నేతలకు ముందస్తు బెయిల్

- అంగళ్లు, పుంగనూరు కేసుల్లో తదుపరి విచారణ వరకు ముందస్తు బెయిల్ ఇచ్చిన హైకోర్టు
- విచారణ రెండు వారాలకు వాయిదా

సాక్షి, అమరావతి: యుద్ధభేరి పేరుతో టీడీపీ అధినేత చంద్రబాబు చేపట్టిన సాగునీటి ప్రాజెక్టుల సందర్శన సందర్భంగా ఇటీవల అన్నమయ్య జిల్లా అంగళ్లు నుంచి చిత్తూరు జిల్లా పుంగనూరు వరకు టీడీడీ శ్రేణులు సాగించిన విధ్వంసంపై నమోదైన కేసుల్లో పలువురు టీడీపీ నేతలు, కార్యకర్తలకు హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. తదుపరి విచారణ వరకు వీరిపై ఎలాంటి తొందరపాటు చర్యలు తీసుకోవద్దని పోలీసులను ఆదేశించింది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. టీడీపీ నేతలపై పెట్టిన కేసుల్లో సుప్రీం కోర్టు ఇచ్చే తీర్పు ఆధారంగా ఈ వ్యాజ్యాల్లో తదుపరి ఆదేశాలు జారీ చేస్తామని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కంచిరెడ్డి సురేష్‌రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. అంగళ్లు నుంచి పుంగనూరు వరకు టీడీపీ శ్రేణులు సాగించిన విధ్వంసంలో దాదాపు 47 మంది పోలీసులు తీవ్రంగా గాయపడ్డారు. ఓ పోలీసు కంటిని కోల్పోయారు. దీనిపై ముదివేడు, పుంగనూరు పోలీసులు వేర్వేరుగా కేసులు నమోదు చేశారు. ఈ కేసుల్లో ముందస్తు బెయిల్ కోరుతూ మాజీ మంత్రి అమర్నాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు షాజహాన్ బాషా, డి.రమేష్ తదితరులు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలపై న్యాయమూర్తి జస్టిస్ సురేష్‌రెడ్డి గురువారం విచారణ జరిపారు. పోలీసుల తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. ఇదే కేసుల్లో పలువురు నిందితులకు హైకోర్టు ఇప్పటికే ముందస్తు బెయిల్ ఇచ్చిందని, ఆ ఉత్తర్వులను సుప్రీంకోర్టులో సవాలు చేశామని, ఇది వచ్చే వారం విచారణకు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. సుప్రీంకోర్టు నిర్ణయం వెలువరించేంత వరకు పిటిషనర్లకు ముందస్తు బెయిల్ ఇవ్వొద్దని అభ్యర్థించారు. టీడీపీ నేతలు, కార్యకర్తల తరఫున సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు స్పందిస్తూ.. సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారన్న కారణంతో ప్రస్తుత వ్యాజ్యాలపై నిర్ణయం వెలువరించొద్దని కోరడం సరికాదన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి.. పిటిషనర్లకు రెండు వారాలు ముందస్తు బెయిల్ మంజూరు చేశారు. ఇదిలా ఉంటే, ఇదే కేసుల్లో జ్యుడిషియల్ కస్టడీలో ఉన్న 79 మంది టీడీపీ కార్యకర్తలకు హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది.

11వ రోజుకు చంద్రబాబు జైలు జీవితం

సాక్షి, రాజమహేంద్రవరం: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో అరెస్టై అయ్యి రాజమండ్రి సెంట్రల్ జైలులో రిమాండ్‌లో ఉన్న టీడీపీ అధినేత చంద్రబాబు జైలు జీవితం 11వ రోజుకు చేరింది. ఎప్పటిలాగే ఆయన దినచర్య గురువారం కూడా కొనసాగింది. ఈనెల 24వ తేదీకి చంద్రబాబు రిమాండ్ ముగియనుండటం, కోర్టుల్లో తీర్పులు రిజర్వ్‌లో ఉండటంతో టీడీపీ నేతల్లో ఉత్కంఠ నెలకొంది. రిమాండ్‌ను మళ్లీ పొడిగిస్తారా? సీఐడీ కస్టడీకి అప్పగిస్తారా?.. తదితర అంశాలతో పాటు బాబుకు వ్యతిరేకంగా కోర్టు తీర్పు ఇస్తే పార్టీని ఎలా ముందుకు తీసుకెళ్లాలన్న విషయాలపై టీడీపీ నాయకులు చర్చించుకుంటున్నారు.

చంద్రబాబును జైల్లో అంతం చేసేందుకు కుట్ర

- నారా లోకేశ్ ట్వీట్

సాక్షి, అమరావతి : చంద్రబాబును జైల్లోనే అంతం చేసేందుకు కుట్ర చేస్తున్నారనే అనుమానాలు బలపడుతున్నాయని టీడీపీ ప్రధాన కార్యదర్శి, ఆయన కుమారుడు లోకేశ్ ఆరోపించారు. ఆధారాల్లేని కేసులో అరెస్టు చేసి బెయిల్ రాకుండా రాజమండ్రి సెంట్రల్ జైల్లోనే చంపేందుకు ప్లాన్ చేస్తున్నారని గురువారం ఆయన ట్వీట్ చేశారు. జెడ్ ప్లస్ భద్రతలో ఉన్న ప్రతిపక్ష నేతకు జైల్లో హాని తలపెట్టేలా సర్కారు కుట్ర సాగుతోందని ఆరోపించారు. చంద్రబాబుకు జైల్లో భద్రత లేదని, విపరీతమైన దోమలు కుడుతున్నాయని చెప్పినా జైలు అధికారులు పట్టించుకోవడం లేదని తెలిపారు. జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న రాజమండ్రి రూరల్ మండలం ధవళేశ్వరానికి చెందిన గంజేటి వీరవెంకటసత్యనారాయణ డెంగీ బారినపడి మృతి చెందాడని, చంద్రబాబును కూడా ఇలాగే చేయాలని కుతంత్రాలు అమలు చేస్తున్నారని, ఆయనకు ఏం జరిగినా సీఎం జగన్‌దే బాధ్యతని పేర్కొన్నారు.

లోకేశ్‌పై నిఘా పెట్టాలి..

- చంద్రబాబుకు ఏదైనా జరగాలని టీడీపీ శ్రేణుల ఎదురుచూపులు
- వైఎస్సార్‌సీపీ ఎంపీ నందిగం సురేశ్



సాక్షి, న్యూఢిల్లీ : టీడీపీ నేత నారా లోకేశ్‌పై నిఘా పెట్టాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ నందిగం సురేశ్ డిమాండ్ చేశారు. చంద్రబాబుకు ఏదైనా అనుకోనిది జరగాలని పలువురు టీడీపీ నాయకులు ఎదురు చూస్తున్నారని, అదే తరహాలో లోకేశ్ కూడా చూస్తున్నట్టు అనిపిస్తోందన్నారు. ఢిల్లీలో గురువారం ఎంపీ మీడియాతో మాట్లాడుతూ.. అసలు లోకేశ్ ఎవరెవరితో మాట్లాడుతున్నారో దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్టీఆర్‌కు చంద్రబాబు వెన్నుపోటు పొడిచినట్లే లోకేశ్ కూడా వెన్నుపోటుదారుడు అవడానికి సిద్ధంగా ఉన్నారని అనుమానం వ్యక్తం చేశారు. తప్పులు ఏమీ చేయకుంటే లోకేశ్ వెంటనే ఢిల్లీ నుంచి ఏపీకి రావాలని ఎంపీ సురేశ్ కోరారు.

చంద్రబాబు అరెస్ట్ వెనుక కేంద్ర హస్తం లేదు

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

నరసాపురం : స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టు వెనుక కేంద్ర ప్రభుత్వ హస్తం లేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి చెప్పారు. ఈ అంశంలో కేంద్రంపై వస్తున్న ఆరోపణలను ఆమె ఖండించారు. పశ్చిమగోదావరి జిల్లా నరసాపురంలోని అల్లూరి సాంస్కృతిక సెంటర్‌లో ప్రధాని మోదీ జన్మదిన వేడుకల్లో భాగంగా బీజేపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మెగా వైద్య, రక్తదాన శిబిరాలను గురువారం ఆమె ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబును అరెస్టు చేసిన తీరును రాష్ట్ర బీజేపీ ఖండించిందని గుర్తుచేశారు. ఇదిలా ఉండగా, బీజేపీ మహిళా కార్యకర్తలతో కలసి పట్టణంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న పురందేశ్వరి ఓ మద్యం దుకాణం వద్ద రెండు మద్యం సీసాలను ధ్వంసం చేశారు. అనంతరం మద్యం తాగినందున అనారోగ్యం పాలై.. ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఇద్దరిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న మద్యం పాలసీ లోపభూయిష్టంగా, ప్రజల ప్రాణాలు తీసేలా ఉందని ఆరోపించారు.

చట్టసభల్లో ఓబీసీలకూ రిజర్వేషన్లు కల్పించాలి

రాజ్యసభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్



పిల్లి సుభాష్‌చంద్రబోస్

సాక్షి, న్యూఢిల్లీ : చట్టసభల్లో ఓబీసీలకు కూడా రిజర్వేషన్లు కల్పించాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్ డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీలకు ఎలాగైతే రిజర్వేషన్లు కల్పిస్తున్నారో అదేవిధంగా మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ అందులో ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని కోరారు. ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మహిళా బిల్లుకు మద్దతిస్తున్నామన్నారు. రాజ్యసభలో గురువారం మహిళ బిల్లుపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. బిల్లు కార్యరూపం దాల్చిన ఏడేళ్ల తర్వాత అమలు చేయడం అంటే పంచభక్ష్య పరమానం ముందుపెట్టి ఎప్పుడో తినమన్నట్లు ఉందన్నారు. సామాజిక, విద్య, ఆర్థిక అంశాల్లో వెనుకబాటుతనంతో ఉన్న ఓబీసీలకు రిజర్వేషన్లు ఎందుకు కల్పించరని బోస్ ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం దీనిపై ఆలోచించి త్వరలోనే ఓబీసీ బిల్లు తీసుకురావాలని ఎంపీ బోస్ విజ్ఞప్తి చేశారు.

లింగ వివక్ష తగ్గుతుంది : ఆర్. కృష్ణయ్య



ఆర్. కృష్ణయ్య

చర్చలో ఎంపీ ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. మహిళా బిల్లు స్వాగతించదగినదన్నారు. దేశంలో లింగ, కుల వివక్షలు ఉన్నాయని.. మహిళ బిల్లుతో లింగ వివక్ష తగ్గుతుందని.. అయితే, కుల వివక్ష తగ్గించాలంటే బిల్లులో ఓబీసీ సబ్ కోటా పెట్టాలని కోరారు. సబ్‌కోటా కుదరకపోతే బీసీ బిల్లు ప్రవేశపెట్టాలన్నారు. అన్ని రంగాల్లోనూ బీసీల పాత్ర చాలా తక్కువగానే ఉంటోందని కృష్ణయ్య తెలిపారు. రాజ్యాధికారం వస్తేనే వారికి గౌరవం దక్కుతుందన్నారు.

లోక్‌సభ

ఇస్రో సేవలు అద్భుతం

- అంతరిక్ష రంగంలో మహిళల ప్రమేయం పెరిగేలా ప్రోత్సహించాలి
- చంద్రయాన్–3పై చర్చలో ఎంపీలు శ్రీకృష్ణదేవరాయలు, భరత్‌రామ్





శ్రీకృష్ణదేవరాయలు భరత్‌రామ్

సాక్షి, న్యూఢిల్లీ: శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఇస్రో అద్భుతమైన సేవలందిస్తోందని వైఎస్సార్‌సీపీ ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, మార్గాని భరత్‌రామ్ కొనియాడారు. అంతరిక్ష రంగంలో మహిళల ప్రమేయం పెరిగేలా ప్రోత్సహించాలని కేంద్రాన్ని కోరారు. లోక్‌సభలో గురువారం చంద్రయాన్–3 విజయంపై జరిగిన చర్చలో ఎంపీలు ఇరువురూ మాట్లాడారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ.. ఇంతటి గొప్ప పరిశోధనలు ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోట నుంచి జరగటం తెలుగువారికి గర్వకారణమన్నారు. చంద్రయాన్ ప్రయోగంలో భాగస్వాములైన మెజారిటీ శాస్త్రవేత్తలు రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించే విశ్వవిద్యాలయాలు, ఇంజినీరింగ్ కళాశాలల నుంచి రావడం గొప్ప విషయమని చెప్పారు. యూనివర్సిటీలకు రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్షా అభియాన్(రూసా)కింద గత నాలుగైదు సంవత్సరాలుగా ఏటా రూ.8,120 కోట్ల నిధులు కేటాయిస్తున్నా వినియోగం 60 శాతం కూడా ఉండటంలేదని వివరించారు. వర్సిటీలు ఈ నిధులు వాడుకునేలా వెసులుబాటు కల్పించాల్సి ఉందన్నారు. అంతరిక్ష రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యాన్ని మెరుగుపరచాల్సిఉందని సూచించారు.

ఎంపీ మార్గాని భరత్‌రామ్ మాట్లాడుతూ.. అంతరిక్ష రంగంలో మన శాస్త్రవేత్తలు ఏళ్ల తరబడి అంకితభావంతో పనిచేస్తున్నారని కొనియాడారు. దేశమంతా చంద్రయాన్–3 విజయాన్ని కొనియాడుతుంటే టీడీపీ మాత్రం మాజీ సీఎం చంద్రబాబు గురించి మాట్లాడుతోందని ఎద్దేవా చేశారు. రూ.3,300 కోట్ల కుంభకోణం కేసులో చంద్రబాబు అరెస్టయ్యారన్నారు. చంద్రబాబు చేసిన ఇతర కుంభకోణాలు సైతం త్వరలో బయటపడతాయన్నారు. చంద్రుడి దక్షిణ ధృవంపై విక్రమ్ ల్యాండర్, ప్రజ్ఞాన్ రోవర్ ల్యాండయినప్పుడు తన ఆరేళ్ల కుమార్తె 'నాన్నా చంద్రుడి మీద అడుగుపెట్టాం' అంటూ ఎంతో సంబరపడిందని, 'మనం ఎప్పుడు చంద్రుడి మీద కు వెళ్తాం అమ్మా?' అని తన తల్లిని అడగడం తనని ఎంతో సంతోషానికి గురిచేసిందన్నారు. చంద్రయాన్–3 విజయంపై ఇస్రో బృందం, ప్రధాని నరేంద్రమోదీకి భరత్ కృతజ్ఞతలు తెలిపారు.

బీసీ మహిళలకు సబ్ కోటా ఇవ్వాల్సిందే

- అప్పుడే సామాజిక న్యాయం సాధ్యం: ఆర్.కృష్ణయ్య
- పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలంటూ జంతర్‌మంతర్ వద్ద మహా ధర్నా



మహాధర్నాలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఎంపీ ఆర్ కృష్ణయ్య

సాక్షి, న్యూఢిల్లీ: వెనుకబడిన వర్గాల సమస్యలు పరిష్కరించాలంటూ ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన మహాధర్నా నినాదాలతో హోరెత్తింది. మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా కల్పించినప్పుడే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని, లేకపోతే సమాజంలో మార్పు ఉండదని ధర్నాలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వైఎస్సార్‌సీపీ ఎంపీ, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. మహిళా బిల్లును ప్రవేశపెట్టిన కేంద్రం దేశంలో 56 శాతం జనాభా ఉన్న బీసీల బతుకులు మార్చే బీసీ బిల్లును పార్లమెంటులో ఎందుకు ప్రవేశపెట్టడంలేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా బీసీల సంక్షేమం కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటుచేయాలని, పంచాయతీరాజ్ సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు 52 శాతానికి పెంచాలని కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు గుజ్జ కృష్ణ, డాక్టర్ ఎన్ మారేష్‌ల అధ్యక్షతన జరిగిన ఈ మహాధర్నాలో ఆర్.కృష్ణయ్యతో పాటు ఎంపీలు బీద మస్తాన్ రావు, బడుగుల లింగయ్య యాదవ్ పాల్గొని తమ సంఘీభావం ప్రకటించారు. ధర్నాలో జబ్బల శ్రీనివాస్, బత్తుల వెంకటరమణ, పద్మలత, నీలం వెంకటేష్, భూపేష్ సాగర్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943 Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.